
ప్రతిభా వైజయంతి

ఎనిమిదవ ప్రతిభామూర్తి రజని సమ్మానోత్సవ సంచిక

జనవరి 2001



ప్రతిభామూర్తి - 2001 నిర్వాహక మండలి


గౌ. శ్రీ ఎస్.బి.పి.బి.కె. సత్యనారాయణరావు
పార్లమెంటు సభ్యులు
ముఖ్యఅతిథి


డా. ప్రసాదరాయ కులపతి
ఛైర్మన్ & మేనేజింగ్ ట్రస్టీ


శ్రీ బొమ్మిడి నారాయణరావు
ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్


శ్రీ కె.యస్.టి. శాయి
ప్రోగ్రాం కన్వీనర్


శ్రీ మెంటే పార్థసారథి
ప్రోగ్రాం ఎడ్వయిజర్


శ్రీ ఆరేటి ప్రకాష్
ప్రోగ్రాం కార్యదర్శి


శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల
సంపాదకులు : 'ప్రతిభావైజయంతి'
& లలిత సంగీత సదస్సు


'రచన' శాయి
అ.శో. - వి.భో. ప్రచురణలు


డా. డి.యస్.యన్ మూర్తి
వైస్ ఛైర్మన్, నాటక సదస్సులు


డా. పి.వి. రామకుమార్
నాటికల ప్రాథమిక
పరిశీలకులు


శ్రీ రాయప్రోలు భగవాన్
నాటికల ప్రాథమిక
పరిశీలకులు


శ్రీ చలసాని కృష్ణ ప్రసాద్
రంగస్థల నిర్వహణ


శ్రీ కె.వి. రమణమూర్తి
అతిథి మర్యాదలు


శ్రీ జెడ్. నవనాథరావు
అతిథి మర్యాదలు


డా. జి.బి.ఆర్.కె. శాస్త్రి
ప్రజా సంబంధాలు
& ఎవిఎస్ ఇండియా ఆపరేషన్స్


శ్రీ భమిడిపాటి రామగోపాలం
రూపశిల్పి
'116 గొప్ప తెలుగు సినిమా పాటలు'

[illegible]

[illegible]



[illegible]

[illegible]

[illegible]

[illegible]: 7-1-2001

ప్రతిభావైజయంతి

ఎనిమిదవ ప్రతిభామూర్తి రజని సమ్మానోత్సవ సంచిక



సంపాదకత్వం :

ఇంద్రగంటి జానకీబాల



ఆర్యవైశ్య వర్తక సంఘ భవనము

(త్యాగరాయ భవనము)

భీమవరం :: 7-1-2001

PRATIBHAVYJAYANTHI
(Special Souvenir)

January 7, 2001

Cover Design & Illustrations :
CHANDRA

Editor :
Smt. INDRAGANTI JANAKIBALA

Designed & Produced by :
'Rachana' Sai

Published by :
AJO - VIBHO PRACHURANALU
1-9-286/3, Vidyanagar
Hyderabad - 500 044.
Ph : 040 - 707 1500

అ.జో. - వి.భో. ప్రచురణలు

Typesetting & Layout :
Rachana Entinti Patrika
Hyderabad - 500 044
by Srinivasa Murthy P. & Srinivas Rao M.

Text & Title printed at :
CHARITA GRAPHICS - Offset Printers
Chikkadpally, Hyderabad - 500 044.
Ph : 040 - 760 7361

Free for Literary and Music Lovers

ఇదీవరస....

సంకల్పం

సంకల్పాలు అనేక విధాలు. సంకల్పం అనేది వ్యక్తి సంస్కృతికి, జాతి సంస్కృతికి కూడా దిక్సూచి. శాస్త్ర సాంకేతిక విషయాల పురోగమనానికి సంకల్పించటం భౌతిక ప్రగతికి నిదర్శనమైతే, విలువైన సంస్కృతీ సభ్యతల వారసత్వాన్ని నిలుపుకోవాలనీ, నిండు హృదయంతో సత్కరించి స్పందించి, కరదీపికగా ముందుతరాలకు తీసుకువెళ్ళాలనీ కోరు కోవడం సత్సంకల్పంగా అభివర్ణించాలి.

1994 నుంచి అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఇటువంటి దీక్షతో పలురంగాలకు చెందిన మహనీయ ప్రతిభామూర్తుల్ని ప్రతియేటా విశిష్ట పురస్కారంతో సత్కరిస్తూ వస్తోంది.

ఈ పరంపరలో 2001 సంవత్సరానికిగాను ప్రముఖ వాగ్గేయకారులు, పరిశోధకులు, యక్షగాన రచయిత, కళాప్రపూర్ణ శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారిని ప్రతిభామూర్తి పురస్కారానికి ఎంచుకోవడం రసజ్ఞులందరికీ ఆనందదాయకమైన విశేషం.

శ్రీ రజనీకాంతరావుగారు సంగీత కళారంగంలో అర్ధశతాబ్దికి పైగా 'రజని'గా సుపరిచితులు, సుప్రసిద్ధులు. రేడియో అనే ప్రచార, ప్రసార సాధనం ప్రసిద్ధిలోకి వచ్చిన తొలి రోజుల్లో లలిత సంగీత రీతికి మార్గదర్శకులయ్యారు. అంతేకాదు, ప్రసంగం వంటి ప్రక్రియకి రూపకల్పన చేయడానికి ప్రముఖ పాత్ర వహించారు.

ఏభై ఏళ్ళకు పైబడిన ఆయన కృషినీ, వ్యక్తిత్వాన్ని విపులంగా విశదంచేసే ఒక ప్రత్యేక సంచికను వెలువరించదలచి, ఫౌండేషన్‌వారు సంపాదకత్వ బాధ్యత నాకు అప్పగించారు. నిజానికిది బరువైన, పరువైన బాధ్యత.

శ్రీ 'రజని' పాటలు నేను పాడి వుండటం, వారితో చిరకాల పరిచయభాగ్యం కలిగివుండటం, దాదాపుగా వారి రచనలన్నీ పుస్తకరూపంలో నా దగ్గర వుండటం, అన్నిటికీ మించి శ్రీ 'రజని' కృషిని సన్నిహితంగా ఎరిగిన ఎందరో కళాకారులతో, రచయితలతో నాకు పరిచయం వుండటం, నన్నీ బాధ్యతను తీసుకోమని ధైర్యం చెప్పాయి.

నా నమ్మకం వమ్ముకాలేదనుకుంటాను. 'రజని' విశేష సంచిక కోసం రచనలు, అనుభవాలు,

నేను కోరగానే ఆయనకు సన్నిహితులైన వారందరూ సహకరిస్తూ రచనలూ పంపారు. సలహాలు యిచ్చారు.

సాధారణంగా ఇటువంటి విశేష సంచిక అనగానే ఏవో కొన్ని వ్యాసాలతో, వ్యాపార ప్రకటనలతో, సందేశాలతో ఒక మూసకట్టు పద్ధతి అవలంభించటం పరిపాటి. ఫౌండేషన్ వారు యీ సంచికను రూపొందించే విషయంలో నాకు సంపూర్ణ స్వేచ్ఛ యిచ్చారు. అందువల్ల శ్రీ 'రజని'ని రేడియో కళాకారునిగా ఎరిగిన సన్నిహితుల జ్ఞాపకాలు శ్రీ 'రజని' కృషిని ప్రతిబింబించే ఆయన స్వీయ రచనలు, యక్షగాన, లలితగీత ప్రక్రియలు ఆయనకు అత్యంత ఇష్టమైనవి కనుక ఆ ప్రక్రియల పూర్వాపరాలు తెలిపే వ్యాసాలు, యీ సంచికలో పొందు పరిచే ప్రయత్నం చేశాను. అలాగే శ్రీ 'రజని' జీవిత విశేషాలను, ఆయన జీవితంలోని ముఖ్యఘట్టాలకు సంబంధించిన ఫొటోలను ఎంచి పొందుపరిచాను. ఇటువంటి విశేష సంచికను తయారు చేసే సందర్భంలో కొంత విమర్శను ఎదుర్కోవలసి వుంటుందని నాకు తెలుసు. ఫలానావారి వ్యాసం లేదా?; ఫలానా పాటను ఎందుకు చేర్చలేదు?; ఫలానా విశేషం మీ కెందుకు తట్టలేదు?; లాంటివి ఎవరేనా అనొచ్చు. అయితే శ్రీ 'రజని' కళాకృషి, వ్యక్తిత్వం, శక్తి సామర్థ్యాలు సాధ్యమైనంత సమగ్రంగా యీ సంచికలో ప్రతిబింబించడానికి ప్రయత్నం చేశానని సవినయంగా చెప్పగలను. దొరికినంత సమా చారమూ ఒకచోట పోగుపెట్టటం నా వుద్దేశం కాదు. ఇంపుగా, అందంగా, క్లుప్తంగా, 'రిఫెరెన్స్'గా, యీ సంచికను రూపొందిచాలని ప్రయత్నించాను.

ఈ ప్రయత్నంలో శ్రీ రజనీకాంతరావుగారు నేను కోరిన ఫొటోలు, సమాచారం ఇచ్చారు. శ్రీ 'రజని'గారికి అత్యంత సన్నిహితులైన, నాకు మిత్రులైన శ్రీ పన్నాల సుబ్రహ్మణ్య భట్టు తమ విలువైన సలహాలిచ్చి సహకరించారు. వ్యాసరచయితలందరూ అడిగిన వెంటనే రచనలు పంపి నా ప్రయత్నానికి వుత్సాహం కలిగించారు.

సమాచారం ఒకచోటకు చేర్చటం ఒక ఎత్తు అయితే, ఆ సమాచారాన్ని కంటికి, మనస్సుకి ఆహ్లాదకరంగా అచ్చులో అమర్చి రూపకల్పన చేయడం మరొక యెత్తు చిరకాలమిత్రులు 'రచన' మాసపత్రిక సంపాదకులు శ్రీ తల్పశాయిగారు ఆ బాధ్యత వహించి, నాకెంతో సహకారంగా వుండి, సంచికకు నిండుతనం అందం చేకూర్చారు. ఈ విశేష సంచికకు ముఖచిత్రాన్ని, శ్రీ 'రజని' గారి రచనలకు బొమ్మలనూ వేసిచ్చింది ప్రముఖ చిత్రకారుడు శ్రీ చంద్రగారు.

- వీరందరికీ నా కృతజ్ఞతలు.

ముందుగా చెప్పవలసిన ఆఖరి మాట - నా మీద తిరుగులేని నమ్మకముంచి, సంపాదకత్వం బాధ్యతను అప్పగించిన అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకులు శ్రీ అప్పాజోస్యుల సత్యనారాయణగారికి, శ్రీ విష్ణుభొట్ల రామన్న, లక్ష్మన్నగార్లకు కృతజ్ఞతాపూర్వక అభివందనాలు!

ఇంద్రగంటి జానకీబాల

అ.జో - వి.భొ. ఫౌండేషన్ ఆఫ్ అమెరికా

సమాజహిత సేవా చింతన నిమిత్తం ఒక సుస్థిర నిధి వ్యవస్థని సంకల్పించి, ఏర్పాటు చేసి సాహిత్య కళా సాంస్కృతిక సాంఘిక సేవా రంగాలలో ప్రతిఫలాన్ని గాని, ప్రయోజనాన్ని గాన్ని వ్యాజంగా ఆశించకుండా స్వీయ ప్రజ్ఞా సమున్మేషంతో ఒక జీవితకాలం తమ సృజనాత్మక ప్రతిభను వెలార్చిన వారిని 'ప్రతిభామూర్తి'గా సత్కరించడం ఈ ఫౌండేషన్ స్థాపన లక్ష్యం. ఆశయం కూడాను.

అకాడమీ, ట్రస్ట్, ఎండోమెంట్, ఫౌండేషన్ మొదలైన గ్రీకు, ఇంగ్లీషు పదాలు స్ఫురింపజేసే తెలుగు మాట లేదా సంస్కృత పారిభాషిక పదం సతృప్తికరమైనది రూపొందించడం ఇంతవరకు సమకూడలేదు. సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, లలితకళా అకాడమీ మొదలైన పదబంధాలలో యథాతథంగా అన్యభాషా పదాన్ని స్వీకరించడం జరిగింది. అలానే అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 1994లో ఆవిర్భవించింది.

ఇప్పటికీ ఏడుసార్లు 'ప్రతిభామూర్తి' సత్కార ఉత్సవాలు నిర్వహించి ఇప్పుడు ఎనిమిదవసారి జీవిత కాల కృషి స్ఫురణ ప్రతిభామూర్తి సత్కారం భీమవరంలో సంఘటిస్తున్నది. ఇదివరలో జరిగిన అ.జో.వి.భొ ఫౌండేషన్ సభలు హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరులలో జరిగాయి. కథ, నవల, నాటకం, పత్రికారంగం, మహిళా సదస్సులు జరిగాయి. ఇప్పుడు లలితసంగీతం సదస్సు జరుగుతున్నది. మొదటి మూడు ప్రతిభామూర్తి పురస్కారోత్సవాలు నిర్వహించినప్పుడు ప్రత్యేక సంచికలు ప్రచురించలేదు. తరువాత ఈ విశేషోత్సవాలకు సంబంధించి ప్రత్యేక సంచికలు వెలువడుతున్నాయి.

రావణవధానంతరం విభీషణుడు సమర్పణ భావంతో కృతజ్ఞతా మనస్వితతో శ్రీ రాముణ్ణి లంకా రాజ్యాన్ని స్వీకరించి అక్కడే ఉండిపోవలసిందని అర్థించగా రాముడు అందుకు ఆసక్తి చూపకపోవడమేగాక 'అపిస్వర్ణ మయీలంకా నమే లక్ష్మణ రోచతే, జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అన్నాడని ప్రాజ్ఞులు అప్పుడప్పుడు గుర్తు చేసుకుంటూ ఉంటారు.

తాము పుట్టి పెరిగి - సుఖసంతోషాలు ఉత్సాహోత్తేజనలు అనుభవించిన స్వీయ భాషా సాహిత్య సాంస్కృతిక తాదాత్మ్యంతో పెద్దలను, ప్రతిభావంతులను సత్కరించడం తమ కర్తవ్యంగా ఫౌండేషన్ భావిస్తున్నది. ఈ ప్రయత్నాన్ని చూసి కలవారు, మనస్సు, అభిరుచి కలవారు తాము కూడా ముందుకు వస్తారని ఆశిస్తున్నది. ఈ విధంగా ఇంతవరకు అర్హమైన గుర్తింపు, సత్కారం లభించని వారిని లోకానికి తెలియపరచడానికి ఉత్సహిస్తున్నది. ఇదేదో మహత్కార్యంగా భావించడం లేదు. ఇతరులకు, ఇటువంటి వనరులున్న వారికి ప్రోత్సాహకంగా, ప్రచోదకంగా ఉండాలని కోరుకుంటున్నది. తెలుగువారి వివిధ నగరాలలో ఈ నాటకోత్సవాలు, సాహితీ సదస్సులు, సత్కారాలు, సన్మానాలు నిర్వహించడం వల్ల అధికాధికంగా తెలుగు వారందరితో తమ తాదాత్మ్య కార్యకలాపాలు విస్తరించుకోవాలని అభిలషిస్తున్నది. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీ ధారా రామనాథ శాస్త్రి



శ్రీ ధారా రామనాథశాస్త్రిగారు నాట్యావధానమనే కొత్త దృశ్యకళా ప్రక్రియ ద్వారా ఆంధ్రదేశమంతటా విశ్రుతులు. ఇది పునః సృష్టి కాదు, పునరుజ్జీవనమూ కాదు. నవ్యసృష్టి. ఝటితి స్ఫురణతో ఆంగికమూ, ఆహార్యమూ, వాచికమూ, అభినయమూ కుదుర్చుకుని ప్రేక్షకులడిగిన సన్నివేశాలను, పాత్రలను, సంఘటనలను, సంఘర్షణలను ఏకపాత్రాభినయంగా నటించడమే ఈ అవధాన విద్య. శ్రీ రామనాథ శాస్త్రి గారు ఈ విధంగా కొన్ని వందలసార్లు ఆంధ్ర, ఆంధ్రేతర దేశాల్లో నాట్యావధాన విద్యను రంగస్థలం మీద ప్రదర్శించారు. పౌరాణిక పాత్రలు, అత్యంత నవీన కాలానికి చెందిన రూపక సన్నివేశ ప్రదర్శనలు ఆయా ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో, విద్వన్మండలుల మధ్య నిర్వహించి మెప్పు పొందారు. ఒక్క ధారణే కాదు దీనికి కావలసింది - అత్యంత స్వల్పవ్యవధిలో వేషధారణ కూడా కావాలి. అత్యంత స్వోపజ్ఞమైన రూపకోచిత అవధాన ప్రక్రియ ఇది. నయనానందమూ, శ్రవణానందమూ కూడాను. అట్లా నిర్వహించగలిగినప్పుడే రక్తికడుతుంది.

అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి' ప్రథమ సత్కారం శ్రీ రామనాథశాస్త్రిగారితో శ్రీకారం సంతరించుకోవడం ఎంతో సముచితమూ, సంతోషకరమూ. హైదరాబాద్‌లో జరిగిన ఉత్సవంలో శ్రీ రామనాథశాస్త్రి 1994లో సత్కృతులు. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీ పీసపాటి నరసింహామూర్తి



పౌరాణిక నాటక రంగస్థలంపై చుక్కలలో చంద్రుని వంటి వారు శ్రీ పీసపాటి నరసింహమూర్తి. శ్రీకృష్ణుడిగా ఆయన తెలుగువారికెంతో ప్రియతములు. నాలుగు కాలాల పాటు గుర్తుంచుకోవలసిన పద్యపఠనాప్రతిభతో తనదైన బాణీతో రంగస్థలంపై శ్రీ నరసింహమూర్తి రాణించారు. తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయం' ప్రదర్శనలో గుంటూరులో శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి సమక్షంలో తన శ్రీకృష్ణ పాత్ర నటనకుగాను శ్రీ శాస్త్రిగారిచే స్వర్ణ కిరీటాలంకృతులైనారు శ్రీ నరసింహ మూర్తి. 'పాండవోద్యోగం'లో శ్రీకృష్ణ పాత్ర ధరించి ప్రేక్షకులను ఎంత మెప్పించేవారో, 'సత్య హరిశ్చంద్ర' నాటకంలో నక్షత్రక పాత్ర ధరించి కూడా అంత ప్రశంసనూ పొందగలిగారు శ్రీ పీసపాటివారు. నాటక రంగంలో విద్వత్తు, పరిశ్రమ, క్రమశిక్షణ, ఉపజ్ఞ ఆయనవల్ల పస్నెకెక్కాయి. సంగీతాన్ని అభినయానికి సహకారంగా స్ఫుట వాక్కుతో పద్యాన్ని చదవగలనేర్పు శ్రీ నరసింహమూర్తిగారి విశిష్టత.

విశాఖపట్నంలో 1995లో జరిగిన ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి' సన్మాన సభలో వీరిని గౌరవించడం జరిగింది.

మా ప్రతిభామూర్తులు

శ్రీ మధురాంతకం రాజారాం



తెలుగు కథా రచయితలలో శ్రీ మధురాంతకం రాజారాంగారి స్థానం పదికాలాల పాటు నిలిచేది. శతాధికంగా కథలు రాసి ఆయన ఆధునిక సాహిత్యంలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సముపార్జించుకున్నారు. స్వానుభవైకవేద్యమైన శ్రీ రాజారాం కథలన్నీ పరమ హృద్యంగా ఉంటాయి. ఆయన కథలలో సహజ హితతత్పరుడైన ఒక 'అయ్యవారి'తనం గోచరిస్తుంది. అనంతమైన వైవిధ్యంతో శ్రీ రాజారాం సృష్టించే పాత్రలు, కథన సన్నివేశాలు పాఠకులను అలరిస్తాయి. ఆలోచింపచేస్తాయి. ఆంధ్రదేశంలో పల్లెటూళ్ళో సహజ వాతావరణం, వివిధ మానవానుభవాల అప్రాకృతికమైన నుడికారమూ వీరి కథల్లో పుష్కలంగా సాక్షాత్కరిస్తాయి. మూడు నాలుగు తరాలుగా చోటు చేసుకుంటున్న సాంఘిక పరిణామాలు, నగరీకరణం, ప్రాతిపదికమైన మానవ చిత్తవృత్తులు, మనోజ్ఞమైన మానవ సంబంధాల లోతులు, ఎత్తులు మధురాంతకం వారి ప్రస్ఫుటముద్ర గల కథాకథనాలు. ఈతరం కథారచయితల కాయన ఒక వరవడి. విజయవాడలో 1996లో జరిగిన ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి' పురస్కారోత్సవాలలో శ్రీ రాజారాం పురస్కృతులు. ఈ సభలలోనే మొదటిసారిగా ఆధునిక సాహిత్యంలో అత్యంత ప్రముఖ ప్రక్రియ అయిన 'కథానిక'పై ఒక సదస్సు నిర్వహించడం జరిగింది. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీ మహీధర రామమోహనరావు



అభ్యుదయ దృక్పథంతో, సంఘ సంస్కరణ ధ్యేయంతో, రాజకీయపరిణామాధ్యయన నేపథ్యంతో తెలుగులో నవలా రచనకు పూనుకున్న విశిష్ట రచయిత శ్రీ రామమోహనరావు. తెలుగు సంఘంపై గాంధీజీ ప్రభావం నుంచి సామ్యవాద రాజకీయ దార్శనిక సిద్ధాంతాల వరకు తెలుగు వారి ఆధునిక సామాజిక జీవన ధోరణులను నవలీకరించారు శ్రీ రామమోహనరావు. వామపక్ష సిద్ధాంతాలు సాహిత్య రచనకు సమన్వయింపజేయడం వీరి అభినివేశంగా తెలంగాణా రైతాంగ పోరాటం వీరి నవలల్లో చిత్రితమైంది. శ్రీ మహీధర రామమోహనరావు నవలలు ఆధునిక సమాజ చరిత్రకు దర్పణాలు. ఆర్థిక శక్తులు సంఘాన్ని ఏ విధంగా నడుపుతాయో ఈయన లోతుగా అర్థం చేసుకున్నారు. ఛాందసాచారాల నుంచి, కట్టుబాట్ల నుంచి భూస్వామ్య శిథిలావశేషాలనుంచి తెలుగునాట సాంఘిక పరిణామాలు ఏ విధంగా రూపుదిద్దుకుంటూ వచ్చాయో వీరి నవలల్లో కనపడుతుంది. 1997లో తిరుపతిలో జరిగిన ఫౌండేషన్ వారి 'ప్రతిభామూర్తి' సత్కార సభలలో శ్రీ రామమోహనరావుగారిని సమ్మానించడం జరిగింది. ఈ సభలలోనే 'తెలుగు నవల'పై చర్చా సదస్సు జరిగింది. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీ నండూరి రామమోహనరావు



అర్ధశతాబ్ది కాలం తెలుగు పత్రికారంగానికి సేవ చేసిన వారు శ్రీ నండూరి వారు. బాలవాఙ్మయ నిర్మాతలు. ఇంగ్లీషు నుంచి రోచకంగా 'కాంచనద్వీపం' తెలిగించారు. వార, దిన, మాస పత్రికలలో తమ ఉపజ్ఞను పర్యాప్తం చేశారు. ప్రపంచ తాత్త్విక దర్శనాన్ని సుగమంగా తెలుగు వారికి తెలియజెప్పారు. 'నరావతారం'లో పరిణామ వాద సిద్ధాంతాన్ని వివరించారు. 'విశ్వదర్శనం'లో ప్రపంచ తత్త్వవేత్తల దార్శనిక వాదాలు పొందుపరిచారు. తెలుగు సాహిత్యాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేశారు. ఆధునిక తెలుగు కవుల కృషిని భావుకంగా, ప్రామాణికంగా సమీక్షించగల ప్రతిభావంతులు శ్రీ నండూరి రామమోహనరావు. వీరి గ్రంథాలు తెలుగునాట ఎంతగానో జనాదరణ పొందాయి. 1998లో రాజమండ్రిలో జరిగిన ఫౌండేషన్ వారి సాహిత్య, నాటక ఉత్సవాలలో వీరు 'ప్రతిభామూర్తి' పురస్కారాన్ని స్వీకరించారు.

వీరేశలింగం నూట ఏభైవ జయంతిని కూడా ఫౌండేషన్ ఈ సందర్భంగా రాజమండ్రిలో నిర్వహించింది. 'నాటక రంగం', 'పత్రికారంగం - గత, వర్తమాన రీతులు, ధోరణుల' గూర్చి రెండు సదస్సులు నిర్వహించడం జరిగింది. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీమతి రావు బాలసరస్వతీ దేవి



సంప్రదాయ కర్ణాటక సంగీతంతో దీటుగా లలిత సంగీతాన్ని తెలుగునాట ప్రాచుర్యానికి తెచ్చిన మధుర గాయని శ్రీమతి రావు బాలసరస్వతీదేవి. పసివయస్సుననే, ఆరవ సంవత్సరం జరుగుతుండగానే, హెచ్. ఎమ్. వి. రికార్డు నిచ్చిన అజన్మ ప్రతిభావంతురాలు శ్రీమతి సరస్వతీదేవి. ఆంధ్రదేశంలో ఊరూరా లలిత సంగీత కచేరీలు నిర్వహించారు. గురుముఖతః సంప్రదాయ సంగీతాన్ని సొంతం చేసుకున్నా, లలిత సంగీతానికే విశేష ఖ్యాతినార్జించి పెట్టారు ఈమె. సినిమాలలో బాలనటిగా తమ ప్రజ్ఞను చిన్నతనంలోనే చాటి చెప్పారు. ఈమెకు నృత్యంలోనూ ప్రావీణ్యం ఉంది. తొలినాళ్ళ తెలుగు సినిమాలలో గాయని ప్రాధాన్య పాత్రలెన్నిటినో ధరించారు. తెలుగు, తమిళ చలన చిత్రాలలో నేపథ్య స్వర సహకారం అందించారు. ఆకాశవాణిలో లలిత సంగీత ప్రసారాలకు జీవనాడిగా శ్రీమతి రావు బాలసరస్వతి ప్రసిద్ధికెక్కారు. ఎస్. రాజేశ్వరరావు, ఘంటసాల, ఎ.ఎమ్.రాజాలతో సినిమాలలోనూ, ప్రత్యేకంగాను యుగళ గాయనీమణిగా తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రులైనారు. రెండు దశాబ్దాల కాలంలో మూడు వేల దాకా 'రికార్డు'లు సృష్టించడం అది ఒక గొప్ప 'రికార్డు'. 1999లో గుంటూరులో జరిగిన అ.జో.వి.భొ. సాహిత్య నాటకోత్సవాలలో 'ప్రతిభామూర్తిగా' శ్రీమతి రావు బాలసరస్వతి దేవి గారిని సమ్మానించడం జరిగింది. ఈనాటికీ వీరి కమనీయ కంఠం రమణీయంగా పలుకుతూనే ఉంది.

మా ప్రతిభామూర్తులు

శ్రీ తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి!



తెలుగు కవితా స్రవంతిని పద్యపర్వతాలనుంచీ వచనశాద్వలాలకు మళ్ళించిన నవయుగవైతాళికుడు శ్రీ తిక్కవరపు పట్టాభిరామరెడ్డి. సమకాలీన భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనమంతా పెద్ద నేపథ్యంగా ఆయన రచనలలో వెల్లివిరుస్తుంది.

శాంతినికేతన్‌లో గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూరు నేతృత్వంలో పొందిన డిగ్రీ విద్య ఆయనలో సంప్రదాయ సాహిత్యంపైనా, భావకవిత్వంపైనా గౌరవాభిమానాల్ని

పెంచాయి. కానీ కలకత్తాలో చిత్పూరు రోడ్డులోని యిరుకు గదుల్లో వున్నప్పుడు ఆయనను కదిలించివేసిన అమానుషత్వమూ, కాఠిన్యమూ, యంత్రికతా, సామాన్యుల వేదనా రావాలూ, నగరజీవిత వున్మాదమూ అంతవరకూ ఆయనను అలరించిన ప్రబంధాలూ, భావకవిత్వం, వందలాది అందమైన అలంకారాలు అర్థరహితంగా తోచి, కొత్తవాటినీ, నవీన పంథాలను వెతకాల్సిన అవసరాన్ని నేర్పాయి.

బఫూనరీ, అహంభావం, సెక్స్‌లను ఆయుధాలుగా ధరించి, పద్యానికీ గద్యానికీ నెయ్యం కుదిరించి, గ్రాంథికానికీ వ్యావహారానికీ పెళ్ళి చేసి, తెలుగుకూ యింగ్లీషుకూ పొత్తు కలిపి, పద్యాల నడుముల్ని ఆయన విరగ్గొట్టినప్పుడు ఓ ఫిడేలులో మోగిన వినూత్న రాగాలతో తెలుగు సాహితీ ప్రపంచంలోనే వొక కొత్త అధ్యాయానికి నాంది పలికి, "తనకు తానే సాటి, తనకు లేనే లేదు పోటీ" అని సగర్వంగా చాటుకున్న పఠాభి మాటలు సత్యదూరం కావు.

తెలుగు సాహిత్యం ఆయన చమత్కారం, తిరుగుబాటు ధోరణీ, తెంపరితనాల వెనక దాగిన సీరియస్‌నెస్‌ను సక్రమంగా అర్థంచేసుకుని ఆయనను ఓ గొప్ప పథనిర్దేశకుడుగా గుర్తించింది. "ఫిడేలు రాగాల డజన్" తెలుగు కవితను నగరాల దోవ పట్టిస్తే "కవిత నా దయిత" అన్న ఆయన మరో కవితా సంకలనం, స్కాట్లెండ్, స్పెయిన్, సిలోన్ లాంటి విదేశీ ప్రాంతాలకు సైతం తీసుకెళ్ళింది. పఠాభి మరో విశిష్ట రచన "పఠాభి ఫన్‌చాంగం" నిజంగా తెలుగు వారికొక కొత్త పంచాంగమై పోయింది. ఫన్నులను విరివిగా ఫన్నిన సంఫన్నుడూ, శ్లేషశాయీ పఠాభే!

ఆదినుంచీ పఠాభి జీవితం ప్రయోగశీలమైంది. ప్రసిద్ధ దర్శక - నిర్మాత శ్రీ కె.వి. రెడ్డి గారితో కలిసి సహనిర్మాతగా 'పెళ్ళినాటి ప్రమాణాలు', 'శ్రీ కృష్ణార్జున యుద్ధం', 'భాగ్య చక్రం' చిత్రాల నిర్మాణంతో ప్రారంభమైన శ్రీ పట్టాభి రామిరెడ్డి చలన చిత్ర జీవితం సహజంగానే నవ్యచిత్ర నిర్మాణదిశగానే సాగింది. డా॥రామ్ మనోహర్ లోహియా ప్రతిపాదించిన సోషలిస్టు సిద్ధాంతాలవల్ల ప్రభావితుడై శ్రీ యు.ఆర్. అనంతమూర్తి ప్రసిద్ధ నవల "సంస్కార" ను చిత్రకావ్యంగా రూపొందించారు శ్రీ పఠాభి. 1972లో భారత ప్రభుత్వ 'స్వర్ణకమలం' ఆ చిత్రానికి లభించింది. 1972లోనే ఎటింబరో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో కూడా ఆ చిత్రానికి బహుమతి లభించింది. ఆయన యమర్జెన్సీ పైన నిర్మించిన "చండమారుత", రవీంద్రుని భావుకత ప్రభావంతో నిర్మించిన "శృంగారమాస" చిత్రాలు కూడా ఆయన ప్రతిభకు గీటురాళ్ళుగా నిలుస్తాయి. యెనభయ్యేళ్ళ వయస్సులో కూడా అరవిందుని రచన "సావిత్రి"ని టీ.వీ.కి అనువదించడంలో నిమగ్నుడైన శ్రీ పఠాభి నిత్యయవ్వనుడే.

నెల్లూరులో 1999లో 'ప్రతిభామూర్తి' సత్కార సభలో శ్రీ పఠాభిగారిని సమ్మానించడం జరిగింది. ఈ సందర్భంగా "వచన కవిత్వం : నాడు - నేడు - రేపు" అన్న విషయం మీద అర్థవంతమైన సదస్సు నిర్వహించబడింది. ✪

మా ప్రతిభామూర్తులు

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు



"**రజని**" అనే పేరు లలిత సంగీత ప్రపంచంలో సుమారు మూడు తరాల శ్రోతలకు సుపరిచితం. 'రజని'యే శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు.

శ్రీ రజనీకాంతరావు 1920 జనవరి 29వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో జన్మించారు. నవ్యసాహిత్య యుగంలో వేంకటపార్వతీశ్వర కవులుగా ప్రసిద్ధులైన జంట కవులలో శ్రీ బాలాంత్రపు వెంకటరావుగారి కుమారులు ఈయన. 1935లో పాఠశాల విద్య, కాకినాడ పి. ఆర్. కళాశాలలో ఇంటర్‌మీడియట్ పూర్తి చేసుకుని 1937 - 40 మధ్య వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు - సంస్కృతం ప్రధాన విషయాలుగా మూడు సంవత్సరాల బి.ఏ.ఆనర్స్ పరీక్ష ప్యాసయ్యారు. 1942లో మద్రాసు

ఆకాశవాణి కేంద్రంలో నిలయ కళాకారునిగా చేరి వివిధ పదవులు నిర్వహించి 1970లో అహమ్మదాబాద్ రేడియో కేంద్రానికీ, 1971 నుండి 1976 వరకు విజయవాడ రేడియో కేంద్రానికీ డైరక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించి, 1978లో పదవీ విరమణ చేశారు.

అనంతరం తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర కళాపీఠ నిర్దేశకులుగానూ, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఎమిరిటస్ ప్రొడ్యూసర్ గానూ, తెలుగు విశ్వవిద్యాలయానికి సలహాదారుగానూ, పరిశోధకులకు సాహిత్య ఆచార్యునిగానూ తమ విశిష్ట సేవలందించి, 1990 నుంచి విశ్రాంతి పొందుతూ విజయవాడలో స్థిరపడ్డారు.

శ్రీ రజనీకాంతరావు వందల కొద్దీ గీతాలనూ, సంగీత రూపకాలనూ రేడియో ప్రసారం కోసం రాశారు. అలాగే రంగస్థలం మీద ప్రదర్శన కోసం నృత్య రూపకాలను కూడా రాశారు. ఆయన రచనలలో "శతపత్రసుందరి" (1953, గీత సంపుటి) "ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర" (1955) "విశ్వవీణ" (1964, సంగీత రూపకాల సంపుటి) ముఖ్యమైనవి. చిన్న పిల్లల కోసం ఆయన రాసిన పాటలు "జేజి మామయ్య పాటలు" గా ప్రసిద్ధి చెందాయి. ఇంతేకాదు, 1971 - 76 మధ్య నూటయాభైకి పైగా క్షేత్రయ్య పదాలకు ఇంగ్లీషు అనువాదాలు చేసి వెలువరించారు. ఇంచుమించు అదేకాలంలో "చతుర్భాణి" అనే "భాణ" రూపకాలలో మూడింటిని తెలుగు చేశారు. అంతక్రితమే శ్రీ వేంకటపార్వతీశ్వర కవులు రచించిన "ఏకాంత సేవ" కృతిని ఇంగ్లీషులోకి అనువదించారు. రామదాసు, క్షేత్రయ్య జీవిత చరిత్రలను కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోసం రచించారు.

శ్రీ రజనీకాంతరావు తమ రచనలకు అనేక బహుమతులు పొందారు. వారి "ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర" కి 1961లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. "కొండ నుండి కడలి దాకా" అనే రేడియో రూపకానికి 1972లో జపాన్‌కు చెందిన అంతర్జాతీయ ప్రసారాల "నిపాన్ హోసో క్యోకై" (టోక్యో) పురస్కారం లభించింది. 1977లో సంస్కృత మేఘదూత సంగీత రూపకానికి ఆకాశవాణి వార్షిక పురస్కారం లభించింది. ఆయన గీత రచయితగా పేరు తెచ్చుకుంటున్న తొలి రోజులలోనే 1953లో "శతపత్ర సుందరి" గీత సంపుటానికి మద్రాసు తెలుగు భాషాసమితి వారి బహుమతి లభించింది. 1980లో శ్రీ రజనీకాంతరావుకి ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదు నిచ్చి సత్కరించింది.

1952 - 56 ప్రాంతాలలో కూచిపూడి నృత్యరీతి సంస్కరణ పథకంలో శ్రీ బందా కనకలింగేశ్వరరావు, శ్రీ ఓలేటి వెంకటేశ్వర్లు గార్లతో కలిసి ప్రముఖ పాత్ర నిర్వహించారు. "రజని" రేడియో గీత రచనలే గాక 1945 నుంచి సినిమా రంగంతో కూడా సన్నిహిత సంబంధం కలిగి వున్నారు. "స్వర్గసీమ", "గృహప్రవేశం", "లక్ష్మమ్మ కథ", "పేరంటాలు", "మానవతి" చిత్రాలకు పరోక్షంగా సంగీత దర్శకత్వం వహించారు.

1941 - 42 లలో శ్రీ సాలూరు రాజేశ్వరరావు 'రజని' పాటలు పాడి, రికార్డులిచ్చి విశేష ప్రచారం కలిగించారు. శ్రీ రజనీకాంతరావు స్వరకర్తగా అనేక ప్రయోగాలు చేశారు. బెంగాలీ సంగీతం, మధ్య ప్రాచ్య సంగీతం, కర్ణాటక సంగీతంతో మిళితం చేసి నూతన స్వరచిత్రాలు సృష్టించారు. ఈ కొత్తదనం కృష్ణశాస్త్రిగారు రచించిన "అతిథిశాల" సంగీత రూపకంలోనూ, ఆయనే రచించిన "విశ్వయానం"కి కూర్చిన సంగీతంలోనూ కనిపిస్తుంది.

గేయకర్తగా, యక్షగానకర్తగా, గాయకునిగా, సంగీత దర్శకునిగా, వాగ్గేయకార పరిశోధకునిగా ఆయన విశేషమైన కీర్తి నార్జించుకున్నారు. అటువంటి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారికి "2001 వ సంవత్సరపు ప్రతిభామూర్తి లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్ అవార్డు"ను 2001 జనవరి 7 వ తేదీన భీమవరంలో తమ ఎనిమిదవ వార్షికోత్సవంలో ప్రదానం చేయడమైనది. ✪

యక్షగానములు

నల్లాన్ - చక్రవర్తుల కృష్ణమాచార్యులు

యక్షగానము అనే ప్రబంధమునకు సాహిత్య మందు ఒక ప్రత్యేకస్థానమున్నది. అప్పకవీయమందు దీని లక్షణము నిర్దేశింపబడినది. సాధారణముగా దీని లక్షణమిది. - పాటలు, పద్యములు, ద్విపదలు వచనములు వీటి సంకలనముతో కూడిన ప్రబంధము యక్షగాన మనబడుచున్నది. యక్షగానము అనే ఈ పేరునకు మూలము కాళిదాసుని 'మేఘసందేశము'లోని ఒక విషయమని నా ఊహ. మేఘసందేశం రెండవ సర్గలో నిట్లున్నది. "ఊదాయ ద్ధనపతి యశః కిన్నరై ర్యత్ర సార్ధం" యక్షులు కిన్నరులతో కూడి కుండ మద్దెలలు వాయించుకొనుచు తమ ప్రభువయిన కుబేరుని కీర్తిని గానము చేయుదురని ఒక సూచన యున్నది. ఇది యక్షగానమే కదా! ఈ విధముగా "యక్షగాన" మనే నామ నిర్దేశము జరిగినదని నా అభిప్రాయము.

ఇటీవలి పరిశోధకులు ఇది అసలు అక్షగానమని, తెలుగులో యడాదేశసంధిచేత "యక్షగాన" మయినదని, అక్షగాన మనగా ఇంద్రియములకు సుఖము నిచ్చుగానమని అర్థము చెప్పి ఒక కొత్త వాదమును లేవదీసిరి. ఛందోలక్షణ కర్త అయిన అప్పకవి యడాదేశసంధిని తెలుసుకొనలేని వాడనుట అవివేకము. కనుక ఇది యక్షగానమే. యక్షగానమే సరియనుట కింకొక ఉదాహరణము. మన జానపదరీతిలో "జక్కుల కథ" అని ఒకటి యున్నది. యక్షులు అనేది అచ్చ తెలుగులో జక్కులు అవుతుంది. జక్కుల కథ అంటే యక్షులు పాడుతూ చెప్పే కథ అని. అదే యక్షగానమని.

మరియు విప్రనారాయణులు "తిరుపళ్లియెజుచ్చి" అని తమిళములో రచించిన రంగనాథసుప్రభాత ప్రబంధములో 'కీదంగళ్ పాడినర్ కిన్నరల్ -మాదవర్ వానవర్ శారణ రియక్కర్' (మునులు దేవతలు, చారణులు యక్షులు పాటలు పాడిరి) అని ఉన్నది. దీనిని బట్టి అనాదిగా యక్షులకును గానమునకును ఒక సంబంధ మున్నదని సూచింపబడుచున్నది. అదే "యక్షగానము".

కాలక్రమములో యక్షగానమున కొక రూపమేర్పడినది. ఒక కథాఘట్టమును తీసికొని పాత్రలతో, ఆ పాత్రలకు రాగతాళ బద్ధములయిన గేయములు, పద్యములు, గద్యములు కలిపి కథాసంయోజనము చేయు సూత్రధారుని పద్య, గద్య గేయముల కలయికతో యక్షగాన మొక రూపు దిద్దుకొన్నది. సంస్కృతభాషలో నున్న జయదేవుని "గీత గోవిందము" నారాయణ తీర్థుల "కృష్ణలీలాతరంగిణి"ని యక్షగానములని అనవచ్చును వీటి ననుసరించే స్వాతి

నారి -

"కడచెను సామ్రాజ్యమ్ములు
కడచెను సంస్కృతులు కాలగర్భగతములై
వడపోసిన విజ్ఞానమె
అడుగడుగున పుడమి మ్రింగు హాలాహలమై"
విశ్వవీణ సంపుటిలో రజనిగేయనాటిక -
శాంతిపథము.

నరుడు -

"దురహంకృతియు నియంతృత
పరపీడాపరత, ఈర్ష్య, పగలున్ తెగలున్
అరిషడ్వర్గమ్మె నా
కరయు కొలది శాంతి పథమునందక యుంచున్ -
విశ్వవీణ సంపుటిలో - రజని గేయనాటిక -"
శాంతిపథము.



ఆధునిక యక్షగానములకు శ్రీకారం చుట్టిన రజని - 'మేనక విశ్వమిత్ర'లో శోభానాయుడు

తిరునాళ్ మహారాజా "అజామిళోపాఖ్యానం" మొదలయిన 4,5 యక్షగానములను సంస్కృతములో రచించెను. అయితే వీటి సంగీతకర్తలు ఇటీవలి కీ॥శే ముత్తయ్య భాగవతార్, సెమ్మాంగుడి శ్రీనివాసయ్యర్ వంటివారు. వీరు చక్కని సంగీత విద్వాంసులు కనుక వీటిలోని గేయములు చాలా రాగరసభరితములై ఉన్నాయి. ఇటీవల ఈ యక్షగానములు "సంగీత నాటకములు" అని వ్యవహరింపబడినది.

తరువాత 3,4, వందల ఏండ్ల క్రితం శ్రీ కాకుళం ప్రాంతపు గోగులపాటి కూర్మనాథకవి తెలుగులో "మృత్యుంజయ విలాసము" అను యక్షగానమును రచించినాడు. భాషా సాహిత్యములను బట్టి ఉత్తమ శ్రేణిలో నున్నది. గేయములు కూడా తాళచ్ఛందస్సుతో చూచితే బాగుగ నున్నవి. ఇది 40 నలభై సంవత్సరాల క్రింద చాలా పాత ముద్రిత గ్రంథము. పరిష్కారము కోసం నేను చూచి ముద్రారాక్షసములను పరిష్కరించినాను. ఇది అచ్చటచ్చట కాళిదాస 'కుమారసంభవము' ననుసరించినది. తరువాత ప్రోలుగంటి చెన్నశౌరి "సౌభరి" అనే ఒక యక్షగానమును రచించినాడు. అది అన్యాపదేశ యక్షగానము. ఆనాటి ప్రభువు ప్రజలను బాధింపగా ఇంకొక ప్రభువు అతనని జయించి సుఖరాజ్యమును స్థాపించినాడు. దీనిని వ్యంగ్యముగా నుంచుకొని ఒక సరస్సులో కొన్ని సర్పము లున్నట్లు అందొకటి ప్రబల దుష్టసర్పముగా నున్నట్లు గరుత్మంతుడు వచ్చి దాని మదమణిచి తక్కిన సర్పములకు శాంతిని గూర్చినట్లు కథను కూర్చి రచించినాడు. ఆలంకారికులు వాచ్యము కన్న వ్యంగ్యమునకు ప్రాధన్యమిచ్చినారు. ఇది దానికి సరితూగినది.


ఇక యక్షగానములలో బాగా ప్రయోగములోనికి వచ్చినవాటిని చెప్పవలసివస్తే సిద్ధేంద్రయోగి రచించిన 'భామాకలాపము', 'శ్రీకృష్ణపారిజాతము' వంటివి. ఇవి కూచిపూడి భాగవతులచే చాల తరముల నుండి పెక్కుచోట్ల ప్రదర్శింపబడినవి. వీటిలో 'భామాకలాపము' ముఖ్యమయినది. సిద్ధేంద్రయోగి మహాభక్తుడు. భక్తిని శృంగార మనవచ్చును. ఇందలి ఇతివృత్తము కృష్ణవిరహార్త అయిన సత్యభామ మన్మథావస్థలననుభవించి ఒక చెలితో కృష్ణునకు రాయబారము పంపుట, ఆ చెలి వెళ్ళి కృష్ణునకు సత్యభామ స్థితిని తెలుపుట, కృష్ణుడు సత్యభామ వద్దకు వచ్చి ఆనందింపజేయుట. ఇది శృంగారరసభరితము. ఇందు పాత్ర ప్రవేశమును ఆ పాత్రయే చెప్పకొనుచు సత్యభామ

"భామనే సత్యభామనే...వయ్యారి భామనే సత్యభామనే" అని ప్రవేశదరువును పాడుచు రంగప్రవేశము చేయును. వంతపాడువారు వంతపాడుదురు. మృదంగ వాదనము సహకారమై చాల రక్తి నిచ్చును. ఇందు నృత్యము ప్రధానము. నృత్యము వంతపాటకుల పాట మృదంగ వాదనము కలిసి మహారక్తిని కలిగించును. సంవాద వాక్యములలో వంతపాటకుల హాస్య వచనము మరీ నవ్వును పుట్టించును. ఈ విధముగా నవరసభరితముగా నుండును. 60 సంవత్సరాల క్రితం తెల్లవార్లూ ఈ ప్రదర్శనము జరిగేది. ఇట్లే కూచిపూడి భాగవతులు ప్రదర్శించినవి. "ప్రహ్లాద", "ఉషా పరిణయము" "హరిశ్చంద్ర" నేను చూచినవి. 'హరిశ్చంద్ర'లో కలహకంఠి, కాలకౌశికుడనే బ్రాహ్మణ దంపతులు, నక్షత్రకుడు హాస్యరసపోషకులు. ఇందు కాటిసీను చాల ముఖ్యముగా భావింపబడేది. కరుణరసము చిప్పిలి ఉండేది. ఈ విధముగా కూచిపూడి భాగవతుల ప్రదర్శనములు పండిత పామర రంజకములుగా నుండేవి. ఇవి రచించినవారు సిద్ధేంద్రయోగి కాక ఇతరులు కూడ నున్నారు. సిద్ధేంద్రయోగిది "భామాకలాపము" కాక "గొల్లకలాపము" అని ఒకటి ఉండేది. చల్లలమ్మ బోవుచున్న ఒక గొల్లభామకు దారిలో ఒక బ్రాహ్మణుడు తటస్థపడును. బ్రాహ్మణుడు తానగ్రకులస్థుడనని అహం కారపడును. గొల్లభామ అతనితో వేదాంతోపన్యాసము చేసి అతని అహంకారము నణచును. ఇది ఇందలి ఇతివృత్తము. ఇవి అన్నియును వస్తుత: చాలా మంచివి. కాని కాలక్రమం లో ప్రయోక్తల అలసత్వము చేత భాషా విషయములో పరిష్కార్యములయినవి. ఒక సమయములో నా చేతికి రాబోయి రాలేదు. కాలక్రమంలో క్రమంగా అవన్నియు తెరవెనుకకేపోయినవి. 1969లో శ్రీ వేదాంతం సత్య నారాయణశర్మగారు "విప్రనారాయణ"ను కూచిపూడి బాణీలో రచించి ఇమ్మని నన్ను కోరిరి. నేను దాని నను సరించి నా సంగీ సాహిత్య జ్ఞానమును పురస్కరించుకొని రచించి ఇచ్చితిని. శ్రీ శర్మగారు దానిలో దేవదేవియై ఆ యక్షగానమునకు వెలుగు నిచ్చిరి. ఇందు శృంగారము అంగిరసము. హాస్యము అంగరసము. సంగీత సాహిత్య ములు నిర్దుష్టములు. ఇంతకంటే దీనిని గురించి చెప్పుట అనావశ్యకము.

సిద్ధేంద్రయోగి ప్రభావము త్యాగరాజస్వామి మీద పడినది. ఆ ఫలితముగా "నౌకాచరితము", "ప్రహ్లాద భక్తి విజయము" అను రెండు యక్షగానములు త్యాగయ్యగారి నుండి వెలువడినవి. చాలా రసవత్తరములైనవి. యక్షగాన లక్షణములన్నియు వాటియందున్నవి. వీటి యందు త్యాగయ్యగారు పద్యములను, గద్యములను, ద్విపదలను కూడా రచించి చేర్చిరి. ఒకటి చెప్పక తప్పదు. పోతన పుట్టినది పద్యముల కొరకు. త్యాగయ పుట్టినది గేయముల కొరకు. "చాపలము చేత పద్యములు వ్రాసి నాను" అని త్యాగయ్యగారు గ్రంథాదిని చెప్పినారు. 'నౌకా చరిత'మందలి ఇతివృత్తము గోపికలు, బాలకృష్ణుడు కలిసి యమునా నదిలో నౌకలో విహారము ప్రారంభించేరు. గోపికలకు కొంచెం గర్వం మొలకెత్తినది. కృష్ణుడు గమనించి

ఉగాది

ఆలయమున వినబడు నదిగో !
ఆకసమున కనబడు నదిగో!
నవవర్షపు ఘంటానినదం
నవ్యాశాజ్యోతి!
ప్రాతయేటి పెను తమస్సులు
పాపకలితములు మనస్సులు
పటాపంచలే!
క్షుభితహృదయములపై విరిసి
విబునికరుణ జడులై కురిసె
నవవసంతమై!
శుభోదయోత్సవసమయమున
ప్రభూ యనుచు మధురరవమున
కీర్తించుదమా!



'రజని గీతం'

నాడు. ఇంతలో మేఘాలు, గాలి, శిలావర్షము విజృంభించినవి. నౌకకు చిల్లులు పడినవి. నీరు లోనికి వచ్చి నౌక మునుగనన్నది. కృష్ణుడు గోపికలతో తమ చీరలను విప్పి చిల్లులను పూడ్చుమని చెప్పినాడు. గోపికలు గర్వముడిగి చెప్పినట్లు చేసి శరణాగతి చేసినారు. నౌక సుఖముగా ఒడ్డు చేరినది. సర్వమును సుఖాంతము. ఇందు శృంగార కరుణ రసములు పోషించబడినవి. సంగీతము రసభరితము.

ఇక 'ప్రహ్లాద భక్తి విజయము'. ఇందలి ఇతివృత్తము. రాక్షసభటులు ప్రహ్లాదుని నాగపాశములతో బంధించి సముద్రమున బడవేసిరి. సముద్రుడు పరమభక్తుడు వచ్చెనని అంతఃపురమునకు గొనిపోయి స్వాగత సత్కారములు చేసి, గరుడుని పిలిచి నాగపాశములను విడిపించును. ప్రహ్లాదుడు ధ్యానముద్రను వీడి సముద్రునితో భక్తిసల్లాపము జేయును. నారదుని ద్వారా ప్రహ్లాదుడు సముద్రగర్భముననున్నాడని తెలసి నారాయణుడు తన స్వరూప రూప విభవైశ్వర్యములతో సాక్షాత్కారమిచ్చును. ప్రహ్లాదుడా ఆనందమున మునిగిస్వామికి నీరాజనము పాడును. ఇది కథాంతము. ఇట్లు త్యాగయ్యగారు ప్రహ్లాదుని భక్తికి విజయము చేకూర్చినారు. రసవత్తరముగా ప్రతి విషయమును వర్ణించినారు. ఇట్లు ప్రహ్లాదుడు త్యాగయ్యగారి చేతిలో క్రొత్తరూపమును దిద్దుకొన్నాడు. త్యాగయ్యగారి ఈ యక్షగానాలు రెండును సంగీతదృష్ట్యా చక్కని రాగరసభరితములు. అభినయానికి గాని, నృత్యానికిగాని అనువు కాని గేయ ప్రబంధ మేదీ ఉండదు. కనుకనే పూర్వము "గీతం వాద్యంతథానృత్తం త్రయం సంగీత ముచ్యతే" (పాట, వ్యాదము, నృత్యము మూడు కలిసి సంగీత మనబడుచున్నది) అని శాస్త్రకారులు చెప్పిరి. కాలక్రమంలో పాట ఆ మూడిటి కలయిక నుండి విడివడి పాట కచ్చేరీ అనే పేరుతో ప్రదర్శన యోగ్యమయినది. దీనికిని వాద్య సహకారము అవసరమయియే యున్నది. నృత్యమనేది గీత వాద్య సహకారులతోనే ప్రదర్శింపబడుచునే యున్నది. ప్రాచీన శాస్త్ర ప్రకారం ఇదే సంగీతమని చెప్పవచ్చును. ఇంకొక రహస్యము. నృత్త గీత వాద్యములలో సంగీతమే ప్రధానము కనుక మొత్తమును సంగీతమని శాస్త్రకారులు చెప్పిరి. అందుచేతనే సంగీతము విడిగా ప్రదర్శన యోగ్యమయినది. సంగీత సహకారము లేని నృత్య ప్రదర్శనము లేదు. నేటికాలమందు నృత్యము ప్రధానము, దానికి గీత వాద్యములు అంగములని ఒక భావన ఉన్నది. అది సరికాదు. గేయము, గేయమందు లయ, దాని ననుసరించి నృత్యము, గేయమందున్న సాహిత్యము ననుసరించి భావము, దాని ననుసరించి అభినయము. ఇది క్రమము. యక్షగానమనే ప్రబంధము యొక్క ప్రదర్శనము పైన చెప్పిన పద్ధతిలో నడచి ప్రజారంజనము పొందినది. యక్షగాన ప్రబంధ రచయిత యొక్క మనస్సులో పైన చెప్పిన వన్ని యుండినను సాధారణముగా యక్షగాన ప్రబంధములన్నియు ప్రదర్శనములోనికి రాలేదు. కూచిపూడి భాగవతులు చేపట్టినవి మాత్రమే వచ్చినవి. త్యాగయ్యగారి రెండు యక్షగానములును, నృత్త వాద్య సహకారముతో ప్రదర్శనలోకి రాలేదు. గాయకుల సంగీత సభలలో మాత్రము పాడబడుచున్నవి. ఇవి తమిళ దేశములోని మేలట్టూర్ భాగవతుల మేళములోను చేరలేదు. దీనికి

"మన శిఖరాయమానులైన గాయక విద్వాంసులలో - ఎంతో ఎత్తయిన మనిషి మంగళంపల్లి బాలమురళీకృష్ణ. బాలప్రాయపు చిన్న వయస్సులోనే కర్ణాటక సంగీతంలో సభాగాయకుడుగా పెద్దల ముద్దును సంపాదించి అప్పుడే అపురూపగానయోగి అనిపించుకొని, నడివయస్సు దాటే సరికి సర్వకళాసంపూర్ణుడై, సంప్రదాయక జ్ఞానంలోకాని, విద్వత్కళా ప్రదర్శనలోకాని, అధ్యాపకత్వంలో గాని, వాగ్గేయ కారకత్వంలో కాని ఏ కొరతాలేని పెరుగుదలను సాధించిన గురుపీఠం అతనిది. రేడియో కేంద్రాలలో కొంతకాలం సంగీత ప్రయోక్తగా పనిచేసి శాస్త్రీయ, లలిత, రేడియో నాటక సంగీతాలను పెంచి పోషించి, విజయవాడలో సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదవిని నిర్వహించి ఇప్పుడు మద్రాసులో 'మురళీరవళి' అని తన పేరనే వెలిసిన సంగీత సంస్థకు కారకుడై అంతరాత్మయై తానే ఒక సంస్థగా భాసిస్తున్నాడు. అతడు నాదమాధురీ మాంత్రికుడు (సమ్మోహకుడు) అంటే ఎంత మాత్రమూ అతిశయోక్తికాదు."

కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావు - మన సంగీత పరిణామచరిత్ర - ఆంధ్రప్రదేశ్ దర్శిని - (1998).

కారణమెక్కువ బృందములు లేకపోవుట. తెలుగు దేశములో కూచిపూడి ఒక్కటే. తమిళ దేశములో మేలట్టూరు ఒక్కటే. ఈ బృందములు ఏవో కొన్ని యక్షగానములను చేపట్టి సరిపుచ్చుకొనుట. ఏదయినా క్రొత్తది చేపట్టినట్లైతే దాని అభ్యాసము కష్టమగుట. యదృచ్ఛాలాభ సంతృప్తి.

ఇట్టి కారణములచేత ఈనాడు గ్రంథరూపమున కనపడుచున్న అన్ని యక్షగానములును ప్రదర్శనములోనికి రాలేదు. జయదేవుని 'గీతగోవిందము', తీర్థుల 'కృష్ణ లీలా తరంగిణి' కూడా భక్త బృందగానములలో పాట కచ్చేరీల చివర భాగములో చిల్లర పాటలుగా వచ్చినవే తప్ప పూర్తి యక్షగాన స్వరూపముతో ఎవరును ప్రదర్శనము లియ్య లేదు. ఈనాటి నృత్యప్రదర్శన బృందములు కాలపు అభి రుచిని బట్టి కొద్దివాటితో సరిపుచ్చుకొనుచున్నవి. కొద్ది కాలం క్రితం అన్నిటిలో ఒకటిగా నయినా ఒక తరంగము, ఒక అష్టపది అయినా నృత్యప్రదర్శనలో చోటు చేసుకొనేవి. ఇప్పుడది కూడలేదు. దీనికి ప్రధాన కారణము నృత్య ప్రదర్శకులకు సంస్కృతము వైదేశికమగుట.

తరువాత యక్షగానములే కాలక్రమములో జానపదరీతి లో దేశ్యరీతిలో బుర్రకథలుగా, హరికథలుగా రూపాంత రములను సంతరించుకొన్నవి. బుర్రకథకు ముగ్గురు చాలు. హరికథకు ఒక్కడు చాలు. ప్రస్తుత మీరీతిలో యక్షగానము కనపడుచున్నది. ఈ వ్యాసము మొదటి భాగములో నేను ప్రస్తావించిన జక్కుల కథ 'జముకుల కథ'గా మారి కొంతకాలం క్రింద బాగా పల్లెసీమలలో బుర్రకథను అను సరించి కనపడేది. అందులో వాయించే లయ వాద్యము జముకు. అందుచేత కూడా జముకుల కథ అనబడినది.

ఇక హరికథ శాస్త్రీయ సంగీత కవితా భారముతో, బుర్రకథ జానపద సంగీత కవితా లాఘవముతో నడచు చున్నవి. వాటియందలి సంగీత నృత్య ప్రవచన ములు వాటికి తగిన ధోరణిలో సాగుచున్నవి. ఇది యక్ష గానములు సింహావలోకనము.

ఆ॥ త్రిదివతలమునుండి దిగివచ్చి నరలోక
మందు నాంధ్రమందు నవఘళించి
దేశకాలముల కఠీనమై యక్షగా
నమ్ము నిలిచె నశ్వరమ్ము కాక. ✪

తెలుగు తల్లీ!



పసిడి మెఱుంగుల తళతళలు
పసిమి వెలుంగుల మిలమిలలు
గౌతమి కృష్ణల గలగలలు
గుడి జేగంటల గణగణలు

మెఱసి, మొరసి మించిన శుభసమయము తల్లీ!
తరళ యశోవతి! అనుపమిత రాగవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!


కవిపికముల సల్లాపములు
గాయక బర్హ్యాలాపములు
లాస్యళ్లగ విన్యాసములు
భాష్వత్పటహ నినాదములు

విరిసి, మ్రోగి, పఱచిన శుభసమయము తల్లీ!
సరళోక్తి మధురసవతీ! కోమలవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!

మాలికజన కలహాసములు
శ్రామికజన మధుహాసములు
దాస్యవిముక్త నివాసములు
స్వతంత్ర ప్రభావికాసములు

ఒలసి, మెలసి, చెలగిన శుభసమయము తల్లీ!
చరణార్పిత కోటిత్రయాహృత్సుమవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగు తల్లీ!

'రజని' గీతం



భావగీత రచన - కృష్ణశాస్త్రి

- పాలగుమ్మి విశ్వనాథం

"గేయం" అనగానే మనముందు సాక్షాత్కరించే మహోన్నతమూర్తి కృష్ణశాస్త్రి. గేయ రచయితగా శాస్త్రిగారిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు స్ఫుటంగా కనిపిస్తాయి. మొదటిది, లోకాన్ని నిశితంగా చూడగలిగే దృష్టి. ఏకేశ్వరోపాసన మొదలుకొని ఎలక్షన్లదాకా, అన్ని విషయాలూ ఆయన అవగాహనలోనికి వచ్చినవే. ఈ అన్ని విషయాల మీద ఆయన సమాన ప్రతిభతో పాటలు అల్లేరు.

"ఊర్వశి, ప్రేయసీ నేడో, యుష్మదీయ
చరణ కరుణా మధు కణమ్మొ దొరక నేను
మూడు లోకాల సుఖమొక్క ముడి నిమిడ్చి
విసరలేనో కాలాంతమే వెనుకప్రాక"

- అంటూ ఊహాసుందరి ఊర్వశి వైపు రెక్కల చాపుకు ఎగిరిపోగల భావనా పటిమ, మరోప్రక్క ఊరిబావి వద్దకు దృష్టి పోనిచ్చి

> "తొలి తెలుగు సినిమాలలో నటీనటులూ గాయకులూ రంగస్థలం మీది నుంచి సరాసరి తెరపైకి వెళ్ళిన వారు కావడం చేత ఆనాడు రంగస్థలపు బాణీలో మరాఠీ, హిందీ శైలులలో సంగీతం వినవచ్చేది. రానురాను హిందీ సినిమాలు మన ప్రాంతీయ ప్రేక్షకులకు కూడా ఆదర పాత్రములు కావడంతో ఆనాటికానాడు అక్కడి బెంగాలీ, పంజాబీ, పర్షియన్, అమెరికన్, ఆఫ్రికన్, మెక్సికన్, స్పానిష్ సంగీతపు బాణీలు తునకలు తునకలుగా వచ్చి మన ప్రేక్షకులపైన, తెలుగు చిత్ర నిర్మాతలపైన దాడి చేసి వారిలో చాలా మందిని ముఖ్యంగా యువకతరం వారిని లోబరుచుకొన్నాయి".

"సూరమ్మా పేరమ్మా చూశారమ్మా!
ఔరా! పెళ్ళంట మన నారిగాడికే!
ఆ! నారిగాడికా?
ఊ! నారిగాడికే"

- అంటూ ఓ చెవి ఇటు పడేసి ఊరి బావి ముచ్చట్లు కూడా, పాటలో ముచ్చటగా చెప్పగలిగే నేర్పరి కృష్ణశాస్త్రి.

"ఎటుల నీ లీల కీర్తింతు
ఓ దేవ దేవా!
ఎటుల నీ మ్రోల నర్తింతు - ఓ దేవ దేవా"

- అంటూ అంతరిక్షంలో, ఎక్కడో, ఏ లోకాల్లో నో కొలువైయున్న పరమేశ్వరుణ్ణి, గొంతెత్తి కీర్తిస్తూనే, మరోప్రక్క నాల్గురోడ్ల మొగలో సవారి కోసం ఎదురుచూస్తున్న రిక్షావాడి మీద కూడా...

"చౌరాస్తా! ఆహిస్తా!
ఏక్ సవారీ ఆఠాణా
దో సవారీ బారాణా
సర్దీ, గర్మీ, ఛడావ్, ఉతార్
రిక్షా జల్దీ తొక్కేస్తా!"

- అంటూ చలాకీ అయిన పాట అల్లేస్తారు శాస్త్రిగారు.

భావనాబలం, భాసా సౌరభం రెండూ పెనవేసుకుని దర్శనమిస్తాయి శాస్త్రిగారి పాటల్లో.

సుఖ దుఃఖాలతోటీ, ఎగుడు దిగుడు బ్రతుకులతోటీ, వెలుగుచీకట్లతోటీ నిండిఉన్న ఈ లోకంలోని మనిషిపై శాస్త్రిగారికి మమకారం ఎక్కువ. అందుకే ఆయన పాటల్లో



రజనికి యువతరం సంగీత దర్శకులంటే అభిమానం. కృష్ణమోహన్ ట్యూన్‌కి పాడుతున్న రజని

అంత వైవిధ్యం గోచరిస్తుంది, చిరుహాస్యం కూడా తొంగి చూస్తుంటుంది.

గేయాన్ని గురించిన పరమరహస్యం, ఆయన అందరి కంటే ముందుగానే తెలుసుకున్నట్లు అనిపిస్తుంది. సంగీత సాహిత్యాలమీద సమాన అధికారం గల వాగ్గేయకారుల యుగం అంతరించిన తర్వాత, సాహిత్య రచనగా రూపొందించిన ఒకగేయం ప్రాచుర్యం పొందాలంటే, దానితో సంగీతం వాడికి కూడా సంబంధం ఉండాలి" అన్న విషయం ఆయన ఎప్పుడో గ్రహించారు. అందుకే శాస్త్రిగారు పాట వ్రాస్తున్నప్పుడు, సంగీతానికి సంబంధించిన వారు ప్రక్కన ఉంటూనే వచ్చారు. మొదటి రోజుల్లో అనసూయాదేవి, మద్రాసు మకాం మార్చినప్పుడు రజనీ, హైదరాబాదు ఆకాశవాణి జేరినప్పటినుంచీ, ఈ వ్యాస రచయిత ఆయన గేయరచనతో ప్రమేయం ఉన్న వాళ్ళమే.

శాస్త్రిగారి గేయరచనా పరిణతి మూడు దశలుగా చెప్పుకోవచ్చు. మొదటి దశలో కాకినాడలో బ్రహ్మ సమాజ ప్రార్థనా గీతాలు ఎన్నో వ్రాశారు. అనసూయాదేవి వాటికి బాణీలు కట్టేది. ఆనాటి ప్రసిద్ధ గాయనీమణులుగా పేరు తెచ్చుకున్న వింజమూరి సోదరీమణులు. అనసూయ, సీత శాస్త్రిగారి పాటలను ఎన్నో సభల్లోను, సమావేశాల్లోనూ పాడి, ఎంతో ప్రాచుర్యం కల్పించారు.

తర్వాత శాస్త్రిగారు కాకినాడనుంచి, మద్రాసు మకాం మార్చారు. అప్పుడు ఆకాశవాణి మద్రాసు కేంద్రం, తెలుగు విభాగంలో శ్రీయుతులు ఎస్.ఎన్.మూర్తి, డా॥ వీరభద్ర రావు, ఆచంట జానకీరామ్, బుచ్చిబాబు, రజని మొదలగు ప్రసిద్ధులెందరో ఉండేవారు. వారు శాస్త్రిగారిచేత అనేక సందర్భాలకీ, పండగలకీ, పబ్బాలకీ, ఎన్నెన్నో పాటలు, సంగీత నాటికలు వ్రాయించారు. రేడియో అవసరాలకు అనుగుణంగా, శాస్త్రిగారి గేయ రచనాశైలిలో మార్పు వచ్చింది. ముఖ్యంగా సంగీత నాటికలలో ఆయా సన్నివేశాలలో, రకరకాల పాటలకు, శాస్త్రిగారు వ్రాసిన పాటలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ ప్రత్యేకతను సంతరించుకోవడంలో రజనీకి ప్రధానపాత్ర ఉంది.

రజనీ స్వతహాగా వాగ్గేయకారుడు. సంగీత సాహిత్యాలతో సమాన పరిచయం ఆయనకుంది. రజనీ సంగీత శైలిలో ఒక ప్రత్యేకత ఉంది. శాస్త్రీయ సంగీత పునాదులపై రూపుదిద్దుకున్న సంగీత రచనాశైలి (Music Composing) కాదు. అతనిది సహజమైన, స్వతంత్రమైన సంగీతధార.

అతని సంగీత విహంగం రెక్కలు చాపుకుని నాద ప్రపంచం లో అందచందాలు వెతుక్కుంటూ అటు మధ్యప్రాచ్యం దాకానూ ఎగిరి ఆ అందచందాలు ఆకట్టుకుంది. ఇటు హిందూస్థానీ, బెంగాలీ, జానపద రీతులతోనూ దోస్తీ కట్టింది. జాతీయతకు (Nativity) దూరం గాకుండా నాద ప్రపంచంలో స్వతంత్ర మార్గం ఏర్పరచుకున్నాడు రజని.

రజనీ సంగీత శైలిలో అనేక సంగీతరీతులు సహజంగా ఒదిగిపోయి కొత్తదనాన్ని ప్రదర్శించేవి. వీటికి తోడు రజనీకి అద్భుతమైన గాత్ర సంపద ఉండేది. గాంభీర్యం తొణికిసలాడే అసలైన పురుషగాత్రం రజనీది. ఆకాశవాణిలో ఆయన నిర్వహించిన సంగీతనాటికలు "మధురానగరి గాథ", "సంధ్యా దీపకళిక", "మేఘ సందేశం," "కొండనుండి కడలిదాకా", "గోదావరి" మొదలగునవి ఎన్నెన్నో శ్రోతల మన్ననలను అందుకున్నాయి. ఇంకా - "పసిడి మెరుంగు తళతళలు", "ఓ విభావరీ! ఓహో విభావరీ", "స్వైరిణీ అన్నారు నన్ను శ్యామసుందరా", "ననుజూచి నవ్వేరే" మొదలగునవి ఎన్నెన్నో ఆకాశవాణి ద్వారా శ్రోతలను ఆకట్టుకొన్న రజనీ పాటలు.

ప్రధానం



ఎన్ని తీయని కలలు
కన్నానో నినుగూర్చి
ఇన్నాళ్ళు ఎదవిప్పి
ఎరిగింపనా చెలీ!
బ్రతుకు పందెములలో
పయిపేరు నాదిగా
తొడిగినా ఏక వీర
కడియమ్ము నా చేయి!
నీ పెదవి కెంజిపురు నే
పుడికిన ఫలమె చాలు
తీయగొంతుక తోడ
కోయిలై పాడుదును!
నీ మనసు నా మనసు
ఏకమగుటనె చాలు
లోకమ్ము దిద్దే మ
హాకవిని కాగలను!
నీ వలపు తేనియను
త్రావిన బలమె చాలు
ఈరేడులోకాలు
ఏకముగ ఏలుదును!

'రజనీగీతం

కృష్ణశాస్త్రి గారి రచన, రజనీ సంగీతం పతాక స్థాయి నందుకున్న సంగీత నాటిక "అతిథిశాల" ఈ నాటిక వింటున్నంత సేపూ శాస్త్రిగారి రచన, రజనీ సంగీతం - మనల్ని మధ్య ప్రాచ్యంలోకి తీసుకు పోయి ....

"తళుకు జలతారు బుటాలల్లిన - నీలవలయంపు గుడారంలో సాకీలు, మధు పాత్రల మధ్య కూర్చోబెట్టి

"ఎట నుండి రాక ఏకడకు పోక
ఎవ్వారి కెరుక రావోయ్
రావోయ్ పథిక రావోయ్

అటు చీకటి ఇటు చీకటి
ఇట పాంథ శాల పగలూ
ఇట మనికి యొకటి మిగులూ"

- అంటూ ఉమర్‌ఖయ్యాం పాడుతుంటే, ఆ శ్రవ్య మధువుతో ఎక్కిన శ్రోతకి ఏ నాటికీ దిగదు. రజనీ సంగీత సృష్టిలో ఇది తలమానికము.

1957లో కృష్ణశాస్త్రిగారు ఆకాశవాణి, హైద్రాబాదు కేంద్రంలో "స్పోకెన్ వర్డ్ ప్రొడ్యూసర్" గా చేరారు. శాస్త్రిగారు ఏ ఉద్యోగం స్థిరంగా చెయ్యలేదు. చేసిన ఒకటి, రెండు ఉద్యోగాలు కొద్ది కాలం తర్వాత ఆయనంతట ఆయనే మానెయ్యడం జరిగింది. చాలా కాలం తర్వాత రేడియోలో ఉద్యోగానికి చేరడం ఒక విశేషం. అంతేకాదు పదవీ విరమణ చేసిందాకా. సుమారు 8 సంవత్సరాలు పనిచేశారు. ఈ ఎనిమిది సంవత్సరాలూ, ఇంచు మించు ప్రతి రోజూ శాస్త్రిగారితో గడిపే అదృష్టం నాకు లభించింది.

హైద్రాబాద్‌లో శాస్త్రిగారు వ్రాసిన పాటల్లో ఎంతో మార్పు వచ్చింది. పాట రచనా వ్యాసంగంలో ఆయనతో

కూర్చున్న సమయాలలో సంగీత సాహిత్యాలకు సంబంధించిన అనేక విషయాలు సంభాషణల్లో దొర్లు తుండేవి.

శాస్త్రీయ రాగాలు, వాటి స్వరూప స్వభావాలు - కోమల స్వరాలు, తీవ్రస్వరాలు వచ్చే రాగాలు, వీటిని గురించి చెపుతూ, వీణవాయిస్తూ, ఈ రాగం ఇల్లా ఉపయోగిస్తే ఈ సందర్భానికి నప్పుతుందేమో? పాటలోని భావం స్ఫుటంగా ముద్రవేయడానికి, ఏగమనంలో ఏగతిలో పాటనడిపితే రాణిస్తుందో, ఒక సాహిత్యం వివిధరాగాల్లో వివిధ గతుల్లో ఎలా వినిపిస్తుందో - పేలవమైన సాహిత్యం కూడా, ఒక్కొక్కసారి సంగీతం వల్ల ఎల్లా ప్రాణం పోసుకుని నిలబడుతుందో, మొదలైన విషయాలు ప్రస్తావనకు వస్తుండేవి. శాస్త్రిగారు అంటుండేవారు - "కవిత్వానికీ సంగీతానికీ దగ్గర సంబంధం ఉంది. కవిత్వం సంగీతం స్థాయికి ఎదగాలి. పాట వ్రాసే వాడికి లోపల సంగీతం ఉండి ఉండాలి. నా సంగీతం నా గుండె దాటి పైకి రాదు, అందుకే నాకు పాడేవాడంటే అసూయ. మరో విషయం కూడానూ. గేయానికి ఎక్కువ నగలు తొడిగెయ్యకూడదు - శబ్దాలంకారాలు వగైరా ఆభరణాల బరువు ఎక్కువైతే, పాపం ఆగేయం ఎగిరి గాయకుడి దాకా వెళ్లలేదు" అనేవారు. పాట విషయంలో శాస్త్రిగారికి స్పష్టమైన అభిప్రాయాలు ఉండేవి.

"ఒక్కొక్క భావం వ్యక్తం కావడానికి అక్కడ విధిగా పడవలసిన మాట ఏదో ఉంటుంది. (Inevitable word) . అల్లాగే ఒక్కొక్క సాహిత్యానికి ఒక్కొక్క బాణీయే నప్పుతుంది. దాన్నే (Inevitable Tune) అనే వారు. శాస్త్రిగారి దగ్గర కూర్చున్న సమయాల్లో సంగీత సాహిత్య ప్రవంతులు ఒకదానితో ఒకటి కలిసిపోయి, పదికాలాల పాటు, పదిమంది నోళ్లల్లో పడి బ్రతికే పాటలు ఎన్నో వచ్చాయి. అందులో భక్తి పాటలు, కర్షక, కార్మిక గేయాలు, పిల్లల పాటలు, స్త్రీల పాటలు, వేదాంతగేయాలు, ప్రేమ గీతాలు ఎన్నెన్నో ఉన్నాయి.

"ఎటు చూచినా తెలుగునాట
వినిపించు ప్రతీ నోట
ఓ కృష్ణశాస్త్రి నీ పాట॥

దుమ్మూ ధూళీ దులిపి
పాత మాటలనె కలిపి
కొత్త అర్థాలు నిలిపి
పాటలు చెక్కే శిల్పీ!
వినిపించు ప్రతీనోట
ఓ కృష్ణశాస్త్రి నీ పాట!

కంటి కొసలలో కొంటెదనం
మాటలలో చిరు చురుకుదనం
ఎప్పటి కప్పుడు కొత్తదనం
నీ పాటకు చేరదు ముసలి తనం
వినిపించు ప్రతీనోట
ఓ కృష్ణశాస్త్రి నీ పాట!

'నారాయణ అల్లా' యనీ!
'శివ శివ యనరాదా' యనీ
'అందాల మేఘమాలా' యనీ
'పదములె చాలు రామా' యనీ
ఒకపదమా ఒక పాటా
నీవు అన్న ప్రతి మాట
ప్రతి ధ్వనించును ప్రతిచోటా
వినిపించు ప్రతీనోట
ఓ కృష్ణశాస్త్రి నీపాట!

ఉన్నత్త భావశాలీ
ఉగ్రూతలూపు నీశైలి
మాపైన కవితచల్లి
పది కాలాల పాటు ఉండాలి
పసందైన పాట లల్లాలి
పరవశించిమే పాడాలి
ప్రతి గుండె అవి నిండాలి"

- అంటూ కృష్ణ శాస్త్రిగారి 80వ ఏట జరిగిన ఒక సన్మాన సభలో నేను చదివిన గీతం ఇది.

తిరిగే సంగీతగోళం

— పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

ఇప్పటివారికి అతిశయోక్తిగా ఉంటుంది కాని వెంకటమఖి తర్వాత అంతటివారు రజని. ఆయన కర్నాటక సంగీత నిరూపణకు, చేసిన సేవ ఎంతటిదో రజనిగారు లలిత సంగీత నిరూపణకు, సంగీత రూపక నిర్మాణానికి అంత సేవచేసారు. రజనిగారి గురించి రాయడానికి చాలా కలాలూ కావాలి. ఆయన సంగీతం రింగులోకి రావటం రావటమే పులిలా వచ్చారు. రింగుమాస్టరులా నడిచారు. లలిత సంగీతం సర్కస్సునంతా ఒక బృందావనంలా తీర్చిదిద్దారు. ఇప్పటికీ ఒకయోగిలా 'విభూతి' నిస్తూనే ఉన్నారు. ఆనాటి 'చండీదాసు' నుండి ఈనాటి 'హలశాతవాహనుడు' రూపకం వరకు ఆయన వేసినవన్నీ రాచబాటలే. ఎంతమంది సంగీత రూపకాలు రాసినా, ఎంతమంది యక్షగాన నవ్యత కోసం ప్రయత్నించినా, ప్రక్కన కాలిబాటని వెళ్లవలసినదే తప్ప ఆయన ఏర్పరిచిన బాటలను తీర్చడానికి ఎవరికీ కుదరదు.

ప్రతి రూపకంలోని వస్తువూ ఒక దివ్యతేజోమూర్తిలా కనబడుతుంది ఆయనకు. ఆ సాక్షాత్కారంతో సంగీతం పూనిన వడ్రంగిలా రాగతాళ నేపథ్యాల పూర్ణకుంభంతో సిద్ధమయిపోతారు. ఇక శ్రోతలకు రసలోకాలకు ఊరేగింపు ఊపిరి పీచ్చుకోడానికి ఆనంతం నుంచి తేరుకొనడానికి వీలుచిక్కదు. అన్ని సంగీతపుటాలోచనలు ముప్పిరి గొంటాయి. అంతటి ప్రకృతి హొయలు లేపివేస్తాయి. అంతటి పాత్రోచితంగా, పాటో చితంగా నడిచే సంభాషణల జల్లులు నిలిపివేస్తాయి. అదేం చిత్రమో కాని ఆయన సంగీత రూపకాలలో, సినీమాలలోని ఉత్సుకత చేకెత్తించే గుణం పదే పదే దర్శనమిస్తూనే ఉంటుంది. ముక్కుపుడుక కైవారం చెక్కుతూవుంటే వడ్రంగి చటుక్కున ఏ అరబీ ఖర్జూర కొమ్మ వంపో గుర్తుకొచ్చి పెట్టినట్లు సంగీతపు వరుసలో క్లిష్టమూ ఉల్లాస కారకమూ అయిన చమక్కు శ్రోతని 'బౌలు' చేస్తుంది. ఆయన పాటల్లో విశాలమైన నోటు మీద గ్రేసుతో నొక్కిన సందర్భాలున్నాయి. అక్షరాల యిరుకులో ఇమడకపోయినా కొంటె అందాన్ని పరిచే గవాయి బొక్కులున్నాయి. అందుకే ఆ పాటలో చరణం లోని ఆ సంగీత సందర్భాన్నీ పదే పదే గుర్తుచేసుకుంటాం. అందుకే తెలివిగల గాయకులు ఆయన ప్రతిభకు అబ్బురపడి ప్రేమించారు. తెలివిలేని గాయకుడు గులామ్‌గా వహ్వా అని వూరుకున్నాడు. ఆనందంగా పాడుకొనే శ్రోత పదే పదే తలచుకొని ముగ్ధుడయ్యాడు.

ఆయన సంగీతంలో చేసిన ప్రయోగాల సాంకేతిక భూమిక అర్థంకాకపోయినా, మామూలు శ్రోతకి సహితం ఒక అనుభవంగా మిగుల్తుంది. అందుకే అరవై సంవత్సరాల ఆయన సంగీత యాత్రలో మజిలీలను ఆయన ఎంతో గుర్తుంచు కొంటారో, అంతగానూ ఆయన పాటలను శ్రోతలూ గుర్తుంచుకొన్నారు. ఈ రక్తిమయ అనుభూతిని, నాలుగు నిముషాల పాటలో ఆయన బాగా చుట్టగలరు. అలా కొద్దిమంది లలిత సంగీత ప్రయోక్తలూ చేసిన మాట నిజమే, కాని సంగీత రూపకాలలోనూ యక్షగానలలోనూ అదే అనుభూతిని పరచగలవారు లేరు. అదీ ఆయన సంగీత రూపక ప్రక్రియకు కూర్చిన అలంకారం.

ఆయన రూపకాలకు మరో ప్రాణం సంఘటనల కల్పనలో కుదింపు. రేడియో సంగీత నాటకమంటే కాలపరిమితికి లోనయినది. వ్యవధి 30 నిముషాలు కావచ్చు, కానీ సంయోగవియోగ విషకంభాలు తవ్వడానికి పూడ్చటానికి చాలా సమయంపడ్తుంది. పైగా రజనిగారు ఎంచుకొన్న విషయాలు, ప్రసరించేకాలం విపులమయినది. ఈ ప్రక్రియలో సంఘటనల బిగింపును నెరవేర్చే వివరణాత్మక అస్త్రాలుంటాయి. ఆ అస్త్రాయ లక్ష్యసిద్ధితో వదలాలి. బోలెడు సంఘటనల జడకట్టును విడుస్తూ వెళ్ళాలి. శ్రోత వాటి జులపాలను చీదరించుకొనకుండా మంచి రాగాల పన్నీరుతో



1941 లో కృష్ణశాస్త్రిగారితో రజని మొదటి సంగీతం రూపకం 'శర్మిష్ఠలో' పాల్గొన్న సూర్యకుమారి, కొమ్మూరి పద్మావతి ; ఇంకా ఎడమవైపు మాలపల్లి సుందరమ్మ బళ్ళారివారి అమ్మాయి. కుడివైపు ఋష్యేంద్రమణి - కృష్ణశాస్త్రికి ఎడమవైపు రజని

అవి సాగాలి. ఆయన రూపకాలలో సాధారణంగా ఈ వివరణాస్త్రాలను నీరదుడో, నారదుడో; గాలో, చెలో; ఊధవుడో, ఉద్ధారకుడో; విటుడో, ఉల్లాసపతో వదులుతూ ఉంటారు. అక్కడేవుంది తమాషాతమకు అవగతమయిన పరిచయావరణలో ఈ బాణాల పదును సాగుతుంది. అనువాదాలలో అవి నడిచిన తీరు కేళీమోదకాలు. స్వంత రచనలలో అవి ఇక్షుకోదండ చుంబితాలు. ఆయన 'మేఘసందేశం', 'చండీదాసు' చదివితే తెలుస్తుంది.

ఆయన రూపకాలలోని మరో ప్రాకారం సంభాషణల కదురు. భావాల నూలుపోగులు పోసి ఆ పాత్ర లక్షణాన్ని, తత్కాల స్థితినీ, కథాక్రమగతినీ పెంచుకుంటుంది. పద్యాలలో మాటల పేటలను అల్లే శైలి తిరుపతి వెంకట కవులు ప్రచారం చేసినట్లు, పాటలలో ఈ శైలిని రజనిగారు నిలబెట్టగలిగారు. పద్యాలలో వచ్చిన శైలివల్ల ఒకరకమైన చిరగి గుణం తలకెక్కుతుంది. కానీ రజనిగారి పద్ధతివలన గోపుర శిఖరాలు పెరిగినట్లు పాటలో భావ శబలత ప్రతి అంతస్తునూ దీప్తిమంతంచేస్తుంది. 'చండీదాసు'లో 'కల్లోలినీ తరంగములన్ పయనించి పయనించి శీర్ణసికతాద్రియగునో మన ప్రేమ' అంటారు. మళ్ళీ 'పూర్ణకలశాబ్ధియగునో' అంటాడు. మళ్ళీ అనుమానం 'కాల గాఢాగ్ని కీలలలో తపియించి తపియించి దగ్ధ తరుకాండమగునో, ముగ్ధ భాండమగునో...' అలాగే - 'విరహ నిశ్వాసమగునో సరస దరహాసమగునో' అంటారు. 'మేఘసందేశం'లో అద్దరి సీనులో.

యక్షుడు : ముత్తైపు వూసలో స్వేదకణములో మోమునలముకొనె ఒత్తనా సఖీ

ఆమె : ముత్తైపు కాంతుల వ్రతభంగముల స్వేదకణములని చెరుపకొ సఖా.

యక్ష : ..... ఉహ్వాని ఒకవరియూదనా

ఆమె: .... యూదిన ఊర్పుటావిరుల దర్పణ బింబముకప్పువడు సఖా.

కాళిదాసు ఊహకి సంగీత శ్రమదానం ముందు చేసిన అనువాద భోగం ఇది.

వ్యాసవిస్తరణ యిష్టంలేక అనేక నాటకాల నుండి ఎత్తి చూపటం లేదు; కానీ ఆయన స్కీములో చటుక్కునవాలే అన్వయ ద్వారాలూ చాలా ఉన్నాయి. గోదావరి మీద

రూపకం తయారుచేసారు. మొదటే "గంగేచ..." అని సకల నదీ కలశ తీర్థ అవాహనతో మొదలయి గోదావరి నసికం దగ్గర మొదలవుతుంది. చటుక్కున రాజమండ్రి దాటిన తర్వాత గోదావరి అంటుంది పిల్లలతో "ఇక మీకు నేను ఈ రూపంలో కనబడను" అని. ధవళేశ్వరం వద్ద కాటన్ కట్టిన నాటి విశేషాలు పడవ ప్రయాణానికి బరువులూ, వివరాలు వస్తాయి. నదీమతల్లి అంతర్ధానమంటే మరొక ప్రగతిశీల పరిణామం. వెనక్కివెళ్దాం. నాగానందం కథని 'అమృతవర్షిణి'గా చేసారు. వధ్యశిల దృశ్యం బృందం కంగారు పడుతుంది:

రివ్వు రివ్వు, రివ్వు రివ్వు, రివ్వుమనుచును
దవ్వుదవుల దవ్వుదవుల సవ్వడాయెనే!
వచ్చిపడెను, వచ్చిపడెను గరుడుడయ్యో
చచ్చిపడెను, వచ్చిపడెను, చచ్చినామయా!

సంగీతానికి ఒదిగే అటువంటి శబ్దానుకృతుల ఛాయలోనే, వెంటనే -

కాలరాత్రి కురుల పాయగా
నీలి మబ్బుతెరల చాయగా
భూన భోంతరమ్ములదరగా - అంటూ చిన్న కల్పనాద్యుతినిస్తారు.

ఆయన రాసిన 'శాంతిపథం'లో నరుడు "నరుడు, ధరిత్రీ సుకవీశ్వరుడను యుగధర్మముల ప్రవక్తను" అంటాడు.

రజనిగార్కి ఎలియట్ ఒక మేలు చేసాడు. వామభావ భారబలముగల కవిత్వ శకలాలు వచనంలో రాసారు. ఆ ఆత్మ పాటలో దోబూచులాగుతూనే ఉంది. పాతగా వుంటుంది చెప్తే - 'ధర్మచక్రం'లోను, ఇతర నాటకల లోనూ, ఇటీవలి పాటల్లోనూ సంపదను అందరూ పంచుకోవాలని సమభావం పెరగాలని చిన్నపికాల గొంతు బాగా వినబడాలనీ - నవీన ఆవిష్కరణలిచ్చిన కొత్త దృష్టి సంస్కారాన్ని రజని రూపకాలలోనూ వదుల్చుకోలేదు-

''ఏగునదే, ఏగునదే జగతి నలుదెనల నా చంద్రార్కము" అన్నవారే, "రాజు, రౌతు, ప్రభువు, బంటు, యతి, గృహస్థు చనుమార్గము సర్వసమము, శాంతి కాంతి పథమవక్రము! ధర్మచక్రము!!" - అని రాసారు.

స్త్రీ వాద రచయిత్రి చైనా పర్యటన గుర్తుకు తెచ్చుకుంటూ ఒక వ్యాసం రాసారు. అందులో గ్రీకు కవయిత్రి శాఫో ప్రస్తావన తెచ్చి మన రచయితలలో కృష్ణశాస్త్రిగారు ఆమె గురించి తలపోసారన్నారు. సరే వేలూరి శివరామశాస్త్రిగారూ చెప్పారు. కానీ రజనిగారు సంగీతరూకం రాసారు. ఊహగా అల్లిన జీవిత ఘట్టమైనా పురుషాహం కారంతో శాఫోను ప్రియుడు షావో విడిచిపెట్టే దృశ్యం ఈనాటి కవయిత్రుల మగవారి డోలాయమానస్థితికి నిదర్శనగా వచ్చింది.

షావో : సెలవొసంగుమా, శాఫో సెలవొసంగుమా
నీ కవితాగరిమకంటె, నీ ప్రణయ మధురిమ కంటె,
ఆ సౌందర్య వనీ సౌఖ్యాంచిత భోగాల వలతు
విస్మరింపుమా, నన్నిక విస్మరింపుమా
సెలవొసంగుమా, శాఫో సెలవొసంగుమా.

చిత్రమైన మనుధర్మబుక్కాపూసుకున్న పురుష పాత్రను సృష్టించారు రజని.

గ్రీసుదేశపు పౌరాణిక గాధలలోని ఆర్ఫియస్ జీవితగాధను సంగీత రూపకంగా, 'విశ్వవీణ'గా మలిచారు. "ఏ తంత్రి నీ మధుర హృదియో" అని వైణికుడు అంటే సుందరి "ఏ మ్రోత నీ హృదయ గీతిమో" అంటుంది అందులో విశేషం లేదుకానీ అంతకుముందే ఈ వైణికుడు చిన్న ఆశ్చర్యం కలగ చేసేమాటని ఉపయోగిస్తాడు.

వైణికుడు : నీలనీరదాంచలాన తేలే శంపాలతవో
కాలసాగరానవెల్గు నారువోయు పూర్ణశశివో

ఈ 'వెల్గునారువోయు' అనే మాట చిత్రంగా పడింది. ఒక వైపు నోటికి పట్టే పల్లవి టైపు పాటల పాదాలు, మరొక వైపు లో - కాలనేలే మాటల రోజాల మాల వంటి ఉక్కిరి భావాలు కలగచేయడం రజని ప్రత్యేకముద్ర.

ఆయన రేడియోలో ఉన్న సంవత్సరాలలో సంగీత రూపకాల క్రీడల్లో బరువు రావటానికి మూడుముక్కలాట ఆడినట్లు కనబడింది. ఒకటి తానే రచించినవి తానే స్వరపరచి తానేపాడే షో. దానితో కొన్ని సంవత్సరాలు నడిచింది. ఏకకాలంలోనే బాలమురళితో వీనులు విందు చేసిన షోలు. అలాగే వోలేటితో నడిపించిన రోజులు. సాధారణంగా సంగీత రూపకాలలోని పాటలకు స్మరణ వుండదు. రజనిగారివి కాబట్టి వాటికి ఆ యోగం పట్టింది. 'చండీదాసు'లోని పాట మనప్రేమ (బాలమురళి): స్వైరణి

అన్నారు నన్ను'లో వోలేటి పాడిన ' మనసౌనే ఓ రాధ'; మల్లిక్ పాడిన 'ధర్మచక్రంలో సాగునదే' బృందగీతిక అలాటి పాటలు.

రజని, 'క్షీరసాగరమథనం' 'విప్రనారాయణ' రేడియో కోసం కృష్ణశాస్త్రిగారితో కలిసి రాసిన యక్షగానాలు; అవిగాక ప్రదర్శన కోసం 'కళ్యాణశ్రీనివాసం', 'శ్రీకృష్ణశరణంమమ', 'విజయోస్తుతేనారీ', 'హలశాతవాహన' - అనే నాలుగు యక్షగానాలు రాసారు. చాలాకాలం క్రితం 'మేనక విశ్వామిత్ర', 'సుభద్రార్జునీయం' కొందరు ప్రదర్శించారు. మధురనగరి గాధను నృత్యం చేసారు.

ఆయన సంగీత రూపకాలు 30 దాకా వచ్చివుంటాయి. 26 ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. 18 సంగీత నాటికలు ఇదివరకే 'విశ్వవీణ' పేరుతో వచ్చాయి.


ఆయన రూపకాలు విశిష్టమైనవిగా కనబడటానికి ఒకటే కారణంగా తోస్తుంది. పాటలో పాడటానికీ, ఆడటానికీ అనుకూలమై రాగ పద్ధతి ఏది వుందో దానిని అవలంబించి ఆ పాటకి సంగీతం పెడ్తారాయన. మిగిలినవారు అలా ఎంచుకొని చేస్తారనుకోను. ఆయన ప్రత్యేకత ఏదో ఆయననే చెప్పమంటే రజనిగారు.

"రాగతాళప్రయోగాలలో ఒక విధమైన కళాత్మకత, స్పాంటేనిటీతో కూడిన క్రియేటివిటీ వుండేలా చూస్తాను" అన్నారు.

రజనిగారికి ముందు 40 దశకంలో సంగీతం తెలిసిన వారికి సాహిత్యం పట్టు తెలీదు. ఆయన రంగంలో దిగటంతో సాహిత్యమనే బంగారానికి సరైన సంగీతమనే తావి అబ్బింది. ఆంధ్రదేశానికి క్రొత్త ఆనందయాత్ర ఆరంభమయింది. అది ఇంకా కొనసాగుతున్నదంటే రజనిగారు వేసిన పాదముద్రలే కారణం.

రజని ప్రతిభకి మరో ముఖం ఉంది. అది విషయాత్మక సంగీతం. దీనిని థీమటిక్ సంగీతంగా ఇటీవల పేరు పెట్టినా, మన రేడియోలోనూ, ఇతర ప్రదేశాలలోనూ వాద్యబృందంగానే చెలామణీ అవుతూ వచ్చింది. సినీమాలలో కథావస్తువుకు అనుగుణమైన నృత్యకల్పనలలో నిడివిగా ఈ విషయాత్మక సంగీతం సాగింది. అయితే మంచి శక్తి గల వాద్య నిపుణులతో రవిశంకర్ నాయకత్వంలో జాతీయ వాద్యబృందం ఎన్నో లక్ష్యాలతో మొదలయింది.

స్వాతంత్ర్యోత్సవ పుష్పాంజలి



మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి!
భరతదేశమే మా దేశం!
భారతీయులం మా ప్రజలం!!

వింధ్య హిమవత్ శ్రీ నీలాద్రుల
సంధ్యారుణిత నవాశలు మావి!
గంగా గోదావరీ సహ్యజా
తుంగతరంగితహృదయాల్ మావి!!

ఆలయమ్ముల శిల్పవిలాసం!
ఆరామమ్ముల కళా ప్రకాశం!
మొగల్ సమాధుల రసదరహాసం!
మాకు నిత్యనూతనేతిహాసం!!

అహింసాపరమోధర:
సత్యం వద ధర్మం చర
ఆదిఋషుల వేదవాక్కులు
మా గాంధి గౌతముల సువాక్కులు!!

స్వతంత్ర భ్రాతృత్వాలు
సమతా మా సదాశయాలు!
జననీ! ఓ స్వతంత్రదేవీ!
కొనుమా! నీవాళులు మావి!!

'రజని' గీతం

ఇటీవలే దీనికి మంగళం పాడారు. జయరామయ్యర్, శంకరశాస్త్రి, ఎమ్. కామశాస్త్రి వంటివారు చేసిన కృషి అపారము. వీరితో పాటు పన్నాలాల్ ఘోష్, అనిల్ బిస్వాస్, ఏల్చూరి విజయరాఘవరావు వంటివారు సమకూర్చిన విషయాత్మక సంగీత కల్పనలు భారతీయ సంగీత జంత్ర

పరిష్వంగము



హాయిగ పాడుదునా సఖి
హాయిగ పాడుదునా!!
ఆకసమందున రాకాచంద్రుడు
నా కౌగిలిలో నీ సౌందర్యము
కాంచలేక నా మబ్బులలోపల
పొంచిచూచి సిగ్గున తలవంచగ?
హాయిగ పాడుదునా!!
కరమున నొక మధుకలశము నిడికొని
ఉరమున నీ విటు లొదిగి యుండగా
తారాపథమును చేరగ గళమును
సారించుక తీయతీయ పాటలు
హాయిగ పాడుదునా!!

'రజనీ గీతం

వాద్య బృందం యొక్క అవధులు లేని సాగరాన్ని దాటిస్తాయి. రాగాల, తాళాల విషయాలను భూమికగా పెట్టుకొని ఒకానొక ఏమోషన్ని, కథా కథన శిల్పాన్ని, నాటక పారమ్యాన్ని సమకూర్చడం ఈ విషయాత్మక సంగీతంలోని బుద్ధి విశేషాలు.

ఈ విభాగపు రచనలలో రజనిగారికి రెండు మకుటాయమైన రచనలున్నాయి. కామదహనం, విశ్వయానమనే గాత్ర వాద్యస్వరమేళనం. ఒకటి మన్మధుడి బూడిద కథ, రెండు ఆకాశంలో పుట్టిన సంగీతం గురించి. భూతభవిష్యద్ వర్తమానాల విశ్వపురుషుని అనంతయాత్ర అది. ఈలోగా ఎక్కడా కీర్తనలు లేని రాగాలలోకి వెళ్ళి రూపాల సాక్షాత్కారం తెచ్చిన రెండు వాద్యబృందాలు, దేశవరళి, దేవసారంగం ఉన్నాయి. వీటి పోకడలకి నేర్పుకీ మతిపోయిన వాద్య నిపుణులు వాయించి "సార్! మేము వీటిని మా సోలో కచేరీలలో పెట్టుకోవచ్చా" అని అడిగారట. వీటి ప్రత్యేకత గురించి చెప్తూ, "రాగఛాయని విభజించటంతో బాటు రాగం యొక్క పలుకుబడిని యాసతో పలికించాను. రాగ విస్తరణతో బాటు ఎమోషన్ను చూపించాను. రసానందం చిప్పిల్లుతూ వాయించగలిగేలా చేయించాను. కీర్తనలు లేని రాగం ఇలా వుంటుంది అని చూపించాను" అన్నారు రజని.

ఆయన విషయాత్మక సంగీతంలో పాత్రలకి వాద్యాలు, వాటి సంవాద రూపాలు, ఏక కాల విభజనలు కలిసి మెదిలే ఊహలు, ప్రకృతి సహజ ధ్వనుల కల్పనాతిశయాలు - ఇలా ఎన్నో ఉంటాయి. వీణ మీద పార్వతి తపస్సు చేస్తూ ఉంటుంది కామదహనంలో, అంటే అర్చన, శివుడికై భైరవి రాగంలో. మన్మధుడు అక్కడ బాణాలు వేస్తాడు శివునిపై - వాద్యాలు తిరగబడే ధ్వనులు. శివుని మూడో కన్ను తెరిస్తే వాద్యాలన్నీ వెంట బడ్తాయి. దహించిన ఎఫెక్టు వస్తుంది. మన్మధుడు పడిపోవటం... అనుకరిస్తున్న వాద్యాల కల్పనలో తిరుగుతుంది. ఇక హేమంతరుతువనే ధ్వని ప్రధాన వాద్య బృందానికి కొంతపనిపెట్టి రక్తికట్టించారు. కీచురాళ్ళ రొదలు, అదీ చిత్రమైన సంగీత ప్రదర్శన.

ఆయన ఆంధ్రీరాగం కళ్యాణీ రాగ రూపమని నిరూపించడానికి కొంత శోధన చేసి ఒక వాద్యచిత్రాన్ని అందించారు. సంగీత రత్నాకరంలోనూ, బృహద్దేశిలోను ఆంధ్రి ప్రస్తావన

వుంది. నొటేషనిచ్చి చూసారు. కళ్యాణితో సంబంధం ఉందని చెప్పారు. ఇదివరకు అలా ఎవరూ చెప్పలేదు. ఆంధ్రి రాగమంటూ ఏ కీర్తన రూపమూ లేదు. వాద్య బృందంతో ఢిల్లీలో నిరూపించసాగారు. మధ్యమ గ్రామంలో గాంధారాంశ మూర్ఛన, అవి కళ్యాణి మెట్లు. అది అయిన తర్వాత కీర్తన దృష్టితో సాగింది. లలితగీతంలోని కళ్యాణి ప్రయోగం చేసారు. పండితులు మెచ్చారు. కళ్యాణి అనే దానికి ఆంధ్రి రాగమని పేరుపెట్టుకోవచ్చు - సంగీతం వారు అంగీకరిస్తే. "దీనిని అసలు తురుష్కరాగం అన్నాడు వెంకటమఖి. అమీరుఖుస్రో యమన్‌ను ప్రోత్సహించాడు ఎమన్, అరబు దేశాల నుండి వచ్చిన మాట ఎమెన్. నిజానికి కళ్యాణి. ఇదే ఆంధ్రి" అన్నారు రజని.

'విశ్వయానం' గురించి ఒక ప్రతేక పత్రమే రాయవచ్చు. "ఎన్ని ఏకాంత రాత్రులలో ఇంటి తోటలో తిరిగిన స్మృతుల సమాహారం" - ఒకమంచి కృతిగా వెలసింది. 20 నిముషాల ఈ రచనను ఒక్కటీ స్పీలుబర్గ్ స్థాయి, దర్శక ఊహాజీవి విజువల్స్ రూపొందించాలి. ఆ వీడియో వెనుక ఈ వాద్య రచన చేయాలి. అంతకంటే చెప్పడానికి లేదు. ఆకాశం శబ్దగుణాత్మకం, అందులోంచి సంగీతం నాదమయి. నాదం మెలడీ అయి, మెలడీరాగమయి - అందులో నుండి ఓంకారం పుడ్తుంది. ఎప్పుడూ ఏదో జరుగుతుండే భూత భవిష్యద్వర్తమాన కేళీవిలాసం ఈ గ్రహాంతర సీమలలోని విశ్వపురుషుని అవతారం. అబ్‌స్ట్రాక్ ప్రెజంటేషన్‌కి స్వరకల్పనలో క్రొత్త ఒరవడిదిద్దిన స్వరరచన. "యదపితదతీతం తదప్యోంకార ఏవ" - అనే మాండుక్య ఉపనిషత్తులోని సూక్తి ఈ సంగీతరచనకు ఆకృతి నిచ్చింది. "చరజగత్తు" అన్న తర్వాత ఒక వాద్యబృంద పదం నడుస్తుంది - అది చాలు ఆయన గొప్ప చాటడానికి.

ఇన్ని వీధులు రూపకభేదం పద్మావతి చరణచారణ చక్రవర్తి తిరిగిన సంగీత వీధులు తిరిగినవారు మరొక రుంటారా! కాళిదాసునీ, కళింగ గంగునీ వనరులుగా మలచుకొనగల మేధోమార్గయక్షుడు మళ్ళీ ఈ నేల మీదకు వస్తాడా? సంస్కృతాన్నీ ఆంగ్లాన్నీ కడుపారా తాగి త్రేన్చగల సృజనధర్మి అస్తమాను ఉదయిస్తాడా? నన్నయ్య పద్యాలలో దాటు లయనీ, శ్రీనాథునిలో భావ లయనీ అలవోకగా చదువుతూ వివరించే రజని వంటి నవీనమతంగుడు జన్మిస్తాడా? తంజావూరు చతుష్టయం వదిలిన చిన్న సందుల్లో దూరి నృత్యాహ్లాదానికి దారులు చూచిన చిరుకాపరిని కనగలమా! జీవించే యక్షగానాల పేటికలో రేడియోలో పునస్సంగీతమహోత్సం దశాబ్దాలుగా నిర్వహించిన పేతురు సోదరుని, రిసరెక్షన్ మళ్ళీ వింటారా! కూచిపూడి యక్షగానాల అలనాటి గాథలతోపాటు, కొత్త యక్షగాన రీతులను నిలవరించే అపారసేవలో అష్టది క్పాలికలవంటి నవీన యక్షగానాలు తయారుచేసిన సంగీత బలభద్రుని మళ్ళీ చూస్తామా! దేశీయ విదేశీయ సంగీత ఫణితుల నిగారింపుతో తెలుగు సినీమా పాటకీ, భావ గీతానికీ ఆయుష్షు పెంచిన అశ్వనీ డాక్టర్ మళ్ళీ ఈ దేశంలో ప్రాక్టీసు పెడతాడా? తురుష్క సంగీతమేకాదు వారి ఖగోళ శాస్త్ర అధ్యయనానికి మన పద్యాలలోని 32వేల సంవత్స రాలు తారాపథ యాత్రాకథని సమన్వయం చేయగల శాస్త్రజ్ఞాన విద్యార్థికుడు ఆంధ్ర దేశాన ప్రస్తావించగలమా? అదేమిటి? శారంగదేవుడు ఆంధ్రి అనడమేమిటి? రజని దానిని నిరూపించడమేమిటి? పరిశోధనకీ ప్రయోగానికి గడిచిన అరవై సంవత్సరాలుగా రజని ఆఖరి మెట్టుగా నిలిచారు. అపురూప ఆధునిక వాగ్గేయకారుడైనారు. అందుకే ఆయన కీర్తికాలం రేపు కూడా విస్తరిస్తూనే ఉంటుంది. ✪

ఆంధ్రవాగ్గేయకార చరిత్రము; పుట 112 - ద్వితీయ ముద్రణము - 1958. "శాస్త్రీయ సంప్రదాయానుసారులైన కీర్తనలు మొదలయిన గేయాల కంటె విలక్షణమైన నూతన స్వరూపం వచ్చింది గేయానికి. సినిమాలో ఈ పరిణామానికి వచ్చిన గేయాలకు గ్రామఫోను, రేడియో ప్రసారాల వల్ల ఎక్కువ ప్రచారం కలిగి ఈ నవ్యావతారం లో గేయం 'లలితగీతం'గా - లైట్‌సాంగ్‌గా తేలింది. సినిమాలో కూడా సాహిత్య సంగీతాలలో సాధికారులైన వారు పనిచేసే చోట గేయం పూర్తిగా తన ప్రాంతీయ సంప్రదాయాలనుకోలుపోక కొంతవరకు తేరుకొని ఉంది" - రజని; పుట 466 - ఆంధ్రవాగ్గేయకారచరిత్రము. ద్వి.ము. 1958

బహుముఖ ప్రజ్ఞాశాలి రజనీగారు

– నూకల చిన్న సత్యనారాయణ

రజనీగారు సాహిత్య సంగీతాలలో అపారమైన ప్రతిభ, ప్రజ్ఞ, ఉపజ్ఞ భగవద్దత్తంగా కలిగిన కళామూర్తి.

నా చిన్నతనంలోనే వారు, భానుమతి పాడిన ఒక Disc Record వినేవాడిని. చాలా అందంగా ఉండి చాలా కష్టమైన పాట కూడానూ అది.

తరువాత, వారిని బెజవాడ A.I.R లో లలిత సంగీతం పాటతో A.I.R నిలయ విద్యాంసులకు నేర్పుతో ఒక లలిత గీతాన్ని కూరుస్తూండగా మొదటిసారిగా చూచాను. ఆ పాట కూడా మధురం గానూ, క్లిష్టంగానూ ఉంది అని అనుకొన్నాను. కర్ణాట సంగీతం ఎక్కువ ఏండ్లు నేర్చు కొన్నట్లు గాలేదు, కాని, వారు అఖండ ప్రజ్ఞావంతుడు గనుక, కర్ణాట, హిందుస్థానీ బాణిలే కాక. మధ్య ప్రాచ్య సంగీత స్వరాలు వారిలాగే పాడటం విన్నాను. నమాజ్ మంచి గొంతుకతో ఇస్లాం మతాధిపతులు పాడుతోన్నట్లు ఉన్నాయి. అవి మన రాగాలే మన స్వర స్థానాలే కాని శృతులలో తేడాలు అంటూ ఉంటాయి.

రజని గారు వ్రాసిన "ఆంధ్రవాగ్గేయ కారులు చరిత్ర"కు వారికి ఒక ఇరవై Doctorates అయినా ఈయవచ్చు. ఎంతో లోతులు వెదికారు. ఎంతమందో అజ్ఞాత వాగ్గేయకారులను జీవింప చేశారు. ఆయన గొప్ప పరిశోధకుడు. నాలాంటి సంగీత విద్యార్థులకు ఆ పుస్తకం ఎంత ఉపయోగ కరమో వర్ణించటం కష్టం. అడుగడుక్కి నేనెన్నో సార్లు ఆ పుస్తకాన్ని Refer చేస్తూనే ఉన్నాను, ఈ నాటికీని. ఆ పుస్తకాన్ని అతిభద్రంగా, బంగారంలా చూచుకొం టున్నాను.

> "1948లో ఆంధ్రశ్రోతలకు ఒక రేడియోస్టేషన్ వచ్చింది - విజయవాడ కేంద్రం, 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడి, 1956లో హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, హైదరాబాదు ప్రధాన రేడియోకేంద్రమై ఆ వెను వెంటనే వరసగా కడప, విశాఖపట్టణం రేడియో కేంద్రాలు వెలిశాయి" - బాలాంత్రపు రజనీకాంతారావు
>
> ఆంధ్రప్రదేశ్ దర్శిని; పుట 595. విశాలాంధ్ర ప్రచురణాలయం - 1998.

ఈ మధ్య క్షేత్రయ్య పదాలకి English Translations చదివాను. చాలా accurate గా idiamatic గా చాలా expressive గా ఉన్నాయి ఆ Trans- lations ప్రపంచ విఖ్యాతి అయ్యేటట్లుగా ఉన్నాయి.

ఒక వ్యక్తిలో ఇన్ని అసాధారణ ప్రజ్ఞాపాటవాలు ఉండటం అనే విషయం ఆలోచిస్తే భగవంతుని యొక్క ఉనికి మీద Rationalist కి నాస్తికులు కూడా ఆస్తికులవాలి మరి. తరువాత వాళ్ల ఇష్టం. ఆయన పరిశోధకుడు, బహుభాషా కోవిదుడు, మహా సంగీతవేత్త, సుకవి, విమర్శకుడు. ఇవి కాకుండా మృదుభాషి, సాధుస్వభావం గలవాడు, మంచి Administrator.

సంగీతంలో వారికి ప్రత్యేకమైన బాణి ఉంది. ఆ బాణిని ఎవ్వరూ అనుకరిం చలేరు. ఇతరమైన ఏ ఒక్క బాణీనీ వారు అనుకరించలేదు.

ఇంకొక్క అపూర్వ విషయంలో వారి అద్భుతమైన greatness ద్యోతకం అవుతుంది. అది వారి 22 శృతుల పరిశోధన. 22 శృతుల subject చాలా అగమ్యగోచరం. ఈ శృతులను వారు గానం చేస్తూ explain చేస్తూ ఉంటే ఈయన భరతుడా, శార్ఙ్గదేవుడా, వారి అవతారమా అనే సందేహం పెద్ద పెద్ద సంగీతజ్ఞులకి కలుగుతుంది.

రజనీగారి లాంటి వ్యక్తులు కోట్లలో ఒకరు, యుగానికి ఒకరు ఉంటారు. వారు చిరంజీవిగా ఉండి సంగీత సాహిత్య సేవచేయాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

రజని సినిమా సంగీతం

— మూల్పూరు నరసింహారావు

నెనుకటి తరం సినిమా ప్రేక్షకులకు ఇప్పటికీ "ఓహోహో పావురమా", "ఊరేది.. పేరేది" అనే పాటలు వింటే చాలు ఒళ్ళు పులకరిస్తుంది. "అటో - ఇటో - ఎటు పోవుటో" అంటూ రోజా పాడుకునే రోజులను గుర్తు తెచ్చుకుంటారు.

వాటిని రచించి, బాణీలు కట్టినవారు సుప్రసిద్ధ సంగీత దర్శకులు శ్రీ బాలంత్రపు రజనీకాంతరావు అని మాత్రం చాలా మంది మరచిపోవచ్చు. రేడియోలో 'రజని'గా ఆయన చేసిన అనేక సంగీత ప్రయోగాలకు, నండూరి పాటలకు బహుళ ప్రజాదరణ లభించింది. తెలుగులో అధునిక యక్ష గానానికి దారి చూపించిన వారిగానూ పేరు వచ్చింది. కానీ, అనేక సినిమాలకు కూడా ఆయన పాటలు రచించి, సంగీత దర్శకత్వం వహించి, పాటలు కూడా పాడారని నేటి యువ తరంలో చాలామందికి తెలియకపోవచ్చు. జయమ్మ, సూర్య కుమారి, కమల, ఎస్.వరలక్ష్మి, భానుమతి, ఆర్. బాలసర స్వతి, ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి ఇలా ఎందరో గాయనీమణులు ఎప్పుడో ఒకప్పుడు ఆయన పాట చెప్పగా రికార్డింగు చేసిన వారే... బాలమురళి, ఎస్. రాజేశ్వర్రావు, ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం, ఎమ్. ఎస్. రామారావు, ఓలేటి, మల్లిక్ ఆయన పాటలు పాడినవారే. పాశ్చాత్య సంగీతపు ధోరణులను రక్తివంతంగా సినిమాలో పాడించిన తొలి సంగీత దర్శకులు, అపూర్వ రాగాలకు తెలుగు సినిమాలో మళ్ళీ పీట వేసిన వారు రజనీకాంతరావుగారు. ఆయనంటే బి.ఎన్. రెడ్డిగారికి ఎంతో గౌరవం. ఒక సినిమాకి ఆయనే ఘంట సాలకి పాటలన్నీ స్వరపరచి ఇచ్చారు. కానీ, రేడియోలో బాధ్యతగల ఉద్యోగం, సంగీత శాస్త్రం పట్ల గాఢమయిన పరిశోధనా దృష్టి ఆయనను సినిమా సంగీతం నుండి దూరం చేశాయి.

1940 - 50 సంవత్సరాల మధ్య శ్రీరజని 'తారుమారు', 'భలే పెళ్ళి' అనే రెండు హాస్య, సాంఘిక చిత్రాలకు పాటలను రాసి సంగీతాన్ని సమకూర్చారు. 'తారుమారు' సినిమాలో ఒక జోల పాటను రజనిగారి శ్రీమతి సుభద్రాదేవి పాడారు. 'భలే పెళ్లి' సినిమాలో రజని అంతకుముందే రచించిన గేయనాటిక, 'మేనకా విశ్వామిత్ర' అంతర్నాటకంగా చిత్రీకృతం అయింది. ఆ సమయంలోనే ప్రసిద్ధ కవులు శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారితో రజనిగారికి పరిచయం కలిగింది. "బస్సుస్టాపులో బస్సు కోసం నిరీక్షిస్తూ ఇద్దరం కొన్ని గంటల సేపు సాహిత్య చర్చలు సాగించే వాళ్ళం" అన్నారు ఆ కాలాన్ని గుర్తు తెచ్చుకుంటూ.

'భలే పెళ్లి' తర్వాత రజని సంగీత దర్శకత్వం వహించిన సినిమా 'స్వర్గసీమ'. రేడియోలో ప్రసారం అయిన గీతావళి కార్యక్రమంలో రజని ట్యూన్ చేసిన ఒక పాట విన్న శ్రీ బి.ఎన్. రెడ్డి వెంటనే రేడియో స్టేషన్‌కి వచ్చి, రజనిని పరిచయం చేసుకొని, "Blood & Sand" అనే రీటా హేవర్త్ నటించిన సినిమాకు తీసుకొని వెళ్ళారు. ఆ సినిమా బ్యాక్ గ్రౌండ్‌లో వినిపించే కొన్ని అరబ్ సంగీత పోకడలతో తాము తీస్తున్న 'స్వర్గసీమ' సినిమాలో కేవలం అర నిముషం పాటు తెర మీద నాయిక హమ్మింగ్ చేయటానికి వీలుగా ట్యూన్ ఇవ్వమని రజనిగారిని కోరారు. హీరోయిన్ పావురాన్ని నిమిరే దృశ్యం అది. మొదట హమ్మింగ్ కోసం చేసిన ట్యూన్‌తో పల్లవి, తర్వాత మిగతా చరణాలు - అలా పాట పూర్తి అయింది. "ఓహోహో పావురమా" అంటూ భానుమతి పాడ టంతో ఆ పాట బహుళ ప్రజాదరణ పొందింది. బి.ఎన్. రెడ్డిగారికి 'రజని' పై సెంటిమెంట్ పుట్టింది. కొత్త రికార్డింగ్ స్టుడియో కట్టిస్తూ "రజనీ! ఈ గది నీదేనయ్యా" అన్నారు. తర్వాత రెడ్డిగారు రజనికి అనేక సినిమాల్లో అవకాశలిచ్చారు.

1966లో భానుమతికి పద్మశ్రీ బిరుదు ప్రదానం జరిగిన

సభలో అప్పటికప్పుడు పావురమా పాట పదాలు మార్చి 'ఓహోహో భానుమతీ' అని స్టేజిపై రజని అభినందనగా పాడితే భానుమతి ఆనందాశ్రువులు రాల్చారు.

'స్వర్గసీమ'లోని మిగిలిన పాటల 'ఓహో తపోధనా', 'హాయిసఖీ', 'ఎవని రాకకై', 'గృహమే కదా స్వర్గసీమ' ఆ రోజులలో అందరూ పాడుకునేవారు. "ఎవని రాకకై ఎదురు చూచెదో ఏకాకివే బేలా" అనే పాట రజని స్వయంగా పాడటం ఇంకో విశేషం. అయితే సర్కారు ఉద్యోగ నిబంధనలను కాదనలేక తమ పేరు టైటిల్‌లో వేసుకోలేదు. పాటల రచన తమ అన్నగారు 'నళినీకాంతరావుగారు' గానూ, పాటలకు మెరుగులు పెట్టిన 'చిత్తూరు నాగయ్య' పేరు సంగీత దర్శకులు గాను టైటిల్స్‌లో వచ్చాయి.

ఇంకా 'గృహప్రవేశం' సినిమాలో పాటలు, సంగీతం రజనీగారే చేశారు. క్రెడిట్స్‌లో నళినీకాంతరావుగారి పేరు ఉంటుంది. ప్రసిద్ధ సంగీత దర్శకులు పెండ్యాల నాగేశ్వరరావు ఈ సినిమాకు రజనిగారికి అసోసియేట్‌గా పనిచేశారు. శ్రీమతి భానుమతి పాడిన "అమ్మా.. అమ్మా", "అనగనగా ఒక రాణి", "కనవోహో తెరునరా", "వెనుకాడెదవేల నోయీ", "మేలుకోవె భారతనారీ" పాటలు, ఎమ్. ఎస్. రామారావు గారు శ్రీ ఎల్.వి. ప్రసాద్‌కు పాడిన "హాలాహల మెగయునో", సి.ఎస్.ఆర్ పాడిన "జానకి నాదేనోయి", "మైడియర్ తులశమ్మక్కా" పాటలు శ్రీరజని రచనలే "పితకో పతికో సుతునకో ఆ జీవితమూ విధేయతా - యుగయుగాలకు లభింపదో ఇక స్వతంత్రతా - మేలుకో భారతనారీ - మేలుకో" అని స్త్రీవాద ధోరణిలో ఈ సినిమాలో రజని 1946లో రాసిన పాట నేటికీ సామాజిక పరంగా సరిపోతుంది.

శోభనాచలవారి "లక్షమ్మ కథ" సినిమాకు పాటలు, సంగీతం రజనివే అయినా రజనిగారి అనారోగ్యం వలన శ్రీ ఘంటసాల స్వరాలు రాసుకుని స్వరపరిచినందుకు మొదటిసారి సంగీత దర్శకులుగా రజనిగారి చలువతో టైటిల్స్ కెక్కారు. పాటల రచన 'తారనాథ్' అని రజని కలంపేరు వేశారు. ఈ చిత్రంలో "చిన్ననాటి స్వప్నసీమ", "అటో ఇటో ఎటుపోవుట" పాటలు మరుపురానివి - "దిగు దిగు నాగా - దిగిరా నాగా" జానపద బాణీ పాట సూపర్ హిట్ అయింది.

శ్రీ గోపీచంద్ తీసిన "పేరంటాలు" సినిమాకు జానపద ధోరణిలో పాటలు వ్రాసి, సంగీత దర్శకత్వం వహించారు. శ్రీ వై.వి.రావు తీసిన "మానవతి" చిత్రానికి పాటలు, సంగీతం కూర్చారు. ఈ చిత్రానికి మొదటిసారిగా "సంగీతం, పాటలు - రజని" అని పేరు టైటిల్స్‌లో వుంటుంది. ఈ చిత్రానికి రావు బాలసరస్వతీదేవి, ఎమ్.ఎస్. రామారావులు పాడిన "ఓ మలయ పవనా", "ఓ నా సఖీ" యుగళగీతాలు జనరంజకత పొందాయి. ఈ సినిమాలో రసాళిరాగంలో "తన పంతమె తావిడువడే" అనే పాటవిని వి.ఎ.కె. రంగారావు గారు "త్యాగరాజు తర్వాత రసాళి రాగంలో పాట చేసినవారు రజనిగారు ఒక్కడే" అన్నారు.

బి.ఎన్. రెడ్డి గారి "బంగారుపాప" సినిమాలో "ఏ కొర నోములు నోచెనోగానీ" అనే కృష్ణశాస్త్రి పాట (మల్లీశ్వరి సినిమాలో మనసున మల్లెల మాలలూగెనే' పాటలో ఈ

స్వీయచరిత్ర

"అప్పుడు - 'అనుపత్రికోకిల'గా విశాఖలోని కె.జి. హాస్పిటల్‌లో టి.బి. వ్యాధి చికిత్సకై ఉంటూండిన జరుక్శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) తనకి వీలైనప్పుడల్లా వాల్తేరు వచ్చి, ఉళ్ళో అబ్బూరి వారింటికి వెళ్ళి, మాష్టార్నీ, వరదనీ, హాస్టల్‌కి వచ్చి నన్నూ కలసిపోతుండేవాడు. వచ్చి నప్పుడల్లా కాలక్షేపం ఏంటంటే శ్రీశ్రీమహాప్రస్థానం, పఠాభి ఫిడేలు రాగాలడన నూతన (జరుక్కులి) రచనలూ విని పిస్తూ ఉండేవాడు. వాటి వల్ల ప్రభావితుణ్ణైనప్పటికీ, అతను మరొకసారి మా హాస్టలికి వచ్చేసరికి వినిపించడానికి ఆధునిక భావాలతో, ఏటికి ఎదురీతగా కనిపించే కవితలు రాయాలనీ 'పూషా' అనే కవితా నామంతో కొన్ని కొత్తకవితలు వినిపించేవాణ్ణి"-

సుమారు 60 ఏళ్ళనాడు (1937 - 43) తాను రాసిన కవితలు ఏటికి 'ఎదురీత' అనే చిన్న కవితా సంకలనంగా ప్రచురించిన రజని - తన తొలిపలుకులలో (1999) - ప్రచురణ : అబ్బూరిట్రస్ట్, హైదరాబాదు.

పాట పోకడ కనిపిస్తుంది), "తాధిమి తకధిమి తోలుబొమ్మ" పాట (మాధవపెద్ది సత్యంగారు పాడి ఎస్.వి. రంగారావు గారికి విశేషఖ్యాతి నార్జించిన పాట) లకు రజనిగారి సంగీతమే!

కె.ఎస్. ప్రకాశరావు గారి "ద్రోహి" చిత్రంలో "జీవితము దుఃఖపూరితమూ" అనే పాట రచించి, ఎమ్.ఎస్. రామారావు గారిచే పాటించారు.

బి.ఎన్. రెడ్డి గారి "రాజమకుటం" సినిమాలో "ఊరేది - పేరేది" అని ఘంటసాల, లీల పాడిన పాట ఇప్పటికీ, ఎప్పటికీ ఎంతో మంది శ్రోతలను ఆకర్షిస్తూ ఉంటుంది. 'సంగీతం - మాస్టర్ వేణు'గా రికార్డులపై ముద్రితమైనా రజనిగారే ఈ పాటకు సంగీతం సమకూర్చారు. అరబ్ సంగీత బాణీలో సాగే ఈ పాట రచన కూడా రజని గారిదే. టైటిల్స్‌లో బావగారయిన నాగరాజుగారి పేరు వేశారు.

శ్రీమతి కన్నాంబగారి రాజరాజేశ్వరీ ఫిలింస్ "సౌదామిని" చిత్రం కోసం ఆరుద్ర రజనిగారి చేత ఒకటి, రెండు పాటలు రాయించి, సంగీతం కూడా చేయించారు. ఇది ఆరుద్ర గారికి మొదటి చిత్రం. "పాటల వరుసలు కన్నాంబగారే విని ఓ.కే. చేస్తూ ఉండేది. అంత ఇంటరెస్టుండేది ఆవిడకి" అన్నారు రజని.


భరణీ వారి "రత్నమాల" చిత్రం కోసం "ఏమే ఓ చిలుకా" అనే పాటకు రచన, సంగీతం రజని సమకూర్చారు. విప్రనారయణ సినిమాలో "ఎందుకోయీ తోటమాలీ", "నారీ నారీ నడుమ మురారి" పాటలకు ఎస్. రాజేశ్వ్రరావుగారు శ్రీ రజనిపై అభిమానంతో ఆయన వరుసలకు దగ్గరగా చేసినవి.

ఎస్. రాజేశ్వర్రావుగారిచే శ్రీ రజని పాడించిన "చల్లగాలిలో యమునా తటిపై", "ఓ విభావరీ" పాటలు, ఘంటసాలగారిచే పాడించిన "ఘనా ఘనా గర్జింపవో" పాట ముందు రికార్డులుగా వచ్చాయి. తరువాత వాటి వరసలు నెమ్మదిగా సినిమాలలో చేరిపోయాయి. అంతకంటె ఒక సంగీత దర్శకుడికి కావలసింది ఏముంది? ఆయన జ్ఞాపకాలు వింటుంటే గంటలు నిముషాల్లా గడచి పోతాయి.

పాటలను వెన్నెల వెలుగులతో, మాటలను తేనెల సొనలతో అందంగా అలంకరించి దృశ్యకావ్యాలను సృష్టించే శ్రీ రజని డెబ్బయి ఎనిమిదేళ్ళ వయసులో కూడా ఆ పాటల సాహిత్యం కోసం తడుముకోక, శృతిలో ఖంగుమని పాడుతూంటే వినడం అనిర్వచనీయ అనుభవం. తాను రాసి సంగీతం కూర్చిన పాటల తప్ప ఇతరుల కోసం రాసిన పాటలు గుర్తులేవని నవ్వేస్తారు చిన్నపిల్లాడిలా. సహస్ర చంద్రోదయాల దర్శనం చేసుకోబోతున్న వీరిని సినీ పరిశ్రమలోని సంగీత దర్శకులు, గాయకులు మరిచిపోవటం ఎంతో విచారకరం. అయినా అయిదు దశాబ్దాల క్రితం ఆయన కూర్చిన పాటలు ఇంకా కొన్ని ఇప్పటికీ శ్రోతలను అలరిస్తున్నాయి. ఆయన అసమాన ప్రతిభకు అదే నిదర్శనం. ✪



శ్రీ బాలా55ంత్రపు రజనీకాంతరావు సతీమణి సుభద్రాదేవిగారితో (1945)



బయకారుడు బాలాంత్రపు రజనీకాంతరావు

— డా॥ అక్కిరాజు రమాపతిరావు

బయకారుడంటే ఉభయకారుడనే సంస్కృతపదానికి విశ్లథరూపమైన తెలుగుమాట అని శ్రీ రజనికాంతరావే తమ ఆంధ్రవాగ్గేయకార చరిత్రలో ఎంతో ఆసక్తి కలిగేలా చక్కగా చెప్పారు. ఉభయకారుడంటే సంగీతంలోనూ సాహిత్యం లోనూ సమానప్రజ్ఞావంతుడు. తన సాహిత్యాన్ని తన సంగీ తాన్నీ తానే కూర్చుకోగల ప్రజ్ఞాశాలి అని అర్థం. మానవ జీవితానికి ఉత్కృష్టమైన సృజన సౌందర్యాన్ని చేకూర్చే ఈ రెండు ప్రజ్ఞలలోనూ ఒకదానిలోనైనా నలుగురూ చెప్పు కొనేంత ప్రతిభ సముపార్జించటమే మహా అదృష్టమూ, అంతకన్నా గొప్ప కష్టమూ కదా! అటువంటిది రెండింటి లోనూ సమానమైన ప్రవేశం, ప్రకృష్టమైన అభినివేశం, స్వోపజ్ఞమైన ప్రతిభావేశం అయినా సమకాలంలో ప్రస్తుతిపాత్రంగానూ పరమాదరణీయంగానూ కళాభిమా నులు భావించడం, లోకంలో ఎప్పుడైనా ఎక్కడైనా ఉన్నదే. ఇక రెండింటిలో సమానమైన ప్రజ్ఞకల వారు శ్రీ రజనీకాంత రావు. ఆయన రచించిన ఆంధ్ర వాగ్గేయకార చరిత్రం విశిష్ట మైనది. స్థూలంగా రెండువేల సంవత్సరాల భారతీయ సంగీత ప్రతిభావికాసాన్ని ఈ గ్రంథంలో ఆయన ఎంతో ఆకర్షకంగా పొందుపరిచారు. ఇటువంటి గ్రంథం తెలుగులో ఇంకొకటిలేదు. మరి అటువంటప్పుడు తెలుగు వాళ్ళు - సంగీత ప్రియులూ, సాహిత్యాభిమానులూ - ఈ గ్రంథాన్ని గూర్చి ఎక్కువ ఆసక్తి చూపి అన్ని రకాల ప్రసారమాధ్యాల ద్వారా విస్తృతమైన గుర్తింపు ఈ గ్రంథానికి తెచ్చి ఉండవల సింది. అటువంటిది జరగలేదు. నాగరక దేశాలలో సంస్కృతి పట్ల సాహిత్యం పట్ల అభిమానం, అనురాగం కలిగి విద్యా వంతులు ఎక్కువగా ఉన్న సమాజాలలో, అభిరుచి ఉన్న దేశాలలో, భాషా వర్గాలలో ఇటువంటి పుస్తకం వచ్చినప్పుడు ఎంతో కుతూహలంతో చదువుతారు. చర్చిస్తారు. వ్యాప్తికి తెస్తారు. కాని తెలుగువారికి అటువంటి పుస్తక పఠనాభిలాష, తమ వారి పూర్వాపరాల తాదాత్మ్యం తక్కువ. అటువంటి ఆసక్తి ఉన్న అధునిక భాషా సమాజంలో ఇంకొక చోటనైతే ఈ పుస్తకానికి ఇప్పటికి చాలా ముద్రణలేవచ్చి ఉండేవి. ఎందుకంటే ఈగ్రంథంలోని విషయం అంత ఆసక్తికరమైనది. ఆయన పరిశ్రమ అద్వితీయమైనది. నిజానికిది శాస్త్ర గ్రంథమైనప్పటికీ ఆ శాస్త్రంలో కృత పరిశ్రములు కాని వారికి కూడా జిజ్ఞాసను, ఆసక్తిని, ఆకర్షణను కలిగించే విధంగా రచితమైంది. ఒక మంచి గ్రంథాన్ని, ఒక గొప్ప పుస్తకాన్ని చదివామన్న సంతృప్తి, సంతోషం కలిగించడమేకదా ఏ రచయిత అయినా ఆశించే తనకృషి ఫలితం. ఈ గ్రంథంలో తెలుగు వారు తెలుసుకొని ఆనందించగల అద్భుతమైన విశేషాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ఆయన సంకలనం చేయ డమే కదా అనుకోకూడదు. విషయ సంగ్రహణం, విషయ ప్రతిపాదనం, విశ్లేషణం, వ్యాఖ్యానం, సమన్వయం, సమ్యగ్ నిరూపణం శ్లాఘ పాత్రంగా నిర్వహించారు శ్రీ రజనీ కాంతరావీ గ్రంథంలో. 'వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః' అని పెద్దలంటారు. మల్లినాథసూరి ప్రతిభ అదేనని వేత్తలు నిరూపించారు. ప్రతిభా, పాండిత్యమూ, లోకశాస్త్రకా వ్యాద్య వేక్షణమూ, ఉన్నవారు కాబట్టే ఈ గ్రంథం వారు రాయ గలిగారు. భగవంతుడి. ఏకవింశద్వ్యవతారాలు భాగవతంలో నారాయణకవచంలో పుస్తకమైనాయి. పూర్వ అధునిక వాగ్గేయకార చరిత్రమైన ఈ మహోద్గ్రంథంలో కూడా ఇరవైయొక్క అధ్యాయాలున్నాయి. ఒక అధ్యాయం తర్వాత ఒక అధ్యాయం చదువుతూ ఉంటే ఉత్తేజకరమైన, అహ్లాదకరమైన, హృద్యమైన సంగీత విజ్ఞాన సర్వస్వం చదువుతున్నంత తృప్తి కలుగుతుంది. అందుకే గాబోలు ఈ గ్రంథానికి పరిచయ వాక్యాలు కూర్చిన సుగృహీత



భారతదేశ రేడియో కార్యక్రమాలకి మొదటి విదేశీ గుర్తింపు రజని రచించి, సంగీతం సమకూర్చిన "కొండ నుంచి కడలి దాకా గోదావరి" రూపకానికి 1971 - 72 సంవత్సరానికి అంతర్జాతీయ నిప్పాన్ హసోక్యొకై - టోక్యో రేడియో బహుమతి పతకం 33 వేల ఎన్నుల నగదు పురస్కారం

నామధేయులు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈగ్రంథం విస్తృతిని గూర్చి ఇలా సెలవిచ్చారు. 'భరతాచార్యుని మొదలు బాలమురళీకృష్ణవరకును గల కర్ణాటక సంగీత వాగ్గేయకారుల పరామర్శ ఈ గ్రంథము. ఇది ఎంత విశాల గంభీరమైన విషయమో, ఎంత ఓర్పుతో సంగ్రహించ వలసిందో, యెంత ధైర్యంతో, నిష్పక్షపాతంతో పరిశీలింప దగిందో ప్రత్యేకంగా వివరింప'నక్కరలేదు అన్నారు. శ్రీ రాళ్ళపల్లివారు. దీన్ని బట్టి తెలుగులో ఇటువంటి ప్రయత్నం ఇంతవరకు మరెవరూ చేయలేదన్నది స్పష్టమేకదా!

తెలుగు వారి సాహిత్య చరిత్రలోనూ, సామాజిక చరిత్ర లోను, సాంస్కృతిక వికాసంలోనూ ఇరవయ్యవ శతాబ్దం అత్యంత విలక్షణమైనది. ఈ శతాబ్దాన్ని మహాప్రతిభా వంతులెందరో ప్రభావితం చేవారు. ఈ ఇరవయ్యో శతాబ్దం ఇంతకు ముందే గడిచిపోయి ఇరవై ఒకటో శతాబ్ది ఇప్పుడే కాలరంగం మీద ప్రవేశించింది. ఇరవయ్యో శతాబ్దంలో వచ్చిన తెలుగు గ్రంథాలలో గొప్పవీ, చాలా మంచివీ ఒక నూరు పుస్తకాలను ఎంపికచేయాలంటే అందులో 'ఆంధ్ర వాగ్గేయకారచరిత్రం' తప్పక చేరవలసి ఉంటుంది. నూరేళ్ళలో అన్ని ప్రక్రియలలో వచ్చిన ఉత్తమోత్తమ గ్రంథాలను ఎంచడం కష్టమే. అందునా నూరు ఎంచాలంటే ఎంతకష్టమో ఆలోచించవచ్చు. 1901 నుంచి 2001 ప్రవేశం వరకు తెలుగులో అన్ని ప్రక్రియలలో వెలువడ్డ గ్రంథాలు కొన్ని వేలు ఉండవచ్చును. రచనలు ఒక లక్షమించి ఉండ వచ్చును. ఇంత విస్తృత వాఙ్మయంలో నూరుగురు మహాప్రతిభావంతులైన సాహిత్యదార్శనికులు, కవులను, పండితులను, విమర్శకులను, నాటక, నవలా, కథారచ యితలను ఎంచుకోవటం సుఖసుఖాల తేలే పనికాదు. అయినా ఎవరైనా సాహసించి అలాంటి ప్రయత్నంచేస్తే అందులో 'ఆంధ్రవాగ్గేయకార చరిత్రా'నికి ప్రవేశం ఉంటుంది. శ్రీ రజనీకాంతరావుకు మరెవరికీ లేని ఒక విశిష్టత ఒక సుకృతం కూడా ఇందుమూలంగా సంక్రమిస్తు న్నాయి. అదేమంటే సైతృక సాన్నిహిత్యం. పంక్తి అర్హత. ఒక వర్గీకరణంలో తండ్రీ, కొడుకులు చేరడం అరుదైన సన్నివేశం. వేంకట పార్వతీశ్వరులతో రజని కూడా నూరు

గొప్ప గ్రంథాల రచయితలలో ఒకడుగా చేరిపోతున్నారు. ఈ శతాబ్ది తెలుగువారి నూరు మంచి పుస్తకాలలో 'ఏకాంత సేవ'ను చేర్చకుండా ఉండలేరు ఎవ్వరైనా.

ఈ శతాబ్ది తెలుగువారి సాహిత్య చరిత్రలో పిఠాపురానికి అత్యంత ప్రాముఖ్యమున్నది. పాతకొత్తల మేలుకలయిక అక్కడ చూసినంతగా మరెక్కడా చూసే అస్కారంలేధు సంగీత సాహిత్య రంగస్థలాలలో. ఒకే చోట అంతమంది విద్వత్కవులు, పండితులు, ప్రతిభాసమున్మేష మనీషులు, అధునిక భావుకులు ఆంధ్రదేశంలో మరి ఇంకొకచోట ఈ శతాబ్దంలో కన్పించరు. బ్రాహ్మసమాజంవంటి ఆధునిక సమాజచేతన వికాసోద్యమానికి ఆంధ్రదేశంలో ప్రధాన కేంద్రం పిఠాపురమే. ఆ సంగీత సాహిత్య సాంస్కృతిక వాతావరణంలో శ్రీ రజనీకాంతరావు ప్రభావశీలమైన సృజనాత్మక భావుకతముకు ముకుళ ప్రసూన వికసనోన్ముఖమైంది. సంగీతరాగాలను, సాహిత్య సంపత్తిని ఆయన అక్కడే పోల్చుకున్నాడు. నిల్పుకున్నాడు. గెల్చుకున్నాడు. అనువంశికమైన సంగీత సాహిత్య సంపత్తిని ఆయన అక్కడే భాగధేయంగా పంచుకున్నాడు. సరివారలతో. తర్వాత కాకినాడ, విశాఖపట్నాలు ఆయన సంగీత సాహిత్య తారుణ్య భావుక విహాయస విహారానికి మరింత స్ఫూర్తినిచ్చాయి. ఇరవై ఏళ్ళు నిండ కుండానే కవితలల్లాడు. కవి మిత్రుల నెనరు సంపాదించుకున్నాడు. అబ్బూరి రామకృష్ణరావు, కృష్ణశాస్త్రి ఆయనకు ఛందస్సం గీతాలు, సాహిత్యలయలు ఎరుకపరచారు. పైగా ఆనాటి స్వాతంత్ర్యోద్యమం, భావ కవిత్వం, అభ్యుదయ సాహిత్యతం, సినిమాలు, నాటక సమాజాలు, సాహిత్యగోష్ఠులు, విద్యారంగం ఆయన తారుణ్యమూర్తి మంతాన్ని ప్రభావితం చేశాయి. ఆనాటి తెలుగు నాట లలిత సంగీత గీత రచయితగా తొలితరంలోనే ఆయనకు గొప్ప పేరు వచ్చింది ఆయన రేడియో ఉద్యోగం వారికీ తెలుగువారికీ చాలా మేలు చేసిందనే చెప్పాలి. శ్రీ రజనీకాంతరావు ప్రతిభకు సరియైన స్థానబలిమి సమకూడింది. అన్యోన్యాశ్రయం అందగించింది. ఆంధ్రదేశానికది ఎంతోలాభించింది. ఆకాశవాణి ప్రసారకార్యక్రమాల తొలి రోజులలో ఆయన ఉపజ్ఞసర్వ్యలనూ ఆకర్షించింది. లలిత సంగీతం సంయోజన కార్యక్రమాలలో తలమున్కలవుతూ ఆయన సాహిత్య సంగీత సమిక్షా గ్రంథరచనకు ఒక పుష్కర కాలం పూనుకోలేకపోయి ఉండవచ్చును. అయితే లలిత గీతాలు స్వాతంత్రోద్యమ చైతన్యోద్యోధకం, భావకవితా సమాశ్రయం అయినవి ఈ కాల వ్యవధిలో ఆయన చాలా రచించారు. భారత భేరీ మ్రోగిందోయ్. మన భారత కేతనము త్రివర్ణరాగం మొదలైన గేయాలు తరుణ హృదయాల నానాడెంతగానో ఆకర్షించాయి.


ఇక ప్రౌఢ నిర్భరవయఃపరిపాకంలో రచించిన గ్రంథం ఆంధ్రవాగ్గేయకారచరిత్రం. ఈ గ్రంథంగూర్చి శ్రీరజనీకాంతరావే సమాపన వినయ వచనాలలో ఇట్లా రాశారు. 'మన వాగ్గేయకారులను గురించి సమగ్రమైన చరిత్రయింతవరకు ఆంధ్ర సారస్వతంలోగాని, ఆంగ్లంలో గాని రాలేదు.' అంటూ అభిప్రాయపడుతూ సంగీత సాహిత్యాలలో తాను జరిపిన కృషిని గూర్చి ఆయనే ఇట్లా విన్నవించుకున్నారు. 'సరస్వతీ కటాక్షం రెండు విధాలా లభించడంచేత స్వయంగా ధాతు మాతుకల్పన చేయగలిగిన వాగ్గేయ కారత్వములో శతపత్ర సుందరీ గేయ సంపుటమును, విశ్వవీణ, మధురానగరీ, చండీదాసాది గేయనాటికలను రచించి, అనేక ఆధునిక కవుల గేయాలకు ధాతు కల్పన చేసి, తాను పాడి పలువురుచే పాడించి, మెప్పించిన యీ గ్రంథకర్త ఇప్పుడే వాగ్గేయకార చరిత్రమును ఆంధ్రలోకానికి అందజేస్తున్నాడు.'

నిజానికి ఆంధ్రవాగ్గేయకార చరిత్రవే ఆయన జీవితకాల కృషికి నిరూపకము. ఈ గ్రంథం ఆయన ప్రతిభకు అవినాభావ స్వరూపకము. ఈ గ్రంథంలో అపూర్వమైన విషయాలెన్నో ఉన్నాయి. అంటే అవి పూర్వం జరిగినవే. కాని తెలుగువారికి నూటికి తొంభైతొమ్మిది మందికి తెలియనివి. ఈ విషయాలు ఈనాడు తెలుసు కోవటం చాలా సంతోషాన్ని కలగజేస్తాయి. భారతదేశంలో శతాబ్దులుగా ఒకగొప్పజాతిగా, ఒక గొప్పభాషగా, పురాచరిత్రోజ్జ్వల ప్రథితయశస్కంగా వర్ధిల్లిన వారు తెలుగువారు. సంగీతంలో వారి ప్రజ్ఞ భారతదేశసంగీత చరిత్రలోనే శిఖరాయమాణం అని యీ గ్రంథం నిరూపిస్తున్నది. ఈ విషయాలనెంతో భావుక రమణీయంగా, తాదాత్మ్య సుందరంగా శ్రీ రజనీ

మరు నిముసము

మరునిముసము మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా!
వడగాలిని వాడునొ యేమో
జడివానను రాలునో యేమో
తొంగలి రెప్పల చెంగల్వపూవే
తొంగిచూచె నదిగో కన్నావో!
రేపని మాపని చూడకుమోయ్!
రెప్పపాటుమాత్రమె బ్రదుకోయ్!
మరునిముసమె మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా!

'రజనీ గీతం



కాంతరావు ఈ గ్రంథంలో అధ్యయనించి అధ్యాయించారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే 'భారతదేశ సంగీతపు క్రమ పరిణామ చరిత్రలో ఆంధ్రుల కృషి అనన్యసామాన్యం మన శాస్త్రీయ సంగీతానికి లక్ష్యప్రాయములైన గేయ రచనలు తెలుగు భాషలో ఉన్నంతగా ఏ యితర భాష లోనూ లేవంటే అతిశయోక్తి కాదు, అంటూ దాక్షిణాత్య గేయ సంపదకు తెలుగువారి వారసత్వం నిరూపిస్తూ తామీ గ్రంథం రచించానని వారే చెప్పారు. తమిళ, మలయాళ, కన్నడ సంగీత విద్యాంసు లందరూ మహాగాయకులందరూ తెలుగులో కృతులు, పాటలు, గేయాలు రాశారు. తెలుగు రాకపోతే, తెలుగు తెలియకపోతే తమ సంగీత విద్యాపరి శ్రమకు, పారంగత్వానికి, సార్థకపారమ్యం సమకూడ దనివారు తలపోశారు. మహామహోపాధ్యాయ ఉ.వె.స్వామి నాథయ్యార్ స్వీయ చరిత్రలో అరవదేశంలోని పెద్దపెద్ద పండితుల కుటుంబాలు తెలుగు నేర్చుకోవడానికి ఆసక్త చూపిన, ఆసక్తి చూపవలసిన అవసరాన్ని గూర్చి స్వీయ చరిత్రలో రాశారు. తమిళ సంగసాహిత్యాన్ని ఉద్ధరించిన మహానుభావుడు, తమిళప్రాచీన సాహిత్య సంస్కృతుల పరమ ప్రామాణిక భాష్యకారుడు స్వామినాథయ్యరుగారు. 'తన గీతి అరవజాతిని పాటకులనుగా దిద్ది తీర్చిన తెలుగు జాతి' అని రాయప్రోలుసుబ్బారావు గారు ఉప్పొంగటం బట్టి గొప్పలు చెప్పుకోవటం కాకపోవచ్చు. ఆధునిక కాలంలో చూసినా మన సంగీత సంప్రదాయ ప్రదర్శిని 'ఎట్టి యాపురం' నుంచే వెలువడింది. సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగు బాస' అని ప్రశంసించాడు. ప్రపంచ ప్రసిద్ధుడైన గణితశాస్త్ర మహామేథావి రామానుజన్ వీధిబడిలో తెలుగు చదువు కున్నాడని ఆయన జీవిత చరిత్రకారులు రాశారు.

16 వ శతాబ్దంలో ఎలహంక ప్రభువులుగా మైసూరు లోని శివ సముద్ర ప్రాంతాన్ని పాలించిన వారిలో బెంగు

ఊరు నగరాన్ని 1537లో నిర్మించిన పెదకొంపరాయడు తెలుగులో గంగాగౌరీవిలాసమనే యక్షగానం రచించడం తెలుగువారి కెంత సంతోషకరమైన సంగతి! పేరు తెలియకుండా చదివితే అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారి అచ్చ తెలుగులా రుచిమంతమైన శైలి అన్న ఆశ్చర్యంకలుగుతుంది. శ్రీరజని ఇందులోని భాగాలు దాహరించారు. 19వ అధ్యాయం.)

తన భాషపట్ల, తానుపుట్టి పెరిగిన సంస్కృతి పట్ల మమకారం ఉండటం దురభిమానం కాదు. తల్లిదండ్రులను, పుట్టిన ఊరును, చిన్ననాటి ఉపాధ్యాయులను ప్రేమించడం వంటిదేఅది. అహంకారం అక్కరలేదు కాని మమకారం తప్పులేదు. మమకారం లేకపోవడమే తప్పు. ఆంధ్రవాగ్గేయకారచరిత్రంలో శ్రీకృష్ణకర్ణామృతం రచించిన లీలాశుకుల వారు తెలుగు వారై ఉంటారని శ్రీరజనీకాంతా రావు అభిప్రాయపడగా రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు పీఠికలో ఆ విషయం ప్రస్తావిస్తూ సున్నితంగా మందలించి నంతపనిచేశారు. 'భాషల ఎల్లలన్నీ దాటిన కర్ణాటక సంగీత ప్రపంచంలో ఇటువంటి అభిమానాలు ఎంత దుర్బలంగా వుంటే అంతక్షేమం' అన్నారు రాళ్ళపల్లివారు. కాని రజనీ కాంతరావు ఊహించింది ఉపాదేయమే. శ్రీకృష్ణకర్ణామృతం పరమమనోజ్ఞమైన రచన. జయదేవుడి గీతగోవింద మంత ప్రశస్త రచన. వేణునాదం వంటి మాదకత కలిగించే రచన శ్రీ కృష్ణకర్ణామృతం. మూలం ఎంత అత్యద్భుతమో, అంత పరమరమణీయంగా తెలుగులోకి అనువదించారు వెలగపూడి వెంగన్నగారు. శ్రీకృష్ణకర్ణామృతాన్ని తెలుగులోకి అనువదించి దానిని తిరుపతి వేంకటేశ్వరుడి అంకిత మిచ్చారు వెంగన్నగారు. శ్రీకృష్ణకర్ణామృతం తెలుగునాట చాలా ప్రాచర్యం పొందింది. శ్రీ రజనీకాంతరావు అంటారూ, భారతీయ భాషలలో ఒక తెలుగులో తప్ప మరే ఇతర భాషలోనూ శ్రీ కృష్ణకర్ణామృతం అనువాదం కాలేదని! అదే నిజమైతే లీలాశుకుణ్ణి తెలుగువారు సొంతంచేసుకోవటంలో తప్పేమీ!

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో తెలుగు మహాకవు లందరూ సంగీతంలో కూడా గొప్ప ప్రవేశంకలవారేమోనని అనిపిస్తుంది. నాధశక్తిని బ్రహ్మాండంగా వినియోగించుకున్న తెలుగు మహాకవి తిక్కన అని జి.వి. కృష్ణారావు 'నాదశక్తి' అనే వ్యాసంలో అన్నారు. అయితే నన్నయ్యగారికి సంగీతం తెలియదేమో అంటారు వారు. కాని ఆ మాట విశ్వనాథ సత్యనారాయణగారు ఒప్పుకోరని కృష్ణరావుగారికి తెలియదేమో! అది విషయాంతరం.

పాల్కురికి సోమనాథుడు అసదృశుడైన సంగీత శాస్త్రవేత్తలాగా ఆయన రచనలద్వారా కనపడుతుంది. బసవపురాణంలో సోమనాథ మహాకవి రచించిన కలేశ్వ రమాది రాజయ్యగారనే గొప్ప సంగీత విద్వాంసుడి కథ ఉంది. అద్భుతమైన కథ ఇది. పన్నెండు వీణలలో ఆయన ప్రవీణుడట. ఏభై అరవైరాగాలలో ఆయన నాదతనుడైన శంకరుణ్ణి ఆరాధించే క్రమం ఎంతో సొగసుగా చెప్పాడు. ఒక్కొక్క రాగానికి ఒక దండెను ప్రయోగిస్తాడు బత్తీ సాదిరాగాలతో, సకలేశుణ్ణి మెప్పిస్తాడు మాది రాజయ్య అని వర్ణించాడు సోమనాథుడు. ఆయన సంగీత శాస్త్ర వైదుష్యమంతా ఈ కథలో ప్రవచించాడు సోమనాథుడు. ఈకథ బసవపురాణం తృతీయాశ్వాసంలో ఉంది. పంచమాశ్వాసంలో కిన్నర బ్రహ్మయ్యగారి కథ ఉంది. శివుడే ఈయనకి కిన్నర వీణాగానానికి పరవశించి ఆయనకు కిన్నర బ్రహ్మయ్య అని బిరుదిచ్చాడట. సోమనాథుడి సంగీత ప్రజ్ఞ పండితారాధ్య చరిత్రలో చాలా చోట్ల వ్యక్తమైనట్లు శ్రీ రజనీకాంతరావు ఆంధ్రవాగ్గేయ కార చరిత్రలో ఉదాహ రించారు. అల్లసాని పెద్దనగారూ, శ్రీనాథుడు, పోతన వంటి మహాకవులు సంగీత ప్రజ్ఞా దురంధరులేనని వారి రచనల ద్వారా తెలుస్తూనే ఉంది. విశ్వనాథ సత్యనారాయణగారు సంగీతం నేర్చుకొన్న వైనమూ, హరినాగభూషణంగారి వంటి మహానుభావుడుకూడా మెచ్చుకున్న విషయమూ విశ్వనాథ అసంపూర్ణ స్వీయ చరిత్రలో ఉంది.

ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర సుమారు 500 పుటల గ్రంథం. ఈగ్రంథం చదివితే సంగీతాభిమానులకూ, సామన్య పాఠకులకూ కూడా చాలా సంతోషం కలిగించే విషయాలు కొన్ని పదులు తెలుస్తాయి. అత్యంత హృద్యమైన విషయాలు వందదాకా పట్టికీకరించవచ్చు. ఈ గ్రంథంలో శైలి అంతటా ఒకే లాగా లేదు కాని ప్రసన్నమూ, సాధువూ, హృద్యమూ అనిపిస్తుంది రజనీకాంతారావు గారి శైలి. ఆయన సహజ సుందర భావుకసౌమ్యత, విషయ వివేచనలో సాధికారత, ప్రతిపాదిత విషయతాదాత్మ్య సుందరత ఆయన శైలికి

మద్రాసులో ఆంధ్ర మహిళాసభలో నిర్వహించబడే సంగీత నాటకాలకి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారితో కలిసి రజనీగారి భార్య, సుభద్ర, నేపథ్యగానం చేసేవారు. ఆమెకు చక్కని సంగీత పరిజ్ఞానం, గొంతువున్నాయి.

సంవత్సరాది లాంటి పండుగలకు ఇంట్లో కవులందరకీ రజనీ గారు పార్టీ ఏర్పాటు చేస్తూ దానితో బాటుగా పాటల విందూ చేసేవారు. అప్పుడు ఆయన సతీమణి సుభద్రగారు రజనీ గారితో కలిసి పాటలు పాడేవారు.

"ఆయన ఇంట్లో పాడుకుంటూ, ట్యూన్‌లు కంపోజ్ చేసుకుంటూ వున్నప్పుడు విని నేర్చుకుని పాడేస్తూ వుండేదాన్ని. కూర్చుని నేర్చుకోవడం తక్కువే. అయినా ఆయన రాసి, సంగీతం చేసిన పాటలన్నీ, చాలావరకు నాకు వచ్చు, కలిసి పాడేదాన్ని" అంటారు రజనీ సతీమణి సుభద్రగారు.

ఒక మసృణత్వాన్ని చేకూరుస్తున్నాయి. తన శాస్త్ర పాండిత్యం కంటే తెలియనివారికి తెలిసేటట్లు చెప్పటమే లక్ష్యంగా రచించారు రజనీకాంతరావు అని సంగీత జ్ఞానమూ, భక్తిలేని వారికి కూడా తెలుస్తుంది. ఈ గ్రంథం చదివితే. తొలితొలి అధ్యాయాలన్నీ చిన్న చిన్న అధ్యాయాలు కావడం ఈ గ్రంథానికి ఒక సొగసు కలిగిస్తున్నాయి. ఏమంటే అవి పూర్తిగా శాస్త్రానికి సంబంధించినవి. పండితులైనవారు మాత్రమే తెలుసుకోగలవీ, వారికి మాత్రమే ఉత్సుకత కలిగించేవీనూ. వాటిని పరిచయాత్మకంగా సంగ్రహంగా సరళంగా ప్రతిపాదించడం ఎంతో బాగుంది. వాగ్గేయకారుడికి వాక్పాటవం ఉండాలికాని వాక్పారుష్యం ఎంత మాత్రమూ ఉండకూడదని సంగీతానికి పరమప్రామాణికమైన సంగీత రత్నాకరం నుంచి వాగ్గేయకారల లక్షణాన్ని వివరిస్తూ శ్రీ రజని చేసిన వివృతి ఎంతో బావుంది. అది ఇలా ఉంది. "రోషం వాక్కునకు కాఠిన్యమిచ్చే గుణం; ద్వేషం మనస్సును కుమిలించే గుణం, మొదటి దాని వలన ఎదుటివారికి నొప్పి. రెండవ దాని వలన తనకే బాధం. ఈ రెండు గుణములకు అతీతులు కావడం ఋషులకే చెల్లు. ఈ గుణములను త్యజించడమే కాకుండా సార్థత్వం అంటే సరసత్వం అలవరుచుకోవాలి. తనను నొప్పించుకోకుండా ఎదిరిని నొవ్వచేయకుండా ఉండడమే కాక, ఎదిరిని మెచ్చుకోగలడమూ అథమం సానుభూతి కలిగి ఉండడమూ సరసత్వం. ఆదర్శప్రాయాలైన ఈ సద్గుణాలు కలిగిన వారే మహాకవులూ ఋషులూ అయినారు. అట్టి వాడే కావాలి వాగ్గేయకారుడు కూడా" (3వ అధ్యాయం) రాజశేఖరుడి కావ్యమీమాంసలో ఇటువంటి మాటలలోనే కవి అయిన వ్యక్తి, వ్యక్తిత్వం ఎలా ఉండాలో ప్రతిపాదించాడాయన. శ్రీ రజనీకాంతరావు కవీ, సంగీత విద్వాంసుడూ కూడా కాబట్టి లోకం పట్ల ఆయన బాధ్యత మరింత పెరిగింది. ఆయనను దగ్గర నుంచి ఎరిగిన వారికీ ఆయన రచనలు చదివిన వారికీ ఆయన మనస్వీఅనీ తన పేరులో అన్వర్థార్థానికి తగినట్లు ఆహ్లాదకరుడనీ, సారళ్యం, సౌజన్యం, సాధుత్వం, సౌశీల్యం, ఎదుటి వారిలో ఏ కొంచెం మెరుపు తళుకించినా మనసారా మెచ్చుకుంటాడనీ తెలుసు. పునరుక్తిదోషమే కాని ఆంధ్రవాగ్గేయకార చరిత్రలో విషయ ప్రసాద గుణమే దాని పునరుక్తి అని పునరుక్తిగా చెపితే అది దోషం అనుకోకూడదు.

ఇక ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర అంటే విస్తృత ప్రాతిపదికన వాగ్గేయకారులను గూర్చి ఆంధ్ర భాషలో రచితమైన చరిత్రగా భావించాలి అని రజనీకాంతరావుగారు చెప్పడంవల్ల భారతదేశంలో అత్యంత ప్రాచీనకాలం నుంచి అత్యంతాధునిక కాలందాకా సంగీత సరస్వతీ మూర్తులైన వారి చరిత్ర తెలుసుకొనే అవకాశం కల్పించిన వారైనారు.

ఇక ఆంధ్రవాగ్గేయకార చరిత్రం నుంచి అత్యంత కుతుహలకరమైన ఎంతో ఆసక్తి కలిగించేవీ అయిన విషయాలివి. తెలుగువారి వేంకటేశ్వరుడిపై ఎంత ఆకర్షణో, అంతటి ఆకర్షణను సంగీత ప్రపంచంలో కలిగించే అన్నమయ్యను గూర్చి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. 'రజని' పూర్వ పండితులూ వ్యాకరణవేత్తలూ తెలుగు వ్యాకరణం సంస్కృతంలో రాస్తూ వచ్చినట్లు సంగీతశాస్త్ర విద్వాంసులంతా తమ లక్షణ గ్రంథాలు సంస్కృతంలోనే రచించడమే కాక అలక్షణాలకు ఉదాహరణాలుగా చూపే సంగతి రచనలుకూడా సంస్కృతంలోనో, ప్రాకృతంలోనో మాత్రమే బంధించే వాళ్ళుట. అట్లా కాకుండా అన్నమాచార్యుల వారు పండితులకోసం తాము రచించిన సంకీర్తన లక్షణం అనే గ్రంథాన్ని సంస్కృతంలోనే

కూర్చినా ఆ లక్షణాలకు ఉదాహరణలన్నీ తెలుగులోనే రాయడం ఎంత ఆహ్లాదకరమైన సంగతి! అందుకే అయన పదకవితాపితామహుడు, మార్గదర్శీ, మహర్షీ అయినా డన్నారు రజనీకాంతరావు.

విద్యానగర రాజ్య ప్రతిష్ఠాపకుడే కాక అఖిల భారత దేశంలోనూ వేద భాష్య కర్తగా ఆరాధ్యుడవుతున్న విద్యారణ్యస్వామి సంగీతసారమనే గ్రంథాన్ని రచించిన గొప్ప సంగీత శాస్త్ర సారంగతుడట. దాక్షిణాత్య సంగీతానికి కర్ణాటక సంగీతమనే పేరు రావడానికి ప్రధాన కారకులలో ఒకడైనాడు అన్నారు రజనీకాంతరావు. ఇంకా ఇలాంటివి ఎన్నో ఉత్సుకతరేకెత్తించే విషయాలున్నాయి. ఆంధ్రవాగ్గేయ కార చరిత్రలో.

విజయనగర సాళువ వంశానికి చెందిన ఇమ్మడి దేవరాయల రాజప్రతినిధిగా తమిళనాట కారైకాల్ దగ్గర తిరుమల రాయపురంనుంచి దక్షిణాదిన పాలించిన గోపేంద్ర అప్పభూపాలుడు తాళ దీపిక అనే శాస్త్ర గ్రంథం రచించాడు. మార్గ, దేశితాళ విజ్ఞానం గూర్చి ప్రత్యేక ప్రకరణాన్నా యీ గ్రంథంలో. ఇదిలా ఉండగా వామనుడి కావ్యాలంకార సూత్ర వృత్తికి ఈ మహరాజు వ్యాఖ్యానం రాశాడు. ఇమ్మడి దేవరాయల ఆస్థానంలో చతురకల్లి నాథుడనే రాయబయకారుడుండేవాడు. ఈయన శార్ఙ్గదేవుడి సంగీత రత్నాకరానికి కళానిధి అనే పేరిట గొప్ప వ్యాఖ్యానం రచించాడు. ఇమ్మడి దేవరాయలే శ్రీనాథుడిని దీనారటం కాలతో అభిషేకించింది. అప్పుడు చతురకల్లి నాథుడు శ్రీనాథ మహాకవి ప్రశంసా గీతాలు, శ్లోకాలు పాడి ఉండవచ్చు నంటారు రజనీకాంతరావు.

శ్రీకృష్ణదేవరాయల అల్లుడైన అరవీటి రామరాయల తమ్ముడైన తిరుమల రాయల ఆస్థానంలో చెరుకూరి లక్ష్మీధర పండితుడనే మహాసంగీత విద్వాంసుడు జయదేవుడి గీతగోవిందానికి గొప్ప వ్యాఖ్యానం రాశాడు. దానిపేరు శ్రుతిరంజని. చెరుకూరి లక్ష్మీధర పండితులకు కుమారుడు చతుర దామోదరుడనే సంగీత మహా విద్వాంసుడు సంగీతదర్పణం అనే గ్రంథం రచించాడు. ఉత్తరదేశంలో ఈయన గ్రంథమే ప్రామాణికం. ఉత్తర భారతంలో దర్పణమతమని ఈయననే మాటి మాటికీ సంగీత విద్వాంసులు ఉదాహరిస్తుంటారు. సంగీత శాస్త్రంలో ఈయనది పరమస్వతంత్రమార్గం. శార్ఙ్గదేవుడ్ని కూడా కాదని సంగీతశాస్త్రంలో స్వతంత్ర ఉపజ్ఞ కనపరిచిన 17వ శతాబ్దానికి చెందిన అహోబల పండితుడనే సంగీత విద్యావేత్త సంగీత పారిజాతం అనే గ్రంథం రచించాడు. ఈయన అహోబలవాసి అయిన ఆంధ్రుడని సంగీత పారిజాతం 1724లో పరియషన్ భాషలోకి పరివర్తితమైంది. (2వ అధ్యాయం). మొగల్ చక్రవర్తి షాజహాన్ కొలువులో ఆంధ్రదేశీయుడైన జనార్దన భట్టు అనే వాగ్గేయకారుడుండేవాడనీ రసగంగాధరం వంటి గొప్ప అలంకార గ్రంథాన్ని రచించిన జగన్నాథ పండితరాయలు సంగీత శాస్త్రంలోనూ పండిత శిఖరమనీ ఆయన కవి గాయక శిఖామణి అని హెచ్. ఎ. పాప్లేగారు 'మ్యూజిక్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో అభిప్రాయంపడ్డట్లు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రెండో అధ్యాయంలో ఉంది.

సుమారు 16 శతాబ్దం నుంచీ వాగ్గేయకారుడికి బయకారుడనే పదం సమానార్థకంగా వ్యవహారంలోఉంది. తంజావూరు రఘునాథనాయకుడి కాలంలో వెలువడిన 'సంగీతసుధ' అనే సంగీతశాస్త్ర గ్రంథలో బయకార పదానికి నిర్వచనం ఉంది. విరోధులను జయించినవాడు అనే ప్రశంసను బట్టి 'బిరుదు' అనే పదం పుట్టిందని విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలో ఉంది (4వ అధ్యాయం). సంస్కృతంలోని ఆర్యాఛందస్సులో రచితమైన సంగీతప్రబంధాన్ని (అంటే సంగీత రచన) కంద ప్రబంధమని అంటారుట. బహుశా తెలుగులో కందపద్యానికి పుట్టుక ఈ ప్రబంధసంబంధికావచ్చు. (4వ అధ్యాయం) తెలుగులో కందార్థాలు సంగీతరచనలే కదూ! ఇలాంటివి ఎంతో ఆసక్తిని కలిగించేవి ఉన్నాయి ఈగ్రంథంలో.

తెలుగు సాహిత్యంలో 13వ శతాబ్దం నుంచీ పుస్తకమైన ఉదాహరణ రచన అప్పటమైన సంగీత రచనమే. దీనిని గూర్చి సంగీత లక్షణకర్త లెవరూ చెప్పలేదు. ఈ ఉదాహరణ రచనకు లక్షణం చెప్పడమేకాకుండా 23 తెలుగు ఉదాహరణ కావ్యాలూ, 5 సంస్కృతిలోదాహరణాలు సంకలనం చేశారు నిడుదవోలు వెంకటరావుగారు. (4వ అధ్యాయం)

కావ్య ప్రకాశమనే మహోత్తమ సాహిత్య లక్షణ గ్రంథాన్ని రచించిన మమ్మటాచార్యులవారు సంగీతమాల అనే

అద్భుతమైన సంగీతశాస్త్ర గ్రంథంలో దేశీయరాగ భేదాలను విపులీకరించాడు. మమ్మటాచార్యుడు నన్నయ్యభట్టుగారి సమకాలికుడు (5వ అధ్యాయం)

భారతదేశాని కంతకూ సంగీత సాహిత్యాత్మకమైన తొలి ప్రబంధం గీతగోవిందం (5వ అధ్యాయం). తెనాలి రామకృష్ణుడికి కృష్ణకర్ణామృత మంటే చాలా ఇష్టం. 'కస్తూరి తిలకం లలాటఫలకే' శ్లోకం పాండురంగం మహాత్మ్యంలో తెలుగులో కనపడుతుంది. (6వ అధ్యాయం). నృసింహ స్వామిని 'నిగమ మహాద్రేర్గుహాంతరాధేయమ్' అని లీలాశుకుల వారు వర్ణించారు కాబట్టీ, లక్ష్మీనరసింహస్వామి) పర్వతగుహలో వసించిన పుణ్యక్షేత్రాలు ఆంధ్రదేశంలోనే ఉండటం వల్లా లీలాశుకుడుకి ఆంధ్రదేశంతో సన్నిహితం సంబంధం ఉండవచ్చు. అట్లానే ఆయన తిరుపతినీ దర్శించి ఉండవచ్చుననడానికి 'బాలా' స్వరూపంగా శ్రీకృష్ణుణ్ణి వర్ణించడం ఆధారమనుకోవచ్చు. (6వ అధ్యాయం).

పన్నిద్దరాళ్వారులు రచించిన ద్రావిడవేదమనీ పంచ మాగమమనీ వ్యవహృతమయ్యే 'నాలాయిరం' నాలుగువేల సంకీర్తనలు కలది. కాగా అన్నమాచార్యుడొక్కడే రచించిన ఆంధ్రవేదం ముప్ఫైరెండువేల సంకీర్తనలుకలిది. (7వ అధ్యాయం). అన్నమాచార్యుడు అద్వితీయ ప్రతిభాశాలి, ఋషికల్పుడు, పదం యొక్క అనంత రూపాలను తన రచనలలో ప్రదర్శించాడు (7వ అధ్యాయం). అన్నమాచార్యుల వారి సంకీర్తనలలో సంగీతం కన్నా సాహిత్యానికే ఎక్కువ ప్రాధాన్యం. తాళ్ళపాక వారి సంకీర్తనములలో ఇప్పటికి లభించిన 14వేల కీర్తనలలో 89 రాగాలు మాత్రమే ఉపయుక్తమైనాయి. వీటిలోనూ ఎక్కువ సార్లు ఉపయోగించినవి 25 రాగాలే. అయితే త్యాగరాజస్వామి వారి కీర్తనలు 750 లభించగా వాటిలో 250 రాగాలు ఉపయుక్తమైనాయి (7వ అధ్యాయం) అని రాళ్ళపల్లివారి అభిప్రాయన్ని ఉదాహరిస్తూ రజనీకాంతరావు అన్నమాచార్యుల కీర్తనల విశిష్టత వివరించారు. అన్నమాచార్యుల వారిని మధ్వ సంప్రదాయ దాసకూటాల వారు ప్రభావితం చేసి ఉండవచ్చునని రాళ్ళపల్లి వారి అభిప్రాయం. ఈ దాసకూటాలకు చెందిన నరహరితీర్థులు రాజమహేంద్రవర వాస్తవ్యుడంటారుట శ్రీశర్మగారు. శ్రీపాదరాయలు, వ్యాస

విభావరి



ఓ విభావరి! ఓహో విభావరి!
నీహార హీర నీలాంబర
ధారిణీ, మనోహారిణి!! ఓ విభావరి
నీ చంచల చేలాంచల
నిభృత్వ స్వప్న సీమలలో
ఏలా భయచ్ఛాయాజాల
మేలా సౌఖ్యరోచిర్లీల!! ఓ విభావరి
సంతతశాంతతరంగిని
మదభరయువకురంగిణి
ఏలా యలసగమనమ్ము
ఏలా నవవిలసనమ్ము!! ఓ విభావరి
ధరణీతలచంద్రశిలా
తరళమంటపమున నిలిచి
యుగములుగ పరిభ్రమింతు
వగమ్యుడౌ యెవని వలచి!!
ఓ విభావరి! ఓహో విభావరి!

'రజని'గీతం

రాయలు, కనకదాసువంటి గొప్ప సంకీర్తనల కర్తలకన్నా పూర్వుడు నరహరితీర్థులవారట. ఆయనరాజ మహేంద్రవర నివాసమే ఆనందమూ ఆశ్చర్యమూ కలిగించే విషయం (8వ అధ్యాం). దత్తాత్రేయ యోగి అవతార సంప్రదాయానికి చెందిన శ్రీపాదవల్లభులు పీఠాపురం వాస్తవ్యుడైనట్లు నరహరితీర్థుల వారు రాజమహేంద్రవరం వారు కావడం చాలా అద్భుతమైన విషయం. తెలుగు సాహిత్యంలో యక్షగానాల ప్రాదుర్భావ వికాసాలను గూర్చి తొలి తెలుగు యక్షగానాల కర్తల గూర్చి చాలా కుతూహలకరమైన యక్షగానాల ప్రాదుర్భావ వికాసాలను గూర్చి తొలి తెలుగుయక్షగానాల కర్తల గూర్చి చాలా కుతూహలకరమైన సమాచారం సేకరించి ఇచ్చారు. శ్రీరజని (9వ అధ్యాయం) పదహారో శతాబ్ది చివరి దశకాలలోనూ పదిహేడో శతాబ్ది చివరి కాలం వరకూ జీవించిన శివనారాయణతీర్థులవారిని గూర్చి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు సంకలితం చేశారు. నారాయణతీర్థుల వారిని గూర్చి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు సంకలితం చేశారు. ఆంధ్రవాగ్గేయకార చరిత్రంలో. ఈయన సమాధి తమిళనాడులో నేటికీ పూజించబడుతూంది. నారయణతీర్థుల వారు రచించిన కృష్ణలీలా తరంగిణి సంస్కృతంలో పరపక్వమైన శైలిలో రచించిన యక్షగానంగా వ్యాఖ్యానించి అందుకు తగిన ఉపపత్తులన్నీ చూపారు రావుగారు (10వ అద్యాయం). విశ్వనాథసత్య నారాయణగారు కృష్ణలీలా తరంగిణికి పీఠిక పద్యరూపంలో రాశారని చాలా మందికి తెలియకపోవచ్చు. ఉయ్యూరు రాజావారు దీనిని ప్రకటించారు. ఈ ప్రస్తావనలో విశ్వనాథవారు తీర్థులవారిది కూచిపూడి అని రాయటం గమనార్హం అంటారు. రజనీకాంతరావు. తీర్థుల వారి ప్రభావం తమిళదేశంలోని యక్షగాన రచన, ప్రదర్శన సంప్రదాయంపై ఎంతగా ప్రభావంచూపిందీ రజని విపులంగా వ్యాఖ్యానించారు. ఆంధ్రదేశంలో కృష్ణలీలా తరంగిణి ఎంత వ్యాపించిందో శ్రీ రజనీకాంతరావు చక్కగా చెప్పారు. అయన్ను సంకీర్తన యక్షగాన సార్వభౌముడని కీర్తించారు. జయదేవుడు మొదలైన మహా సంగీత కవుల రచనలకన్నా వాటిలోని భక్తి శృంగార ప్రస్తావ్నాం కన్నా భక్తి, ఆధ్యాత్మిక భావంతో ఉదాత్తతరమైన శివనారాయణతీర్థుల సంకీర్తనలు గొప్పవి అని శ్రీ రజని అభిప్రాయం. (10వ అధ్యాయం). సిద్ధేంద్రయోగిని గూర్చి, భామాకలాపం, గొల్ల కలాపం గూర్చి తెలుగువారి సంగీత సాహిత్య వైదుష్యాన్ని తెలుపుతున్నాయి. (11వ అధ్యాయం). భద్రాచల రామదాసుగా ప్రతిష్ఠితుడైన కంచెర్ల గోపన్న విరచిత కీర్తనలు, దాశరథీశతకం గూర్చి ఎన్నో అమూల్యమైన విషయాలు ఆంధ్ర వాగ్గేయకార చరిత్రలో కూర్చారు రజని. కర్ణాటక విద్వాంసులు రామదాసు కీర్తనలను ఎక్కువగా ప్రచారంలోకి తేవకపోవడానికి కారణం చెపుతూ "ఆ కీర్తనలలో ఆ విద్వాంసుల విద్వత్ప్రకర్షకు అవకాశం తక్కువయి, వాటి సంగీత రచన సరళ స్పష్టలయాన్వితమై, సూటి అయిన భావస్ఫురణంతో సామన్య జనానికి కూడా అందుబాటులో సుగమంగా ఉండడమే ఇందుకు బహుశా" హేతువు కావచ్చునంటారు రజని. ఆనందభైరవి రాగం మన సంగీత చరిత్రలో మొట్టమొదటి ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసేనని శ్రీరజని ప్రతిపాదించడం ఆయన మౌలిక ప్రతిభా పరిశోధనకు అప్రతర్కితమైన గొప్ప సాక్ష్యం. 'ఈరాగం ప్రత్యేకంగా ఆంధ్రుల సొంత సొత్తు. క్షేత్రయ్యకూడా దీనిని ఎక్కువగా వాడాడు. అంచేత ఇది మొదటి ఆంధ్ర భైరవి అయి ఆతర్వాత ఆనందభైరవి అయిందేమోనని ఆనందచమత్కారం చేస్తున్నారు రజని. (12 వ అధ్యాయం). ఆంధ్రవాగ్గేయకార చరిత్రకు పరిచయ వాక్యాలు రాసిన రాళ్ళపల్లివారు కూడా రజని చేసి ఈ ఊహను మెచ్చుకున్నారు. ఆనందభైరవిలో రామదాసు సుప్రసిద్ధకీర్తనలను పట్టిక ఇచ్చారు రచయిత. 'కేవల భక్తిమార్గమే కాక జ్ఞానమార్గమును కూడా తోడు చేసుకొని వైరాగ్యము సిద్ధింప జేసుకొన్న యోగిపుంగవుడు రామదాసు" అని రజని అనడం ఎంతో బావుంది. క్షేత్రయ్య కేవలం అతిహేలమైన శృంగారాన్ని వర్ణించిన పదకర్త మాత్రమేనని సామాన్యుల అభిప్రాయం. కాని శ్రీ రజని ఆంధ్రవాగ్గేయకార చరిత్రంలోని పదమూడో అధ్యాం చదివితే ఈ అభిప్రాయం ఎంత తప్పో తెలుస్తుంది. 'క్షేత్రయ్య వేసిన ముందంజ ధాతుకల్పనలో', ఇది తన తరువాతి వాగ్గేయకారులెందరికో అతనిని మార్గదర్శిగా చేసింది. నేటికి కర్ణాటక సంగీతపురాగములెన్నో స్పష్ట రూపంతాల్చినది క్షేత్రయ్య పదాలలోనే (13 అధ్యా.)

తెలుగు వారిని ఇతర దక్షిణ ప్రాంతీయభాషా సోదరులు - 'మీకు సొంత మనదగిన సంగీత సంప్రదాయం లేదు. కర్ణాటక సంగీతం దక్షిణాది వారిది' అని 'యద్దేవా' చేసేవారు. ప్రసిద్ధ వాగ్గేయకారులంతా ఎక్కువగా తెలుగులోనే కీర్తనలు రచించారన్న సంగతివారికి పట్టేది కాదు. సంగీతానికి కాణాచియైన తంజావూరు నాయక రాజులు, మహారాష్ట్రులూ తెలుగు వాగ్గేయకారుల్నీ యక్షగాన కవుల్నీ పోషించడమేకాక, తామే స్వయంగా పదాలు యక్షగానాలూ రచించారన్న సంగతి వారికి పట్టేదికాదు". మన సంగీత పరిణామ చరిత్ర - కళాప్రపూర్ణ బాలాంత్రపు రజనీకాంతరావు - పుట 595


విశాలాంధ్ర ప్రచురణం - ఆంధ్రప్రదేశ్‌దర్శిని - 1998.

అన్నారు రజని. 'త్రిపుటాది తాళాల మాతుబంధంలో ద్వితీయాక్షర ప్రాసమూ అంత్యాను ప్రాసములూ అందాన్ని ఇనుమడించగా తీయని భావాలతో తేట తెలుగు నుడికారంతో క్షేత్రయ్య తన పదరచనలో జయదేవుడు అష్టపదులలో సాధించిన మాధుర్యం కంటె ఎక్కువగా సాధించిన ధన్యుడైనాడు' అని చెప్పారు రజనీకాంతరావు. క్షేత్రయ్య మనస్తత్వ పరిజ్ఞానమూ అనుభవపరిణతీ, అలంకార శాస్త్ర జ్ఞానము కంటె మించి నట్టివి అని కూడా మెచ్చుకున్నారు. 'మాటలలోని భావాలకు అనుగుణమయిన రాగ విన్యాసమూ, రాగస్వరూపాన్ని పరిపూర్ణంగా స్ఫురింపజేసే మాటల కూర్పూ ఇతనికి తోడ్పడినట్లు వేరే ఏ వాగ్గేయకారునికీ సహాయపడలేదు. రాగములందు భావోద్రేకం కలిగింపగల స్వరసంగతులు తెలిసిన ప్రౌఢుడు కనుక దానికి తగిన సాహిత్యం అప్రయత్నంగా రాగభావంలోని ఆవేశంతో కలిసి పైకి తీగలు సాగి పూలు పూచింది' అని క్షేత్రయ్యను వ్యాఖ్యానించ గలగటానికి సాహిత్య సంగీతాలలో ఎంత ప్రజ్ఞఉండాలో తెలియజేస్తుంది. తెలుగులో అధ్యాత్మరామాయణ కీర్తనలు రచించిన మునిపల్లె సుబ్రహ్మణ్య కవిని గూర్చి పధ్నాలుగో అధ్యాయంలో ఎంతో హృద్యంగా విరించారు. శ్రీ రజనీకాంతరావు సంగీత సాహిత్య వైదుష్యం. భారతీయ వేదవేదాంత సంస్కృతి పరమార్థ అవగాహన ఈ అధ్యాయంలో బాగా కనపడతాయి. అధ్యాత్మ రామాయణ కీర్తనలు సంగీతాన్ని ఉద్ధరించుకోవడం అత్యంతావశ్యకం అంటారు శ్రీరజని. 'ఎక్కడో దక్షిణాది వారి బాణీనో ఉత్తరాది వారి బాణీనో అనుకరించడం తప్ప ఆంధ్రులకు సొంత సంగీతం లేదనుకొనే వారందరికీ అన్నమాచార్య, క్షేత్రయ్య, సుబ్రహ్మణ్య కవుల మహాప్రతిభకంటె ప్రత్యుత్తరం ఏముంది అంటారు రజని. పదిహేను, పదహారు అధ్యాయాలలో తెలుగు వారి యక్షగానాల ఉద్భవ వికాస పరిణామాలు విపులంగా రూపించారు రజనీకాంతరావు. తంజావూరు, మధుర, పుదుక్కోట, మైసూరులలో తెలుగు సరస్వతి ఆరాధన పరమహృద్యంగా అత్యంతహ్లాదకరంగా వివరించారు. రఘునాథనాయకుడు, విజయరాఘవ నాయకుడు తెలుగు సాహిత్యానికి, సంగీతానికి ఎటువంటి గొప్పసేవచేశారో ఈ గ్రంథంవల్ల విశదమవుతున్నది. రఘునాథుడు జయంతసేన, రామానందము అనే కొత్త రాగాలను కనిపెట్టి నట్టు చెపుతూ తంజావూరి సాహిత్య సంగీత వైభవాన్ని వివరించారు. విజయరాఘవ నాయకుడు శృంగార ప్రియుడైన బలహీనుడని కొందరు చరిత్రకారులు రాశారు, కాని తెలుగు సంగీత సాహిత్యాలకు ఆయన చేసిన సేవ నిరూపమానమని) రజని తీర్పు. రఘునాథ నాయకుడికాలంలో సంస్కృత రచనలు ఎక్కువగా వెలువడ్డాయి, విజయరాఘవనాయకుడి కాలంలో తెలుగు రచన లెక్కువగా వెలువడ్డాయి, విజయరాఘవుడు ఎనిమిది భాషలు తెలిసినవాడు, చతుర్విధ కవితానిర్వాహక సార్వభౌముడని ఆయనకు బిరుదు ఉంది. ఆయన కొలువుకూటం నిజంగా శారదా ధ్వజమే అని మల్లంపల్లివారి మాటలుదాహరించారు రజని (15. అధ్యా.)

మైసూరులో కూడా తెలుగు యక్షగాన సాహిత్యం వర్ధిల్లిందనీ పదిహేడో శతాబ్ది చివరి పాదంలో మైసూరును పాలించిన చిక్కదేవరాయల కుమారుడు కంఠీరవరాజు బహుళయక్షగాన కర్తగా ప్రసిద్ధిపొందాడని నిడదవోలు వెంకటరావు గారిని ఉదాహరించారు రజని. కంఠీరవరాజు 18వ శతాబ్ది తొలిపాదంలో మైసూరు పరిపాలకుడు.

ఈయన పుట్టుకతో చెవిటి, మూగ అయి ఉండినీ హస్త సంజ్ఞలతో రాజ్యకార్యనిర్వహణం చేసేవాడనీ ఆయనకు కమనీయమైన కవనశక్తినీ, బహుభాషావేత్తృత్వాన్నీ భగవంతుడు ప్రసాదించాడనీ వెంకటరావుగారు రాశారుట. ఈయన తెలుగులో యక్షగానాలు రచించడం అద్భుతమేకదా! (15. అధ్యా.) తంజావూరును మహారాష్ట్రులు పాలించినప్పుడు కూడా తెలుగు సాహిత్యం ఉజ్జ్వలంగా దేశీయుల మన్ననలుపొందింది. పదిహేడో శతాబ్ది చివరి దశకాలలోనూ, పద్దెనిమిదో శతాబ్ది మొదటి శకమూ తంజావూరును పరిపాలించిన శహాజీ కొలువులో శ్రీధరవేంకటేశర్యుడూ, లలితా సహస్రనామాలకు గొప్ప వ్యాఖ్యానం రచించిన భాస్కరరాయము ఉన్నారని చెప్పేవారిని గూర్చి అద్భుతమైన విషయాలు రజనీ కాంతరావు సంకలనం చేశారు. (16వ. అధ్యా.) శాహజీ మహారాజు 20 యక్షగానాల పైనే తెలుగులో రచించిన వైనం వివరించారు. తంజావూరు నాయకులు, మహారాష్ట్ర రాజులు పరిపాలించిన ఆకాలం సంగీతానికి, యక్షగాన సాహిత్యానికి స్వర్ణయుగమని రజనీకాంతరావు గారి వివరణ తెలుపుతున్నది.

తెలుగులో పదకర్తగా కొంతపేరు సంపాదించుకొన్న సారంగపాణి ఎంతో ప్రతిభావంతుడని రజని నిరూపిస్తూ సారంగపాణినికి అదివరలో ఉన్న అపప్రథను పూర్తిగా తొలగించారు. ఇది చాలా అపూర్వమైన పరిశోధన. సారంగ పాణి సాహిత్యరచనలో భాషా శిల్పాన్ని బట్టిగాని భావ ప్రదర్శనను బట్టిగాని, అనుభవ విస్తృతిని బట్టిగాని క్షేత్రయ్యకేమీ తీసి పోడని రజనీకాంతరావుగారి తీర్పు (16. అధ్యా.). వీరేశలింగం పంతులు గారంతటి గంభీరుడు 'సంగీత ప్రియ ప్రహసనం'లో సారంగపాణి హాస్యపదాలను ఉదాహరించినట్లు తెలుసుకొంటే సారంగపాణి పదాలు ఎంత వ్యాప్తిలో ఉండేవో తెలుస్తుంది. అట్లాగే అజ్జాడాది భట్ల నారయణదాసు ఒకటెక్కుటక్కులు ప్రదర్శిస్తున్న వేశ్యముందు సారంగపాణి పాదం అభినయ గానం చేసి ఆమెను పాదక్రాంతను చేసుకొన్న ఒక పిట్ట కథ స్వీయచరిత్రలో ప్రసక్తం చేశారు. ఆంధ్రవాగ్గేయకార చరిత్రలో 16వ అధ్యాయంలో కర్ణాటక సంగీత దివ్యోజ్జ్వల యుగపూర్వరంగంలోని అత్యంత ప్రతిభావంతులను గూర్చి పరమహృదయంగమంగా ఎన్నో సంగతులు క్రోడీకరించారు. కర్ణాటక సంగీత ప్రపంచంలో త్యాగరాజ స్వామి, శ్యామాశాస్త్రుల సమ ఉజ్జీ అయిన ముత్తస్వామి దీక్షితుల తండ్రిగారైన రామస్వామి దీక్షితులు వారిని గూర్చి ఎన్నో అద్భుతమైన విషయాలు సేకరించారు రజని. 'హంసధ్వని' అనే రాగాన్ని ఈయనే కల్పించి ఆరాగంలో ప్రసిద్ధమైన కృతిని యీ దీక్షితుల వారు రచించారు', అని రజని రాశారు. (16 అధ్యా.) 108 ఉపనిషత్తులకు, భగవద్గీతకు భాష్యం రచించి ఉపనిషద్బ్రహ్మేంద్ర యోగిగా విశ్రుతులైన వారిని గూర్చిన అపూర్వ మైన విషయాలెన్నో ఉన్నాయి ఆంధ్రవాగ్గేయకా చరిత్రంలో. వీరు కోరినప్పుడు త్యాగరాజస్వామి వీరి మఠానికి వచ్చి కీర్తనలు పాడి ఈ స్వామివారిని ఆనందింపజేసేవారుట. పదిహేడో అధ్యాయం త్యాగరాజస్వామిని గూర్చి రాసినది. దీన్ని ప్రారంభిస్తూ శ్రీరజనీ కాంతరావు ఇట్లా రాశారు. "ఒక్క దక్షిణభారత సంగీత చరిత్రలోనే కాకుండా ప్రపంచ సంగీత చరిత్రలో కూడా 1750 నుంచి 1850 వరకూ అత్యంత ప్రధానమైన యుగం. రెండు చరిత్రలలోనూ ఈ యుగాన్ని స్వతంత్ర ధాతుకల్పనాయుగమని పిలువచ్చును. యూరొపులో అనాడు బీతొవెన్, మోట్జార్ట్, మెండల్ సొన్, షొ పైన్, షూబెర్ట్, వీబర్ అను గొప్ప సంగీత కర్తలందరూ వెలిశారు. వారందరూ సొనాటా, సింఫొని ఇత్యాదిగా (ఆర్కెస్ట్రా) వాద్యమేళములపైన ప్రత్యేక వాద్యముల పైనే ప్రయోగింపదగిన సంగీతరచనలను అపూర్వమైన ధాతు కల్పనా చాతుర్యముతో వెలువరించి యశోధనులైనారు. ఇదే యుగంలో తమ స్వతంత్ర ధాతుకల్పనాత్మకములైన కీర్తనలతో దక్షిణ భారత సంగీతానికి అఖండ పరివ్యాప్తిని చేకూర్చి అవతారమూర్తులయిన వాగ్గేయకారులు త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు. కర్ణాటక సంగీత చరిత్రకారులు వీరి ముప్పురునీ సంగీత త్రిమూర్తులనీ, రత్నత్రయమనీ పిలుస్తారు". పదిహేడు, పద్దెనిమిది అధ్యాయాలలో త్యాగరాజస్వామి (1767 - 1847) శ్యామశాస్త్రులు (1762 -1827) ముత్తుస్వామి దీక్షితులు (1776 - 1835) గార్లను గూర్చి ప్రసన్న



మద్రాసు మ్యూజిక్ అకాడమీలో క్షేత్రయ్య రచనలపై సోదాహరణ ప్రసంగం (1981)

మహితమైన శైలిలో, భక్తిప్రపత్తులతో, విద్వత్తతతో అనేక విషయాలు చెప్పారు. కర్ణాటక సంగీతంలో ఈ మహాను భావుల చిరయశస్సుకు కారణా లేమిటో నిరూపించారు. త్యాగరాజస్వామివారి జీవిత చరిత్రకూడా ఎంతో ఆరాధన తత్పరత్వంతో శ్రీ రజనీకాంతరావు ఈ గ్రంథంలో కూర్చారు. అచ్చయి లభిస్తున్న ఐదారు వందల కృతులలోనూ 200 రాగాలను త్యాగయ్యగారు పయో గించినట్లు చెపుతూ త్యాగరాజస్వామివారి గూర్చి ఇదివరలో సంగీత విద్వన్మ ణులు వెలిబుచ్చిన, నివాళులను కూడా సమీక్షించారు. ప్రహ్లాద విజయం, నౌకావిజయం సొగసులు వివరించారు. త్యాగరాజు, శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు సంగీత యోగసిద్ధి తారతమ్యాలు చక్కగా సమీక్షించారు. వీరి సంగీత సంప్రదాయ శిష్యపరంపరను గూర్చికూడా వివరంగా చెప్పారు. స్వాతి తిరునాళ్ మహరాజునుగూర్చి, ఆయన సంగీత రచనల విశిష్టతను గూర్చి విపులంగా పద్దెనిమిదో అధ్యాయంలోనే వివరించారు. తూము నరసింహదాసు, మద్దిరాల వెంకటరాయకవి వంటి లోకానికి ఎక్కువగా తెలియని సంగీత విద్యావేత్తలను గూర్చి చాలా విషయాలు సేకరించి చెప్పారు. మాడుగుల సంస్థా నాధీశుడు కృష్ణభూపతి, విజయనగర సంస్థానాధీశుడు ఆనందగజపతి సత్కరించిన గొప్ప సంగీత విద్వాంసులను వారి గొప్ప ప్రతిభను సోదాహరణంగా శ్రీ రజనీకాంతరావు ఈ పద్దెనిమిదో అధ్యాయంలో ఉత్తేజకరంగా చెప్పారు. ఆనందగజపతి సంగీత గురువైన దూర్వాసుల సూర్యనార యణ సోమయాజుల గారిని గూర్చి చెపుతూ" ఈయన కర్ణాటక, హిందుస్తానీ సంగీతరీతులలోనే కాక పాశ్చాత్య రీతులలో కూడా ప్రజ్ఞసంపాదించి వైస్రాయి ఎల్గిన్ ప్రభు వును కూడా మెప్పించిన" వైనం ప్రసక్తం చేశారు. (18. అధ్యా.) అజ్జాడాది భట్ల నారాయణదాసు గారి స్వీయ చరిత్ర శ్రీ రజని ఆంధ్ర వాగ్గేయకార చరిత్రం రచించే నాటికి వెలువడ లేదు. ఈ స్వీయచరిత్రలో బొబ్బిలి, విజయనగరం, బందరు, పిఠాపురం వంటి సంగీత సాహిత్య విద్వత్కేం ద్రాలలో ఆనాడు దిగ్గజాల వంటి సంగీత విద్వాంసుల ప్రజ్ఞాప్రతిభోదంతాలు ఉన్నాయి. ఒక్కసారి పదివేల

కోకిలలు కూసినట్లుగా పాడగల ఒక మహాగాయకుణ్ణి గూర్చీ ఆయన పాటను గూర్చీ నారయణదాసుగారు స్వీయ చరిత్రలో ప్రసక్తం చేశారు. పందొమ్మిదో అధ్యాయంలో కాలజ్ఞాన తత్త్వ రచయితలను గూర్చి కమనీయమైన విషయాలెన్నో చెప్పారు. అచలమతం, ఏగంటి వారి వచనాలు, పోతులూరి వీరబ్రహ్మం, దూదేకుల సిద్ధప్ప, నిట్టల ప్రకాశదాసు, ఎడ్ల రామదాసు, మొదలైనవారి సంగీత రచనలు సామాన్య ప్రజానీకాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో వివరించారు. ఈ తత్త్వగీతాలు ఆధునిక కవులైన కవి కొండల వెంకటరావు, అడివిబాపిరాజు గార్లపై ప్రభావం చూపిన విషయం చెప్పటం రజని మౌలిక ఉపజ్ఞాన్విత విశ్లేషణకు సాక్ష్యం పలుకుతుంది.

ఇరవయ్యో అధ్యాయంలో కాలక్రమేణ తెలుగునాట యక్షగానం హరికథగా ఎట్లా పరిణమించిందో సోదాహర ణంగా ప్రతిభావంతంగా సమీక్షించారు. హరికథ యక్షగాన సంప్రదాయం నుంచే పరిణమించడం నిరూపిస్తూ మౌలి కమైన ప్రతిపాదనలు చేశారు. మునిపల్లె సుబ్రహ్మణ్యకవి విరచిత ఆధ్యాత్మరామాయణమే తెలుగులో వెలువడ్డ మొదటి హరికథ అని ప్రతిపాదించడం రజని నిశిత పరి శీలనకు దృష్టాంతం. మోక్షగుండం రామాయణ గూర్చీ దీనికర్త అయిన తాళ్ళూరి నారాయణకవిని గూర్చీ చాలా మంచి విషయాలు తెలియజేశారు. ఇక తర్వాత 'ఆంధ్రదేశ మంతటినీ హరి కథాగానంతో ఉర్రూతలూగించిన మహాప్రతిభాశాలియైన వాగ్గేయకారుడు అజ్జాడాది భట్లనార యణదాసు గారి గూర్చీ, ఆయన వల్ల ప్రభావితులైన తరువాత తరం హరికథకులను గూర్చీ సంగ్రహంగానే అయినా సమగ్రత్వ స్ఫూర్తి కలిగేటట్లు ఇరవయ్యో అధ్యాంలో పొందుపరిచారు. ఇరవయ్యొకటవదీ, చివరదీ అయిన అధ్యాయంలో ఆధునికి వాగ్గేయకారులను గూర్చి శ్రీరజనికాంతరావు సంగీతతూలికతో చిత్రించిన వాక్చిత్రాలు పరమమనోహరంగా ఉన్నాయి. ప్రయాగ రంగశర్మగారు, కొచ్చెర్ల కోట రామరాజు, పాపట్ల కాంతయ్యగారల ప్రతిభను విశ్లేషించారు. ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రయాగరంగ శర్మగారి దౌహిత్రుడని చెపుతూ రంగదాసు గారి సంగీత విద్వత్త, సంకీర్తన విశిష్టత వివరించారు. హరినాగభూషణం గారి గూర్చి ఆయన సంగీత మూర్తి మత్త్వమహత్వాన్ని గూర్చి చక్కని పద చిత్రం రచించారు. శ్రీమంగళంపల్లి బాలమురళీ కృష్ణను గూర్చి ఆయన అసమాన సంగీత విద్వత్తను గూర్చి సుమారు అర్ధశతాబ్దం కిందనే శ్రీ రజనీకాంతరావు ఈ గ్రంథంలో ఆయన భవిష్యదుజ్జ్వల మూర్తి మంతాన్ని పరమవిశిష్టంగా అంచనావేశారు. శ్రీ బాలమురళీకృష్ణ విరచిత 'జనకరాగకృతి మంజరి' అనే సంగీతకృతులు గ్రంథానికి కాశీకృష్ణాచార్యుల వారు, విశ్వనాథ సత్య నారాయణగారు రాసిన పీఠికల నుదాహరించారు. 'బి. మురళీకృష్ణ యొక్క ప్రతిభయు, శాస్త్ర జ్ఞానము, నిత్యాభ్యాసము పండి సముద్భవించినదీ గ్రంథము'... ఈ గ్రంథంలో కవి యొక్క భావణ విశేషం కన్పిస్తున్నదని ప్రశంసిస్తూ' వయసు చేత చిన్నవాడైనను విద్యచేత ఆంధ్రదేశస్థగాయకవతంసులలో ఒకడని' విశ్వనాథవారు శ్రీ బాలమురళికి అనాడే శుభకామనలంద జేసిన విషయాన్ని శ్రీ రజనీకాంతరావు ఉటంకించారు. లలితగేయ పరిణా మాన్ని గూర్చీ, లలితగేయకర్తలను గూర్చీ ఎవరినీ వదలిపెట్టకుండా సంగ్రహంగానే అయినా ప్రస్తకం చేస్తూ వారి ప్రతిభను, పాండిత్యాన్ని ప్రసిద్ధిని, సంగీత లోకంలో వారార్జించిన జనప్రీతిని ఉదారహృదయంతో ప్రశంసిస్తూ ఈ గ్రంథాన్ని ముగించారు.

20 వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన విశిష్టమైన నూరు గ్రంథాలలో ఆంధ్రవాగ్గేయకారచరిత్రలో తప్పకచోటు చేసుకుంటుందని ఈ వ్యాసంలో ఇదివరకు వెల్లడించిన అభిప్రాయానికి అనుబంధంగా ఈ 20వ శతాబ్దంలో తెలుగువారి సంగీతాన్ని గూర్చీ, వారి మౌలిక ఉపజ్ఞను గూర్చీ, వాగ్గేయకారుల కృషిని గూర్చీ వెలువడ్డ ఇరవై, పాతిక గ్రంథాలలో మొదటి పది గ్రంథాలలోనే ఆంధ్ర వాగ్గేయకార చరిత్రం స్థానం సంపాదించుకొంటుందని కూడా చెప్ప వచ్చు. ఇంత విస్తృతీ, ఇంత అధ్యయనం ఇంత పరిశ్రమ, ఇంత ఉపజ్ఞాన్వితమైన విశ్లేషణ, వ్యాఖ్యానం, సహృదయ సమన్వయం, ఉత్తమ సాహిత్య సంస్కారం సాహితీలోకంలో అరుదు. వీటన్నిటి సమాహారమే శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావున్నూ, ఆయన ఆంధ్ర వాగ్గేయకార చరిత్రమున్నూ. తెలుగువారి సంగీత ప్రతిభ తెలుసుకోవా లనుకొన్నప్పుడు ముందు తరాలవారికీ ఆయన గ్రంథమే శరణ్యం. ఈ విషయంలో ఆయన పరమ ప్రామాణికుడు. ✪

రేడియో సంగీత రూపకాలకు స్వరరచన

— ఎం. చిత్తరంజన్

లలిత సంగీతాన్ని, సంగీత రూపకాన్ని ప్రప్రథమంగా ప్రసారం చేసిన ఘనత మద్రాసు రేడియో కేంద్రానికే దక్కింది. 1939లో శ్రీ మల్లవరపు విశ్వేశ్వరావుగారు రచించిన "బిల్హణీయం" సంగీతరూపకాన్ని శ్రీ బి.వి. నరసింహారావుగారు సంగీతం కూర్చగా ఆకేంద్రం ప్రసారం చేసింది. సుమారు అదే కాలంలో (బహుశా'39 లోనో '40లోనో) మద్రాసు కేంద్రంలో పనిచేస్తున్న ఎస్.ఎన్. మూర్తిగారు ఒక రోజు ఒక ఫిలిం రికార్డింగు స్టూడియోకు వెళ్ళి సాలూరు రాజేశ్వరరావు, రావుబాలసరస్వతీదేవి గార్లను కలిసి "మీరు మా కేంద్రానికి వచ్చి కొన్ని లలితగీతాలు పాడండి. మా కేంద్రంనుండి లలిత సంగీత కార్యక్రమాలు ప్రసారం చేయాలనుకుంటున్నాం" అన్నారట. అప్పుడు బాలసరస్వతి, రాజేశ్వరరావు - యిరువురూ కలసి బసవరాజు అప్పారావు మొదలైన కవుల పాటలు రేడియోలో పాడారుట. (ఈవిషయం బాలసరస్వతిగారు నాతో చెప్పారు.). మనదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు. ఆంధ్రప్రాంతంలో ఎక్కడా కూడా రేడియో కేంద్రం లేకపోవడంవలనను, హైదరాబాద్‌లో "దక్కన్‌రేడియో" కేంద్రంవున్నా, అది నిజాంపరిపాలనలో వుంటూ తెలుగుకు చాలా తక్కువ ప్రాముఖ్యత వుండడం చేతను, తెలుగు కార్యక్రమాలకు తగిని ప్రాచుర్యాన్ని కలిగించినది మద్రాసు కేంద్రం ఒక్కటే ఆరోజుల్లో.

ఆవిధంగా "గీతావళి" అనే పేరుతో లలిత సంగీత కార్యక్రమాలలో ఎస్. వరలక్ష్మి, ఘంటసాల, అనసూయ - సీత, టంగుటూరి సూర్యకుమారి, భానుమతి, వక్కలంక సరళ, ఎమ్.ఎస్. రామారావు, రజనీకాంతరావు, మల్లిక్ మొదలగువారు పాల్గొంటూండేవారు.

"ఊర్వశి", "శబరి", "గుహాలేదు", "విద్యాపతి", "అతిథిశాల", "దక్షయజ్ఞం", "ఆండాళ్ కళ్యాణం" మొ॥ కృష్ణశాస్త్రిగారి సంగీత నాటికలు, "కోకిలమ్మ పెళ్ళి", "కిన్నెరసాని" మొ॥ విశ్వనాథ సత్యనారాయణగారివి, విశ్వేశ్వరరావుగారి "కలభాషిణి", రజనిగారి "మధురా నగరగాథ", "చండీదాసు", "మేఘసందేశం", "సంధ్యా దీపకళిక" మొ॥నవి - యిలా ఎన్నో సంగీత రూపకాలను మద్రాసు కేంద్రం ప్రసారం చేసింది.

1948లో విజయవాడ రేడియో కేంద్రం ప్రారంభించబడింది. పోలీసు యాక్షన్ తరువాత 1948లో నిజాం పరిపాలన అంతరించి హైదరాబాదు సంస్థానం భారత దేశంలో విలీనం అయింది. 1950లో "దక్కన్ రేడియో"గా వున్న హైదరబాదు కేంద్రం అకాశవాణి కేంద్రంగా మారింది. 1954 - 55 సం॥ ప్రాంతంలో నుండి తెలుగు కార్యక్రమాలు ఎక్కువగా ప్రసారం కావడము, '56లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణతో హైదరాబాదు రాజధాని అయినందున ఆ స్టేషన్ తెలుగుకు ప్రాముఖ్యత గల కేంద్రంగా మారింది. కాబట్టి 1950వ దశకం నుండి విజయవాడ, హైదరాబాదు కేంద్రాలలో ఎన్నెన్నో లలిత సంగీత కార్యక్రమాలతో బాటు అనేక సంగీత రూపకాలు కూడా ప్రసారమౌతూవచ్చాయి. 1955లో నిష్ణాతులైన కళాకారులను, పండితులను, విద్వాంసులను ఆకాశవాణి కేంద్రాలలో సంగీత, సాహిత్య, నాటకాది శాఖలకు అధిపతులుగా (ప్రొడ్యూసర్లుగా) కేంద్ర ప్రభుత్వం నియమించింది. విజయవాడలో బాలమురళీకృష్ణ, పింగళి లక్ష్మీకాంతం, బందాకనకలింగేశ్వరరావు, దాశరథి, గోపీచంద్, స్థానం నరసింహారావు, మంచాళ జగన్నాథరావు, వింజమూరి వరదరాజయ్యంగార్ మున్నగువారు నియమితులయ్యారు. అప్పటినుండి యీ రెండు స్టేషన్‌లూ అనేక సంగీత రూపకాలను, యక్షగానాలను ప్రసారం చేశాయి.

నాటి నుండి నేటి వరకు కృష్ణశాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు, రజని, మల్లవరపు, వింజమూరి శివరామారావు,

దాశరథి, నారాయణరెడ్డి, బోయి భీమన్న కందుకూరి రామభద్రరావు, శశాంక, బాపురెడ్డి, పద్మినీదేవి, ఆచార్యతిరుమల, వడ్డెపల్లి కృష్ణ, యింకా అనేక మంది ప్రసిద్ధ కవుల లేఖిని నుండి జాలువారిన సంగీత రూపకాలు బాలమురళి, రజని, మల్లిక్, ఓలేటి, పాలగుమ్మి విశ్వనాథం, మంచాళ జగన్నాథరావు, కొచ్చెర్లకోట సూర్య ప్రకాశరావు, రమణమూర్తి, సూర్యారావు, చిత్తరంజన్, జగన్నాథాచార్యులు, రామానుజ సూరి, ప్రియంవద, కృష్ణమోహన్ మొ॥వారి స్వరరచనలతో పూవు - తావి చందాన సుమధుర పరిమళాలు వెదజల్లుతూ అత్యంత ప్రజాదరణను పొందుతూ వస్తున్నాయి.

శాస్త్రీయ సంగీతంలో వాగ్గేయకారుడు చేసే పనిని లలిత సంగీతంలో యిద్దరు చేయవలసి వస్తుంది. గీత రచన చేసే కవి, సంగీత రచన చేసే స్వరకర్త - యీ యిద్దరూ కలసి రూపొందించగా ఒక పాట తయారవుతుంది. వాగ్గేయ కారునిలో వాక్కు, గేయము - అనగా సాహిత్యము, సంగీతము రెండూ అతని హృదయంనుండి సమస్పందనతో ఏకకాలంలో ఉద్భవమై ఒక కీర్తనగానో, పదముగానో, జావళీగానో రూపొందుతుంది. కాని లలిత సంగీతంలో ఒక పాట అకృతి నొందాలంటే గీత రచయిత, స్వరకర్త యిరువురికీ సంబంధిత యితివృత్తము, సన్నివేశము మొదలగువాటిని గురించిన సంపూర్ణమైన అవగాహన కలిగిన తరువాత కవి తగురీతిలో గీత రచన సాగించాలి. దానికి అనుగుణమైన స్వరలహరులతో బాణీని కూర్చాలి సంగీతదర్శకుడు. స్వరకర్త ముందుగా బాణీని కూర్చగా... రచయిత ఆబాణీకి అనువైన సాహిత్యాన్ని అందించే పద్ధతి కూడా వున్నది.

శాస్త్రీయ సంగీతంలోని రాగాలను లలిత సంగీతానికి అన్వయించి వాడేటప్పుడు సాధారణంగా ఆరాగాలకుండే మూర్ఛన క్రమము, గమకాది లక్షణములతో కూడుకున్న రాగస్వరూపము మొదలగు కట్టుబాట్లను, నియమ నిబంధనలను వదలిపెట్టి, ఆయా సన్నివేశాలకు, యితివృత్తాలకు భావరసపోషణకై అవసరాన్ని బట్టి ఆరాగా లలో స్వతంత్ర స్వరసంచారాలు, అన్యస్వరప్రయోగాలు మున్నగువాటితో మనోహరమైన బాణీలను కూర్చవలసి వస్తుంది. తద్వారా ఆరాగాలు కొత్తరూపురేఖలను సంతరించుకుంటాయి.

అందుకే స్వరకర్తకు కేవలం కర్ణాటకమో, హిందుస్తానియో, జానపదమో - ఏదో ఒక సంగీతంలో మాత్రమే జ్ఞానం వుంటే సరిపోకపోవచ్చును. కర్ణాటక, హిందుస్తాని, వివిధప్రాంతాల జానపద సంగీత రీతులు, పాశ్చాత్య సంగీతము - వీటిన్నిటి గురించిన పరిజ్ఞానం కొంతైనా కావలసివస్తుంది. ఎందుకంటే, ఉదాహరణకు ఒక నాటకంలో ఒక పంజాబీ పాత్ర వుందనుకోండి. ఆ పాత్ర పాడే పాటకు (గీత రచన తెలుగు భాషలోనే వున్నా) పంజాబు ప్రాంతపు సంగీతాన్ని అందించాలి కదా. అంటే స్వరకర్తకు ఆ ప్రాంతీయ సంగీతం గురించి తెలియాలి. కాబట్టి స్వరకర్త వివిధరకాల సంగీత పద్ధతులను అవగాహన చేసుకోవలసివుంటుంది. అప్పుడే న్యాయం చేకూర్చగలుగుతాడు.

రేడియో వంటి శ్రవ్యమాధ్యమానికి, సినిమా, టి.వి. వంటి దృశ్యమాధ్యమాలకు స్వరరచన చేయడంలో కొంత వ్యత్యాసం వున్నది. సినిమా, టి.వి.లలో కనబడే దృశ్యము, పాత్రల వేషధారణ మొ॥నవి సంగీత దర్శకుడికి దోహద పడతాయి. ఉదాహరణకు - ఒక ఉద్యానవనంలో ఒక పాత్ర నృత్యం చేస్తూ పాడుతున్నది అనుకుందాం. అదృశ్యంలో ఉద్యానవనము, పాత్ర యొక్క ఆహార్యము - యివన్నీ ప్రేక్షకుడికి కనబతాయి గనుక, స్వరకర్త కేవలం గీతానికి తగిన బాణీని, వాద్య సంగీతాన్ని కూర్చుకుంటే సరిపోతుంది. కాని శ్రవ్యమాధ్యమమయితే స్వరకర్త తన సంగీతం ద్వారా ఉద్యానవన వాతావరణాన్ని, పరిసరాన్ని సైతం సృష్టించుకుని, నృత్యానికి తగినట్లుగా బాణీని, వాద్య సంగీతాన్ని సమకూర్చుకోవాలి. అప్పుడే రేడియో వద్ద కూర్చున్న శ్రోత ఉద్యానవనంలో నృత్యం చేస్తూ పాడే పాత్రను తన కళ్ళతో ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతిని పొంది ఆనందించగలుగుతాడు.

కృష్ణశాస్త్రి గారి "కొత్త కోవెల", "అతిథిశాల", "బావొచ్చాడు", ఏడాది పొడుగునా", "ఆండాళ్ కల్యాణం" మొ॥నవి, నారాయణరెడ్డి గారి "వెన్నెలవాడ", "రామప్ప", "మేఘమాధురి" మొ॥, దాశరథిగారి "యశోదర", "మమశ్వేత", "మీర్జాగాలిబ్" మొ॥, రజనిగారి "చండీదాసు", "విశ్వవీణ", "కొండనుండి కడలిదాకా", "మేఘసందేశము", శశాంక రచించిన "పొష్యలక్ష్మి", "వసంత శోభ" మొ॥, కోపల్లె, శివరాం యొక్క "త్రిపథ", "అవంతిక", యమ్. పద్మినీదేవి



కుడి నుంచి ఎడమకు : శ్రీ రజని; శ్రీ విశ్వనాథ సత్యనారాయణ; శ్రీ యస్. యస్. మూర్తి (డి.డి.జి, ఆకాశవాణి, న్యూఢిల్లీ); శ్రీ టి.ఆర్. మురళీధరన్ (స్టేషన్ డైరక్టర్ హైదరాబాద్); బి.జి. కృష్ణమూర్తి

రచించిన "విష్ణుచక్రం", "చంద్ర సరోవరం", "యక్షగృహిణి", "కాలచక్ర గమనంలో కపోత లకూజితాలు" మొ॥, వడ్డెపల్లి కృష్ణ విరచితమైన "జీవనరాగం" మొ॥నవి

-యిలా ప్రసారమైన వాటిని కొన్నిటిని మాత్రమే మచ్చుకు పేర్కొంటున్నాను.

రజనిగారి "చండీదాసు" సంగీతరూపకంలో ఆయన బెంగాలి సంగీతపు కీర్తన పద్ధతిని అనుసరించి స్వరరచన చేశారు. కృష్ణశాస్త్రిగారి "అతిథిశాల" ఉమర్‌ఖయ్యాం జీవితానికి, తత్త్వానికి సంబంధించిన యితివృత్తం కలది. ఖయ్యాం పర్షియాదేశస్థుడు కనుక మధ్యప్రాచ్యసంగీత రీతులను ఆధారంగా చేసుకొని రజనిగారు ఆరూపకం అంతటా కూడా అరబ్బీ సంగీతంలో వుండే స్వరపోకడలను కర్ణాటక శాస్త్రీయరాగాలైన చారుకేశి మున్నగువాటికి అన్వయించి అందమైన బాణీలను కూర్చారు.

"ఓహో ముసాఫిరోహో! ఓహో!
ఇది అతిథిశాల యిది ఉదయవేళ" అనే పాట,
"వేబోకవిరియు నెచ్చెలులార యినుడెగయు
.... మధువిదిగో మధువిదిగో" అనేది -
-ఈరెండిటినీ చారుకేశిరాగంలోను,
"రావె సాకీ సాకీ! రాగవీధులనడచి కడచి
చలివేళ పొలిమేర ఆమని పాడిచే" అన్న గీతాన్ని సింధుభైరవిలోను,

"తళుకు జల్తార్ బుటాలల్లిన - నీలవలయమ్మీ గుడారం"

అనే పాటను శివరంజని రాగాన్ని ఉపయోగిస్తూ ఆరాగంలో లేని కొన్ని అన్యస్వరాలను మిళితం చేసి మధ్యప్రాచ్య వాతావరణాన్ని కడు రమణీయంగా సృష్టించారు.

ఆరూపకాన్ని తిరిగి 1963లో హైదరాబాదు కేంద్రంలో ప్రసారం చేసినప్పుడు అందులో నేను కూడా పాడాను. అందులో ఒక పద్యాన్ని కర్ణాటక సంగీతంలోని 11వ మేళకర్తయగు "కోకిల ప్రియ" రాగంలో నన్ను పాడమని రజని గారంటే, అరబ్బీ సంగీతపు ధోరణిలో ఆ పద్యాని ఆరాగంలో పాడాను. ఏ రాగాన్ని ఎలావాడుకుంటే, ఏభావం

ఉత్పన్నమౌతుందో, ఏరస పోషణకు వీలవుతుందో తెలిసి సంగీతాన్ని కూర్చగలగడమే స్వరకర్త యొక్క నిజమైన ప్రజ్ఞ. యీవిషయంలో సిద్ధహస్తులయిన రజనిగారు లలిత సంగీతంలో సాధారణంగా వాడబడని అపూర్వరాగాలెన్నిటినో సంగీత రూపకాలలోను, లలిత గీతాలకు కూర్చిన బాణీల్లోను సమర్థవంతంగా ప్రయోగించారు.

రజనిగారు రచించిన "మేఘసందేశం"లో యక్షుడు పాడే విరహగీతానికి కర్ణాటక సంగీతంలో పక్కు శాస్త్రీయరాగంగా పరిగణించబడే కాంభోజ రాగాన్ని వినియోగించి లలితంగా, నూతనంగా భాసించేటట్లు బాణీని కూర్చిన పాట.

"నీకు మాత్రము కాకపోయిన -
నాకు సుంతయు లేకపోయిన
ఆవసంతమ్మటులెగడచెను -
నీవు లేకయె నీవు లేకయె ప్రేయసీ"

-దీనిని బాలమురళీగారు గానం చేశారు.

అదే సన్నివేశానికి హైదరాబాదు కేంద్రంలో త్రిపురనేని గోపీచంద్ వ్రాసిన "మేఘ సందేశం" సంగీతరూపకానికి కృష్ణశాస్త్రిగారు వ్రాసిన యక్షుడు పాడే విరహగీతం

"ఎలాగీ వియోగాన వేగేనో నా ప్రియా
ఎలాగీ మేఘమాసం ఏగేనో నా ప్రియా".

దీనికి పాలగుమ్మి విశ్వనాథం గారు "అభేరి" రాగంలో మనోహరమైన బాణీని కూర్చగా ఆ పాటను నేను పాడాను.

ఒకే సన్నివేశానికి ఒక్కొక్క స్వరకర్తయొక్క స్పందన, ఆలోచనా సరళి, రాగనిర్ణయము, అన్వయము మొదలైనవి ఒక్కోవిధంగా వుండి ఎంతో వైవిధ్య భరితమయిన రస గుళికల వంటి బాణీలు రూపొందడానికి దోహదమౌతాయి.

పాలగుమ్మి విశ్వనాథంగారు దాశరధిగారి "యశోధర" (బుద్ధుడి జీవితగాథ యితివృత్తం) సంగీతరూపకంలో "తథాగతా ప్రజాహితా" అనే గీతానికి లలిత సంగీతంలో అరుదుగా వాడబడే "నాటకురంజి" రాగాన్ని ప్రయోగించి లలితమైన హృద్యమైన బాణీని కూర్చారు. దీనిని మా చెల్లెలు శాంతగానం చేసింది. ఇంకొకపాట "రావేమిరా శశీ! అంధకారం యీనిశి" అనే యశోధర పాడే విరహగీతానికి విశ్వనాథంగారు షణ్ముఖ ప్రియరాగాన్ని ఉపయోగించారు. పక్కు శాస్త్రీయ రాగమైన షణ్ముఖ ప్రియను లలిత లలితంగా రూపొందేటట్లుగా సంగీతాన్ని కూర్చారు. దీనిని కూడా మధురంగా శాంతపాడింది. ఈ పాటలన్నీ శ్రోతల మన్ననలను పొందాయి.

అల్లసాని పెద్దనగారి "మనుచరిత్ర"కు రేడియో అనుసరణగావించి "త్రిపథ" అనే సంగీతరూపకాన్ని కోపల్లె శివరాం రచించాడు. అందులో విరహతప్త యైన వరూధినిని

"కొమ్మరో విరిరెమ్మరో!

రొద

రొద సేయకె తుమ్మెదా, రేగి
రొద సేయకె తుమ్మెదా!!
చెలిని నిదురింపగా నీయదే, నీ రొదా!
రొద సేయకె తుమ్మెదా!!
విరివలపని భ్రమయకే
పొందామర తళుకని మురియకే
చెలియూపిరి తీపికి సొలయకే అలయకే!!
రొద సేయకే!!
హాయిగ నీ అరమూయు కనులలో
ఆడు పాపలే నీ చెలులా!
తీయనైన పెదవి యెఱుపులో
తేరు తేనెలే నీ కలలా!!
రొదసేయకే!!
వింజామర వేయవె - చల్లని
విరిగందము భరియించు రెక్కలతో
వింజామర వేయవె!
కంజానన యిపు డిపుడే ఆ
కలల లోకమున చెలగెడివేళ!
రొద సేయకే!!

'రజనీ గీతం

ఇంతలో నీకింతగా కన్నీరు ఎలా" అంటూ బ్రతిమిలాడి ఊరడించే చెలికత్తె పాటకు, ఆనందంగా హుషారుగా పాడుకోడానికి, వీరరసానికి అనుకూలంగా వుండే హంసధ్వని రాగాన్ని సౌమ్యంగా అప్యాయంగా అనురాగంతో అనునయించేందుకు వీలుగా వినియోగించి కొత్తదనంతో రూపొందే విధంగా బాణీని కూర్చారు.

1989వ సం॥లో ఆకాశవాణి వార్షిక అవార్డులలో ప్రశంసాపత్రాన్ని పొందిన సంగీతరూపకం "కాలచక్ర గమనంలో కపోత కలకూజితాలు".

డా॥ పద్మినీదేవి రమణీయంగా చిత్రించిన యీ రూపకంలో మానవజీవితాన్ని బాల్యంనుండి వృద్ధాప్యం వరకూ ఆరు ఋతువులతో అనుసంధించే యితివృత్తంగల యీ నాటకానికి నేను స్వరరచన చేశాను. ఎలాగైతే ఋతువులు సంయమనంతో తమ ధర్మాలను ప్రకటిస్తే ప్రకృతి అంతా శోభాయమానంగా ప్రశాంతంగా భాసిస్తుందో, అదే విధంగా మనిషి తన నీతి నియమాలను పాటిస్తూ, అక్రమాలకు అకృత్యాలకు పాల్పడకుండావుంటే తనకూ తన తోటివారికీ, తద్వారా సమాజానికీ సుఖశాంతులు చేకూరుతాయి అన్న యీ అంశానికి సంబంధించిన యీనాటికలోని పాటలలో - వసంత ఋతువుకు 'వసంత' రాగము, గ్రీష్మ తాపాన్ని సూచించేందుకు "కోకిలవరాళి", వర్షఋతువుకు 'అమృతవర్షిణి', అతిగా వర్షాలు కురిసి వరదలు, తుపానులు వచ్చి విధ్వంసాన్ని గావిస్తే - దానికి సూచనగా "మేఘరంజని" రాగం, శరదృతువును విజయకాలమంటారు గనుక "విజయనాగం" రాగం, హేమంత ఋతువుకు హిందుస్తాని రాగమైన "హేమంత్", శిశిరానికి వైరాగ్యసూచకమైన "మాయామాళవగౌళ", "ఝాలవరాళి" రాగాలు - యీ విధంగా ఔచిత్యంతో సంప్రదాయాన్ని, నూతనత్వాన్ని కలుపుకుంటూ సంగీతాన్ని కూర్చాను.

కె. చిరంజీవి రచించిన "భాగ్యనగరం" నాటకం హైదరాబాదు చరిత్రకు సంబంధించిన కథాంశంగలది. నవాబు దర్బారులో నృత్యం చేస్తూపాడే నర్తకి "భాగామతి" పేరుతోటే హైదరాబాదు భాగ్యనగరం అని పిలువబడుతున్నదని చరిత్రకారులు చెబుతారు. "ముజ్రా" అనబడే నృత్య గీతానికి ఆ సంప్రదాయాన్ననుసరించి సారంగి, సితార్, తబ్లా, మొదలైన వాద్యాలను మేళవించి నట్‌భైరవ్ అనే హిందుస్తాని రాగం (కర్ణాటక సంగీతంలో 'సరసాంగి' అనే రాగం) లో సంగీతాన్ని కూర్చి తస్నీం సయ్యద్ అనే ముస్లిం గాయని చేత పాడించాను. ఎంతోమంది శ్రోతల ప్రశంసలనందుకుంది. అదే నాటికలో విరహము, విషాదము, ఉత్కంఠతో కూడుకున్న ఒక సన్నివేశానికి "రూపవతి" అనే కర్ణాటక సంగీతంలోని మేళకర్త రాగాన్ని ముస్లిం వాతావరణానికి అనకూలంగా మలచుకొని ఆ సన్నివేశాన్ని కేవలం వాద్య సమ్మేళనంతో రూపొందించాను.

1983లో వడ్డెపల్లి కృష్ణ విరచిత "జీవనరాగం" అనే సంగీత రూపకంలో ఒక యుగళగీతానికి ఒకటి, ఒకటిన్నర శృతులలో (White I, Black I శృతులలో) రెంటిలోనూ సాగే విధంగా సింధుభైరవి రాగాన్ని వాడి బాణీని కూర్చాను. అందులో ఒక్కొక్క చరణం ఒక్కొక్క Chord తో రూపొందేలా - అనగా స,మ,ద (చతుశృతి దైవతం) స్వరాల Chord తో మొదటి చరణము, గ,ప,ని అనే Chord తో 2వ చరణము - యీ విధంగా కొనసాగుతుంది.

1989లో పద్మినీదేవి రచించిన "యక్షగృహిణి" సంగీత రూపకాన్ని హైదరాబాదు కేంద్రం ప్రసారం చేసింది స్త్రీల కార్యక్రమంలో. కాళిదాసు విరచిత "మేఘ సందేశం"లో యక్షుడు తన ప్రియురాలికి సందేశం. పంపడం యితివృత్తమైతే, ఆ మేఘసందేశాన్ని విరహిణియైన యక్షగృహిణి స్వీకరించి సాంత్వన పొందడం యీ రూపకం యొక్క సారాంశం. ఇందులోని పాటలకు రసికప్రియ, చంద్రజ్యోతి మొ॥ లలిత సంగీతంలో ఉపయుక్తంకాని రాగాలలో నేను కూర్చిన బాణీలను అత్యంత మధురంగా శ్రీరంగం గోపాలరత్నంగానం చేశారు.

అసంఖ్యాకమైన రూపకాల గురించి - ఇలా చెప్పుకుంటూ పోతే యిదొక పెద్ద గ్రంథమే అవుతుంది.

సుమారు ఆరుదశాబ్దాలుగా ఆకాశవాణి కేంద్రాలు నుండి ప్రసారమవుతూ వచ్చిన అనేక మంది సుప్రసిద్ధ కవులు, సంగీత దర్శకులు రూపొందించిన పౌరాణిక, చారిత్రక, సాంఘికాది కథాంశాలు గల సంగీత రూపకాలు లలిత సంగీత వికాసానికి, అభివృద్ధికి ఎంతగానో తోడ్పడి నేడు యీ సంగీతం తనదైన ఒక విశిష్టరూపాన్ని సంతరించుకుని ఆబాలగోపాలన్ని రంజింపజేస్తూ ప్రజలదైనందిన జీవనంలో ఒక భాగమై విరాజిల్లుతూంది. ✪

రజనీ బాబాయిగారు

— ఎస్.బి. శ్రీరామమూర్తి

విజ్ఞులు, పండితులు, వయోవృద్ధులు తమ అనుభవాలను, అభిప్రాయాలను వెలువరించే ఈ విశేష సంచికలో నాబోటివాడికి కూడా ఒకింత చోటు (దొరకటం) కల్పించటం - సరస్వతీమాతకు జరిగే పుష్పార్చనలో ఒక గరిక పువ్వుగా నిలిచే మహాభాగ్యం లభించినట్టే. ఒక మహాకాంతి మేఘం, ఒక నిరంతర స్వరఝరీ ప్రవాహం, మూర్తీభవించిన ఒక శబ్దరూపం - ఈ మూడింటి సమ్మేళనంతో అలరారే అద్భుత మానవరూపమే 'రజని'. గత మూడు దశాబ్దాలుగా ఆయన VIBRATION కి లోనయిన పరమాణువుగా ఆయన గురించి రెండు మాటలు చెప్పటానికి సాహసిస్తున్నాను. మింటిని వెలిగే చుక్కలో చంద్రునిలాగ, సంగీతసాహిత్య వినీలాకాశంలో తన యశః కాంతులు దశాబ్దాలుగా ప్రసరింపజేస్తున్న రజనీకాంతు డాయన. స్వరము, అక్షరము అనే రెండు జాతి అశ్వాలను పూన్చి - సృజన అనే వెండిరథంపై విజయవిహారం చేసిన మేటివీరుడాయన. మూడవ కక్ష్యలో పరిభ్రమించేవారు 'రజనీకాంతరావ'నీ రెండవ కక్ష్యలో పరిభ్రమించేవారు "రజనీ" అనీ, సమీప కక్ష్యలో మసలగలిగే మహాభాగ్యం పొందిన మముబోంట్లు 'రజనీబాబాయిగార'ని ఆయన్ని పిలుచుకోవడం పరిపాటి. అంతటి మహాకళా స్రష్టకు శిష్యులం అని చెప్పుకోగల ధైర్యసాహసాలు, అర్హతలూ లేవుగానీ - రజనీకాంతుడనే ఈ చంద్రుని చుట్టూ విప్పారిన నేత్రాలతో, విస్మయం గొలిపే దృక్కులతో, రిక్కించిన వీనులతో - నిరంతరం పరిభ్రమించే పరమాణువులం అని మాత్రం చెప్పుకోగలం. తెల్లని కర్పూరపు పొడివంటి శరత్కాలపు వెన్నెలలు వెదజల్లి, సంగీత సాహిత్యా భిమానులపై 'చంద్రజాలం' చేసే రజనీకాంతుడు ఆయనైతే - బేబీ టైటానులం మేము.

"ఆదియందు శబ్దము ఉండెను...." అంటూ, బహుళ ప్రచారంలో ఉన్న BIG BANG THEORM ని సైతం గౌరవిస్తూ జంత్ర, గాత్ర సమ్మేళనంతో 'విశ్వయానం' చేసినా - కారడవులలో, కొండకోనలలో ప్రతిధ్వనించే నాదాన్ని "ఓహో ప్రతిశృతీ" అని స్వరరూపం కల్పించి పలుకరించినా - మానవుని జీవనగమనానికి ఆలంబనమైన ఆశావాదాన్ని అక్షరరూపంలో చూపించి, స్వీయ సంగీతంలో "ఆశా, నా ప్రాణ సఖీ" అని ఆలపించినా - శతాధిక గేయాలను 'శతపత్రసుందరి'గా అలంకరించినా - గోదావరీమాతను జపాను శ్రోతలకు పరిచయం చేసి ఆకాశవాణికి ప్రపంచ ఖ్యాతిని ఆర్జించి పెట్టినా - ఏది పట్టినా, ఏది ముట్టినా, ఏ అక్షరం వ్రాసినా, ఏ స్వరం పలికినా - నాటికీ, నేటికీ ఆయనకు ఆయనే సాటి. అందుకే ఆయనంటే మావంటి వారికి అంతటి అయస్కాంతపు ఆకర్షణ. ఎందుకు ఆయనను 'రజని బాబాయిగారని' ఆప్యాయంగా పిలుచు కుంటామో కొంతవరకైనా వివరించడానికి ప్రయత్నిస్తాను.

డెబ్భయ్యవ దశకం నుంచీ ఆయన కనుసన్నలలో మెదిలే మహదవకాశం ఉద్యోగరీత్యా మాకు దక్కింది. ఆయన హయాంలో ఉద్యోగంలో ప్రవేశించాం అని చెప్పుకోగల అదృష్టం మాకు కల్గింది. అతిరథులు, మహారథులు వివిధ శాఖలకు సారథ్యం వహిస్తున్న ఆకాశవాణిలో పనిచేసే అరుదైన అవకాశం లభించినందుకే ఆనందిస్తూంటే - రజని 'కులపెద్ద'గా కేంద్ర సంచాలకులుగా వ్యవహరించే కాలంలో పనిచేయగల్గటం, నిజంగా పూర్వజన్మ సుకృతం. సుప్రభాత వేళ నుంచి, సుషుప్తి వరకూ ఆసేతు హిమాచలం వరకూ వ్యాపించిన ఏ ఆకాశవాణి

కేంద్రమైనా నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. అందులో అచ్చెరువేమీ లేదు. కానీ నిత్యకళ్యాణం పచ్చతోరణంలాగ, ప్రతిరోజూ ఒక పండగలాగ, ప్రతివేకువా ఒక తిరునాళ్ళలాగ, ప్రతి సంధ్య ఒక ఉత్సవంలాగ - జరపగలిగే విశేష ప్రజ్ఞ రజనికే ఉంది - ఆ విషయం అనతికాలంలోనే విజయవాడ పురప్రముఖులు గ్రహించగలిగారు. అంచేతనే రజని రూపొందించి, ఆహ్వానం పల్కిన ఏ విశేష కార్యక్రమానికైనా తండోపతండాలుగా జనం విచ్చేసి, ఆకాశవాణి ప్రాంగణంలో రంగస్థలంపై జరిగే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసారు, దాదాపు ఓ దశాబ్దంపాటు. అదొక స్వర్ణయుగం. అదొక మహాయోగం. ఆ మంత్రదండం రజని చేతిలోనే ఉండేది. కనుకనే 'జై ఆంధ్ర' ఉద్యమంతో ఊరంతా అట్టుడికిపోయే, ఉపద్రవవేళలో కూడా ప్రేక్షక శ్రోతలు కించిత్తైనా శంకించక - రవంతైనా భయపడక - రాత్రివేళలలో కూడా, అప్పటికి ఊరికి ఒక మూలగా భావించే ఆకాశవాణి ఆవరణలోకి - సంబరంగా వచ్చేవారు. రంగస్థలంపై జరిగే సంగీత, సాహిత్య కార్యక్రమాలన్నింటినీ ఆసాంతం వీక్షించి, ఆపైన ఇంటిముఖం పట్టేవారు. అటువంటి అనేకానక కార్యక్రమాలలో, రంగస్థలంపైన అపూర్వమైన, అద్వితీయమైన ఒక ప్రయోగం - "రంగుల - రాగాల సమ్మేళనం". ప్రముఖ గాయకులు 'ఓలేటి' శాస్త్రీయ రాగాలాపన చేస్తూంటే, ఆ సంగీత స్వరాలకు ప్రతిస్పందించిన ఓ ప్రముఖ పెయింటింగ్ ప్రొఫెసర్ ఒకరు - రంగస్థలంపైన కేన్వాస్‌పై రంగులతో తన భావాలను అప్పటికప్పుడు చిత్రీకరించడం.

ఇలాంటివే, రజని రచించి స్వరపరచిన 'మూల స్తంభాలు' నృత్యనాటిక, 'అతిథిశాల' సంగీత రూపక ప్రదర్శనలు కొన్ని. కేవలం వాద్యబృందం రచనగా సాగే విశేష కార్యక్రమం - "ఆదికావ్యావతరణం". రామాయణ గాథను, వాల్మీకిపరంగా ప్రదర్శిస్తూ ఆ పవిత్ర కావ్యరచనకు దారితీసిన సన్నివేశాలను అటు ప్రేక్షకుల్ని, ఇటు శ్రోతల్ని ఆకట్టుకొనే రీతిలో - కేవలం వాద్యబృందంతో రూపొందించిన తీరు బహుథా ప్రశంసనీయం. ప్రధాన పాత్రయైన వాల్మీకి వేషధారిగా రంగస్థలంపై నన్ను పరిచయం చేస్తూ "ఇడుగో ఇతనే వాల్మీకియైన రాముడు" అన్న రజని ఆశీస్సులు నేటికీ ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. ఆ రూపంలో



ఆంధ్రాయూనివర్శిటీ హాస్టల్ డాబా మీద (1937)

'క్రౌంచమిదున వియోగాన్ని' ప్రముఖ వయొలిన్ విద్వాంసులు శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులుగారి చేత వయోలిన్‌పై వేదనాపూరితంగా పలికింపజేయటం - ప్రేక్షకులకు ఒక విశేష అనుభూతిగా మిగిలిపోయింది.

అలాగే 'ఓహో ఓహో ప్రతిశృతి' పాట మధ్యలో వచ్చే చరణాంతర వాద్య ఖండికలో నిలయకళాకారులు శ్రీ సుందరపల్లి సూర్యనారాయణమూర్తిగారి క్లారినెట్ బిట్ దిశాంతాలకు చేరుకునే ప్రతిధ్వనిలాగే వినిపిస్తుంది. ఆకాశవాణి లలితగీతానికి ఆకారాన్ని దిద్ది, అలంకారాలు సమకూర్చి అందాలు అద్ది, తళుకు మెరుంగులతో తరతరాల పంటగా మనకి అందించిన రజని సేవలు ముందుతరాలవారికి వారసత్వ సంపదగా మిగిలిపోతాయి.

వాగ్గేయకారుడైన రజనిగీతంలో, స్వరకల్పనలో ఒక అరుదైన ముద్ర అదృశ్యంగా కనిపిస్తుందని - అభిమానులంతా చెప్పుకునేమాట. పేరు చెప్పకపోయినా 'అది రజని గీతం' అని, 'అది రజని స్వర రచన' అని ఇట్టే స్ఫురిస్తుంది. ఏ సంగీత వాద్యాలను సమ్మేళనపరిస్తే - ఏ ఎఫెక్ట్ పలుకుతుందో - వాద్య సమ్మేళనాన్ని ఏ రీతిన స్వర పరిస్తే - గాయనీ గాయకులు స్వయంగా పాడుతున్న అనుభూతి కలుగుతుందో - రజనికి తెల్సినట్టు మరెవరూ గ్రహించలేదేమో. ఇందుకు చిన్న ఉదాహరణ "ఆది

కావ్యావతరణం"లో, ప్రారంభంలో వినిపించే ఖరహరప్రియ రాగ ఖండిక. ఇంతేగాక, ఢిల్లీలోని జాతీయ వాద్యబృందాన్ని స్వరపరిచి దాదాపు శతాధికంగా వాద్యాలను సమ్మేళన పరిచి, రజని రూపొందించిన అనేక ఇతివృత్తాత్మక సంగీత రచనలూ, వాద్య బృందరచనలూ - హార్మోనికి, సృజనాత్మ తకూ ప్రతీకలుగా, ఆయన ఊహాశక్తికి మచ్చుతునకలుగా పేర్కొనవచ్చు. వాటన్నిటిలోనూ 'రజనీ సంగీతతత్వమే" ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. ఈ సంగీత రహస్యాలను మావంటి యువ అభిమానులను చుట్టూ కూర్చోబెట్టుకుని - ఒకటొకటిగా వివరిస్తూ, మధ్య మధ్య తానే 'పాడుతూ', శాంతినికేతన్ విద్యాబోధనారీతిలో - మాకు ఆకళింపు అయేలాగ, మనసుకు హత్తుకునేలాగ చెప్పగలనేర్పు రజని బాబాయిగారికే ఉంది.

ఆయన అపార సంగీతనిధి. అమూల్య జ్ఞాపకాల పెన్నిధి. ఎప్పటిదో ఏదో పాట - అది రేడియో లలిత గీతమో, అలనాటి సినీగీతమో - ఏదైనా సరే - దాని పుట్టు పూర్వోత్తరాలు విశదీకరించి చెప్పేవారాయన. ఇంక ఆకాశవాణి ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో ఉన్నప్పటి గాథలూ, తన సినీ సంగీత ప్రవేశ కథలూ, యుద్ధ సమయంలో కూడా అర్ధరాత్రి వరకూ ఆకాశవాణిలో రిహార్సల్స్ చేసి, ఆ రాత్రివేళల్లో - మదరాసు వీధుల్లో సంచరించడం, భారత స్వాతంత్ర్య దినోత్సవపు తొలినాటి అర్ధరాత్రి వేడుకలూ, ప్రముఖ నటి, గాయని టంగుటూరి సూర్యకుమారి చేత లైవ్ పాడించిన దేశభక్తి గీతం - ఇలా ఎన్నెన్నో ముచ్చట్లు రజనిబాబాయిగారి చుట్టూ చేరి అనేక సందర్భాలలో చెవులింతగా చేసుకుని వినేవాళ్ళం. ఆ అదృష్టం అందరికీ లభించదేమో అనిపిస్తుంది. ఆయన కబుర్లకు వంతపాడే సుభద్రమ్మపిన్నిగారిని కదిపినా ఎన్నెన్నో ఆకాశవాణి గాథలు, గలగల వరదలా పారుతాయి. అందుకే బాబాయిగారనీ, పిన్నిగారనీ ఆ దంపతులిద్దర్నీ ఆప్యాయంగా పిలుచుకోవటం. ఇద్దరమ్మాయిలు, ముగ్గుర బ్బాయిలతో, మనుమలతో కళకళలాడే నిండు కుటుంబం ఉన్నా- మాలాంటి యువతరాన్ని కూడా అభిమానంతో చేరదీసి - రక్తసంబంధీకులకంటే ఎక్కువగా నిష్కళంక ప్రేమను అందించే అరుదైన దంపతులిద్దరూ. ప్రముఖ వైణికులు చిట్టిబాబు చిరుతప్రాయంలో ఎంత చనువుగా తమ ఇంట్లో మసలేవాడో సుభద్రమ్మ పిన్నిగారు చెప్తూంటే వినితీరాల్సిందే. స్వయంగా ఆవిడే చక్కని గాయని కావటం చేత - ఘంటసాల దగ్గర్నుంచి, సూర్యకుమారి, ఎస్. వరలక్ష్మి వంటి అనేకమంది నేపథ్యగాయనీ గాయకులనేకులు, తమ మదరాసు కాపురంలో ఎంత చనువుగా ఉండేవారో పిన్నిగారు వివరిస్తూంటే ముచ్చటగా ఉంటుంది వినటానికి.

పదవీ విరమణ తర్వాత కూడా ఆయన నిత్య పారిశ్రామికుడుగానే ఉన్నారు. ఎన్నో పరిశోధనా వ్యాసాలు, ఎన్నో సంగీత నృత్యరూపకాలు రచించడం, సోదాహరణాత్మక ప్రసంగాలు చేయడం - ఎంతోమంది పరిశోధకులకు, రిఫరెన్స్ అండ్ రిసోర్స్ పర్సన్‌గా తమ విజ్ఞానాన్ని పంచిపెడుతూ ఒక లివింగ్ ఎన్‌సైక్లోపీడియాగా పేరు పొందారు. నేటికీ ఆయన కళ్లలో కొత్త కాంతులు! ఇంకా ఎన్నెన్నో పరిశోధనలు చేయాలనీ, ఎన్నో శిఖరాలు అధిగమించాలనే! ప్రభుత్వం, మీడియా ఆయన సేవలను ఇంకా విలువైన రీతిలో వినియోగించుకుని ఉండాల్సిందేమో అనీ, రజని వంటి విశిష్ట వ్యక్తి రజని ఒక్కడే అయినప్పటికీ, ప్రభుత్వం తరపున ఆయనకు రావల్సిన గుర్తింపు ఇంకా రాలేదనీ - భట్టుగారిలాంటి సన్నిహితులం అనేక పర్యాయాలు అనుకుంటూ ఉంటాం.

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో 'రజని' కాలం మాకు ఒక పాఠశాల వంటిది. ఎంతో విలువైన చదువులబడి అది. తెల్లవారే సరికీ - ఏదో ఒక ప్రత్యే కార్యక్రమ రూపకల్పన - అందునిమిత్తం దూరప్రాంతాలనుంచీ విచ్చేసిన అపూర్వ కళాకారులు, విచిత్రవాద్యాలు, మూడు నాలుగురోజుల పాటు వారితో రిహార్సల్స్ కార్యక్రమాన్ని రూపొందిస్తున్న రజని బాబాయిగారితో పాటూ - మాకూ బోలెడంత సందడి. దూరంనుండి చూస్తూ, ఆనందంతో, అంబరవీధుల్లో విహరించడం. ఇవిగాక ఢిల్లీలో జరిగే ఆకాశవాణి వార్షిక పోటీలకు ప్రతిఏడూ ప్రత్యేక రూపకల్పనలు. కేంద్రంలోని కళాకారుల్ని తమ రూమ్‌లోకి రప్పించి, తాము సంకల్పిస్తున్న ఇతివృత్తాలను వివరించి - కేంద్ర సిబ్బందిని సమీకరించి - ఒక పోటీ వాతావరణంలో నిరంతరం శ్రమించి, ప్రత్యేక కార్యక్రమాల్ని రూపొందించడం. పోటీలు ప్రారంభించిన ఏడాదిలోనే ప్రథమ బహుమతులు పొందడం, అటుపైన ప్రతిఏటా బహుమతులతోనే ఢిల్లీ నుంచి తిరిగిరావడం

కాదేదీ స్టేజి కనర్హం - రంగస్థలం మీద తెలుగు కథ!

1994వ సంవత్సరం నుండి ప్రతి ఏటా నాటికల పోటీని నిర్వహిస్తూ వస్తున్న అ.జో. - వి.భొ. ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 1997 నుండీ కేవలం సరికొత్త నాటికలను మాత్రమే పోటీలకు ఆహ్వానిస్తూ ఒక కొత్త ఒరవడికి రూపం దిద్దింది. దీని ఫలితంగా తెలుగు నాటక రంగానికి నాలుగేళ్ళలో 348 కొత్త నాటికలు లభించాయి.

ఎప్పటికప్పుడు నవ్యతనాసించే అ.జో. - వి.భొ. ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 2001 వత్సరపు పోటీకి మరొక కొత్త ఆలోచన చేసింది. దాని ఫలితమే 'కథానాటికల పోటీ'!

అద్భుతమైన తెలుగు కథా సాహిత్యానికి రంగస్థలం మీద పట్టాభిషేకం జరిపించి 'కాదేదీ స్టేజి కనర్హం' అని నిరూపించడమే ఈ ప్రయోగం యొక్క ముఖ్యోద్దేశం. దాన్ని అర్థవంతంగా విజయవంతం చేసింది నాటక రచయితలు, సమాజాలూనూ!

అలవాటు ప్రకారం సకాలంలో అందిన 73 కథానాటికల నుంచి తొమ్మిది పోటీ ప్రదర్శనకు ఎంపిక అయి 4,5,6 జనవరి 2001 తేదీలలో భీమవరంలో ప్రదర్శింపబడుతున్నవి. అవి -

నాటిక, కథారచయిత	నాటకీకరణ	సమాజం
పట్నపురాణీ తలపోటు - బీనాదేవి	కృష్ణశ్రీ	ఆర్.వి.ఆర్. ప్రొడక్షన్స్, సామర్లకోట
అలరాస పుట్టిళ్ళు - కళ్యాణసుందరీ జగన్నాథ్	స్నిగ్ధ	కళావాణి, రంగంపేట
నిజాయితీ - బలివాడ కాంతారావు	అద్దేపల్లి భరత్‌కుమార్	సహృదయ, బొప్పూడి
భయం - కాళీపట్నం రామారావు	కె.కె.ఎల్. స్వామి	ఫేకర్ కల్చరల్ అసోసియేషన్, గరివిడి
సుశీల - చలం	ఎ. భాస్కర్ చన్ద్ర	భూమిక, చిలకలూరిపేట
అధికారి - రాచకొండ విశ్వనాథశాస్త్రి	విశ్వనాథ గణపతిరావు	కళాతరంగిణి, విశాఖపట్నం
ఎడారి కోయిల - మధురాంతకం రాజారాం	వల్లూరు శివప్రసాద్	గంగోత్రి, పెదకాకాని
వఱడు - అల్లం శేషగిరిరావు	కందిమళ్ళ సాంబశివరావు	సాగరి, చిలకలూరిపేట
మీ పేరేమిటి? - గురజాడ అప్పారావు	యం.వి.యస్. హరనాథరావు	అభినయ, ఒంగోలు

బహుమతులు పొందడం అన్న విషయాన్ని అటుంచితే, ఈ ఆరోగ్యకరమైన పోటీలో పాల్గొంటున్న తొమ్మిది సమాజాలవారూ తెలుగు కథను రంగస్థలానికి సమర్థవంతంగా మలిచారు. అందుకు అందరికీ అభినందలు!

ఆయన హయాంలోనే ఆరంభమయింది. అదే మాకు తర్ఫీదుగా మారి, రజని పదవీవిరమణ తర్వాత కూడా విజయవాడ కేంద్రం కీర్తి బావుటాను నిరంతరం ఎగురవేసే అపూర్వ అవకాశం మాకు చిక్కింది. రజని బాబాయిగారి పదవీ కాలంలో కూడా మావంటి ఔత్సాహిక కళాకారులు ప్రతిపాదించిన ఏ అంశాన్నైనా సరే - అవశ్యం ఆమోదించే వారాయన. "కొత్తదనానికి దేనికైనా సరే నేను ఎప్పుడూ సిద్ధమే" అని మా వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. చేరిన రెండు సంవత్సరాలకే మేము రూపొందించిన "నీలి నీడలు" రూపకం యువవాణిలో విన్న వెంటనే ఇంటి దగ్గర్నుంచి ఫోన్‌లో అభినందనలు తెల్పారాయన. అదీ innovative గానే! *"Tell him, I've hugged him & kissed him on his cheek"* అని చెప్పారాయన. సృజనాత్మకతనూ, నూతనత్వాన్ని ప్రేమించే ఏ కళాకారుడికైనా, ఏ కాలంలోనైనా సరే, చెరగని స్ఫూర్తి ఆయన. ఆయన్ని 'రజని బాబాయి'గారనకుండా ఇంకే పేరుతో పిలవాలి? ఆయన మాకు ఎస్.డి. కాదు - 'డాడీ'! అచ్చ తెనుగులో "రజని బాబాయిగారు". ✪

కూచిపూడి నాటకాలు

-పి. సంగీతరావు

"కూచిపూడి నాట్యానికి, భరతనాట్యానికి ఏమిటి తేడా?" అని అడుగుతూ ఉంటారు. పదవిన్యాసంలోనూ, కరచాలనంలోనూ, ఆహార్యంలోనూ, అభినయరీతిలోనూ, నాట్యాంశములలోనూ తనదైన ప్రత్యేకశైలి తనకి ఉన్నా, కూచిపూడి నాట్యం నాటకానికి సంబంధించినదని, భరత నాట్యం Solo Dance అనే అభిప్రాయం వ్యాప్తిలో ఉంది. ఈ అభిప్రాయమే పారిభాషికంగా కూచిపూడి నాట్యమేళ సంప్రదాయానికి, భరత న్యాటం నట్టువమేళ సంప్రదాయానికి చెందినవని చెప్తూ ఉంటారు. రెండు సాంప్రదాయాలు కూడా, భరతముని ప్రణీతమైన నాట్యశాస్త్రం మూలంగా వర్ధిల్లినవి. అయితే కూచిపూడి నాట్యవేత్తలు ప్రదర్శించే నాటక స్వరూప స్వభావాదులు ఎలాంటివి? అంటే, ఇవి కాళిదాసు, భవభూతి, భారవి మొదలగు సంస్కృత కవులు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం', 'ఉత్తర రామచరిత్ర', 'వేణీసంహారం' మొదలైన సంస్కృత నాటకాల కోవకు చెందినవి కావు. కూచిపూడి వారి నాటకాలు యక్షగాన శైలికి సంబంధించినవి.

ఈ యక్షగానానికి కొన్ని శతాబ్దాల చరిత్ర ఉంది. సంగీతము, నాట్యము, సాహిత్యము సమన్వయం పొందిన రచన యక్షగానం అంటే. ఈ విధమైన యక్షగానాలు భారతీయ భాషలన్నిటిలోనూ కొంచెం రూప భేదంతో రచింపబడ్డాయి. తమిళంలో తెరుకూత్తు, కర్ణాటకంలో యక్షగానం, కేరళలో కథకళి, బెంగాల్‌లో యాత్రలు, మార్వార్‌లో గంధర్వగానం. అదేవిధంగా ఇతర ప్రాంతాల్లో కూడా, ఈ యక్షగాన రచన వేర్వేరు పేర్లతో వ్యవహరింపబడుతోంది. యక్షగానం అనేక పరిణామాలు చెంది చివరకు నృత్య నాటకంగా రూపొందింది. క్రీ.శ. 12వ శతాబ్దం నాటికే పాల్కురికి సోమనాధుని 'పండితారాధ్య చరిత్ర'లో యక్షగాన ప్రశంస ఉంది. అదే విధంగా శ్రీనాధుని రచనలతో "యక్షగాన సరణి" చెప్పబడింది. పదిహేనో శతాబ్దంలో రచింపబడిన 'క్రీడాభిరామం'లో "జక్కుల పురంధ్రి" గాన కళా ప్రావీణ్యం వర్ణింపబడింది. అయితే యక్షగానం మొదట గేయ రూపంగానే ఉండి నాటకంగా పరిణమించింది. అయితే ఆనాటి రచనలు ఏవీ లభ్యం కాలేదు.

పదహారో శతాబ్దం నాటికి కందుకూరి రుద్రకవి రచించిన 'సుగ్రీవ విజయం'. చక్రపురి రాఘవాచార్యుని 'విప్రనారాయణ' చరిత్ర సంపూర్ణ యక్షగాన స్వరూపాన్ని సంతరించుకున్న మొదటి రచనలు. అయినా, యక్షగానం ప్రబంధ రూపంగానూ, నాటక రూపంగాను ప్రదర్శన యోగ్యంగా పరిణమించినది. పదిహేడో శతాబ్దంలో తంజావూరు నాయక రాజుల కాలంలోనే రఘునాథ నాయకుడు, అతని కుమారుడు విజయరాఘవ నాయకుని కాలంలోనే యక్షగానం పరమోచ్ఛ స్థితిని పొందింది. రఘునాథ నాయకుడు 'రుక్మిణీ కల్యాణం' రచించాడు. విజయరాఘవ నాయకుడు (1633 - 1673) ఇరవైమూడు నాటకాలు రచించాడు. యక్షగానాన్ని నాటకమని పేర్కొన్నది కూడా విజయరాఘవ నాయకుడే! 'ప్రహ్లాద', 'కృష్ణవిలాసం' మొదలైన 23 నాటకాలు విజయరాఘవుకి రచనలు. విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి రంగాజమ్మ 'మన్నారుదాసు విలాసం' అనే యక్షగానం కూడా రచించింది. నాయకరాజుల తదనంతరం వచ్చిన తంజావూరు మహారాష్ట్ర రాజులు కూడా సంగీత సాహిత్య పోషకులు. వారి కాలంలో యక్షగానం ఎంతో రాజాదరణ పొందింది. ఆ రోజుల్లో మేలట్టూరు వెంకటరామశాస్త్రి రచించిన 'ప్రహ్లాద', 'హరిశ్చంద్ర' మొదలైన

యక్షగానాలు మిక్కిలి ప్రచారం పొందాయి. రామభక్తి సామ్రాజ్యంతోపాటు, సంగీత సామ్రాజ్యాన్ని కూడా ఏలిన వాగ్గేయకారులు శ్రీ త్యాగరాజస్వామి 'నౌకా చరిత్రం', - 'ప్రహ్లాద భక్తి విజయం' అనే యక్షగానాలు రచించారు. ఈనాడు కచేరీలలో కూడా గానం చేయబడుతున్న "వందనము, రఘునందనా...", "వాసుదేవయని వెడలిన దౌవ్వారి కుని కనరె..." మొదలగు కీర్తనలు పై యక్షగానాలకు సంబంధించినవే. రఘునాథ నాయకుని తండ్రి, అచ్యుతప్ప నాయకుని చేత సన్మానింపబడిన నారాయణతీర్థులవారు సంస్కృతంలో రచించిన 'కృష్ణలీలా తరంగిణి' - యక్షగానమే. శ్రీ నారాయణ తీర్థులవారు తెలుగులో 'పారిజాతాపహరణం' అనే యక్షగానం కూడా రచించారు.

కూచిపూడి నాట్యవేత్తలచేత, ప్రదర్శింపబడి ఆంధ్ర దేశంలో అనన్యమైన ప్రజాదరణ పొందిన 'భామాకలాపం' రచించిన సిద్ధేంద్రయోగి, శ్రీనారాయణ తీర్థుల వారి శిష్యుడనే జనశ్రుతి. 'భామాకలాపం' పదిహేడో శతాబ్ది ఉత్తరార్థం నుంచి ప్రదర్శింపబడుతున్నట్లు పండితాభి ప్రాయం.

'భామాకలాపం' ప్రదర్శనకు పూర్వమే కూచిపూడి భాగవతులుచే 'కిరాతార్జునీయం', 'గరుడాచలం', 'త్రిపుర సంహారం', 'గంగాగౌరీ విలాసం' మొదలైన యక్షగానాలు వ్యాప్తికి చెందిన ఘనత గ్రంథస్థమై ఉంది.

పంథొమ్మిదో శతాబ్దం నాటికి వందల సంఖ్యలో యక్ష గానాలు రచింపబడ్డాయి. వీధి నాటకం, ప్రబంధం, ఉలా ప్రబంధం, బొమ్మలాట, బయలాట, హరికథ, కలాపం, బుర్రకథ ఇత్యాదులు యక్షగానశైలికి సంబంధించినవే. వివిధ ప్రక్రియలుగా రూపొందిన ఈ యక్షగానాలలో ప్రయోగింపబడిన నాట్యం, సంగీతమూ కూడా 'దేశి' (దేశి అంటే జానపద) పద్ధతికి చెందినవి.

కూచిపూడి భాగవతులు ఈ యక్షగానాలను 'మార్గ' పద్ధతిలో ప్రదర్శించటంతో యక్షగాన ప్రక్రియ నూతనో త్తేజాన్ని పొందింది..

ప్రౌఢమైన నాట్యరీతిలో రాగతాళాత్మకంగా, రసవంతంగా యక్షగానం ప్రదర్శించడమే, 'మార్గ' పద్ధతి అనిపించు కుంటుంది. స్వర లయ ప్రయోగంలోనూ, నాట్యపరంగా



ప్రఖ్యాత నర్తకి బాలసరస్వతీదేవితో

నృత్తాభినయములలోను సక్రమమైన అవగాహన ఏర్పాడా లంటే సంగీత రత్నాకరాది లక్షణ గ్రంథాలతోను భరతముని ప్రణీతమైన 'నాట్యశాస్త్రం' వంటి శాస్త్ర గ్రంథాల పరిచయం అవసరం. లక్షణ గ్రంథాల ఆధారంతో ఉత్తమ గురువుల పర్యవేక్షణలో కఠోర సాధనతో మాత్రమే సాధించవలసి ఉంటుంది - మార్గ సంగీతం కాని, నాట్యపద్ధతికాని. మార్గ శైలి ప్రౌఢమైనదీ, నూతన ప్రయోగశీలమైనదీని.

కూచిపూడి భాగవతులు 'భామాకలాపం' ప్రదర్శించ

డానికి పూర్వమే, 'కిరాతార్జునీయం', 'గంగాగౌరీ విలాసం', 'త్రిపురాసుర సంహారం' వంటి యక్షగానాలు 'మార్గ' పద్ధతిలోనే ప్రదర్శించి ఉంటారని ఊహించవచ్చు.

యక్షగానం ప్రదర్శనం వైయ్యక్తికం కాదు, సామూహికం. మేళంలో ఉన్నవారందరికి 'మార్గ' పద్ధతి తెలిసి ఉండాలంటే అది ఒక తరంలో సాధ్యమయేది కాదు. అంటే కూచిపూడి భాగవతులు కొన్ని తరాల నుంచి శాస్త్రీయ సంగీత నాట్యాలలో సాధకులై ఉండాలి. అయితే ఆనాటి యక్షగానాలలోని దరువులలోని ధాతు రచన లభ్యం కాదు. ధాతువు అంటే గేయంలోని సంగీత భాగం. ప్రాచీన గేయ రచనలు వేటికీ మూలమైన ధాతు రచన కనబడదు. రాగతాళ సూచనలు మాత్రమే ఉంటాయి. అష్టపదులు, తరంగాలు, సదాశివ బ్రహ్మేంద్ర కీర్తనలు, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు వేటికీ మూలమైన ధాతు రచన లభ్యం కాదు. అందుచేతనే ఆయా ప్రాచీన రచనలు గానం చేసేటప్పుడు కూడా ఆధునిక సంగీతమే వినబడుతుంది. అంటే త్యాగరాజస్వామి కృతుల వరవడితో.

5. రజని - విశ్వవీణగేయ నాటిక సంపుటి ఉపోద్ఘాతం (1964) "పాశ్చాత్య దేశాల్లో ఆపెరాలు అంటే సంగీత నాటకాలూ, బ్యాలేలు అంటే నృత్యనాటకాలూ - రెండు ప్రక్రియలూ స్వతంత్రంగా ఒక దానితో ఒకటి - ప్రమేయం లేకుండా వర్ధిల్లాయి. 17వ శతాబ్ది ప్రాంతంలో ఇటలీలో అ - పెరాలు ప్రారంభించేదాకా పాశ్చాత్యదేశాల్లో సంగీత నాటకాలు పుట్టలేదు. భారతదేశంలో 12వ శతాబ్ది ప్రారంభంలో వెలసిన జయదేవుని ద్వారా మన దేశానికి అంతటికీ అన్ని ప్రాంతాలకీ ఈ నాటికీ ఆరాధ్యమైనగీత గోవిందం అనే మహా సంగీత నాటకం లభించింది - పద్మావతీచరణ చారణచక్రవర్తి' అన్న జయదేవుని ప్రజ్ఞాత్మకమైన బిరుదాన్ని బట్టి, అదివట్టి సంగీత నాటకమే కాకుండా నృత్యనాటకం అనికూడా గ్రహించవచ్చు. భరతనాట్య శాస్త్రానికీ అలంకార శాస్త్రానికీ గీతగోవిందం లక్ష్యప్రాయమై నాటినుంచి నేటి వరకూ పరమ ప్రామాణికమయింది"

రజని - విశ్వవీణగేయనాటిక సంపుటి ఉపోద్ఘాతం - 1964.

సంగీతపరంగా 'భామాకలాపం'లోని దరువులు ఉత్తమ వాగ్గేయకారుల రచనతో పోల్చవచ్చు. భైరవి, ముఖారి, సావేరి, కాంభోజి, కల్యాణి, తోడి, ధన్యాసి, ఆనందభైరవి మొదలైన చాలా సంప్రదాయ రాగాలు అతి సమర్థంగా ఆయా దరువులలో ప్రయోగింపబడ్డాయి. అంతేకాదు ఆయా దరువులలోని సాహిత్యం, సంగీతమూ కూడా నాట్యానుగుణ్యమైన గమన సౌందర్యం కలిగి ఉంటాయి. అయితే సక్రమమైన రాగ తాళ పరిజ్ఞానంతో గానం చేయని పక్షంలో ఆ దరువులకు సరియైన న్యాయం జరగదు.

నాట్యమేళ పద్ధతిలోనే రచింపబడిన మేలట్టూరు వెంకటరామశాస్త్రి 'యక్షగానం'లోని దరువులు కూడా 'మార్గ' పద్ధతినే అనుసరించినా కూచిపూడి దరువులు నాట్యపరంగా రసవత్తరములైనవిగా గ్రహించవచ్చును.

భారతదేశంలో రాధాకృష్ణుల శృంగారం వివిధ భక్త కవులు గానం చేయడంచేత మిక్కిలి ప్రచారం పొందినా ఆంధ్ర దేశంలో మాత్రం భామాకృష్ణుల శృంగారమే ఎక్కువ ఆకర్షించినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా తెలుగు నాట్యవేత్తల రసాస్వాదనకు ఆలంబనమైనది భామాకృష్ణుల శృంగారమే. అష్టవిధనాయికావస్థలను అభినయించడానికి సత్యభామే అనువైన నాయికగా వారు భావించి ఉండాలి. అందుచేతనే సిద్ధేంద్ర విరచితమైన 'భామాకలాపం'తో పాటు ఆంధ్ర దేశంలో అనేక భామాకలాపాలు, పారిజాతా పహరణాలు యక్షగానాలుగా రచింపబడ్డాయి. అసలు సత్యభామ పాత్రను అంత రసవంతంగా మొదట సృష్టించినది నంది (ముక్కు)తిమ్మనగారు. 'పారిజాతాపహరణ' ప్రబంధం రచించి శ్రీకృష్ణదేవరాయల వారికి, వారి దేవేరితో ఏర్పడిని కలహం, ప్రణయ కలహంగా మార్చగలిగేరు ముక్కు తిమ్మనగారు. నాట్యరీతిలో ప్రదర్శింపబడుతున్న భామా కలాపంలోని భామ ముక్కు తిమ్మనగారి సత్యభామ ప్రభావాన్ని పొందినదేమోనని అనిపిస్తుంది. 'భామాకలాపం' అష్టాదశ వర్ణముల వారిచే జానపద రీతిలో కూడా ప్రదర్శింపబడుతోంది. 'భాగవతం'గా ప్రచారం పొందిన ఈ 'భామాకలాపం' యక్షగానం బ్రాహ్మణుల చేత అధిక ప్రచారం పొందడం చేతనే బ్రాహ్మణ శాఖలన్నిటిలోన, 'భాగవతుల' ఇంటి పేరు కనిపిస్తుంది. దీనిని బట్టి భాగవతమేళ ప్రభావం సంఘంలో ఎంతటిదో గ్రహించవచ్చు.

'భామాకలాపం' తర్వాత కూచిపూడి వారు 'ప్రహ్లాద', 'ఉషాపరిణయం', 'రామనాటకం', 'గొల్లకలాపం' మొదలైన చాలా యక్షగానాలు ప్రదర్శించేవారు. 19వ శతాబ్దం నాటికి కూచిపూడి నాటకం ప్రజా జీవితంలో విడదీయరాని భాగంగా పరిణమించింది.

దగ్గరగా మూడు శతాబ్దాలుగా ప్రదర్శింపబడుతున్న 'భామాకలాపం'లో కీర్తి పొందిన ప్రాచీనుల గురించి తెలీదు. పందొమ్మిదో శతాబ్దం ఉత్తరార్థంలో మాత్రం శ్రీ వెంపటి వెంకటనారాయణగారు 'కలియుగ సత్యభామ'గా కీర్తింప బడ్డారు. ఇరవయ్యో శతాబ్దం పూర్వార్థంలో తాడేపల్లి పేరయ్యగారు, భాగవతుల లక్ష్మీ నరసింహంగారు, చింతా రామమూర్తిగారు, భాగవతుల విస్సయ్యగారు సుప్రసిద్ధులు.

ఒక విషయం మనం గుర్తుంచుకోవలసి ఉంది. కూచిపూడి నాట్యాభినయములకు ఆధారం భామా కలాపమే. 'భామాకలాపం'లో కథా ప్రాధాన్యం అంతగా లేదు. ఏక పాత్ర పాధాన్యం కలదే కలాపం. నాట్యదర్శికి నికషోపలం కూడా భామావేషమే. యక్షగానంలో కథాప్రాధాన్యం ఉంటూ అనేక పాత్రలు ఉంటాయి. ప్రావేశిక దరువులలో మాత్రం నాట్యం ఉంటుంది. కేవలం శృంగారరసమే కాకుండా కథా సరణిని బట్టి వివిధ రసాలు పోషింప బడతాయి. దరువులు నృత్త ప్రధానంగా నడుస్తాయి.

కూచిపూడి యక్షగానాలలో నాయక పాత్రధారులు - సుప్రసిద్ధులు - మహంకాళి శ్రీరాములుగారు. అలాగే మహంకాళి సత్యనారాయణగారు, హరి పున్నయ్యగారు. వేదాంతం రామక్రిష్ణయ్య, పసుమర్రం కొండలరాయుడు ప్రభృతులు.

ఇక స్త్రీ పాత్రలలో వేదాంతం వెంకటాచలపతిగారు, వేదాంతం జగన్నాథశర్మగారు, వెంపటి పెదసత్యంగారు, వేదాంతం రాఘవయ్యగారు సుప్రసిద్ధులు.

యక్షగాన రచనతో కూచిపూడి వారికి ఏమీ సంబంధం లేదు. ప్రదర్శనతో మాత్రమే వారి సంబంధం. 'భామా కలాపం' సిద్ధేంద్రుని రచన. 'ప్రహ్లాద యక్షగానం' వేదాల తిరునారాయణాచార్యులు 'తిరువెళ్ళిక్కేణి' రామానుజాచార్యులు రచించినది. అదే విధంగా 'ఉషాపరిణయం'

వీడ్కోలు



పోయిరావే కోయిలా
పోయిరావే కోయిలా
వీడుకోలే కోయిలా
వీడుకోలే
చివురు గుబురుల
గూటిలోన
దాగినావే కోయిలా!
చివురురసమును
చేదు చేదుగ...
త్రాగినావే కోయిలా!
తీయపాటల
హాయిగొలుపుటెగాని
కానరాని లేదోయి!!!
దెసల అంచున
నీదుపాట
తేలి కరగేనోయి
పసిమివెలుగుల
తోట నిలువున పులకరించేనోయి!!

'రజని గీతం

రెంటచింతల చిదంబర దీక్షుతులుగారు రచించారు.

యక్షగానాలే కాదు కూచిపూడి నాట్యాంశాలు దశావతారం, మండూక శబ్దం వంటి శబ్దాలు, అనేక కౌత్వాలు మొదలైనవి కూడా ఇతరుల రచనలే.

కూచిపూడివారి నాటకాలు ఉజ్జ్వలంగా ప్రదర్శింపబడుతున్న రోజులలో 1880 ప్రాంతంలో ధార్వాడ నాటక సమాజంవారు ఆంధ్ర దేశంలో హిందీ నాటకం ప్రదర్శించారు. ఆ నాటక ప్రదర్శనలోని నటనా విధానం, సంగీతం, రంగాలంకరణ మొదలైనవి ఆంధ్రదేశంలో ఎక్కువ

ప్రభావం చూపేయి. వివిధ నాటక సమాజాలు వెలిసి ధార్వాడ నాటక వరవడిలో ప్రదర్శించడం జరిగింది. ధార్వాడ నాటక కంపెనీ వారు ప్రదర్శించిన నాటకలలోని పాటల వరుసలను పార్శీ మెట్లు అనేవారు. ఆ పాటల వరవడితో తెలుగులో కవులు పాటలు రాయడం ప్రారంభించారు. మన తెలుగు నాటకాలలో పాటల రచయితలుగా పాపట్ల కాంతయ్యగారు, దైతా గోపాలంగారు ప్రసిద్ధులు. కాలక్రమేణా తెలుగు నాటకాలలో మరాఠీ సంగీతం బాణీ జనాదరణ పొందింది.

మహారాష్ట్ర నాటకాలలో స్త్రీ పాత్రధారి గాయకులు అయిన బాలగంధర్వ, మాస్టర్ కృష్ణారావు మొదలైన వారి పాటలు మక్కికి మక్కిగా తెలుగు నాటకాలలో పరివర్తన చెందాయి. తెలుగు స్టేజి నటులలో కపిలవాయి రామనాథ శాస్త్రి, పారుపల్లి సత్యనారాయణ, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, తుంగల చలపతిరావు, కె. రఘురామయ్య, మొదలైనవారు మహారాష్ట్ర సంగీత ప్రభావంతో జనరంజకమైన స్టేజి గాయకులుగా ప్రసిద్ధి పొందినవారు. 'గయోపాఖ్యానం', 'చిత్రనళీయం', 'శ్రీ కృష్ణతులాభారం', 'పాదుకా పట్టాభిషేకం', 'పాండవోద్యోగ విజయాలు' మొదలైన పౌరాణిక నాటకాలు, 'చింతామణి', 'రంగూన్ రౌడి', 'వర విక్రయం', 'కన్యాశుల్కం' వంటి, సాంఘిక నాటకాలు, 'భక్త రామదాసు', 'సక్కుబాయి' వంటి భక్తి నాటకాలు ప్రజాభిరుచిని స్టేజి నాటకాల వైపు మళ్ళించాయి. ఎంతో కాలంగా యక్షగానాలు చూస్తున్న తెలుగు ప్రజలను ఈ కొత్త నాటకాలు విపరీతంగా ఆకర్షించాయి. ఈ స్టేజి నాటకాలలో నాట్య ప్రాధాన్యం లేకపోయినా, పాత్ర పోషణం, ఆహార్యం, సంగీతం ఒక కొత్త రుచిని కలిగించాయి.

స్టేజి నాటకం ప్రాదుర్భావంతో హరిప్రసాదరావు, ముంజులూరి కృష్ణారావు, డి.వి. సుబ్బారావు, బెల్లంకొండ సుబ్బారావు మొదలైన నాయక పాత్రధారులు, ముప్పిడి జగ్గరాజు, ఉప్పులూరి సంజీవరావు మొదలైన స్త్రీ పాత్రధారులు ప్రజాహృదయంలో నిలిచిపోయారు. స్టేజి నాటకాలు బళ్ళారి రాఘవాచార్యులు, స్థానం నరిసింహారావు, గోవిందరాజుల సుబ్బారావు, మాధవపెద్ది వెంకటరామయ్య వంటి మహా నటులను దేశానికి అర్పించాయి.

స్టేజి నాటకాలలో పాటలు మరాఠీ బాణీలో ఉన్నా, పద్యాలు మాత్రం శాస్త్రీయ సంగీత రాగాలలోనే పాడేవారు. అద్దంకి శ్రీరామమూర్తి, కపిలవాయి రామనాథశాస్త్రి, పి. సూరిబాబు, శాస్త్రీయ రాగాలలోనే చదివేవారు. శ్రీ సి.ఎస్. ఆర్. ఆంజనేయులు, శ్రీ కె. రఘురామయ్య వారి స్వంత శైలిలో పద్యాలు పాడేవారు. చివరకు స్టేజి నాటకాలలో పాటలు అంతర్ధానమై, పద్యాలు మాత్రం మిగిలేయి. స్టేజి గాయకులుగా బహుజనాదరణ పొందిన వారు తుంగల చలపతిరావు, దాసరి కోటిరత్నం, పి. రామతిలకం, కన్నాంబ.

20 శతాబ్దం ప్రారంభంలో గ్రామ్‌ఫోన్ రికార్డుల యుగం వచ్చింది. ఆనాటి ప్రసిద్ధ శాస్త్రీయ సంగీత విద్వాంసుల సంగీతంతో పాటు స్టేజి గాయకుల పద్యాలు, పాటలు, హరి కథలు, చివరకు హాస్య పాటలు కూడా రికార్డయాయి. ఆనాటికి కూచిపూడి నాటకాలు, వారి దరువులు తిరుగు ముఖం పట్టిపోయాయి. కూచిపూడి సంప్రదాయపు దరువులు మచ్చుకు కూడా రికార్డు కాలేదు. ఈ పరిస్థితులలోనే సంఘసంస్కర్తలు వ్యభిచార నిర్మూలనకు ప్రచారం చెయ్యడంతో ఆనాటి వరకు నృత్యగానాలు వృత్తిగా తీసుకున్న దేవదాసీలు, కళావంతులు సాంఘిక తిరస్కారానికి లోనయ్యారు. అంతేకాదు, హరినాశ్రయించిన నృత్యగానాలు కూడా చిన్నచూపు చూడబడ్డాయి. ఈ పరిస్థితులలో కూచిపూడి నాటకాలు వాటి విశిష్టతను కోల్పోవడం జరిగింది. వారి నాటకాలలో నాట్యధర్మి వెనకబడింది. స్టేజ్ నాటక ప్రభావం కూచిపూడి నాటకాల మీద కూడా పడి సంప్రదాయక యక్షగానశైలికి గ్రహణం పట్టింది. సాంస్కృతికమైన ఈ పరిణామ దశలో కూచిపూడి నాట్యకళను సజీవంగా నిలిపిన ఘనత పూజ్యులు వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి గారిది. అదే విధంగా యక్షగానం సంప్రదాయాన్ని, దరువులలోని సంగీతాన్ని భద్ర పరచినవారు మాన్యులు శ్రీచింతా వెంకట రామయ్యగారు, వారి పుత్రులు శ్రీ చింతా కృష్ణ మూర్తిగారు. శ్రీవేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రిగారు నాట్య ప్రధానమైన ప్రవేశ దరువుల, తరంగం, శబ్దం, కౌత్వం మొదలైన సాంప్రదాయక నాట్యాంశములను పునరుద్ధరించి, కూచిపూడి శైలి వ్యక్తిక పద్ధతిలో స్త్రీ లోకంలో వ్యాపించజేసి, నాట్యశైలికి కొత్త ఆకర్షణ కలిగించారు. మద్రాసులో వీణాధనమ్మాళ్ కటుంబానికి చెందిన సుప్రసిద్ధ



'రజని వాగ్గేయకార చరిత్ర'కు కేంద్ర సాహిత్య అకాడమీ (1961) బహుమతి - డా. రాధాకృష్ణన్ చేతుల మీదుగా

అభినయకారిణి బాలసరస్వతి, శ్రీలక్ష్మీనారాయణశాస్త్రిగారి శిష్యురాలవడం తన అదృష్టంగా ప్రకటించారు.

ఇంతలో అనగా 1930 ప్రాంతం నుంచి తెలుగు సినిమా ఆవిర్భవించి దినదిన ప్రవర్ధమానమవుతున్న తరుణంలో కూచిపూడి నాట్యవేత్తలు కూడా తెలుగు సినిమాలలో నృత్య దర్శకులుగా స్థిరపడడం జరిగింది. కాలక్రమేణా ప్రముఖ కవులు, గాయకులు, నాట్యవేత్తలు, నటకులు మొదలైన కళాకారులందరికీ సినిమా పరిశ్రమ ఆశ్రయించడమే తమ అస్తిత్వం రుజువు చేసుకునే మార్గంగా పరిణమించింది. సినిమాలో రచన చెయ్యడమే కవుల లక్ష్యం. సినిమాలో పాట పాడితేనే వారి పాటకు సార్థకత. సినిమాలో నృత్య దర్శకత్వమే నాట్యవేత్తల పరమాదర్శంగా పరిణమించింది.

సినిమా అన్నది ఒక పరిశ్రమ. ఆర్థికమైన విజయం దాని ధ్యేయం. సంగీతం, నాట్యం, కవిత్వం మొదలైన కళలను దాని అవసరమైనంత వరకే అది వాడుకుంటుంది. కళల యెడల ఉత్తమ అభిరుచిని కల్పించవలసిన బాధ్యత దానికి లేదు. ఏది ఉత్తమ అభిరుచి అన్నది వేరే ప్రశ్న. అంతేకాదు కళాపరమైన సాంప్రదాయపు విలువలను గుర్తించవలసిన అవసరం కూడా దానికి లేదు. అయితే చాలామంది ఉత్తమశ్రేణికి చెందిన కవులు తమ స్వకీయమైన కవితా ప్రవృత్తికి భంగం కలగకుండానే కవితాపరమైన సినిమా అవసరాలను తీర్చగలిగారు. అలాగే, తమిళ సినిమాను జగత్తులో ప్రథమంగా ఉత్తమ శ్రేణికిచెందిన సంగీత విద్వాంసులు ప్రవేశించినా వారి శాస్త్రీయ వారసత్వాన్ని వదులుకోలేదు. తెలుగు సినిమాలలో మాత్రం గాయకులుగా గుర్తింపబడిన వారు స్టేజి గాయకులే!

కాలక్రమేణా సినిమా అవసరాలకు తగిన నేపథ్య గాయకులు ఏర్పడ్డారు. కాని నాట్యం విషయంలో అలాగ జరగలేదు. ముఖ్యంగా తెలుగు సినీరంగానికి చెందిన నాట్యవేత్తలు తమ కళయొక్క చరితార్థత సినిమా పరిశ్రమలోనే గ్రహించగలిగారు. వారివలన సాంప్రదాయ కళకు లాభము, నష్టము కూడా కలగలేదు. అయితే ఒకటి, సినిమా పరిశ్రమలో స్థానం దొరికితే, ఆయా కళాకారులకు తగిన ఆర్థిక భద్రత ఏర్పడింది. ఆ రోజుల్లో సంగీతం, నాట్యం, కవిత్వం

వృత్తిగా చేసుకోవడమనేది ఒక సాహసం. కళాకారులందరూ కీర్తి ప్రతిష్ఠలు కలిగినవారు కూడా ఆర్థికంగా దైన్యం అనుభవించేవారు. సినిమా పరిశ్రమ చాలామంది కళాకారులను ఆర్థికంగా ఆదుకుంది. వాళ్ళు ధైర్యంగా తల ఎత్తుకుని తిరిగే అవకాశం కలిగించింది.

దేశం స్వతంత్రమైన తర్వాత పరిస్థితులు మళ్ళీ మారాయి. సంప్రదాయ కళల యెడల తిరిగి అభిమానం ఆసక్తి ఏర్పడ్డాయి. ముఖ్యంగా మన నాట్యం, సంగీతం విదేశీయుల్ని ఎక్కువ ఆకర్షించింది. చాలామంది విదేశీయులు మన సంగీత నాట్యాల సాధనకు పూనుకున్నారు. సంప్రదాయ కళల నూతన వికాసం ప్రారంభమైన దశలో కూచిపూడి నాట్యం, కూచిపూడి నాటకం పునరుజ్జీవనం పొందాయి. స్వయంగా సుప్రసిద్ధ స్టేజి నటుడైన శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారు ఎంతో మమకారంతో శక్తివంచలేని ప్రోత్సాహన్ని కూచిపూడి శైలికి కలిగించారు. కూచిపూడి సంగీతశైలి పునరుద్ధరింపబడింది. విజయవాడ రేడియో వారు కూచిపూడి నాటకాలలోని దరువులను సంస్కరించి రికార్డ్ చేశారు.

దక్షిణ దేశంలో ప్రముఖ నృత్యరీతులు భరతనాట్యం, కర్నాటకలో యక్షగానం, ఆంధ్రలో కూచిపూడి, కేరళలో కథకళి ఊహించలేని విజయాన్ని సాధించాయి. ఈ విజయానికి వెనక భరతనాట్యానికి మాన్యులు రుక్మిణీ అరుండేల్, కథకళికి వల్లతోల్ నారాయణ మేనన్, యక్షగానానికి కరంత్, కూచిపూడి నాట్యానికి వెంపటి చినసత్యంగార్ల అవిరళ కృషి, చిత్తశుద్ధి, నాట్యకళల యెడల తమకు గల మమకారం కారణం అనడం అతిశయోక్తికాదు.

శ్రీ చినసత్యంగారికి వృత్తిగా సినిమా సంబంధం కలిగినా, ప్రవృత్తిగా ఆయన సాంప్రదాయ కళకే అంకితమయ్యారు. సాంస్కృతిక కేంద్రమైన మద్రాసులో వివిధ సాంప్రదాయ నాట్యరీతులను పరిశీలించడానికి ఆయనకు అవకాశం కలిగింది. ఆయా సంప్రదాయ నాట్యరీతులను తులనాత్మకంగా పరిశీలించి తన జీవిత ధ్యేయమూ, గమ్యమూ కూచిపూడి నాట్యకళోద్ధరణమే అని గ్రహించారు.

కూచిపూడి నాట్యానికి, కూచిపూడి యక్షగానానికి అపూర్వమైన, శాస్త్రీయ శైలిని, సౌందర్యాన్ని నిరూపించిన కళాతపస్వి శ్రీ చిన సత్యంగారు. కూచిపూడి నాట్యోద్ధరణకు వారి కృషి సర్వతోముఖమైనది. కూచిపూడి శాస్త్రీయమైన నాట్యరీతిని నిరూపించడానికి ఆయన చేసిన తపస్సు అనన్యమైనది. అనేక నూతన నాట్యాంశాలు సృష్టించారు. సంప్రదాయ శైలిని నిరూపించే అనేక జతులను, (అంగహారములను) నిర్మించారు. ఆయన గురుత్వంలో శతాధికమైన ఉత్తమ నాట్యవేత్తలు సృష్టింపబడ్డారు. నాట్యశిల్పంలో అపూర్వమైన గాంభీర్యము, వైశ్యాలము కూచిపూడి నాట్య సంప్రదాయానికి సంక్రమింపజేశారు. కూచిపూడి నాట్యశైలికి శ్రీచిన సత్యంగారు సాధించిన మరొక ఘన విజయం. ఆయన నిర్మించిన నృత్యనాటకాలు. 'శ్రీ కృష్ణపారిజాతం', 'క్షీరసాగర మధనం', 'కుమారసంభవం', 'శాకుంతలం', 'విప్రనారాయణ చరిత్రం', 'మేనకా విశ్వామిత్రం', 'పద్మావతీ శ్రీనివాసం', 'కల్యాణ రుక్మిణి', 'హర విలాసం', 'శివధనుర్భంగం' వంటి నృత్యనాటకాలు రూపొందించడం న్యాయంగా ఒక తరంలో జరిగే పని కాదు. శ్రీ చిన సత్యంగారు నిర్మించిన నృత్యనాటకశిల్పం అపూర్వమైనది. సాహిత్యము, సంగీతము, నాట్యము త్రివేణీ సంగమంగా సమ్మిళితమయాయి. ఆయన నిర్మించిన నృత్యనాటకాలలో కవితామయమయిన పాత్ర చిత్రణ, రసోచితమైన సంగీత శైలి, సర్వోత్కృష్టమైన నాట్యశిల్పం వారి నాటకంలోని విశిష్టతకు నిదర్శనాలు.

ఈనాడు సంప్రదాయ సంగీతం ఎడల, నాట్యం ఎడల అపూర్వమైన శ్రద్ధాసక్తులు గమనించగలుగుతున్నాం. ముఖ్యంగా యువత ఈ కళల యెడల చూపుతున్న భక్తిశ్రద్ధలు సంగీత నాట్యకళల ఉజ్జ్వల భవిష్యత్తును సూచిస్తున్నాయి. శాస్త్రీయ సంగీతం సార్థకంగా, రసాత్మకంగా అనుభవించాలంటే నృత్య నాటకమే చక్కని ఆలంబనం. అంతేకాదు, మార్గ కళారీతికి ప్రత్యేకమైన నృత్యనాటకం, రాగ తాళ పరిజ్ఞానమూ, సదృష్టి ప్రయోగ కౌశల్యము కలిగిన విద్వాంసులను వివిధ సన్నివేశాలకు రసాభానువాగుణ్యమైన సంగీత రచనకు ప్రోత్సహిస్తూ ఉంది. సంగీతము, సాహిత్యము, నాట్యము ప్రత్యేక శాఖలుగా, దేనికది ప్రదర్శన యోగ్యంగా రూపొందినా, సాంప్రదాయకమైన ఈ కళల సమాహార రూపమైన నృత్య నాటకమే రసాత్మకంగా భవిష్యత్తులో నిలుస్తుందని భావించవచ్చును. ✪

రజని కూర్చిన సంగీత వరుసల ప్రత్యేకత

- కేతా ప్రియంవద

సంగీత ప్రపంచంలో లలిత సంగీతానికి ఒకవిశిష్టమైన స్థానం వుంది.

"రజని కూర్చిన సంగీత వరుసల ప్రత్యేకత"ను గురించి వ్రాయుట మంటె జగమెరిగిన సత్యాన్ని మరోసారి తలచుకొన్నట్లువుతుంది.

శాస్త్రీయ సంగీతము కన్నను, లలిత సంగీతమును కూర్చుట చాలా కష్టము.

భావానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి, సర్వులు మెచ్చదగు విధముగా రాగమును జతకూర్చటమంటే సామాన్యమైన విషయంకాదు.

భావతాదాత్మ్యం, రాగస్వరూపం, లయ, తాళ గతులను తగురీతిని సాహిత్యమునకు సంగీతమును కూర్చుట మహాద్భుతం.

కళాప్రపూర్ణ శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారి లలిత సంగీత రచనాశిల్పం. రసరమ్యభావలావణ్యాన్విత కవితం! ప్రప్రధమ లలిత సంగీత నిర్దేశకత్వమును గావించిన గాయకులు శ్రీ రజని బాబయ్యగారు. ప్రతి స్వరమునకు, రాగమునకు గల జీవములను పుణికి పుచ్చుకొని సాహిత్య పదాలకు తొడిగి, చిరకాలము తలచుకొనగలిగిన మాధుర్యము నందించగల నేర్పు, తీర్పు గలిగిన గాయాకోత్తములు శ్రీరజని.

> రజని - విశ్వవీణగేయ నాటికల సంపుటి ఉపోద్ఘాతం. (1964) "పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం మన ఆధునిక సాహిత్యంలో అనేక కొత్త అందాలను తీర్చుకొన్నది తెలుగుగేయం. జాతీయములైన రగడలు మొదలయిన మాత్రా ఛందస్సులలో నుండి ముత్యాలసరాల వంటి గేయాలను గురజాడవారూ వారి ననుసరించిన వారూ చాలా మంది నవ్యకవులు రచించారు."

ప్రతి ఒక్క స్వర రచనకు ఓ ప్రత్యేకతను సంతరించుకొనగల సౌందర్యము గలిగినది... శ్రీరజనీగారి లలిత సంగీతం.


శాస్త్రీయ పద్ధతిలో నిర్మల మందాకినిలాగను జానపద శైలిలో పిల్లగాలులు, సెలయేరుల సోయ గములను, జాతీయ గీతములలో ధీర, గంభీర తత్వములను...

నాయకానాయకీ భావములలో... నవ్రమతాను నయనర్తనములను సంగీత - వరుసలలో చిత్రించి శ్రోతల మనములను మైమరపింపజేయగల వాగ్గేయకారులు శ్రీ రజని.

వీరి లలిత సంగీత భావ చిత్రములు ప్రతి హృదిని పరవశింపజేయగల... ప్రమోదాకృతులు

వీరి స్వర ప్రస్తారములు, విస్తార ప్రయోగములు స్వరసమ్మేళనావృతములు అద్భుతకల్పితములు "పసిడి మెరుంగుల తళతళలు" అను శ్రీ రజనిగారి స్వంత రచనలో వీరి స్వరరచన "గౌతమి కృష్ణల గలగలలు"గా అవతరింపజేసిన అమృతత్వం ఆనందభరితం.

అర్ధశతాబ్ది గడచినా యింకనూ వినూత్న శోభలతో మారుమ్రోగుచున్న వీరి భావ సౌందర్యలహరి "శతపత్ర సుందరి" "ఇదెజోతనీకిదెజోత" అను వీరి రచనలోని సంగీత



ఎస్.పి.బి.కె. పట్టాభిరామారావు, గోపాలరెడ్డి, మోటూరి నిర్వహించిన అభినందన సభలో
వెనుక వరసలో గిడుగు సీతాపతివారు

రచనాశైలి వంగదేశీయుల సంగీతపు రుచులను ప్రస్ఫుటింప జేస్తుంది.

"ఎవరూ కేక విని రాకపోయినా సరే" అను వీరి స్వంత రచనలో రవీంద్ర సంగీతమును జతచేసిన ఘనత శ్రీ రజనీగారిది మాత్రమే.

"మేఘసందేశం" సంగీత రూపకంలో అషాఢ మేఘాన్నుద్దేశించి ఏడాది ప్రవాసియగు యక్షుడుని గురించి గానం చేసిన రచనకు సంగీతశైలి మహోన్నతం. విన్నవారి హృదయాలు వేదనలో చలింపక తప్పదు. మేఘ రంజని రాగంలో కూర్చబడిన వరుస అది.

"మేఘసందేశము"లోనిదే మరొక రచన "నీకు మాత్రము కాకపోయినా". "ఆ వసంతమ్మటు లెగడచెను".. అంటు ప్రేయసి నుద్దేశించి యక్షుడు పాడినపాట కాంభోజి రాగంలో స్వరపరుపబడినది. శ్రోతల హృదయాలను స్పందింప జేయగల అత్యద్భుతమైన వరుస అది.

ఇటువంటి సంగీతమును సృష్టించగల వాగ్గేయకారులు నూటికి కోటికి ఒక్కరుగా కూడా వుండరేమొ.

ఎందుకంటే సంగీతానికిగల శక్తి సంభరితానురక్తి, మహామహోన్నత రసస్ఫూర్తిని గలిగి అలరారే వీరి రచనలు అపూర్వములు

శ్రీ రజనీగారి మరో రచన "మహేశ్వరి మహాకాళి" అనే గీతానికి శివరంజని రాగంలో అత్యుత్తమ సంగీతాన్ని సమకూర్చారు. వింటుంటే ఆ తల్లి సాక్షాత్కరిస్తున్నట్లే వుంటుంది. అటువంట్ భావుకత తాదాత్మ్యంతో స్వర పరచటం అనితరసాధ్యం.

జాతీయతా భావం వుట్టి పడే మరో గేయం "దేశమును ప్రేమించుమన్న" శ్రీగురజాడ వారి గేయం జాతీయ గీతాన్ని స్వరపరచిన తీరులో ఒక సున్నితమైన సందేశాన్ని అందిస్తున్నట్లే వుంటుంది. ఖరహరప్రియ రాగ రంజకత్వాన్ని పూర్తిగా పొందుపరచిన అమోఘమైన గీతం అది.

శ్రీరజనీగారి స్వంత రచన "మాదీ స్వతంత్రదేశం" అనే గేయంలో భారతదేశస్థుల చిరునామాను వివిధ రంగులతో చిత్రించిన చిత్రంలా కన్నులకు కట్టినట్లే వుంటుంది. ఆ రాగ వరుస.

ఏ రాగంలో స్వరచిత్రణ చేసినా ఆ గీత స్వరూపం వినేవారి కన్నులకు కట్టినట్లు భావమును, మనస్సునకు హత్తుకొనే రూపును దిద్దగల ప్రావీణ్యము గలిగి యుండుట... శ్రీ రజనీగారి లలిత సంగీతం.... ఎందరెందరో కళాకారులకు, సంగీత దర్శకులకు మార్గదర్శకత్వమును గలిగినది. వీరి లలిత సంగీత నిర్వహణము.

"స్థలమున జలమున సమీరణమ్మున... అనలాకాశములందున్" (అను వీరి స్వంతరచన "విశ్వవీణ" సంగీత రూపకము లోనివి) అను విధమున విశ్వమంతటిని పునీతము చేయగల సామవేద సారామృతపాన నిరతులగుచు స్వరపరచిన రజనీ గారి సంగీతం సర్వులకు సమ్మోదకరం.

భారతదేశ సంగీత ఖ్యాతిని మాత్రమే కాక విదేశీ సంగీతపు పద్ధతులను, వరుసలను కూడా శ్రోతలకు పరిచయం చేసిన అత్యుత్తమ సృష్టి శ్రీ రజనీగారిది.

సంగీతజ్ఞుల నుండి సామాన్యులవరకు ఎందరెందరి ప్రశంసలనో అంది పుచ్చుకున్న ప్రతిభామూర్తి శ్రీ రజనీకాంతరావు గారు.

ఇంకనూ ఎన్నో ఎన్నెన్నో రచనలు సంగీత రచనలు వున్నను నాకు తెలిసినవి మాత్రమే వ్రాయగలిగాను.

మహా గాయకుల చేత వీరి స్వర రచనలు గానమొనరింపజేసి, సంగీత సారథ్యమును వహించి ఆకాశవాణి దూరదర్శనుల ద్వారా ప్రసారము చేయించి శ్రోతలను మంత్రముగ్ధులను గావించిన గాయకోత్తములు శ్రీ రజని గారు

శ్రీ రజనీకాంతరావుగారి లలిత సంగీత సరస్వతీ శిల్పమును గురించి తెలియవలసినది తెలుసుకొనదగినది ఎంతో వున్నప్పటికి నేను వ్రాసినది నాకు తెలిసినది చాల కొద్దిగా మాత్రమే.

ఇట్టి తపస్సంపన్నులకు
నమస్సులనర్పిస్తూ ✪

మయూరీ!



నటన మాడవే మయూరీ
నటన మాడవే!

కటి యిటు నటు కదలియాడ
చిరుపదాలు చిందులాడ
వంపుల మెడ సొంపు లొలుక
ఇంపుగ గళమెత్తి పాడి ॥నటన॥

చల్లని తడిగాలిపిల్ల
మెల్లగ నిను తాకెనుగా
రెక్కల సందున నేదో
చక్కిలిగింతాయెనుగా ॥నటన॥

ఆకసంపు టంచు దాటి
పైకి పైకి ప్రాకివచ్చు
నీలిమబ్బు దుప్పటాన
తేలియాడు కలలలోన ॥నటన॥

ఉరుములసడి మెరపులవడి
చినుకులజడి తాళముగా
సరస నీసఖుడు పురివిడి
వన్నెలకన్నులచూడగ ॥నటన॥
నటన మాడవే మయూరీ
నటన మాడవే!

రజనీగీతం

చండీదాసు

(ప్రణయ జీవియైన ఒక వంగ కవి జీవిత కీర్తనం)

'రజని'

పాత్ర పరిచితి :

చండీదాసు : ఆదర్శశీలి, రాధాకృష్ణ భక్తుడు, కవియైన యువకుడు, నకులదాసు : ఆయన సోదరుడు, విశాలాక్షి ఆలయంలో అర్చకుడు. రామిని : చండీదాసునకు ప్రేమ పాత్రురాలైన రజకిని. ఆలయదాసి. పూజారులు, ధర్మకర్తలు, సాంఘికులు, రజక జనం...

పూర్వ రంగం


బృందగీతి : ప్రేమగానము; ప్రేమగానము
సకల జగదభిరామ గానము!!
ఆదికవి వాల్మీకి కోకిల
అమృత మంజుల సామగానము!!
రామగిరి వని దివ్య వంశీ
విరహపూరిత భవ్యగానము!!
నాట్యదాత్మ సఖీ పదాంకిత
నవ్యతమ జయదేవగానము!
రజకినీ ప్రియుడైన చండీదాసు
విశ్వప్రణయ గానము!!
ప్రేమగానము; ప్రేమగానము;
సకల జగదభిరామగానము!!

ఒకటో రంగము

(నన్నూరా గ్రామంలోని విశాలాక్షి దేవాలయం, గర్భగుడిలో శంఖధ్వానం, ఘంటానాదం - ఆవరణలో సన్నాయి, మంటపంలో పూజారులు)

బృందగీతి : త్వాం నమామో వయం మాతరమ్;
త్వాం నమామో వయం మాతరమ్ !!
అళినీలాలక చుంబిత నయనే!
లలిత మధుర హాసాంచిత వదనే;
హసితచ్ఛవి సంకాశితరదనే!!
దిగంత సరిత ప్రణవరూపిణి
అనంత అచల ప్రణయగాయని
త్వాం నమమో వయం మాతరమ్;
త్వాం నమామో వయమ్!!
(పరిక్రమిస్తాడు)

మధుదాసు : చండీ; చండీ;
దేవి సేవించుటకు మించిపోవు వేళ
సజ్జ చేబట్టి పూదోట పజ్జనిల్చి



వెర్రిగానమ్ముతో దృష్టి వ్రేలవైచి
ఒక్క కుసుమమ్మయిన
కోయకుంటివేల?

చండీదాసు : (నిమీలిత దృష్టితో తన్మయుడై)
తలపు తెరల డోలల నూగుమనసే
చెలిమికలల జోలలతోగు సాగసే
పాడి, మనికి స్వర్గముగాగ
గడిపివై తును
గడియ గడియ మాధవు ప్రేమగాధ
ఒడలు మరచు రాధిక తీయబాధ;
పాడి, జగమె బృందావనిగ సలిపి వైతును
గడియ గడియ మాధవు ప్రేమగాధ;

(దూరం నుంచి నేలవూడ్చే రజక కన్య - రామిని)

రామిని : తెరువరులు లేని బాట
మరపునకు రాని పాట...

పూజారి : ఏలాలతవలె ఊగెదవేలా;
రాలోనికి రావయ్యా చండీ;
రజకిని చూపులదారి మసలకు
బ్రహ్మజన్మ, ధర్మము నేమరకు;

రామిని : (నేల వూడ్చుతూ ప్రవేశం)
తెరువరులు లేని బాట
మరపునకు రాని బాట
కరవునకు నెండు నోట
కురియు నమృతంపు నూట

చండీదాసు : (ఆమె నెదుర్కొని)
ఓహో తరుణాశాజ్యోతీ;
నీహారసదృశమే నీ గీతి
దీనాన న వగు ఓనాతీ;
మానసమున కలిగెను ప్రీతి

పూజారి : అలనొకగ రజకిని పాడే, ఆ
వలపు పాటపై వ్యాఖ్యలవేల?
చేరువగా పోబోకు సుమా!
దూరమయ్యేదవు కులదేవతకు;

రామిని : మీరెవరో మహా మాన్య;
నేను పేద రజక కన్య -
వలపు బరువు తలపులచే
మీదు తేనె పలుకులచే
భయమున నా మది కలంగు,
ప్రియమున నా యెద చెలంగు;
సరస నిలువ రాని దాన,
క్షమియింపుడు పోవుదాన.

చండీదాసు : మాధవ మధు మురళీధ్వని
రాధాన్వేషణలో...
యుగ యుగాలు జగజగాలు
వేచి వేచి తిరిగి తిరిగి
బృందావనమందే, కాళిందీ తీరమునందే
సఫల మనోరథ కాంచె
మాధవ మధుమురళి;

- కొందరు సాంఘికులు వృద్ధులు కలకలంతో చరచర వస్తారు. -

సాంఘికుడు : పతిత జనములతోడ సంభాషణమ్ము
ధార్మికుడ; మాను, పాప సంధాయకమ్ము
ప్రేమ పేరిట మతి నీతి నీమ ముడిగె;
చాలు కుహనా కవిత్వ సంస్కార మింక

రామిని : (వెనుకకు తప్పుకుంటూ)
స్వామి, పేదదాన మీదు
చదువు లెరుగనట్టిదాన
పూజ్య కృపావీక్షణాల
బ్రదుకు గడపు దాసురాల
సహజము, నా దోస మేదొ
క్షమా పాత్రమో కాదో;
స్వామి, పేదదాన, నన్ను
క్షమియింపుడు పోవుదాన;

చండీదాసు : జ్యోత్స్నా తరళిత తరంగిణీ రజనీ,
మత్స్వప్నాశయ దివ్యరాగిణీ తరుణీ;
విజన మదీయ హృదయ గృహ తారానారీ;
రజకినీ రూప మాధురీ; నవకిశోరీ

- సాంఘికుల కలకలం హెచ్చుతుంది

రామిని : (మళ్ళీ మోకరిల్లుతుంది)
దివ్యమైన మీ సన్నిధి
పేదనైన నా పెన్నిధి
తెలియని నా మదిని రేగి
కలలెవో జడులయి మూగు;
మీరు వలపు తెరువరులో,
అమృత మాను సురవరులో;
ఊపిరాడనీక కురియు
ఈ పరిమళముల బరువు
ఓపలేను, కరగి పోదు,
ఒరగిపోదు మీ యడుగుల;
ఎదలోపలి యెదలో యే
నదులో కదలి పొంగి మీ

పదాబ్జముల పయికి జారి
మెదలగోరు నిది దోసమొ?....

- తిరస్కార సూచకంగా సాంఘికుల కోలాహలం -

సాంఘికులు : దోసమే రజకినీ వృథాయాసమేను
అధమ సంజాత, వాతని దగ్గజన్మ
కాన తత్పదచ్ఛాయ యందేని నిలువ
తగవు; కట్టుకథల చెల్మి కెగయలేవు!

చండీదాసు : ప్రణయ లేఖలలో ప్రేయసి రాధిక
ప్రేమికుడే మాధవుడు!
ప్రణయశక్తి రాధిక జగన్మాత
ప్రేమమూర్తి మాధవుడు జగత్పిత!
ఓ జగద్వ్యాపినీ! రజకినీ రూపిణీ
జగజ్జననీ! అనంత ప్రేమఖనీ!
నీ శీతల చరణ తలమ్మే శరణమ్మోయి
దివ్యతన్వీ!

- సాంఘికుల కలకల -

బృందగీతి : కలవంశీ స్వర ధునులో
మలయానిల మధురిమలో;
ఝురులై పొరలుచు పులకించున్
విరులై యురలుచు సొలయించున్;
యువసౌరభ మదరుతులో
నవభావోజ్జ్వల గతులో;
అళులై పాటల తమకించున్
అలలై ఆశల నెమకించున్;
హిమ మౌక్తిక తరళిమలో;
తరుణాశల అరుణిమలో;
నెలలై అమృతము లొలికించున్
కలలై కోర్కుల మొలిపించున్!

రెండో రంగము

- పక్షుల కలరవాలతో ప్రాతఃకాలపు వెలుగుల్లో రజకవాటిక.
ఊత పదంతో - రేవులో - బట్టలుదుకుకొనే రజకజనం. -

బృందగీతి : తొలుసంజ విరిసేటి పూవా, నువ్వు
మలు సంజనే వాడిపోవా;
మురికి మడుగున కన్ను విడిచావే, సిరికి
సిరమెక్కి సిపమెక్కి నడిచావే;
కతలు కబురులు సత్తె మంటావు; నువ్వు
వెతల పా లౌదు వేమంటావు?
వెలుగు చీకట్లు మరిచావా, నీకు
కలుగు నిక్కట్లు తలిచావా!

- తన గృహము ముంగిట -

రామిని : ఈ పేద పూవలపు లే పగిది చేరునో
ఆశాలను దాటి ఆ ప్రభాకరమూర్తి
॥ఈ పేద॥
వలపేది తలపేది మరపున నశించునో;
అలము నాశల వెలుతురుల ప్రశోభించునో
॥ఈ పేద॥
పంకజాంగనకు అక లంక తేజోఘనుని
అంకపీఠము కోరు టడియాసయే యేమొ!
॥ఈ పేద॥
మసలు సూర్యుని మంట
విసురులో నుసి యౌనో
ఎసగు ప్రేమజ్యోతి కొసల నైక్యమె యౌనో!
॥ఈ పేద॥

- దూరము నుండి చండీదాసు కేక -

చండీదాసు: రామినీ,రామినీ! పూర్ణిమా యామినీ
ధవళ కాదంబినీ తరళ చ్ఛదనలోల
నయనకల్లోలినీ!

రామిని : పిలిచారే ఠాకూరు;

తలపున వలపులు మీరు
కన్నుల అశ్రులు రాలు
కనగలనా ఠాకూరు?
చండీదాసు: (దూరమునుంచే)
రామినీ, రామినీ! (దగ్గరగ వచ్చి)
పూర్ణిమాయామినీ!
కనలేనే చెలి కనలేనే
నయన సుమదళము పయిని హిమకణము
వినలేనే చెలి వినలేనే
మందమధురరుతియందు విధురగతి
వినలేనే చెలి వినలేనే!
చెలిమి కలిమి నెదలో నలత
కలలోపల లోకము కలత
బ్రతుకు బ్రతుకే బరువై... కరవై
కనలేనే... కనలేనే...
రామినీ, రామినీ!...
కనలు కమలమ్ము తుహినాంబు
కణములందు
రవికరస్పర్శనంది చిర్నగవు చిందు
వదనశశి జూచి బాష్పాంబువార్ధి యెగయు
వార్ధి కదలాడి యెగయదో వదనశశియు...
రామిని : ఎంతదయో! ఎన్నాళ్ళకు! ఆహా! ఠాకూరు రాక;
ఇంత దీనురాలి ననుగ్రహించినారు నేడైన,
దాసిని పీడకుడు, విశ్రమింపు డిదిగొ
తరుశాఖ;
సరసనెన్నడు మీరు నిలిచి యున్నారో;
ఒరసి చూపుల చూపు లొల్కుచున్నారో;
ఇరుల త్రోసి హసించు వెలుగు కన్నానె;
వలితెమ్మెరల పాటలాలాసె;
చలువ వెన్నెల రేని తళతళలు పొలసె
మనసులోపలి వెతల జడివాన వెలిసె;
మూకపడి ముడుగు నా స్వరము;
ఠాకూరు రాకలో తియ్యకలవరము;
చండీదాసు: జీవననందినీ! జీవననందినీ!
నీ, మందహాస చంద్రరేఖ
స్పందనా వికాసమందు విందుగ
క్రొందళ్ళులెన్ని చిందె;
జీవన నందినీ, జీవన నందినీ...
నీ, సుందర నయనాళి యుగళి
మంద్రగాన రవళియందు విందుగ
క్రొందేనెలొన్ని చిందె;
జీవననందినీ, జీవననందినీ...
నీ, చందన నిశ్వసన పవన
బృంద మృదువిలాసమందు విందుగ
క్రొందావులెన్ని చిందె;
జీవననందినీ, జీవననందినీ...
ఇద్దరు : మనప్రేమ
సస్య సౌందర్య భూములలో
ప్రభవించి ప్రభవించి
నమ్రమరు సీమమగునో
కమ్ర సుమధామమగునో;
మన ప్రేమ...
కల్లోలినీ తరంగములన్
పయనించి పయనించి
శీర్షసికతాద్రి యగునో
పూర్ణకలశాబ్ధి యగునో;
మనప్రేమ...
కాలగాఢాగ్ని కీలలలో
తపియించి తపియించి
దగ్ధ తరుకాండ మగునో
ముగ్ధ మధుభాండ మగునో;
మనప్రేమ...
దీర్ఘ ఝంఝా మారుతములన్
ప్రసరించి ప్రసరించి

విరహ నిశ్వాసమగునో
సరస దరహాసమగునో;
మనప్రేమ....
సువిశాల గగన వీథులలో
విహరించి విహరించి
ప్రణయ స్వేచ్ఛాభ్రగామి యగునో
నిరవధిక సౌఖ్య ధాని యగునో!

(రజకవాటిలో రజకబృందపు గొంతులలోనుండి - ఉండి ఉండి... 'తొలుసంజ విరిసేటి పూవా నువ్వు మలుసంజనే వాడిపోవా' అనే బృందగీతి దూరంనుంచీ క్రమంగా దగ్గరై వినవస్తుంది.)

మూడోరంగము

- గర్భగుడిలో - చిరుగంట గణగణ వాయిస్తూ దేవతార్చనలో నిమగ్నుడైన నకులదాసు -

నకులదాసు : ఆదిశక్తీ : దేవీ :
వేదత్రయీ మూర్తీ :
భర్మసంకాశినీ :
నిర్మలాత్మ ప్రభాభాసినీ :
హేజననీ :
పతిత దీన క్షమాసంగినీ
ప్రేమాంతరంగిణీ :
పావనీ :

- : ముందు వాకిట కలకలముతో సాంఘికులు : -

సాంఘికుడు: అహహ: దేవీచరణశిలు డహరహమ్ము;
ఆదిశక్తి సమర్చనాభ్యాసపరత
గర్భగుడియందె, ధర్మభంగమ్ము చేయు
భ్రాతృ ధౌర్త్య ముపేక్షించు వ్యర్థమమత
గర్భగుడియందె ఔరౌర కాలమహిమ;

- నకులదాసు చేతిలోని దేవతార్చన గంట జారి క్రిందపడుతుంది -

నిత్యకర్మవ్యతిక్రామి నిందితపథ
గామి నేటితో నర్చాధికార మెడలు;
నేటితో నాత్మ సంఘ సాన్నిధ్య మెడలు;
ఇదియె ధర్మజ్ఞ సమితి విధించు శాస్తి;
ఇదియె ధర్మద్రుతు డనుభవించు శాస్తి;

అందరు : చండీదాసు స్వధర్మపాలనకు వెలి;
చండీదాసు స్వసంఘలాలనకు వెలి;

- భేరీ మ్రోగుతుంది - తొట్రుపాటుతో నకులదాసు -

నకులదాసు : శరణు శరణు ప్రశాంత దాంత
స్వాంతులారా:
శరణు శరణు :
మీదు దూషణ భాషణమ్ముల కేనె
బాధ్యుడు:
బాలు డాత డపరిణతుండు :
ఉద్వేలమౌ భావగతి నాపగ చాల డాతడు :
బాలు డాతడు :

1. సాంఘి : బాల్యాప్రౌఢి, వయస్సా
కల్యారూఢియు నభేదకలితంబులు, దౌ.
శ్శీల్యా చరణంబున దౌ
ర్బల్యానీత స్వకర్మభంజన మందున్

2. సాంఘి : అధ్యాత్మ పరత్వము చెడు
మిథ్యేంద్రియ లాలసత్వ మహికా పథికుల్
వధ్యులె కాకుండినచో
సాధ్యమె ధర్మంబు పృథివి సాగుట
కెటులున్...

నకులదాసు : ఎరుగమిని చేయు తప్పే జీవితమ్మెల్ల
తరిమి సాధింపగా తగవగునె ధర్మాత్మ
పొరబడిన దుర్బలుల సరిచేయగా వెరవె
కరుణింపరో కృపామహితాత్ములార :

సంఘవృద్ధు : కఠిన దండనకాని మార్గ మ్మొకటి
కలదు ప్రాయశ్చిత్త కర్మమ్మె :

దేవి సన్నిధి దివిజ తర్పణ
కర్మదీక్షితు డౌచు సత్పథ
గమనమునకై ప్రతిన పట్టిన
సవ్యముగ నా పైని నడచిన
సాంఘిక స్వత్వమున కర్తృత
సంఘటిల్లును, సంఘవృద్ధులు
సమ్మతింతురు, సంతసింతురు :

నలకులదాసు: భాతృ ప్రేమార్ద్రమౌ ఆశలే
నా హృదిని కలుగు;
మహిత సంఘ ప్రేమ పాత్రుడై
నా భ్రాత మెలగు;
మాతృసేవా ప్రసవ మాన్యుడై
ధన్యుడై చెలగు;
పతిత దీనక్షమాసంగినీ,
ప్రేమాంతరంగిణీ, జననీ;

అందరు : దిగంత సరిత ప్రణవరూపిణే,
అనంత అచల ప్రణయగాయని;
త్వాం నమా మో వయం మాతరమ్;

నాలుగో రంగము

- సాంఘికులు శాసనం వల్ల సమాగమానికి వీలులేక, తపిస్తూన్న రామినీ చండీదాసుల వియోగ వేదన. -

బృందగీతి : ఎవరు విన్నా రెవరు కన్నారు;
రాధికా ప్రణయమ్మునకు సాటి
మాధవుని ప్రేమమ్మునకు సాటి;
ఎడలు రెండూ ఏకమన్నారు! ఎవరు!
గడెవియోగమె సై చమన్నారు!
తమ సమాగమ మింక ముగిసేనా
తనువొరసి ఉసురులే యొగసేనో! ఎవరు!
చందురుని చెంగలువ వలచేని
చాతకము జలధరుని తలచేని
చలి తుపానుల కలువ మడిసేని;
చాతకము దాహార్తి సుడిసేని;
చందురుడు చెంగలువ జూచేన?
జలధరుడు చాతకము గాచేన?
ఏటికో యీ క్షణిక ప్రణయాలు
సాటిలేనిది రాధ ప్రణయమ్మె;
సాటిలేనిది కృష్ణు ప్రేమమ్మె! ఎవరు!
తేటివలపే మేటి అంటావ?
పూవు వలపే పొగడబోతావ?
పూవు కొరకై తేటిరాదేని,
తేటికొరకై పూవు పోయేన?
ఏటికో, యీ క్షణిక ప్రణయాలు;
సాటిలేనిది రాధ ప్రణయమ్మె;
సాటిలేనిది కృష్ణు ప్రేమమ్మె;

(రజక వాటిలో రామిని వలపోత)

రామిని : కురియదేలో ప్రజభువిలో
మధుమురళీ సుధాఝరీ;
యమునదరిన్ తమ మలమెన్
పిలుపులెవో కలచు నెదన్
శ్వసనవినా తృషిత మహిన్
నీరవతా, విరాగతా;
విరహవ్యథా విదాహమో;
నిదాఘమో; నిరయమ్మో;

(ఆలయములో చండీదాసు తలపోత)

చండీదాసు: నా మురళి
మధుర శ్రుతుల పలుకదే!
నా హృది
సుధాధారలను చిలుకదే!!
కోకిలకు
మూగవోయెనొ కంఠరవము!
కేకికి
ఆగిపోయెనో నాట్యజవము!!
నా మురళి

మధుర శ్రుతుల పలుకదే!!
చీకటులు
మూకముసురుగ రగిలెనే;
ఘూకరుతి
వ్యాకులత కెదపగులునే!!
నా మురళి
మధుర శృతుల పలుకదే,
(రజకవాటిలో రామిని వాపోత)

రామిని : దాసికానా ప్రాణబంధూ
న న్ను దాసింతువే ప్రేమసింధూ;
ఆశలే సురిగి తూలెవో; ఆకాశమే విరిగి
కూలేనో!! దాసికానా;
చెలికై తపించు ఏకాకి, మనికి,
ఆకలిలో నశించు వడసోకి;
హృదయమ్ముపై రాలు రువ్వు, లోకమ్ము
అదయమౌ వెడనవ్వు నవ్వు; దాసికానా;
చంద్రుడే యిరులలో దాగె, జగము
తంద్రలో కనుమూసి తోగె;
బృందావనికి నీవు రావో, మధుర
మందానిలము లింక లేవో;
దాసికానా ప్రాణబంధూ;
న న్ను దాసింతువే ప్రేమసింధూ;

- బయట ప్రళయంగా ఝుంఝూమారుతం వీస్తూంటే ఆలయంలోపల కరగిపోయిన గుండెతో చండీదాసు -

చండీదాసు: ప్రియతమా; గాఢాంధకార బంధుర రాత్రి
గగనమ్ము కాలమేఘాచ్ఛన్న మీ రాత్రి
నలుగడల తాపసంకులమౌ మనస్సులో
అలముకొను పాపపంకిలమౌతమస్సులో
వలచికొన్నాను నా కరుణానిధిని నిన్ను
పిలిచికొన్నాను;
దరికి రాబోవు నీదారి కంటకితమ్ము
తలుపు గడెవైచి హేళన చేయు సంఘమ్ము
కుటిలలోకమ్ము ప్రేమ కృపా దరిద్రమ్ము;
జటిల ధర్మ వివాద జడితమ్ము
హృదయమ్ము
క్రూరమగు లోక ధర్మము నెదుర్కొనలేను
కోరికగు ప్రణయ జీవిక నందుకొనలేను;
గగనమ్ము కాలమేఘాచ్ఛన్న మీ రాత్రి;
ప్రియతమా; గాఢాంధకార బంధుర రాత్రి;

- ప్రకృతి ఒక్కసారిగా కొన్ని క్షణాలసేపు శాంతిస్తుంది ఒక సంఘ వృద్ధుడు వోదార్పుగా చండివద్దకు చేరుతాడు -

సంఘవృద్ధు : వేళమించె కన్నులు తెరువుము
విశాలాక్షి పదములనొరగుము;
చిరుత హృదయ మారాటమ్మున
పొరలు గ్రమ్మె ధర్మ మ్మొడలను
వంత లుడుపు ధర్మమార్గము -
శాంతియుతము ధర్మజీవిక;

- దూరాన సన్నాయి, మంత్రఘోష -

ఐదోరంగము

- ఆలయంలో, సన్నాయి, ఘంటానాదం వినవస్తుంటాయి -

బృందగీతి : ప్రణయ పరిశుద్ధుండు
చండీదాసు ప్రాయశ్చిత్తమంట;
వలపుతాపసియైన మాధవు
మనసె కల్మష కలితమంట;
చెలిమికై తపియించు రామిని
చిరుత హృదయము వ్రేల్చుమంట
మలిన ధర్మప్రోక్తలౌ
ఆచార్యవర్యులె కర్తలంట;
ప్రణయ పరిశుద్ధుండు
చండీదాసు ప్రాయశ్చిత్తమంట

(దూరాన రుంయిమని బరువైన గాలి యీల, రజక వాటినుండి పరుగెత్తివస్తూ రామిని)

రామిని : ఎడద పగులునో, బ్రదుకెరగులునో
విరహజీవికే - యే విధిని గడచునో
మరపుటిరులలో, మరిగి సురుగునో
చదివిన నరులే, అదయహృదయులో -
తెలివి మరుగులో, వలపు తలపరో?....

(రుంయిమని వినబడే పవన రోదనమును చీల్చుకుని రామిని ఆర్తారావం వినబడుతుంది)

రామిని : ప్రణయమూర్తి ప్రాయశ్చిత్తమో;
ప్రేమికార్తి లోకోత్పాతమో;

(దేవాలయంలో, ప్రాయశ్చిత్త మంటపం - మంత్రఘోష)

అర్చకులు : జయ విశాలాక్షి! జయ విశాలాక్షి
దేవ్యై నమోస్తు దివిదేవ గణార్చితాయై
భూత్యై నమోస్తు భువనార్తి వినాశనాయై
శాంత్యై నమోస్తు శరణాగత రక్షణాయై
క్రాంత్యై నమోస్తు దురితక్షయ కారణాయై

(సుదూరంలో రామిని ఆర్తనాదం)

రామిని : ప్రాణాధికా! ప్రాలుమాలికా;
ప్రళయ ఝంఝ వీతెంచునిదే;
ప్రణయ శక్తి విజృంభించు నిదే!

- అర్చకులు బిగ్గరగాను - వెంట - చండీదాసు మందంగా అలస్యంగాను - మంత్రపాఠం. -

అర్చ, చండీ: ధర్మ ప్రకాశినీ! భర్మ సంకాశినీ!
మహాపాపినం స్వధర్మచ్యుతం
మాంశోధయ పరిశోధయ;
మాంపాలయ ప్రపాలయ
భావి సౌశీల్య ప్రతిజ్ఞాతారం
మాం రక్షయ పరిరక్షయ!

- ఆత్రంగా పరిగెత్తివస్తూన్న రామిని గొంతు దగ్గరవుతూంది. -

రామిని : ప్రాణపతీ! ప్రణయైకమతీ!

- మంత్రపాఠం అర్చకులు మాత్రమే - పరధ్యానంగా వెంట అనుకరించని చండీదాసును హెచ్చరిస్తూ - నొక్కి నొక్కి చదువుతుంటారు. -

అర్చకులు : భావి సౌజన్య ప్రతిజ్ఞాతారం
మాంపాలయ ప్రపాలయ!

(హెచ్చరికగా తిరిగి అదే చదువుతారు.)
(ప్రాయశ్చిత రంగంలోకి రామిని వచ్చివేసింది.)

రామిని : ప్రాణపతీ! ప్రణయైకమతీ!

పళ్ళెములు పాత్రలు దభాలున వదలివేసి ఆచార్యుల హాహాకారాలు లెక్కచేయక చండీదాసు వచ్చి రామిని పాదాలవద్ద మోకాళ్ళపై వ్రాలిపోతాడు.

చండీదాసు: ప్రణయినీ; రామినీ!
స్నిగ్ధతేజో ధామినీ, దివ్యభామినీ!
శాశ్వతైకైక సౌధర్మ్య స్వరూపిణీ;
చకితరవి శశి తారకా ప్రభావ్యాపినీ!
చరణచారణ సకల దివిజ మనుజావళీ;
నిరుపమ ప్రేమినీ!
వరప్రేమ గాయని, వాసంతదాయిని;
విశ్వసుందరి, వేదమాత, గాయత్రీ!

(ప్రాయశ్చిత మంటపంలో - సాంఘికుల ధన్యవాదాలు.... ధిక్కారాలు - ఛీత్కారాలు - కల్లోలంనుండి వెలువడి చండీదాసు, రామిని కలసి ప్రస్థానము, ఆలయ ప్రాంగణంలో)

ఆచార్యులు: తక్కువ వెలంది వేదమాతగ నుతించు;
విజ్ఞ సంఘంబులోననే విప్లవంబొ
వెర్రితలలొ ఘటిల్లెడు పీనికతన
ఈ క్షణమె - ధర్మ పతితుడౌ నితడు జన్మ
భూమినుండ ననర్హుడై పోవుగాక!

నకులదాసు : అగ్రజుని స్నిగ్ధ హృదయమ్ము వ్రీల్చితివోయి
అనుజ అనుజా పోవుదువా, పోవుదువో
తండ్రి!
పోవుదువో తండ్రి, పోయితివా;

దేవీ, విశాలాక్షి - ఓ విశ్వ హృదయినీ
భగ్న హృదయుడను, విభ్రాతృకుడ
లోగొనుమమ్మ!
(గుండె పగిలి కూలిపోతాడు)

సాంఘికుడు: వంశమును సంఘమును గురువరుల ధిక్క
రించు పాపి, ఆత్మ భ్రాతృ ప్రేమమణిని
కాలదన్ను నారకలోక గామి - అరిగె;
సంఘమున కొక యెడ సుప్రశాంతి గలిగె
ప్రేమఖని నకులాచార్యు హృదియె ప్రీల
సర్వలోకమ్మునకును విషాదమయ్యె!

(జనసందోహం క్రమంగా తగ్గుతుంది)

ఉత్తర రంగము

బృందగీతి : మాధవదేవుని మధువనము జగము
రాధారమణీ జీవనము :
ప్రణవ వికంపిత పవనాలింగిత
తరుకుంజలతాకరము :
ప్రణయ కదంబిత మధుకర చుంబిత
ప్రసవ సౌరభాకరము :
మదశకుంతరవ మధు ప్రభాతము
హృదయ రాగమంజరీ విభాతము :
గ్రీష్మవికాస విచికిలోచ్ఛ్వాసము
ఉష్మాగమ వంశీ నిశ్వాసము :
జలధర మర్మర దౌత్యోల్లాసము
చలద్వినర్తక చపలాహాసము;
శశికర సుషమాలస విన్యాసము
శిశిర తుషార విహార విలాసము;
రాధా మాధవ ఖేలనము జగము
బాధా ఖేదో న్మూలనము;

(మహాప్రస్థానంలో - చండీదాసు, రామిని ప్రణయతరణిపైని)

రామిని : నినువీడి మనుదునే నాథ; నా
మనికి కనువెలుగీవె కాద;
ఒరగి నీ యెడదనే మెదలి; నే
కరగిపోయెద మేను వదలి;

చండీదాసు: నిను వినా, దేవి; నాకమ్మైన వలతునే
క్షమియింపవో - ధర్మ జడితుదోషము ప్రియా
కలల లోకపు టంచు మెరసి నీవై వెలసె
వలపు తెరువరి యెడద సొలసి తీవలు
మలసె
తెలివి మరుగున దాగి వలపు నెరుగని
భూమి
నిను వినా, దేవి; నాకమ్మైన వలతునా?
మనికి స్వర్గ మ్మెపుడు కాదు;
జగము బృందావనము కాదు;
మనమె స్వర్గము సఖి;
మనమె బృందావనము!

రామిని : నీ రాధికను నేనె!

చండీదాసు: నీ మాధవుడ నేనె!

ఇద్దర : మనమె స్వర్గము ప్రియా!
మనమె బృందావనము!

(ఆశాంచల అవధిలో మహాప్రస్థాన ప్రణయ నౌకలో)

ఇద్దరు : ప్రియా, నడవనీ మన ప్రణయ నౌక -
వేగ గడవనీ లోకమ్ముదాక!
మనకు కాల మొకటే వెల్గు రేక
ఎడద లేకమై సోలు నందాక
ప్రియా! నడవనీ మన ప్రణయనౌక!

బృందగీతి : ప్రణయఖేలలో ప్రేయసి రాధిక
ప్రేమికుడే మాధవుడు!
ప్రణయశక్తి రాధిక జగన్మాత
ప్రేమమూర్తి మాధవుడు జగత్పిత!
రజకినీ ప్రియుడైన చండీ
దాసు విష్వ ప్రణయగానము!
ప్రేమగానము, ప్రేమగానము!
సకల జగదభిరామగానము!

వాడితగ్గని సంగీత ప్రతిభ

— డా॥ వింజమూరి సీతాదేవి

మా రజనీ అన్నయ్యకు ఎనభై ఏళ్ళంటే నమ్మలేక పోతున్నాను. ఇప్పటికీ అతను స్పిరిట్స్‌లో ఎనిమిది సంవత్సరాల వాడే. మా నాన్నగారు లక్ష్మీనరసింహారావు, మా మామయ్య కృష్ణశాస్త్రి వెంకటపార్వతీశ కవులలో ఒకరయిన బాలాంత్రపు వెంకట్రావు బాబయ్య పిఠాపురాన్ని తమ పీఠంగా చేసికొన్న సమకాలపు కవులు, పండితులు, రచయితలు. ఈ సన్నిహిత కుటుంబాలను అనుబంధపు పాశాలలో బిగించినవి సాహిత్య సంగీతాలు. వారంతా మనసు కలిసిన మిత్రులు. ఇది వంద సంవత్సరాల క్రితం మాట. అదేవిధంగా వారి అడుగుజాడల్లో మా అన్నయ్య ప్రభాకరు, నళినీ అన్నయ్య రజని అన్నయ్య వారి చెల్లాయి, మా అక్క అనసూయ, నేనూ ఎంతో స్నేహంగా ఉండే వాళ్ళం.

మా రజని అన్నయ్య భార్య సుభద్ర నేనూ చిన్ననాటి స్నేహితులంకూడా. కలిసి ఆడుకునేవాళ్ళం. మేకల్ని పట్టుకోవటం, మేకలను తోలేవాళ్లచేత తిట్లు తినడం మరచి పోలేదు. వీధులమ్మట పరుగులు, పాటలతో మాటలతో ఎంత ఆనందంగా గడిపామో! అలా ఒకరోజు, వానలో తడిసి ఆడుతుంటే చూసి, "చినుకు కన్నియల పరికిణీ చెంగున, చెంగున మెరిశాయె చిన్ని ముత్తెసరులు - టిప్ టాప్. టాప్" అనే పాట, పాడుతూ రాసేశాడు రజనీ అన్నయ్య. అది రేడియోలో ముందుగా పాడిన ఘనత మాకు చెల్లింది. ఇంకా మా సోదరీమణులం రజని గేయాలను ఎన్నో పాడాము. అలాగే 1938లోనే "వలపు తేలుదునో" అనే గేయాన్ని సోలో గ్రామఫోను రికార్డు ఇచ్చాను. రెండోవైపున భమిడిపాటి వారి గేయం "సందే చీకట్లో" రికార్డయింది.

1938లోనే మద్రాసు ఆకాశవాణి కేంద్రం ఆరంభ మయింది. అది మా సోదరీమణుల గీతాలతోనే ప్రారంభం. తరువాత మా మామయ్య కృష్ణశాస్త్రి రాసిన 'వసంతోత్సవం' సంగీత రూపకానికి అన్నయ్య సంగీతం నిర్వహించింది. కాకినాడలో పాటల రిహార్సల్స్. రజనీ అన్నయ్య ప్రయా గలతో కలిసి పాడటం ఒక చిత్రమైన అనుభూతి.

నేను హైదరాబాద్‌లో రేడియో కేంద్రంలో జానపద సంగీత ప్రయోక్తగా పనిచేసినపుడు రజని కూడా అక్కడ ఉద్యోగం చేశారు. చాలా సంవత్సరాలు ఆయన కార్య క్రమాల్లో నేను, నా జానపద సంగీత కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే వాళ్ళం.

రజని పేరుగల వాగ్గేయకారుడు. రచన సంగీతం ఆయనకు కలిసే తర్వాయి. ఎంకిపాటల సుబ్బారావుగారికి కూడా అలాగే వచ్చాయి. ఎంకిపాటలు. అయితే నండూరి వారికి సంగీతం అంతగా తెలియదు. ఇదేవిధంగా మామయ్య కృష్ణశాస్త్రి కూడా తాను అనుకున్న భావానికి, ఏదో పద్యంలాగో, పాటలాగో పాడేస్తూ వుండేవాడు' - తన రచనల్ని. ముఖ్యంగా బ్రహ్మసమాజ కీర్తనలు - "నా నోట నీ మాట" వంటి పాటలు అలా పాడుతూ ఉండేవాడు. "అవని అంతా పెద్ద అక్షయపాత్ర" అనే పాట. ఇలా ఎన్నో



'శతపత్ర సుందరి'లో పాటలను రికార్డు చేస్తున్న రజని. పాడుతున్న వారు వింజమూరి లక్ష్మి, టంగుటూరి సూర్యకుమారి (20 - 1 - 1956)

తాళం లేకుండా పాడేస్తూ ఉండేవాడు మామయ్య. వాటిని తాళబద్ధం, రాగబద్ధం చేసేది అక్కయ్య అనసూయ.

రజని అన్నయ్య, రాజేశ్వరరావు, పాలగుమ్మి విశ్వనాథం - ఇలా ఎంతోమంది మామయ్య పాటలకి సంగీతం కూర్చారు. ఆఖరికి నేను కూడా కొన్ని చేశాను. కాని రజని అన్నయ్య సంగీత వరుసలకు ఒక ప్రత్యేకత ఉంది. అతని పాటలు, వరుసలు ఎవరూ, ఏమీ మార్చలేరు. వాటిని అవగాహన చేసుకొని పాడటం కూడా కష్టం. అయితే వాటిని రేడియోలోనూ, బయటా పాడి పేరుతెచ్చుకున్నది మేమే. ఆయన సంగీత దర్శకత్వం వహించిన 'మానవతి' చిత్రంలో 'అందుకోండిదే, పూలచెండిదే' అనే పాట నేను పాడాను. ఈ చిత్రంలో బాలసరస్వతికూడా పాడింది. ఒక విధంగా ఆనాటి మద్రాసు రేడియోలో సంగీత ప్రధాన కార్య క్రమాలను, అనసూయా, నేనూ, రజనీ అన్నయ్యా గుత్తకు పుచ్చుకున్నాం. అనిపిస్తుంది. సాహిత్యపరంగానూ, సంగీత పరంగానూ రజని మేధస్సు, ఈనాటికీ వాడి తగ్గలేదు. ✪

నరుడు -

"నరుడు ధరిత్రీ సుకవీ
శ్వరుడను యుగధర్మముల ప్రవక్తను! నాకే
చరితను గడచిన పుటలను
తిరిగి తిరిగి చదువ మిగుల దిగులేకలుగున్!"

విశ్వవీణ సంపుటిలో రజని గేయనాటిక - శాంతి పథము (ప్రచురణ - 1964)

రజని వచన కవితాలహరి

— కె. రామమోహన రాయ్

శ్రీ బాలాంతప్రు రజనీకాంతరావు సంగీత సాహిత్య కళా కౌశలం జగమెరిగినది. స్వాతంత్ర్యోదమ కాలంలో, భావ కవిత్వపు వికాసదశలో, అభ్యుదయోద్యమంలో రజని కవిగా స్పందించారు.

శ్రీ రజనీకాంతరావు కవిత్వ రచన ప్రారంభించేనాటికే తెలుగులో వచన కవిత్వం ప్రారంభమైంది. 1930 తర్వాత తెలుగు కవిత్వపు బహిరాకృతిలో వచ్చిన మార్పు వచన కవిత్వం. ఛందో బంధాలను తెంచుకోవటానికి భావకవులు ప్రయత్నించినా వారు స్వేచ్ఛకై పరితపించారేగాని నియమాలను తెంచివేయలేదు. పద్యానికి ముందు వృత్తాలను సూచించే 'ఉ - చ - శా - మ' అని అచ్చువేయటం మానేశారు. అచ్చువేసే ఆకృతిని కూడమార్చారు - 4 పంక్తుల పద్యాన్ని ఒక్కోసారి 6,8 పంక్తులుగా కూడా అచ్చువేశారు - పద్యం పూర్తికాకపోయినా భావం పూర్తయితే అక్కడితో పద్యాన్ని ఆపివేశారు. ఈ స్వేచ్ఛతో సరిపెట్టుకోక శ్రీ దువ్వూరి రామిరెడ్డి, కవికొండల వెంకటరావు మొదలైనవారు దరిదాపు గద్యకవిత్వమన దగిన రచనలు చేశారు. దువ్వూరికి ఛందస్సంటే అపరిమితమైన గౌరవం ఉన్నది. యథార్థమైన కవిత్వమునకు అనివార్యముగా ఛందస్సు అనుగతమౌను. అని ఆయన విశ్వసించారు. ఛందస్సును ధిక్కరించటం ఆయన వుద్దేశ్యంకాదు. కాని కొత్తను వెదుక్కుంటూ ఆయన చేసిన ప్రయోగాలే వచన కవిత్వానికి తొలిరూపాలుగా కన్పిస్తున్నాయి. దువ్వూరి వారి యీ కొత్త రచనలు వచన గేయ రూపం గలిగినవేగాని వచన కవిత్వం కావు.

వచన కవితకు ఆద్యుడుగా పేర్కొనదగిన కవి శ్రీశిష్టా ఉమామహేశ. ఆయన 1930 ప్రాంతాల నుండి రాసిన వచన గీతాలు 1938లో 'విష్ణుధనువు' 'నవమి చిలుక' కావ్యరూపాలు ధరించాయి. మహాకవి శ్రీ శ్రీ రచనలతో వచన కవిత్వానికి ఎనలేని గౌరవం కలిగింది. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ తమ కవితలతో తెలుగు కవిత్వాన్ని తేజోమయం చేస్తున్న తరుణంలో రజని కవిత్వంలో కొత్తదనానికి ఆకర్షితులయ్యారు. సంప్రదాయాన్ని ధిక్కరించటంలో చొరవ చూపారు.

కవిరాజహంస 'వేంకటపార్వతీశ కవుల'లో బాలాంత్రపు వేంకటరావుగారి కుమారుడు రజని. భావకవితకు పరవశుడైన రజని కొన్ని మధురగీతాలు ఆలపించినా ఆ కవితతో పూర్తి సంతృప్తి చెందలేదు. 1937 - 40 సంవత్సరాల మధ్యకాలంలో రజని వాల్తేరులో, తెలుగు ఆనర్సు చదువుతున్న కాలంలో జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి రజనీకాంతరావుకు శ్రీశ్రీ మహాప్రస్థానం; పఠాభి 'ఫిడేలు రాగాలడజన్' కవితలతో పరిచయం కలిగించారు.

సమాజపు అస్తవ్యస్త పరిస్థితులు, శ్రీశ్రీ పఠాభి కవితలు తనను ప్రేరేపించగా రజని 'పూషా' కలం పేరుతో తానూ తిరుగుబాటు కెరటమయ్యారు. 'పూషా' అంటే సూర్యుడు. జగద్విఖ్యాతుడైన బెర్నార్డ్‌షాను Pooh - Pooh చెయ్యాలని తానీ కలంపేరు పెట్టుకున్నట్లు రజని ఇటీవల తెలిపారు.

పాట అంటే ప్రాణమిచ్చే రజని వచన కవిత్వాన్ని అభిమానించటం కాల ప్రభావం చేతనే. ఎరగని మొగాలు; కల్చర్; అండ్ : ఏనార్కీ; మధ్యాహ్నం; డెలీరియ్యం; కవితలు 60 సంవత్సరాల తర్వాత కూడా విశేషంగానే తోస్తాయి.

"నా చుట్టూరాయెందుకు వీళ్ళు
మెరగని మొగాల పరాయి వాళ్ళు!
వాళ్ళ గుంపులో యెందుకో నేను
యెరగని మొగంతో పరాయిగాను" అంటూ

సమూహంలో ఏకాంతాన్ని వర్ణించారు - 1980 తర్వాత తెలుగు కవితలో పొడసూపిన 'పరాయీ కరణ' బీజాలు 'ఎరగని మొగాలు'లో ఉన్నాయి.

"నారక్తాన్నే పీల్చేస్తారు / నా మాంసాన్నే దొల్చేస్తారు, దోచేస్తారు నా చుట్మారా యెందుకు వీళ్ళు!" అన్నకవి ఆవేదన ఇప్పుడైనా గుండె గూడు పట్లు కదిలిస్తుంది.

కల్చర్ పేరుతో చెలరేగిన అరాచకత్వాన్ని "మానవశుష్క కళేబరం పాలిటి వొక్కే మహా పెను కల్చర్! వొక్కొక్కడికీ యెవడికి వాడికీ / నాలుగ్గోడల నడిం ప్రపంచం! కల్చర్ - కంచం మంచం / యెవడికి వాడికి - యెవడిది వాడిది! మా ఇంట్లోనే వొక *Pooh - Shaw* వి, షర్వాని, నాదర్వాని? నీయింట్లో నువ్వొక *Go wells* వి, గోబెల్స్ వి, గోరింగ్ టాంగ్‌వి!" అని ఎద్దేవాచేశారు - సంప్రదాయానికి స్వస్తిచెప్పమని ఫర్‌గెట్ ఎవ్రీయస్టర్‌డే!" అని ఎలుగెత్తి పలికి ఆధునికతను ఆహ్వానించారు.

మధ్యాహ్నపు ఎండ తీవ్రతను "ఇది యెండిన మొండి మధ్యాహ్నం! మది యెండిన బండ మధ్యాహ్నం" అనటంలో రజని భావ ప్రకటన శక్తిమంతమైనదిగా నిలుస్తుంది.

అధివాస్తవికత తెలుగు కవిత్వంలో వింత అందాలు ప్రదర్శిస్తున్న కాలంలో రజని 'డెలీరియం' గీతం కాలాను గుణంగా వచ్చింది. "టిక్కెట్టు పారేసుకున్న ప్రయాణీకుడి హృదయ గంద్రగోళం / తీర్థంలో తప్పిపోయిన పిల్లాడి తల్లిగోల! ధర్త్రీమాతలో గాలివానలో చెట్టును పట్టుకు వేళ్ళాడే / కె.సి. ఓకేక! వర్షంలో నోరంతా తడిసి / నీరు జారుతున్నా తీరని ఉమాశశి దాహప్పిలుపు" - మనస్సును కుదిపివేసిన భావసంచలనాన్ని రజని యీ కవితలో వొడుపుగా పట్టు కున్నారు.



శ్రీ ఎల్.కె. అద్వానీ, బ్రాడ్‌కాస్టింగ్ మినిస్టర్‌తో రజని (బెంగుళూరు, 1977)

ఏది ఏమైనా రజని వచన కవిత్వాన్ని విడిచి పెట్టటమే మంచిదయింది. వచన కవిత్వరచన కొనసాగించి వుంటే శ్రీశ్రీ తరువాత వచ్చిన ఒకానొక వచన కవిగా మిగిలి పోయేవారు. "స్వైరిణి అన్నారు నన్ను శ్యామ సుందరా!": "విరిని చీల్చి మధువుతాపవే మోయీ?" లాంటి సుమధుర గీతాలు లభించి ఉండేవి కావు.

అర్థశతాబ్దికాలం తెలుగు లలిత సంగీతానికి రజనీ సహకారం లభించి ఉండేదికాదు - 'పూషా' కావ్యసంపుటి ఏటికి ఎదురీత. వచనకవితావికాసాన్ని గూర్చి తెలుసు కోవాలనుకొనే వారికి ఉపయోగకరమైనది.

పూషావచన కవిత కాలకవితా ప్రవాహంలో
ఉవ్వెత్తుగా లేచిన ఒక కెరటం మాత్రమే. ✪



రజనీగానం

– ఇంద్రగంటి జానకీబాల

1976 లో విజయవాడ రేడియో కేంద్రానికి డైరక్టర్‌గా వున్న బాలాంత్రపు రజనీకాంతరావుగారికి మరో కేంద్రానికి బదిలీ అయింది. ఆ సందర్భంలో ఆయన అభిమానులు, మిత్రులు ఆయనకొక వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. ఆ సభ ముగింపులో 'రజని' ఒక పాట పాడారు ఆ పాట పల్లవి.

"ఊరు విడచి వూరు - గడచి పోవు తీరు" -

అదేకాకుండా ఆ పాటకి తాను చేసిన హిందీ అనువాదాన్ని కూడా 'గావ్ఁ ఛోడ్‌కర్ గావ్ఁ జానా

కామ్ హమారా'..... అంటూ అత్యంత చక్కగా పాడి, ఎదురుగా కూర్చున్న ఆయన అభిమానుల్ని ఆనందంలో, కించిత్ విషాదంలో ముంచెత్తి వేశారు.

అంత క్రితం ఎన్నోసార్లు ఆయన కంఠం రేడియోలో వినివున్నప్పటికీ ఆ రోజు, ఆ పాట అందరికీ ఎంతో ప్రత్యేకంగా అనిపించింది.


ఆ తర్వాత ఆయన చేసిన ఒక కచేరి విన్నప్పుడూ, యు.కె.లో బర్మింగ్‌హామ్‌లో ఆయన పాడిన 'లలితసంగీత విభావరి' క్యాసెట్ విన్నప్పుడు ఆయన పాడే విధానంలో వుండే కొన్ని ప్రత్యేక లక్షణాలు నాకు అర్థమవుతూ వచ్చాయి.

రజనీకాంతరావుగారు, కృష్ణశాస్త్రిగారు రచించిన 'అతిథిశాల' సంగీత రూపకానికి సంగీతం కూర్చటమే కాకుండా అందులోని ప్రధాన పాత్ర (ఒమర్ ఖయ్యాం)ను పోషించి, పాడిన పాటలు వినడం కూడా నాకొక కొత్త అనుభవాన్ని చేకూర్చింది. రజనీగారు ఆయన స్వయంగా బాణీలు కూర్చుకుని, ఆయనే పాడినదానికీ, అవే బాణీలు బాలమురళీ, గోపాలరత్నం, ఓలేటి వెంకటేశ్వర్లు, జగన్నాథాచార్యులు మొదలైన వారు పాడటానికి వున్న తేడాని శ్రద్ధగా వింటే గమనించగలగడం. గేయ రచయితే పాట ట్యూన్ కంపోజ్ చేసుకుని తానే పాడితే అందులో చాలా స్వేచ్ఛ వుంటుందని రజనిగారి పాటలు వింటే అర్థమవుతుంది. -, రచయిత రాగాలు తీసుకుంటూ మాటలు పేర్చుకుంటూ, తనకి అనువైన, తన గళంలో బాగా పలికించగల సంగతులు వేసుకుంటూ పాటను పూర్తిచేస్తాడు. అప్పుడతనికి బోలెడు స్వేచ్ఛ. అదేకాక తన మనసులోని భావానికి హృదయలాలిత్యాన్ని జోడించి పలికించే వీలు చిక్కుతుంది.

ఇక్కడ 'రజని'ని రచయితగా కాక గాయకునిగానే విశ్లేషించదలచుకున్నాను.

గాయకునిగా ఆయన గొంతు మృదువైన ప్రేమ లాలిత్యాన్ని, ప్రణయభావాన్ని పలికించేదికాదు.

గాంభీర్యం, గమక ప్రీతి పలికించే విలక్షణమైన గొంతు. ఉద్రేకపూరితంగా, నిండుగా తన భావాన్ని ఆలపించటానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యం యిస్తారనిపిస్తుంది. పాడే టప్పుడు ఆయన భావప్రకటనలో ఆవేశం అంతా ఇంతా అని చెప్పనలవి కాదు. అలాంటప్పుడు శ్రోతలు ఆయన పాటలో మమైకమై పోతారు. ఒక్కొక్కసారి తాళం ఆయనకు భయపడి ఒదిగి నడవవలసిన సందర్భం కూడా ఏర్పడు తుంది. ఆయన కంఠంలో విలక్షణంగా పలికే ఒక 'జీర' బెంగాలీ గొంతులకను స్ఫురింప జేస్తుంది. బెంగాలీ సంగీత ప్రభావం వుంది ఆయన మీద. అది బాణీలు కూర్చడం లోనూ, పాడటంలోనూ మనకి కనిపిస్తుంది. కర్నాటక సంగీత రాగాల పాండిత్యం, బెంగాలీ సంగీత లాలిత్యం ఆయనకి తన గొంతులో పలికించటం యిష్టం. అదే కాకుండా మధ్య ప్రాచ్య అరబిక్ సంగీతం లోని విచిత్రమైన గమకాల తీరును ఆయన బాణీలలో కలగలపడం, 'రజని' పాటకు ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్నిచ్చాయి.



బర్మింగ్‌హామ్‌లో రజనీగారి కార్యక్రమానికి ముందు
మాట్లాడుతున్న టంగుటూరి సూర్యకుమారి

ఒక్కమాటలో చెప్పాలంటే రజని గానవిధానంలో భావగాంభీర్యంతోపాటు చుట్టలు చుట్టలుగా తీగె సాగే సంగతుల విన్యాసం ఒక ప్రత్యేకతగా కనిపిస్తుంది.

అందరికీ సుపరిచితమైన 'చల్లగాలిలో యమునాతటి'పై గానీ, 'ఓ విభావరీ' గానీ సాలూరి రాజేశ్వరరావుగారి గొంతులో వినిపించే దానికీ, రజని స్వయంగా పాడి వినిపించేదానికీ తేడాను బర్మింగ్‌హామ్ లలిత సంగీత విభావరి క్యాసెట్‌లో వింటే అర్థమవుతుంది. ఆ పాటల్ని రజని విజృం భించి, స్వతంత్రించి పాడే విధానంలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఒక అకారమో; ఒక ఆలాపనో తీసుకుంటే 'రజని' తనివితీరా, తృప్తిగా విస్తరించి పాడి గానీ విడువరు. అది ఆయన మనోధర్మంతో విస్తరించి స్వైర విహారం చేస్తుంది. అది ఆయన సొంతం కావడంతో దానికి హద్దులుండవు సరికదా ఆయన హృదయం పలికి శ్రోతల్ని వుర్రూత లూగిస్తుంది.

ప్రతి శ్రుతి - ఓహో ప్రతిశ్రుతి అనేది అనేక సార్లు - అనేక స్వర స్థానాలలో పలికిస్తూ పాడతారు.

రజని తాదాత్మ్యం భావ సందర్భంగానే కాదు, గాన సందర్భంలోనూ ఉద్విగ్నంగా సాగుతుంది. ఇటువంటిదే ఆయన పాడిన -

"అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనములు శృంగార సంకీర్తనములు రాగతాళసంయుతమైనవి 32,000 మొత్తం కలవని ఆయన మనుమడు చిన్నన్న తన అన్నమాచార్య చరిత్రంలో వ్రాశాడు. అవికా కద్వి పదప్రబంధంగా నవ్యరీతిని రామాయణము, సంస్కృతంలో వేంకటాద్రిమాహాత్మ్యము, తెలుగున శృంగారమంజరి, 12 శతకాలు, యింకా సకలభాషలలో అనేక ప్రబంధాలు. సంస్కృతములో సంకీర్తన లక్షణమును రచించాడు అన్నమాచార్యుడు.

ఈయన 1502 వ సంవత్సరము ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు సంకీర్తనములు పాడుతూనే వేంకటేశ్వరునిలో ఐక్యం చెందాడట, చనిపోవునాటికి 95 ఏండ్ల వయస్సుండవచ్చు" - రజని.

ఆహా! నా ప్రాణసఖీ
ప్రభాత తారా! నామధుర భావధారా!
దగ్గరగా రా! మరీదగ్గరగా రా!
ఇంకా దగ్గరగా రా....
కూడా వుంది.

ఈ పాటలో 'దగ్గరగా ఇంకా దగ్గరగా -, మరీ దగ్గరగా' అనే మూడు విరుపుల్లో ఆయన పలికించిన ప్రణయ తాదాత్మ్యం గొప్పగా వుంటుంది.

రజనీగారు లలిత లలితంగా చిన్న చిన్న మాటలతో పాట కూర్చడం ఒక పక్క చేస్తూనే మరొక పక్క సుదీర్ఘ సమాసాలతో మెలికలు తిరగే నడకతో పాటలు రాస్తారు. బాణీలు కూరుస్తారు. పాడతారు. బహుశ బాణీ కూర్చుకుంటూ, పాట పాడుకుంటూ పదాలు అల్లుకోవడం ఒకేసారి చేయడంవల్ల ఆయనిష్టమొచ్చినట్లు స్వేచ్ఛగా పాటను రూపొందిస్తారనిపిస్తుంది.

'స్వప్నజగతిలో ఛాయా వీణ'
మన ప్రేమ - మన ప్రేమ'

'ఓ విభావరీ....' లాంటి పాటల్లో మాటలు ఆయన గొంతులో వింటున్నప్పుడు ఆ మాటల్ని విరిచి ఆయన భావయుక్తంగా పలుకుతున్నప్పుడు ఆ సమాసాల దీర్ఘత్వం మనకి చాలా సహజంగా అనిపిస్తుంది. పైగా అవి తప్ప ఆ భావం మరే మాటలూ చెప్పలేవనిపిస్తుంది.

ధరణీతల చంద్రశిలా
తరల మండపమున నిలచి
యుగములుగా పరిభ్రమింతువగమ్యుడౌ
ఎవని వలచి? - ఓ విభావరి - !

- లాంటి సమాసాలు ఎంతో సహజంగా కనిపిస్తాయి ఆ ట్యూన్‌లో.

తొలిసారిగా 1942లో మద్రాసు కేంద్రంలో చేరిన రజని ఎన్నో సంగీత రూపకాలు చేశారు. ఎన్నో పాటలు చేశారు. నిరంతరం అదేధ్యాస. అదేగానం.

'అతిధిశాల' సంగీత రూపకానికి సంగీతం కూర్చి కృష్ణశాస్త్రి తన రచనలో వాడిన పారశీ, ఉరుదూ పలుకుబడులకు సారసనిక్ (SARACENIC) శిల్పవిన్యా సాలకు దీటుగా రజని మధ్యప్రాచ్య సంగీతాన్ని వాడారు.

'ఓహో ముసాఫిరోహో' -
నేలా వచ్చెహవాహుమాయి పయి'
'వేబోక విరియు నెచ్చెలులార'
'ఏల యీ మధుశాల - ఏరుమూసిన వారు'
- లాంటివి గొప్పగా వుంటాయి.

శంకరమంచి సత్యం రచించిన రేడియో నాటకం 'హరహర మహాదేవ'లో పతాక సన్నివేశంలో రజని పాడిన కాళిదాసు ప్రసిద్ధ శ్లోకం 'వాగర్థావివసంపృక్తౌ'... ప్రకృతి పురుషుల సంయోగ లక్షణాన్ని గంభీరంగా ఆవిష్కరిస్తుంది. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ రచించిన 'మాటా - మౌనం' సంగీత రూకంలో "ఏ రేవులో ఎక్కేవురా - నీ రేవు యెతికేవు యీ దారిలో" అనే పడవ పాటకు పలికించిన బెంగాలీ సంగతులు ఆ నది వాతావరణానికి చక్కగా అమరి వినిపిస్తాయి.

చివరిగా 'శ్రీసూర్యనారాయణా - వేద పారాయణా లోక రక్షామణీ...' అనే సూర్యస్తుతి, ఆయన బాణీని, ఆయన పాడే విధానాన్ని కలిపి చూపిస్తుంది. ఆయన బాణీని, పాటనీ విడదీసి చూడటం కష్టం. రెండూ కలిసి పోయి, విడదీయ వీలులేకుండా వుంటాయి.

మరొక్క మాట ఏమంటే ఆయన రచన, ఆయన స్వర పరచగా మరొకళ్ళు పాడినదాని కంటే ఆయన గొంతులో ఎక్కువ అందంగా, పసరు రెక్కలు విప్పి పక్షి ఆకాశంలో ఎగిరినట్టుంటుందని ఎప్పుడూ అనిపిస్తుంది. ✪

భీమవరం సాహితీమూర్తులు

– డా॥ తటవర్తి రాజగోపాలం

ప్ర తిరీత్యా భీమవరంలో తాత్కాలికంగా నివసించినా, శాశ్వతంగా ఈ పట్టణ కీర్తి కిరీటంలో మణులు పొదిగిన బహుముఖ విద్యావేత్తలు ప్రతిష్ఠులూ అయిన ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య, ఆచార్య పెద్దాడ రామ స్వామి, శ్రీ కె. సన్యాసయ్య, ఆచార్య ధూళిపాల అర్కసోమ యాజులు, శ్రీ కె. రాఘవరావు ప్రభృతులకు మొదట నమ స్కరించి ఆంధ్ర సారస్వత క్షేత్రంలో విశేష కృషి చేసిన ఇక్కడి శారదామూర్తుల్ని దిఙ్మాత్రంగా స్మరిద్దాం.

భీమవరం గర్వంగా చెప్పుకొనే ఆంధ్ర రచయితలలో అడివి బాపిరాజుగారిది అగ్రతాంబూలం. అడివి బాపిరాజు గారు అక్షరాలా కళాప్రపూర్ణులు. 1895 వ సం॥ అక్టోబరు 8వ తేదీన తన జన్మ కారణంగా భీమవరానికి శాశ్వత కీర్తి దెచ్చిన బాపిరాజు ఇక్కడ కొంత కాలం ప్లీడరు ప్రాక్టీసు పెట్టారు. తరువాత బందరు జాతీయ కళాశాలలో ప్రిన్సి పాలుగా పనిచేశారు. బందరు, హైదరాబాదు, మద రాసులతో పాటు భీమవరంలోనూ కళాపీఠం స్థాపించి ఇచ్చట ఈయన కళారాధన చేయడం ఈ పుర చరిత్రలో సువర్ణపుట.

శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, గానం, కవిత్వం, చరిత్ర, శాస్త్రాలపై ఆసక్తి, దేశభక్తి, రసార్ద్రమైన హృదయం, తీయని తెలుగు పలుకుబడి - వెరసి అడివి బాపిరాజు గారు.

విశ్వవిద్యాలయం వారి బహుమతులు సంపాదించే గ్రంథాలు ఉంటాయి గాని ప్రజల హృదయాలను దోచుకొనే రచనలు వాటిలో ఎన్ని? అని ప్రశ్నించేవారికి బాపిరాజుగారి "నారయణరావు" నవల చక్కని సమాధానం. వీరి తొలకరి, అడవిశాంతిశ్రీ, రాతి రథము, అంజలి, జాజిమల్లి, హిమబిందు, గోనగన్నారెడ్డి, కోనంగి, తుపాను వంటి నవలలు తెలుగుజాతి మరువలేనివి.

"ఉప్పొంగి పోయింది గోదావరీ తాను
తెప్పున్న ఎగిసింది గోదావరి"
"మరచిపోవకే బాల మరచిపోవకే"

ఇత్యాది వీరి గేయాలకు రసహృదయతంత్రులను పలికింప చేసే శక్తి ఉంది.

'మీజాన్' పత్రికా సంపాదకత్వం చేపట్టినా, చలన చిత్రరంగంలో కళాదర్శకత్వం చేపట్టినా జీవితాంతం ఉత్కృష్టమైన ఆదర్శాలతో, స్వతంత్రమైన ఊహలతో బ్రదికిన భీమవర సాహితీ గగన 'శశికళ' అడివి బాపిరాజు గారు.

ఈ పట్టణ సాహితీ దివ్యవాహినికి మనోహ రమణి కర్ణికా ఘట్టం అప్పటి "పశ్చిమ గోదావరి భీమవరం కళాశాల" (నేటి డి.యన్.ఆర్. కళాశాల). శిష్యవాత్సల్యం మూర్తీ భవించిన డా॥ నండూరి వెంకట రామకృష్ణమాచార్యులు గారు 1921 సం॥రంలో ఈ జిల్లాలోనే జన్మించి అనేక ప్రభుత్వ కళాశాలల్లో ప్రిన్సిపాలుగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఎన్ని ఉన్నత పదవులు పొందినా తన 22వ ఏట తొట్టతొలుత ఉద్యోగపీఠాన్ని అధిరోహించింది భీమవరం కళాశాలకు ఆంధ్రశాఖాధిపతిగానే.

"శిష్యుడెవడు? భక్తి జిజ్ఞాస గలవాడు
అహము వీడినట్టి ఆర్ద్రహృదుడు

వెలుగు వెదుకుకొనుచు నిలుచుతోడుగ సదా
పరమగురుడు శిష్యవరుడె నాకు"

అన్న దేశికోత్తముడీయన. వీణాపాణిసేవలో వీరు వ్రాసిన ఖండ కావ్యాలు. నాటకాలు, నాటికలు, నృత్యనాటికలు, పరిశోధన వ్యాసాలు వీరి సాహితీమూర్తిమత్వానికి మణి దీపాలు. తారాతోరణం, ప్రగతిగీత - కవితా ప్రభాస, ఛత్రపతి శివాజీ, ధర్మచక్రం, ఉరికంబం, త్యాగరాజు, వీరాభిషేకం, గోదావరి, దక్షిణ భారతదేశ చరిత్ర, కవిత్రయం మొ॥నవి వీటిలో కొన్ని.

జ్ఞానవయోవృద్ధులైన డా॥నండూరి వారు నేడు పద్య కవితా సదస్సుకు అధ్యక్షులై శక్తికి మించిన సాహితీ వరివస్యగావిస్తున్న భాగ్యనగరవాసి. భీమవరం అంటే ఈయనకు భావస్థిరమైన జననాంతర సౌహృదం.

భీమవరం కళాశాల తొలి తరంలో మరో ఆణిముత్యం - పాలగుమ్మి పద్మరాజుగారు. ఇక్కడ కెమిస్ట్రీ హెడ్‌గా పనిచేసే కాలంలో వీరు సృష్టించిన "గాలివాన" తెలుగు కథానికతో పాటు భీమవరానికి కూడా అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. "బ్రతికిన కాలేజీ" పాలగుమ్మి రచనలలో "బంగారుపాప" వంటిది. చాలా కాలంపాటు తెలుగు చలన చిత్రరంగంలో సంస్కారవంతమైన కథలకూ, సంభాషణలకూ పద్మరాజుగారి వాణి ఒక అంతర్వాహిని.

ఈ పట్టణ సాహిత్య చరిత్రలో సాటిలేని వెలుగు దర్భా సర్వేశ్వరశాస్త్రిగారు. "డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు రాని యీపాడు కాలాన పుట్టి" నా తమవృత్తికే వన్నెతెచ్చిన సంస్కృతాంధ్ర విద్వన్మణులలో దర్భావారు సర్వేశ్వరుడే. కౌముది - అమరం పరిపూర్ణంగా కంఠంస్థం చేసిన శాస్త్రిగారు 1950 - 59ల మధ్య భీమవరం కళాశాలలో పనిచేసి తన వ్యాకరణ పాఠప్రవచనంతో శిష్యుల హృదయాలను దోచుకొన్నారు. ఈ మహానుభావుణ్ణి గురించి రెండే మాటలు. సూర్యారాయాంధ్ర నిఘంటు నిర్మాణ దక్షులలో.... వీరొకరు, విద్వత్కవి శేఖరులు వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు ఈయనకు శిష్యులు.

కట్టమంచి రామలింగారెడ్డిగారి మనసు చూరగొన్న సంస్కృతాంధ్ర పండితులు వెలిది శేషయ్యశాస్త్రి గారు ఇక్కడ వారే. 1937లో వీరి 'కాదంబరి' ఆంధ్రపద్యానువాదం రామలింగారెడ్డి గారిని ఎంతగానో అలరించింది. ఇపుడు వీరి వయస్సు 91 సం॥లు. కందకవి సార్వభౌమ, ఆంధ్రబాణ, తత్త్వవిదగ్రగణ్య - ఇత్యాది బిరుదులున్నా డాబుదర్పాలు లేని వీరి వ్యక్తిత్వం, సాహిత్యసేవ ఈ ఊరికి తరగని తొడవులు. పరమ నిరాడంబరంగా ఎందరికో సాహితీ భిక్ష పెట్టి ఎందరినో "భాషాప్రవీణులు"గా "విద్యాప్రవీణు" లుగా తీర్చిదిద్దిన శేషయ్యశాస్త్రిగారు తన అశేష శేముషీ దురంధరతతో 20 వరకు సాహిత్య గ్రంథాలను, వేదాంత గ్రంథాలను లోకానికి అందించారు. హర్షచరిత్ర (పద్యకావ్యం), బ్రహ్మతత్త్వ వికాసము, సుభాషిత సుధార్ణవము, ఉపనిషత్సారము మొ॥వి వీరి గ్రంథాలలో కొన్ని.

భీమవర సాహిత్యవీథుల్లో తనకు తానే సాటి అనిపించుకొన్న దిగ్గజం దిగుమర్తి సీతారామస్వామి గారు.

నండూరి, దిగుమర్తుల శిష్యరికం అంటే "ఆరోజుల్లో" ఒక మధురానుభూతి అంటూ శిష్యులు పొంగిపోతూ ఉంటారు.

దిగుమర్తి వారు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉండే రోజుల్లో వ్రాసిన "సప్తశతీసారము" అన్న పరిశోధన వ్యాసాన్ని కవి సమ్రాట్టు, తొలి తెలుగు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారు చూసి, ఇంతటి భావుకత కలవానితో మైత్రి చెయ్యాలని నిర్ణయించుకొని, దిగుమర్తి శ్రోతగా ఉంటేనే తాను భీమవరంలో తన రామాయణ కల్పవృక్షకావ్యపఠనం చెయ్యడానికి వస్తాననడం సామాన్య విషయం కాదు.

ప్రతివిషయాన్ని స్వీయ ప్రతిభా ప్రతిబింబంగా దర్శించి సత్యమని తోచిన దాన్ని నీళ్లు నమలకుండా నిర్భయంగా వక్కాణించే విమర్శ సీతారామస్వామిగారి సొత్తు.

పరిమితాక్షర పరిధిలో అపరిమితార్థాన్ని కుంభించి వక్తృస్థానానికి జీవం పోసిన దిగుమర్తివారు కలంపట్టినా గళం విప్పినా హేమాహేమీలకే ప్రకంపనాలను పుట్టించిన సందర్భాలు అనేకం. అంతటి విమర్శనా నైశిత్యం అలవడడానికి కారణం అసాధారణమైన సాహిత్యకృషి - అనివేరే చెప్పనక్కర్లేదు.

వీరి భావుకతకు, పద్యరచనా ప్రాగల్భ్యానికి సుహృల్లేఖ, స్వామిపుష్కరిణి, హేమంతప్రస్థానం - ఇతర కృతులు నిలువు టద్దాలు: కాగా అనర్ఘరాఘవ నాటకాదులపై సాగిన



1953లో 'శతపత్ర సుందరి'కి బహుమతి వచ్చిన సందర్భంగా విజయవాడలో రజనికి అభినందన సభ తర్వాత
ఎడమవైపు నుంచి రజని, కొడూరి లీలావతి, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, ఎస్.బి.పి.కె. పట్టాభిరామరావు,
గోపాలరెడ్డి, మోటూరి సత్యనారాయణ తదితరులు

అపురూప వ్యాసాల సంకలనం "అనర్ఘమణులు". తన గురువు గారైనా పింగళి లక్ష్మీకాంతంగారు అస్తమించిన నాల్గవ రోజునే 14 - 1 - 1972న కనుమూసిన దిగుమర్తి - తెలుగు మాటల తూకం తెలిసిన వాగ్వనమాలి.

కొన్నేళ్ళ క్రితం తెలుగునేలలో ఆదివారం మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా ప్రతి యిల్లూ ఒక నైమిశవనంగా, ఒక వాల్మీకి తపోవనంగా మంత్ర సమ్మోహనం చేస్తూ ఆకాశవాణి వినిపిస్తూ ఉండేది. అనితరసాధ్యమైన ఆ వాగ్ధోరణి ఉషఃశ్రీ ది అని గుర్తు చెయ్యనక్కర్లేదు. ఇంతకూ ఉషఃశ్రీ కి (పురాణ పండసత్యనారాయణ దీక్షితులుకు) సాహిత్య ఉపాసనా రక్తిని, శక్తిని యిచ్చింది - భీమవరం కళాశాలయే. ఈయన పితృపాదులు పురాణపండ రామమూర్తి గారు ఇంటిపేరును శతధా సార్థకం చేసుకొన్న పౌరాణికోత్తములు. ఆధ్యాత్మిక సారస్వత సేవచేసి, తద్రూపంగా ఎన్నో కార్యక్రమాల్ని నడిపి ఇక్కడ సోమారామ క్షేత్రంలో బహు సంవత్సరాలుండి ఈ ఊరికి మరో సిరిని గూర్చారు.

"నిన్ను చూపి చనియె మహాత్మా" అన్నట్లు దిగుమర్తి సీతారామస్వామిగారిని తలపింప చేసిన సాహిత్యగత ప్రాణి సన్నిధి రాజు సుబ్రహ్మణ్యంగారు. పరమ గాంభీర్య వ్యక్తిత్వం వెనుక అద్భుతావహమైన చమత్కారం, సునిశిత విమర్శనా దృష్టిలోపల రసార్ద్ర మార్దవమైన హృదయం గల సాహితీ సభాసవ్యసాచి సన్నిధిరాజువారు. "తెలుగు వాక్యాన్ని ఎన్ని ఒడుపులు చూపి అందాన్ని వెలార్చవచ్చో తెలిసిన ఇద్దరు ముగ్గురులో ఈయన ఒకరు" - అని ఆర్. యమ్. చల్లాగారి వక్కణ. పట్టుకొన్న విషయాన్ని అమూలాగ్రం పరిశోధిస్తే గాని పెదవి విప్పని నిత్యవిద్యార్థి కావడం వల్ల సుబ్రహ్మణ్యంగారి విమర్శ నిర్మాణాత్మకం అని, అదొక గీటురాయి అనీ విజ్ఞులకు తెలిసిన విషయమే. ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు, పోతన, జాషువా, దువ్వూరి రామిరెడ్డి మొ॥లగు కవులపై వీరు చేసిన ఆకాశవాణి ప్రసంగాలు, పుస్తక సమీక్షలు సాహితీచకోరాలకు పున్నమిరాత్రులు. నేడు

"బాలాంత్రపుర రజనీకాంతరావు (జననం 1920) మంచి ప్రతిభావంతుడు. 1937 మొదలుకొని గేయాలను విరివిగా వ్రాసి స్వయముగా స్వరకల్పనము చేసి వాటిని మధురకంఠముతో ఆలపిస్తూ - రేడియో ముఖాన 'రికార్డుల' ద్వారా వినిపిస్తూ - "మధుపాయి" (వాల్తేరు)లో సభ్యుడై - రేడియోలో ఉద్యోగిగా అనేక గాయకులకు మార్గదర్శియై - గ్రీష్మము - దివ్యజ్యోతి - మేఘదూత - మధురానగరిగాథ - మేనక - విజయ విధాత "మొదలైన గేయనాటికలను, చండీదాసు, శాషో, లకుమాదేవి అనే నాటకములను (చూ. ప్రతిభా సంపుటములు) రచించి వ్యా.షా అనే ప్రచ్ఛన్న నామముతో కొన్ని చిత్ర రచనలను చేసి - మంచి ప్రసిద్ధిలోకి వచ్చిన నవ్యుడు యీ "రజని"

నవ్యాంధ్ర సాహిత్య వీధులు - కురుగంటి సీతా రామయ్య, పిల్లల మర్రి వేంకట హనుమంతరావు; చతుర్థ భాగము పుటలు 704 - 5; తెలుగు విశ్వవాద్యాలయం ప్రచురణ 1994.

కీర్తిని మాత్రం మిగుల్చుకొన్న సన్నిధిరాజువారు భీమవరం కళాశాల తొలితరం విద్యార్థి, అధ్యాపకులున్ను.

జాతీయ రేడియో కవి సమ్మేళనంలో భీమవరం కవుల పాటలు హస్తినాపుర గగనవాణి నుండి యావద్భారతం లోను మారు మ్రోగాయి; సాలూరి రాజేశ్వరరావు, మల్లిక్, కె.వి.ఆర్.జి. కృష్ణమూర్తి (ఈయన డి.యస్.ఆర్. కళాశాలలో పూర్వం కెమిస్ట్రీ లెక్చరరు) గారలు బాణీలు కట్టిన ఈ పాటలు ఆకాశవాణి నుంచేగాక ఎన్నో కళాశాలలలో మాధుర్యాన్ని పంచి పెట్టాయి. ఇక్కడ ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేసిన కె.వి. అప్పలాచార్యులుగారు ఆ గీతాల రచయిత. ఈయన అన్నగారు కె.వి. శేషాచార్యులు హిందీ లెక్చరరు. కాల్పనికత్వం, సమకాలీన సమాజ ప్రతిబింబతత్త్వం మూటగట్టుకొన్న వీరి పాటలు, గేయాలు పద్యాలు శతాధికంగా ప్రచురితాలై ఈ ఊరి ప్రతిష్ఠను ఇనుమడింపచేశాయి. వయస్సు పండకుండానే ఈ సోదరకవుల కీర్తి పండిపోవడం భీమవర సాహిత్యరంగానికి తీరనిలోటు.

భీమవర సాహిత్యపౌరోహిత్యంలో వసిష్ఠ వామదేవులవంటివారు శ్రీములగాల సేతుమాధవస్వామిగారు, స్వర్గీయ చిలుకూరి వీరభద్ర శాస్త్రిగారు. ములగాల వారు ఓరియంటలు కళాశాల పూర్వకులపతులు. ఒళ్లు జలదరించే ప్రాచీన సంప్రదాయ సంస్కృతాంధ్ర విద్యలకు ఈ ప్రాచ్యకళాశాలలు నిలయాలు కావడానికి మాధవస్వామి వంటి వారెందరో కట్టిన సేతువులు నేటి అప్రాచ్యపు విద్యా విధాన జలప్రవాహానికి కొట్టుకొని పోయాయి. హితభాషి, స్మితభాషి అయిన ములగాలవారు సాహిత్యంతో పాటు వాస్తు జ్యోతిషాదులలోనూ విశేషకృషి చేసిన సహృదయ శిరోమణి. వీరు ఇక్కడే స్థిరపడడం ఈ ఊరికి పెట్టనికోట. చిలుకూరి వారు సంస్కృతాంధ్రాలు, హిందీ భాషలతోపాటు తర్కవ్యాకరణ న్యాయ మీ మాంస శాస్త్రాల్ని క్షుణ్ణంగా అవలోధనం చేసిన ఈ ఊరి కళాశాల పూర్వ అధ్యాపకులు. భగవద్గీతను తెలుగులో ద్విపదలో సరళంగా వ్రాశారు. దశాబ్దాలు దాటినా చిలుకూరి పాఠప్రవచనాన్ని, సాహితీ వైదుష్యాన్ని శిష్యులు మరువలేరు.

జీవితభీమా సంస్థలో పనిచేస్తూ, సాహిత్యరసాస్వాదనమే జీవనమకరందంగా తన జీవితాన్ని ధన్యం చేసుకొంటూ, అసాధారణమైన ధారణాశక్తితో మనుచరిత్ర మహాప్రబంధాన్ని ఒక్క పూటలో నిర్నిరోధంగా అప్పగించిన అనునిత్య సాహిత్య తపస్వి వెంపరాల ప్రభాకర సుబ్రహ్మణ్యంగారు. అనవద్యహృద్యమైన పద్యగేయ రచనలో వీరు పుష్కలమైన శక్తి ఉన్నవారు. రసచంద్రిక చిందించే వీరి సాహిత్య సేవ ఈ సోమారామానికి మరో వెలుగు.

ప్రాచీనాంధ్ర సాహిత్య ప్రభలతోపాటు నవ్యాంధ్ర సారస్వత దీధితుల్ని కూడా సహృదయదక్షుంగా అనుభవిస్తూ వికసించిన భీమవరసాహితీవన సరోజం డా॥రామడుగు వేంకటేశ్వరశర్మగారు. ఈయనకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కొన్నేళ్ళ క్రితమే "రీడరు"గా పదోన్నతి నిచ్చినా ఎన్నాళ్ళనుంచో నిజమైన రీడరీయన. సాహిత్యం ఆరోప్రాణం అనే కన్నా ఐదుప్రాణాలూ సాహిత్యమే అనడం సముచితం. పద్యాన్ని పదునుగా నడపడంలో, గేయానికి అందమైన నడకలు కూర్చడంలో మంచి రచయిత అయిన శర్మగారు

భీమవర సాహితీ భారతికి ముద్దుబిడ్డే. ఓరియంటలు కళాశాల ఈ ఊర్లో నిలువలేక పోవడంతో రామడగు వారు తాడికొండలో అడుగుమోపారు.

పరమవైదుష్యంగా పద్యరచన గావించే భారతం శ్రీమన్నారాయణ గారు కూడా ఇలాగే చిట్టికూడూరు వెళ్ళక తప్పింది కాదు.

భీమవర సాహితీ సౌభాగ్యగరిమకు తమ్మన వేంకటేశ్వరరావు గారు పచ్చలారని అక్షరతోరణాలు కైచేస్తున్న కవీశ్వరులు. కళ్యాణి, నవభారతం, అహల్య, గీతావేంకటేశ్వరీయం, ఆంజనేయ స్తవాక్షరి, అకుంఠితదీక్ష, నస్యనిషేవణం, అర్తిసంరక్షణం - ఇత్యాదులు వీరి ముద్రిత కృతులు. యయాతి చరిత్ర కావ్యంలోని తెలగనార్యుని అచ్చతెలుగు కైత వెలుగు వెల్లువలను వెలార్చుచు తమ్మన వారు శోధించి వ్రాసిన "అచ్చతెలుగుకైత సిరి" తెలుగుపరి శోదక లోకాన విరిసిన దివ్యపారిజాతపువిరి. కవిత్వమే ఊపిరిగా జీవితం సాగిస్తున్న ఈ సారస్వత సేవకులు ఇక్కడి విద్యార్థి, అధ్యాపకులు కూడా. కవులకు కవి, పరిశోధకులకు పరిశోధకులు అయిన తమ్మనవారు భీమవరవాసి గావడం ఊపురం చేసుకున్న సుకృతం.

పరిశోధన, విమర్శ, నిరంతర కావ్య పఠనా ప్రవణత, చారిత్రకాన్వేషణ, రచనాశక్తి రూపుగొన్న మనీషి జొన్నవిత్తుల రామకృష్ణ శర్మగారు కూడ ఇక్కడే ఉద్యోగం చేసి, నిత్యవిద్యార్థిగా విశ్రాంత జీవితాన్ని గడుపుతున్నారు. స్వయంకృషి, స్వీయప్రతిభ వీరి సాహితీ వైదగ్ధికి ఇరుప్రక్కలు. వసుచరిత్ర పారదర్శక విమర్శ, విశ్వనాథ శబరి, మేఘదూత పద్యానువాదం, సోమేశ్వర మహాత్మ్యం, మూవుళ్ళమ్మ కీర్తనలు - మొ॥వి వీరి ప్రసిద్ధ ముద్రిత సాహితీగ్రంథాలు.

స్థానికంగా డి.యన్.ఆర్. కళాశాలలో పి.జి. లో తెలుగుకోర్సు ప్రారంభించడం ఇక్కడి తెలుగు సారస్వతీప్రభకు మరో వెలుగు. నిరంతర పరిశోధకులు, పరిశోధన పర్యవేక్షకులు, సాహిత్యతత్త్వవేది అయిన డా.పి. వెంకట్రాజుగారు "నన్నయ విద్యాపీఠం" పేరున చేసిన సాహిత్యసేవ భీమవర ప్రతిష్ఠకు పతాక.

లలితపదవిన్యాసంతో పద్యగేయరచనలు చేస్తూ సహృదయుల మన్ననల్ని చూరగొన్న డా॥కె. వెంకట్రామ రాజుగారు దక్షిణాంధ్రయుగ సాహిత్యం. ముఖ్యంగా చేమకూర వెంకటకవిపై విశేష పరిశోధన చేసిన అధ్యాపక సత్తములు. రామరాజు భూషణుడు, తిరుపతి వెంకటకవులు. దువ్వూరి రామిరెడ్డి మొ॥వారి పై వీరు పరిశోధనలు చేయించారు.

ఇలా - జన్మాంతర సాహితీ సంస్కారాన్ని ఇక్కడ పంచిన ప్రముఖులెందరో ఉన్నారు. ఇక్కడే స్థిరపడిన వాళ్ళు కొందరు, ఈ గడ్డపై పుట్టిన వాళ్లు కొందరు, కొంతకాలం ఇక్కడ చదవడం వల్లనో ఉద్యోగం చెయ్యడం వల్లనో ఈ ఊరికి చెందిన వాళ్లు కొందరు. అందరికీ ఈ భీమవరం పట్ల అపారమైన అభిమానమూ, నిస్తులమైన నెనరూ. వారిలో కొందరు - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి (విశాఖ, ఎ.యు. రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్), ఆచార్య బయ్యాసూర్య నారాయణ (బెనారస్ విశ్వవిద్యాలయం, రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్), ఆచార్య తంగిరాల సుబ్బారావు (బెంగుళూరు విశ్వవిద్యాలయం, రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్), డా॥ఏల్చూరి మురళి (రీడర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం), డా॥ నందుల గోపాలకృష్ణమూర్తి (రాజమండ్రి ప్రభుత్వ కళాశాల, పి.జి. తెలుగు రిటైర్డ్ హెడ్), శనగన నరసింహస్వామి (రిటైర్డ్ తెలుగుహెడ్, లయోలా కళాశాల, విజయవాడ), డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావు (రిటైర్డ్ డైరక్టర్, సాంస్కృతిక వ్యవహారాల శాఖ (రిటైర్డ్ డైరక్టర్, సాంస్కృతిక వ్యవహారాల శాఖ, హైదరాబాదు), డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి (రిటైర్డ్ తెలుగు లెక్చరర్, నాగార్జునసాగర్), డి.వి. రామరాజు (రిటైర్డ్ ఇంగ్లీషు లెక్చరర్, భీమవరం), రాయసం వెంకట్రామయ్య (ఐ.టి. కమీషనర్, హైదరాబాదు), పోలాప్రగడ సత్యనారాయణమూర్తి (సుప్రసిద్ధ కథారచయిత, నవలా కారుడు, హైదరాబాద్), వద్దిపర్తి పద్మాకర్ శతావధాని (ఏలూరు), కోట లక్ష్మీనరసింహ శతావధాని (మంచిలి), కీ.శే. జోశ్యుల శ్రీ వేంకటేశ్వర్లు (గణిత అధ్యాపకులు, భీమవరం,"వేయిపడగలు" నవలకు ఆంగ్లానువాదకర్త) - ఇత్యాదులెందరో ఈ భీమవర సాహిత్య సరస్వతీ ముకుటమణులు, యశశ్శిరోమణులూ ఉన్నారు. సర్వసమగ్రంగా వివరిస్తే సోమారామ సాహితీ సాగరంలో ఆణిముత్యాల కాంతులు అపూర్వ లావణ్యాన్ని ఎలా గుత్తకొన్నాయో తెలుస్తుంది. ✪



జేజి మామయ్య

- సి. సుజాతాదేవి

దో బూచీ దోబూచీ
కళ్ళు రెండూ మూచేచి
అమ్మ కొంగులో దాచేచి
చీ చీ అంటే చిగ్గేచి
పక పక పక పక నవ్వేచి
బూచాడంటే బయమేచి
దోబూచి ---- దోబూచి --

ఈ పాట చదువుతుంటే బోసి నవ్వుల పాపాయి అరచేతులు విప్పి కళ్ళకు అడ్డం పెట్టుకుని, ఆ వేళ్ళ సందు నుంచీ వెలిగే కళ్ళతో దొంగ చూపులు చూస్తూ బోసి నవ్వులు పూస్తున్నట్లు లేదూ? అవును! మాట నేర్చిన పాట మాధుర్యం ఇలాగే ఉంటుంది. అచ్చమైన అమ్మ ప్రేమ అక్షరాలలో ఒదిగితే అది ముద్దులు మూటకట్టే మాటలుగా మారితే అవి రంగు రంగులు రాగాలను సమకూర్చుకుంటే అది పాటై కూర్చుంటుంది.

కవిత్వం మొదట పాటగానే పుట్టింది. లిపి పుట్టుక ముందే రామాయణాది ఎన్నో కథాగానాలు పాటలుగా ప్రచారంలోకి వచ్చాయి. జానపదులు తమ భావోద్వేగాలనూ, రాగవిరాగాలనూ పాటలుగానే పాడుకున్నారు. చందో బంధాలకు అందని అందమైన వరసలలో ఉన్న ఆ పాటల ఫణితులు పరిశీలిస్తే వారి భావ ప్రకటనలోని సహజ సౌందర్యం, సూటిదనం, తేటదనం అర్థమౌతాయి. తల్లీ బిడ్డల మమతాను రాగాలను మనోహరంగా చిత్రించిన ఎన్నో బాలగేయాలు మన జానపద వాఙ్మయంలో ఉన్నాయి. తన బిడ్డ ఉన్నతిని మనసారా కోరుతూ ఉప్పొంగే హృదయంతో తల్లి పాడుకునే జోలపాటలు, ఊయల పాటలు మనం వింటూనే ఉన్నాం.

చిచ్చోళాళాళో హాయీ...
హాయి గోవుల గాయీ... ఆపదలు గాయీ
చిన్నిపాపను గాయి శ్రీ వెంకటేశా...

- అంటూ తొలుత ఏ తల్లి నోట తన బిడ్డ మీద ప్రేమ ఉప్పొంగి ఉరకలేసిందో నేటికీ ఆ పాట వేన వేల తల్లుల తమితీరని మమకారానికి తార్కాణంగా ఎందరో తల్లీ బిడ్డలను ఉర్రూతలూగిస్తోంది. ఆ పరంపరనే అందుకుని ఎందరో కవులు చెంగలించే చిన్నారుల కోసం పాటలల్లుతున్నారు. ఆ ప్రయత్నంలో మళ్ళా బాల్యాన్ని అనుభవించే అదృష్టవంతులౌతున్నారు.

వారెంతటివారైనా పాపాయి కోసం పాట రాయాలనుకుంటే భాషా భేషజాలను, సమాసమోస్తాలనూ వదిలించుకుని బాల్యంలోకి మళ్ళాలి. ఆలోచించాలి, అనుభవించాలి. లేచివుళ్ళవంటి మెత్తటి పదాల్ని అందుకుని అలవోకగా అమర్చాలి. అవి ఏమాత్రం పిల్లల ఆలోచనా పరిధిని మించకూడదు. అప్పుడు కదా అది పిల్లల పాట అయేది!

జాజిపూల వంటి సుతిమెత్తని సువాసనగల పదాలను ఏర్చికూర్చి మనకంటి కన్నలు కనబడని సున్నితమైన సూత్రంతో అలా అలా అలవోకగా అల్లుకుపోతారు మన 'జేజి మామయ్య'. జేజి మావయ్య పాటలంటే ఒకప్పుడు తెలుగు పిల్లలకు ప్రాణం. ఇప్పటికీ ఎప్పుడన్నా వినబడే ఆ పాటల నాజూకు శైలి ఆశ్చర్యకరంగా ఉంటుంది. వింటుంటే ఎప్పుడో విడిచి వెళ్ళిన బాల్యం వెన్నంటే ఉన్నట్లు గిలిగింతలుగా ఉంటుంది. చిన్నప్పటి ఆటపాటలూ, అమ్మ పెట్టే తాయిలాలూ, కోతి కొమ్మచ్చులూ, కాగితం పడవలూ,

ఎన్నో ఆకుపచ్చటి జ్ఞాపకాలు లలితగీత సామ్రాజ్యాన్ని 'రజని'గా కొన్ని దశాబ్దాల పాటు ఏలిన కవి, గాయకులు, స్వరకర్త, శ్రీ బాలంత్రపు రజనీకాంతరావుగారు పిల్లల కోసం జేజి మావయ్య పాటలు వ్రాశారు. ఆయన రచించిన "శతపత్రసుందరి" లలితగేయ సరస్సులో వేయిరేకుల పద్మంలా విరిసింది. ఆ గుబాళింపుకు పరవశించిన పాటల ప్రేమికులెందరో తుమ్మెదల్లా ఝుంకారాలు చేశారు. ఆకాశ వాణిలో ఎందరెందరో ఎన్నెన్నో పాటలు పాడారు. వివిధ తాళగతులలో సంగీత నృత్యరూపకాలు వ్రాసి సంగీతజ్ఞుల మెప్పుపొందిన రజని, అంతెత్తు మనిషి! వాత్సల్యంతో ఒంగి ఒంగి తప్పటడుగుల పిల్లలకు చేయి అందించినట్లు అని పిస్తుంది వారి పిల్లల పాటలు చూస్తుంటే. కొయ్యగుర్రం మీద షికారు. కప్పతల్లి గడబిడ, కాగితం పడవ ప్రయాణం - వానవల్లప్ప బొమ్మల కొలువులూ, అమ్మల ప్రేమలూ, బాల ప్రపంచంలో జీవించి బాల మనసుతో ఉప్పొంగి వ్రాసిన పాటలు.

చీచీ అంటే చిగ్గేచి
కళ్ళు రెండూ మూచేచి
- ఎంచక్కటి రూప చిత్రణ!

ఆట మరిగి, ఆకలి మరిచి, తిరిగి తిరగి అలసిసొలసి ఇల్లు చేరిన పిల్లలకు అప్పుడు గుర్తొస్తాయి ఎక్కడ ఏమున్నాయో.

ఆటలు ఆడి పాటలు పాడి
అలసీ వచ్చాకే
తియ్యాతియ్యని తాయిలమేదో
తీసీపెట్టమ్మా
గూటీలోని బెల్లం ముక్కా కొంచెం పెట్టమ్మా
చేటలోని కొబ్బరి కోరూ చేరెడు పెట్టమ్మా
అటకామీది అటుకుల కుండా అమ్మా దించమ్మా
తియ్యా తియ్యని తాయిలమేదో తీసీపెట్టమ్మా

అనగనగా ఓ పిల్లి. అది వంటగదిలోంచి బయట కొచ్చింది. మూతి నాక్కుంటూ, మ్యావు మ్యావు మంటూ దాటేయ బోయింది. కాని ఓ గడుగ్గాయి చూడనే చూశాడు. వాడేమంటున్నాడో చూడండి. -

మ్యావు మ్యావు పిల్లీ రావె రావె పిల్లీ
ఈ బువ్వ కాస్త తిని పోవె
హాసి దొంగ పిల్లీ మీసాలపైనీ



ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బి.ఎ. (ఆనర్స్) (1940)

పాల చుక్క లెందుకొచ్చాయే
మ్యావు మ్యావు పిల్లీ పోవె పోవె పిల్లీ
ఈ బువ్వ నీకు కాదు లేవెనీ

- ఇలా ఉదహరించాలంటే ఎన్నో ఉన్నాయి. కొండను అద్దంలో చూపడం లాంటిదే ఈ ప్రయత్నం. సంగీత సాహిత్యంలో ఎనలేని కృషిచేసి విశేష కీర్తిని ఆర్జించుకున్న శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారికి, ఈ 2001 అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు ప్రతిభమూర్తి పురస్కారాన్ని అందజేయడం పాటకు పట్టంకట్టినట్లే ననిపిస్తుంది. ఆ అక్షర బహ్మను, సంగీత సరస్వతిని అభిషేకించిన పూలు పాటలు కట్టేవారినందరిని మురిపిస్తాయి. ఇది తీయటి అక్షరానికి, అక్షరాలతో అల్లిన పరిమళించే పాటకు పురస్కారం. ఇందుకు ఫౌండేషన్ వారికి వందనాలు! 'జేజి మామయ్య'కు అభినందనలు! ✪

రజని - ఉత్తమ వాగ్గేయకారుడు

- డా॥ బి. మహాలక్ష్మీ కుమారి

"సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయమ్
ఏకమాపాత మధుర మన్యదాలోచనామృతమ్"

సంగీతసాహిత్యాలు సరస్వతీదేవి స్తనద్వయం. మొదటిదైన సంగీతం విన్నవెంటనే ఆనందాన్ని కలిగిస్తుంది. రెండవదైన సాహిత్యం ఆలోచించిన కొలదీ అమృత మయాలైన అర్థఫలాలనిస్తుంది.

సంగీత సాహిత్యాలు రెండూ అవినాభావ సంబంధం గలవి. అవి పరస్పర పోషకాలు. సంగీతానికి సొంపు కూర్చేది సాహిత్యం. సాహిత్యానికి ఇంపు చేకూర్చేది సంగీతం.

"ఇరు ప్రక్కల క్షీరధారలిచ్చి నన్ను పెంపకున్న
తరతరాల తాతల బహు తపఃఫలము నీయకున్న
నాకృతి కృతియేనా - నీ కృప లేకున్న
ఓ వాగ్గేయ కళామయి - గాయత్రీ వేదధాత్రి"'

- (వాగ్గేయకారచరిత్రము, పుట. 508)

అంటూ రజనిగారే తమ గేయంలో, తమ సాహిత్యం ఎలాంటిదో స్పష్టం చేశారు. "ప్రత్యక్షరంలో పరమ రమణీయమైన సంగీత మాధుర్యం జాలువారే సాహిత్యం ఆయనది." (స్వాతి, ఫిబ్రవరి 90)

రజని - వాగ్గేయకారుడు 1 (సంగీత సాహిత్య సవ్యసాచి)

"తన పితామహః గాన గంధర్వకళను
స్వీయ జనకుని నవ్య కవిత్వకళను
బట్టి భారతి కారతి బట్టినట్టి..."

సుప్రసిద్ధ వాగ్గేయకారులు శ్రీ రజనీకాంతరావుగారు. వారు సంగీత సాహిత్య కళానిధి. సంగీతమూ, సాహిత్యమూ సరస్వతీదేవి స్వరూపాలు. ఆ రెండూ సరస సమ్మేళనం పొందిన సమగ్ర పుంభావ సరస్వతీ స్వరూపమే శ్రీ రజనీకాంతరావుగారు.

శార్ఙ్గదేవుడు తన సంగీత రత్నాకరంలోని ప్రకీర్ణకాధ్యాయంలో వాగ్గేయకార శబ్దానికి నిర్వచనాన్నీ, వాగ్గేయకారునికి ఉండవలసిన లక్షణాలన్నీ పేర్కొన్నాడు.

"వాఙ్మతు రుచ్యతే గేయం ధాతు రిత్యభిధీయతే
వాచం గేయం చ కురుతే యఃస వాగ్గేయ కారకః"

వాగ్గేయకారుడు అంటే వాక్కునూ, గేయాన్నీ, చేసే నేర్పుగలవాడు. ఇందులో భాషాపరంగా ఉన్న అంశం - వాక్కు అంటే మాటల కూర్పు. సంగీత పరంగా ఉన్న అంశం గేయం అంటే రాగ లక్షణ నిర్ణయం లేదా సంగీతపు వరుస. సంగీత పరిభాషలో ఈ మాటల కూర్పును అంటే మాటల కూర్పునీ, ధాతువనీ అంటే సంగీతపు వరుసనీ తానే చేయ గలవాడు వాగ్గేయకారుడని శార్ఙ్గదేవుడు పై శ్లోకంలో నిర్దేశించాడు. ఈ రెండూ వాగ్గేయకారునికి చెప్పిన లక్షణాల్లో సాహిత్యపరంగా ముఖ్యమైనవి ఆరున్నాయి.

"శబ్దాను శాసన జ్ఞాన మభిధాన ప్రవీణతా
ఛన్దః ప్రభేద వేదిత్వ మలం కారేషు కౌశలమ్"
"రసభావ పరిజ్ఞానం దేశస్థితిషు చాతురీ
అశేష భాషా విజ్ఞానం కలాశాస్త్రేషు కౌశలమ్"

1. వాగ్గేయకారునికి 'శబ్దానుశాసన' జ్ఞానం అంటే వ్యాకరణ పరిజ్ఞానం ఉండాలి. అదే కాకుండా సుశబ్ద, అపశబ్ద వివేచనమూ, కలిగి ఉండాలి. శబ్దాలని సప్రమాణంగా, నిర్దుష్టంగా, సాభిప్రాయంగా ప్రయోగింప గలిగే పరిజ్ఞానం ఉండాలి.

2. 'అభిధాన ప్రవీణత' అంటే నిఘంటువులతో

పరిచయం ఉండాలి.

3. 'ఛన్దః ప్రభేద వేదిత్వం' అంటే మార్గదేశి ఛందో జ్ఞానం కలిగి ఉండాలి.

4. 'అలంకార కౌశలమ్' అంటే శబ్దాలంకార, అర్థాలం కార ప్రయోగనైపుణ్యమూ, ప్రసిద్ధ కవిసమయాలని తగురీతిని ప్రయోగించే నేర్పూ కలిగి ఉండాలి.

5. 'రసభావ పరిజ్ఞానం' అంటే అలంకార శాస్త్రజ్ఞులు వివరించిన నవరసాల గురించి పరిపూర్ణ జ్ఞానం కలిగి ఉండాలి.

6. 'అశేషభాషా పరిజ్ఞానం' అంటే తన భాషలో అశేష పరిజ్ఞానమూ, ఇతర భాషలలో విశేష పరిజ్ఞానమూ, ఇతర భాషలలో విశేష పరిజ్ఞానమూ కలిగి ఉండాలి.

ఇక సంగీత పరంగా చెప్పిన లక్షణాలలో ముఖ్యమైనవి ఆరున్నాయి.

'తూర్యత్రితయ చాతుర్యం హృద్య శారీర శాలితా
లయతాల కలాజ్ఞానం వివేకానేక కాకుషు'2

1. తూర్యత్రితయ మంటే నృత్యగీతవాద్యాలు - వీటిలో నేర్పుండాలి.

2. శారీరం అంటే గాత్రం (కంఠం) హృద్యంగా ఉండాలి.

3. లయలోని ద్రుత మధ్యమాది భేదాలు, లక్షణ కర్తల చేత వివరించబడిన తాళాలని గురించి తెలిసి ఉండ డమే లయతాల కలాజ్ఞానం.

4. కాకువంటే ఛాయ. అంటే గాన పద్ధతిలోని 'యాస' అనవచ్చు. ఇవి ఆరు. స్వరకాకువు, రాగకాకువు, అన్యరాగ కాకువు, దేశకాకువు క్షేత్రకాకువు, యంత్రకాకువు.

వాగ్గేయకారునికి ఈ కాకువులన్నీ తెలిసి ఉండడం అత్యంతావశ్యకం. ఆ కాకువులు తెలిస్తే వాటికి అనుగుణ మైన పద ప్రయోగమూ, ఆ పదబంధానికి సరిపోయే సంగీత రచనా అతనికి వశమవుతాయి.

'ప్రభూత ప్రతిభోద్భేధ భావత్వం సుభగగేయతా
దేశిరాగేష్వభిజ్ఞానం వాక్పటుత్వం స భాష్యతే'

5. నిత్యలోక పరిశీలనా, శాస్త్ర కావ్యపారాయణమూ, నిత్యకవితా కళాసాధన హేతువులుగా ప్రభవించే శక్తి 'ప్రతిభ' అనిపించుకుంటుంది. ఇది వాగ్గేయకారునికి ఎంతో ముఖ్యం.

వాగ్గేయకారుడు తానే శ్రావ్యగాయకుడై ఉండాలి. అదే సుభగగేయత.

6. దేశిరాగాలను గురించిన పరిపూర్ణ జ్ఞానం అవసరం. దేశిరాగాలు తెలిస్తేనే దేశ భాషలలో గేయరచన ఆ రాగాను గుణ్యంగా చేయడానికి వీలవుతుంది.

చిత్తైగ్రత కలిగినవారు శ్రేష్ఠుడైన వాగ్గేయకారుడని శార్ఙ్గదేవుడు నిర్వచనం.

ఈ వాగ్గేయకార లక్షణాలని పరిశీలిస్తే ఉత్తమ కవికి ఉండవలసిన లక్షణాలతో ఏ మాత్రం తీసిపోవని తెలుస్తోంది. అంతేకాదు, కవి కంటే కూడా ఉత్తమ వాగ్గేయ కారునిలో సంగీతాది కళలలో పరిజ్ఞానం ఉండాలని స్పష్టమవుతుంది.

శార్ఙ్గదేవుడు వాగ్గేయకారులలో ఉత్తమ, మధ్యమ, అధముల లక్షణం కూడా చెప్పాడు. సంగీత రచన బాగా చేయకలిగి మాటల కూర్పులో మందుడైతే మధ్యమ తరగతి వాగ్గేయకారుడు. మాటల కూర్పులో నేర్పరీ, సంగీత రచనలో మందుడూ అయితే అధముడు. మాటల కూర్పులోనూ, సంగీత రచనలోనూ కూడా నేర్పరి అయిన వాగ్గేయకారుడు ఉత్తముడు.

ఇంకొక విధమైన భేదనిరూపణం కూడా ఉంది. వస్తుకవి అంటే ఇతివృత్తాన్ని తీసికొని కథగా అల్లగలిగే కథాకవి ఉత్తముడు. కథలో రామణీయకత లేకుండా వర్ణనలు మాత్రం బాగా చేయగలిగేవాడు మధ్యముడు. ఇతరుల సంగీత రచనకి మాటలు మాత్రం కూర్చేవాడు అధముడు.

అలాగే ఆధునిక వాగ్గేయకారులని మూడు విధాలుగా విభజించవచ్చు. పూర్తిగా సంగీత విద్వాంసులయి సాహిత్యంలో ఒక విధమైన ప్రవేశం కలిగి గేయరచనలు చేసినవారు, పూర్తిగా సాహిత్యపరులయి లీలగా సంగీతాభిరుచి కలిగి గేయరచనలు చేసినవారు, సంగీత సాహిత్యాలలో సమానాభినివేశం కలిగి గేయరచనలు చేసినవారు.

పైన వివరించన లక్షణాలని సోదాహరణంగా నిరూపించి రజనీకాంతరావుగారు ఉత్తమ వాగ్గేయకారులని ఈ వ్యాసంలో నిరూపించడం జరుగుతుంది.

సాహిత్యపరమైన లక్షణాలు :

శబ్దానుశాసన జ్ఞానం - 'మేనక' అనే గేయనాటికలో ఇంద్రుడు రంభాది అప్సరసలని పిలుస్తూ జ్వలన్నిశ్చల ప్రణయ నర్తకీ మేనకా అని సంబోధిస్తాడు. సంస్కృత వ్యాకరణ సూత్రానుసారం జ్వలత్ + నిశ్చల - జ్వల న్నిశ్చల అవుతుంది. ఇక్కడ ఈ శబ్ద ప్రయోగం సాభిప్రాయంగా, నిర్దుష్టంగా జరిగింది. రంభాది అప్సరసలు విశ్వామిత్రుని తపోభంగం చేయలేక వెళ్ళిపోయినా, మేనక మాత్రం నిశ్చలమై విశ్వామిత్రుని నిజప్రణయాధీనునిగా చేసుకొనే దాకా కదలలేదు. ఈ విధంగా వస్తుధ్వనని గర్భీకరించుకొన్న సంబోధనా ప్రయోగం రజనిగారి ప్రతిభావ్యుత్పత్తులని ప్రకటిస్తూ కావ్యగౌరవాన్ని ఇనుమడింప జేస్తోంది.

'సుభద్రార్జునులు' అనే గేయనాటికలో బలరాముడు అర్జునుని నిందించిన సందర్భంలో పదరాపార్థ! అపార్థ! అనే పంక్తిలోని పార్థాపార్థ శబ్దాల ప్రయోగం సాభిప్రాయమై అలరారుతోంది.

'చండీదాసు' గేయనాటికలో రామినీ చండీదాసులు తమ ప్రేమ ఫలిస్తుందా లేదా అని దుఃఖించే సన్నివేశంలోని.

"మన ప్రేమ....

సస్య సౌందర్య భూములలో"

అనే గేయంలో రజనిగారు ప్రదర్శించిన రచనాశిల్పం అనితరసాధ్యం. ఈ రచనలో శబ్దార్థాలు సౌందర్య శిఖ రాగ్రాన్ని స్పృశించాయి. నమ్ర మరు సీమము - కమ్ర నమధామము, శీర్ణ సికతాద్రి - పూర్ణ కలశాబ్ధి దగ్ధ తరుకాండము - ముగ్ధమధుబాండము విరహవిశ్వాసము - సరస దరహాసము వంటి సాభిప్రాయపదబంధాలతో నాయికా నాయకుల ప్రణయ సాఫల్య వైఫల్య విరుద్ధ భావాలని హృదయంగమంగా వ్యక్తీకరించి, చివరి చరణంలో 'ప్రణయ స్వేచ్ఛాభగామి, నిరవధిక సౌఖ్యధావి' అని కేవలం సాఫల్యాన్ని సూచించే పదబంధ ప్రయోగంతో వారిరువురి ప్రణయజీవితం సఫలమవుతుందని ధ్వనింప చేశారు.

ఇలా వారి గేయాలనుండి ఎన్నో ఉదాహరణలియ్య వచ్చు.

అభిధానప్రవీణత - శ్రీ రజనీకాంతరావుగారు సంస్కృ తాంధ్ర సాహిత్యాలని అభిమాన విషయాలుగా బి.ఏ. ఆనర్స్ చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అనేక బాషలలో గేయరచనలు చేశారు. వారి ఆంగ్లానువాదాలు, సంస్కృత రూపక రచనవలన వారికి ఆంధ్రనిఘంటు వులతోనే కాక అమర కోశాది సంస్కృత నిఘంటువులతోను, ఆంగ్ల నిఘంటువులతోను పరిచయం ఉండడమే కాక శబ్దాలకు లోక ప్రమాణరీత్యా ఏ అర్థాలు సాధువులని నిర్ణయించారో అదంతా చక్కగా తెలిసినవారు రజనీకాంత రావుగారు అని వెల్లడి అవుతోంది. ఇంక సంగీత విషయానికి వస్తే ఆయన సంగీత శాస్త్ర రహస్యాలని వ్యాఖ్యానించే 'సంగీత నిఘంటు'వుగా కళాప్రియుల మన్ననలందు కున్నారు. శాస్త్రీయ సంగీతానికి ఆయన ఓ ఎన్‌సైక్లోపీ డియా.


ఛన్దః ప్రభేద వేదిత్వం :

శ్రీ రజనీకాంతరావు మార్గదేశి ఛందో జ్ఞానం కలవారు. తేటగీతి, ఆటవెలది, కందం, మంజరీ ద్విపద మొదలైన దేశీ ఛ్ఛందాలో వారు వ్రాసిన పద్యాలు వారి గేయనాటికలలో ఉన్నాయి. అవి కాకుండా ముత్యాలసరం మొదలైన గేయచ్ఛందస్సులలో కూడా వారు సిద్ధహస్తులు.

ఉదాహరణకి - వారి నృత్యగేయనాటిక 'కళ్యాణ శ్రీనివాసం'లో ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం వంటి వృత్తాలతో పాటు తేటగీతి కందము కూడా ఉన్నాయి. అలాగే 'శ్రీకృష్ణ శ్శరణంమమ'లో తేటగీతి, కందపద్యా లున్నాయి. 'మేఘసందేశం'లో తేటగీతులు, మంజరీ ద్విపదలు, లకుమాదేవిలో

కందపద్యాలు, చండీదాసులో ముత్యాలసరం ఉన్నాయి. ఇవికాక వాగ్గేయకార చరిత్రములోని, అంకిత పద్యాలు, విశ్వవీణ సంపుటిలోని కృతీ సమర్పణ పద్యాలూ కూడా పద్యరచనలో వారికి గల నైపుణ్యాన్ని నిరూపిస్తు న్నాయి. దీనిని బట్టి వీరు గేయరచనలోనే కాక పద్యరచనలో కూడా ప్రావీణ్యం గలవారని. తెలుస్తూంది. రజనీకాంతరావు పద్యకవిత్వము వ్రాయలేనివాడు కాడు. ఇతడు రచించిన పద్య కవిత్వము ఇందు ప్రకటింపబడకపోయినను బహుళ ముగా కలదు.

అలంకార కౌశలం - రజనిగారి అలంకార కౌశలాన్ని నిరూపించడానికి కొన్ని ఉదాహరణలు 'అంత్యానుప్రాస', 'తెలుగుతల్లి', 'శతపత్రసుందరి', 'జ్యోతి', 'గ్రీష్మజృంభణం', 'విరహిణి' రాధ, శ్రావణలక్ష్మి ఉజ్వల ప్రభాతము, 'పృథ్వీ ప్రశంస' మొదలైన గేయాలలోనూ, 'ముక్తపదగ్రస్తం' మేనక





వక్త "రజని"

గేయనాటికలోనూ గోచరిస్తాయి.

ఉపమాలంకారము - 'మధురానగరీగాథ' లో (గేయనాటిక), 'కృష్ణావతారం' గేయంలోని 'సుదర్శన చక్ర' వర్ణనలోనూ 'పూలచెండు' గేయంలోనూ 'చలికారు' గేయంలోనూ 'సెలయేరు' గేయంలోను గోచరిస్తుంది.

రూపకాలంకారం - 'చినుకు కన్నియలు' (చినుకుపాట), శ్రావణలక్ష్మి వనలక్ష్మి యౌవనలక్ష్మి (వసంతోత్సవం), ఆర్తి తమస్సు (ఉజ్జ్వల ప్రభాతము) ఆనందసుధ (ప్రబోధము), నిశారాజ్ఞి (విజయప్రభాతము), అలలడోల (జోల), అశామృణాల హారవళి (విరహిణి) మొదలైన రూపకాలంకారాలు కనిపిస్తాయి.

అతిశయోక్తి - 'లాక్షాచిత్రణ' గేయంలోనూ 'పరిష్వంగం' అనే గేయంలోనూ ఉంది. 'దృష్టాంతాలంకా'రము 'యక్షునిగ్రీష్మం' అనే గేయంలోని వియోగ వర్ణనలోనూ - శ్లేష - 'వసంతం' అనే గేయంలోని వర్ణనలోని 'సఫల శబ్దములో'నూ 'మయూరి' అనే గేయంలోని 'వన్నెల కన్నులు' అనే పదంలోనూ శ్లేష ఉంది.

అర్థాంతరన్యాసాలంకారము : - 'రతివిలాపము' అనే గేయంలోని వర్ణనలో ఉంది.

కవిసమయాలు - వీరి గేయాలలో ప్రసిద్ధమైన కవిసమయాలున్నాయి. సూర్యోదయంతో పద్మాలు వికసిస్తాయి. సూర్యాస్తమయంతో పద్మాలు ముకుళిస్తాయి అనే కవిసమయం శతపత్ర సుందరి, 'విరహిణి', 'అస్తమయం' అనే గేయాలలోనూ, చంద్రోదయంతో కలువలు వికసిస్తాయి. అనేది కలువ వలపు, శశిపిలుపు, అనే గేయాలలోను, పూలకీ తుమ్మెదకీ ఉన్న నైసర్గిక సంబంధాన్ని, ప్రణయంగా చిత్రించడం. 'మధుసాయి, రోద, జాజి, తుమ్మెద', అనే గేయంలోనూ, తారాచంద్రులని నాయికా నాయకులుగా వర్ణించడం 'వెన్నెలరేయి' అనే గేయంలోనూ, 'వెంటివెంటి కనుబొమ్మలు' ప్రయోక్తిలోను, విరిసరాలు, చిరుతమీలు, కారుమొగులు, 'చెలిసొగసు,' అనే గేయంలోను, ముఖచంద్రుడు చిర్నగవుల వెన్నెలలు 'యుగళగీతి' అనే గేయంలోనూ ఉన్నాయి. ఈ అలంకారాలన్నీ, 'రజని'గారి గేయకవితా కన్యకి చక్కటి

అలంకారాలు.

రసభావ పరిజ్ఞానం - శ్రీ రజనీకాంతరావుగారి గేయ నాటికలు అలంకార శాస్త్రజ్ఞులు వివరించిన నవరసాలని ఒలికిస్తాయి. ఉదాహరణకి, శృంగారరసం - 'మేనక', 'మధురానగరిగాథ', లోనూ, వీరరౌద్రరసాలు, - 'సుభద్రా విజయం'లోనూ, కరుణరసం - 'విశ్వవీణ' లోనూ, భీభత్సం, శాంతిపథంలోనూ, అద్భుతం - 'కళ్యాణ శ్రీనివాసం' 'శ్రీ కృష్ణశ్శరణం - మమ'లోనూ, వీరాద్భుతాలు - 'విజయవిధాతలో'నూ భయానకం - 'అమృతవర్షిణి'లోని గరుడుని రాకని వర్ణించే సందర్భంలోనూ హాస్యం 'కన్నె కాకి బావ' అనే గేయంలోనూ గోచరిస్తాయి.

కనుక వీరికి రసభావ పరిజ్ఞానం పరిపూర్ణంగా ఉంది.

రాగరచనలో రసభావం :

రసానుభవాన్ని సాహిత్యం ద్వారానే కాదు, సంగీతం ద్వారా కూడా పొందవచ్చు. రసభావాన్ని వ్యంజింప చెయ్యడానికి సంగీతం కూడా ఒక శక్తివంతమైన సాధనం.

సాధారణంగా సాహిత్యంలో రసం మాటల ద్వారాను; నాటకంలో మాటలు, అభినయం ద్వారాను; గేయనాటికలలో మాటలు, అభినయం, సంగీతం ద్వారాను; నృత్యనాటకంలో మాటలు, అభినయం, సంగీతం నృత్యం ద్వారాను అభివ్యక్తమవుతుంది. కాని, సూర్యకాంతరాగంలో, మాటలు లేకపోయినా కేవలం స్వరాలే విరహ విప్రలంభ ద్యోతకాలు. ఇటువంటి అపవాదులు కొన్ని ప్రతిచోటా ఉంటాయి.

వాగ్గేయకారులు తమ కీర్తనలలో ఒక్కొకరసాన్ని ఒక్కొక్క రాగంలో పలికిస్తారని కొందరి అభిప్రాయం, ఖమాస్ రాగం భక్తి శృంగారాలనీ; ముఖారి, నాదనామక్రియ, పున్నాగవరాళి అహిరి గౌళిపంతురాగాలు, కరుణరసాన్నీ; అరభి అఠాణ రాగాలు రౌద్రాన్నీ; హిందుస్తానీ బేహాగ్ అద్భుతాన్నీ; శామరాగం శాంతాన్నీ; ఘంటారాగం భయానక రసాన్నీ; బిలహరి, కేదార వీరరసాన్నీ; వరాళి బీభత్సాన్నీ; కేదారగౌళ భైరవి భక్తినీ; నీలాంబరి వాత్సల్యాన్నీ ధ్వనింపచేస్తాయని శ్రీ.పి. సాంబమూర్తిగారు వివరించారు.

ఈ విషయం కొంతవరకు నిజమే కాని, ఈ రాగంలోనే ఈ రసాన్ని గానీ భావాన్ని గానీ పలికించగలమని నిర్ణయించి చెప్పడం అన్ని వేళలా సాధ్యం కాదు. (కదనకుతూహలం లాంటి) కొన్ని రాగాలు కేవలం గానరసాన్ని కలిగిస్తాయే గానీ నవరసాలని కాదు.

అద్భుతరసం - శ్రీ కృష్ణశ్శరణం మమ నృత్యగేయ నాటికలో.

'ఇదికలయో వైమమాయో ......' అని యశోద కృష్ణుని నోరు తెరిపించి ఆశ్చర్యపోయిన సందర్భంలోని గేయాన్ని 'షణ్ముఖప్రియ' రాగంలో కూర్చి అద్భుతరసాన్ని పోషించారు. హిందూస్తానీ భోహాగ్‌లో కాదు.

శాంతిరసం - 'అమృతవర్షిణి' గేయనాటికలో జీమూతవాహనుడు వైనతేయుని శాంతింవచేసే సందర్భంలోని

'వైనతేయ బలి గ్రహించుమా.......నీ
దాహతాపము శమింపగా నా
దేహ రక్తమును పీల్చుమా'

అనే గేయాన్ని సామ రాగంలో కూర్చి శాంతరసాన్ని ప్రకటించారు.

భయానకం - 'అమృతవర్షిణి'లో గరుడుని రాకని వర్ణించే సందర్భంలోని

"రివ్వు రివ్వు, రివ్వు రివ్వు రివ్వు మనుచును
దువ్వు దవుల దవ్వు దవుల సవ్వడాయెనే....
కాలరాత్రి కురుల పాయగా
నీలిమబ్బు తెరల చాయగా
భూనభోంతరమ్ము లదరగా
నాగులెల్ల బెదరి చెదరగా
వచ్చిపడెను వచ్చిపడెను గరుడుడయ్యో.

అనే గేయాన్ని సావేరి రాగంలో కూర్చి భయం కలిగించారు. ఘంటా రాగంలో కాదు.

సంయోగశృంగారం - దీన్ని ఖమాస్ రాగంలో కూర్చలేదు. 'మేఘసందేశం'గేయనాటికలో అద్దము చూపవో సఖా, అనే గేయాన్ని నాటకురంజి రాగంలోనూ, నీ పలువరుసలు నీ కనుకొలుకులు అనే ప్రణయ గేయాన్ని మలయమారుత రాగంలోను కూర్చి శృంగార రసావిష్కరణ చేశారు. నిలుమా సఖినిలుమా (మేఘసందేశం) అనే గేయాన్ని హిందుస్తాని బేహాగ్ లో కూర్చారు.

విప్రలంభ శృంగారం - 'మేఘసందేశం' లోని 'దుస్సహ

మీశాపమయ్యో', అనే గేయాన్ని వకుళాభరణ రాగంలోనూ,

"ఏ దూర సీమనో, ఏ విసిన భూమినో
ఈ విరహమెన్నాళ్ళు ఎటు సైచునో విభుడు"

అనే గేయాన్ని చారుకేశి రాగంలోనూ కూర్చి వియోగవ్యథని వర్ణించారు.

వీరరసం - 'విజయవిధాత' లోని 'విజయవిధాతల మేమే విశ్వ విజేతల మేమే' అనే గేయాన్ని కేదార రాగంలో కూర్చి దేవతల వీరవిజయవిహారాన్ని వివరించారు.

కరుణరసం - 'అమృతవర్షిణి' లోని -

'నాగలోకవాసులెల్ల నాశమై పోవుదురో అ
య్యో గరుడు మహాగ్రహాగ్నికి ఆహుతై పోవుదురో'

అనే గేయాన్ని పున్నాగవరాళీ రాగంలో కరుణ రసపూరితంగా కూర్చారు.

భక్తి - 'భక్తి'ని భైరవి, శంకరాభరణం, దేవగాంధారి, మొదలైన రాగాలలో ప్రదర్శించారు.

వాత్సల్యాన్ని 'రీతిగౌళ' రాగంలో కూర్చారు. నీలాంబరిలో కాదు 'శ్రీ కృష్ణశ్శరణం' మమలోని ఎంతో వెలుగవురా - ఇంత వింతౌ శిశువువురా అని వసుదేవుడు పాడిన పాట దీనికి ఉదాహరణ. 'దీన్నే సంగీత దర్శకుడు తర్వాత మార్గహిందోళనకు మార్చారు అలాగే సుభద్రావిజయము లోని బలరాముడు అర్జునుడు సుభద్రని హరించాడని తెలిసినప్పుడు

'తెండి నా ధనుర్బాణాల్
ద్రుచ్చగ పార్థుని వధింతు
ఒరే బంధువిద్రోహి
పడరాపార్థ అపార్థా!'

అని పలికిన రౌద్రరసయుక్తమైన గేయాన్ని 'పూర్వికల్యాణి' రాగంలో కూర్చారు. ఆ గీతికి సంగీత సాహిత్యాలతో కలిసిన రౌద్రరసవాహిక. దీన్ని ఆరభిలోగాని, అఠాణలోగాని కూర్చలేదు.

'అమృతవర్షిణి' లో

'దిన దిన మొక్కొక్క నాగకుమారుడు
చమ యమునింటికి కులప్రళయమిది!
కనుమవె హతులగు నాగకుమారుల
కంకాళమ్ములు అస్థిశేషములు!

సత్కార కలహంస

సీ॥ ఈ అపూర్వైక సత్కృతికి సంతోషించు
'ప్రమదావన' విహార భావకవిత
ఈ విశిష్టైక సత్కృతికి ఆనందించు
'గిరజాల సరదాల కృష్ణ' కవిత
ఈ అపూర్వైక సత్కృతికి సంతసమందు
'సృష్టిలో తీయని స్నేహ' కవిత
ఈ విశిష్టైక సత్కృతికి ఆమోదించు
లలిత సంగీతంపు రమ్య కవిత
ఈ అపూర్వైక సత్కృతికి ఆనందించు
అల్లపల్లెపదాల అమృత కవిత
'అప్పజోస్యుల' 'విష్ణుభట్లా'ఖ్య సంస్థ
'రజని కాంతున' కున్న అర్హత నెఱింగి
'భీమవరము'న గౌరవస్థేమ మిడుట
కెడద ముదమొందని పదార్థమెందుగలదు?

గీ॥ ఉదయమున భక్తిరంజనైయొప్పమీ
లలిత సంగీతమై పగల్ బాగుమీరి
అరయమలి ప్రొద్దు రూపకంబై చెలంగి
రాత్రి రసవత్ ప్రసంగమై రాణగాంచి
గగనవాణియే తానుగా జగతికెక్కు
దొర ఎవండిల? 'రజని కాంతుండు' దక్క॥

మ॥ అలగాగన్ గదలాడు జానపదగేయంబైన వాడా, రసో
జ్జ్వలసారస్వతమైత్రి గాథలుగ తెల్పంజాలు వాడు, చ్ఛలత్
తెలుగున్ విశ్వకళాలయుండు - విలసద్దివ్యంపు సత్కారవుం
గల హంసై వెలుగొందువాడు 'రజనీకాంతుండు' తానొక్కడే!॥

ఆ.వె ॥ మాట - పాటలోన, మౌలిక రచనలో
తెనుగుదనము నింపుకొనిన 'రజని'
కందజేయు మహితమౌ 'అవార్డ'మెరికా
తెలుగు కిచ్చునట్టి వెలుగె ఇద్ది॥

డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ

నేడాయెను మా సుతువంతు,

మా శంఖచూడు బ్రతుకున కంతు!

అనే గేయచరణం పున్నాగవరాళిరాగంలో పరస్పరమూ వివాదులైన స్వరాలతో కూడి బీభత్స కరుణరసాలని ఆవిష్కరిస్తోంది.

'శాంతిపథం'లో బీభత్సానికి కనకాంగి వివాదిస్వర క్రమంతో సాగే ప్రథమమేళకర్తలో సంగీతపు వరుస కూర్చారు.

ఈ విధంగా రాగాలు అనేక రసాలని వ్యంజింపచేస్తాయి.

రాగాలలోని జీవస్వరాలు రసాన్ని వ్యక్తం చేస్తాయి. అంతే కాకుండా గేయంలోని లయ, తాళం మీద కూడా రసభావం ఉంటుంది. విలంబిత లయలో సాగేవి భక్తి కరుణ, వాత్సల్యాలని ప్రకటిస్తాయి. ద్రుతలయలో సాగేవి వీరరౌద్రాద్భుత రసాలను ఆవిష్కరిస్తాయి. అన్నీ జీవస్వరాలే గల కొన్ని రాగాలు ఒకదాని కంటె ఎక్కువ రసాలని ప్రకటించే శక్తి గలిగి ఉంటాయి.

ఉదాహరణకి - శంకరాభరణం మోహన, కాంభోజి, కల్యాణి మొదలైనవి. మరికొన్ని ఒకటి రెండు రసాలనే వ్యక్తం చేస్తాయి. ఉదాహరణకి - శంకరాభరణం, మోహన కాంభోజి, కల్యాణి మొదలైనవి. మరొకొన్ని ఒకటి రెండు రసాలనే వ్యక్తం చేస్తాయి. ఉదాహరణకి పున్నాగవరాళి, ముఖారి మొదలైనవి.

మొత్తం మీద రాగంలో రసావిష్కరణం అనేది రాగాన్ని, రాగంలోని స్వరప్రయోగాలని ఉపయోగించుకోవడం మీద (treatment of raga), ధాతుసంయోజనా విధానం మీద (The manner of developement of the dhathu) అధారపడి ఉంటుంది.

అశేషభాషాజ్ఞానం - రజనిగారికి తమ భాషలో అశేష పరిజ్ఞానం ఉంది. ఉదాహరణకి 'చండీదాసు'లో అనే గేయనాటికలో "మన ప్రేమ సస్య సౌందర్య భూములలో....' అనే గేయం ఒక్కటి చాలు. ఆ గేయంలో వారు ప్రదర్శించిన రచనాశిల్పం నిరుపమానం.

వారికి ఇతర భాషలలో విశేష పరిజ్ఞానం కూడా ఉంది. దీన్ని నిరూపించడానికి వారి అనువాదాలని పేర్కొనవచ్చు. శ్రీ వేంకట పారతీశ్వరకవుల ఏకాంతసేవనీ, క్షేత్రయ్య, పదాలు కొన్నిటినీ రామదాసు సంకీర్తనలు కొన్నిటిని, కొండ నుండి కడలిదాక, అనే గేయ రూపకాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. మేఘసందేశం రూపకం సంస్కృతంలో వ్రాశారు. తమ గేయాలని ఇతర భాషలైన హింది, కన్నడం మొదలైన భాషలలోకి స్వయంగా అనువదించి ప్రసారం చేసిన బహుభాషా కోవిదులు రజనీకాంతరావుగారు.

సంగీత పరమైన లక్షణాలు

తూర్య త్రితయ చాతుర్యం - శ్రీ రజనీకాంతరావుగారికి గీత వాద్యాలు రెండింటిలో నేర్పుంది. నృత్య శాస్త్రం గురించి తెలుసు నృత్యప్రధానమైన నృత్యగేయనాటికలని రచించారు. మధురాగనగరిగాథ, సుభద్రా విజయము, మేనక రాసలీల, అమృత వర్షిణి లకుమాదేవి, విజయ విధాత మొదలైనవే కాకుండా శ్రీమతి శోభానాయుడిగారి కూచి పూడి నృత్య ప్రదర్శనకోసం 'కళ్యాణశ్రీనివాసం', 'శ్రీ కృష్ణశ్శరణంమను' అనే నృత్యగేయనాటికలని ప్రత్యేకంగా రచించారు.

'ప్రదర్శనానుకూలత వీరి గేయనాటికలలోని మేటి గుణము'.

శ్రీ రజనీకాంతరావుగారి గీతాలు రసరమ్యపారిజాతాలు. వారు గీత రచన చేయడమే కాకుండ గీతాలకి సంగీత రచన కూడా తామే చేసిన ప్రతిభ కలవారు. అంతే కాదు గీతాలలో నాటకీయతని రంగరించి రమ్యరచనలు చేసిన రససిద్ధులు. "గేయమున నాటకీయతను రంగరించి రచన సాగించుట రససిద్ధులైన కవులకే సాధ్యము. అట్టి రచనలో శ్రీ రజనీకాంతరావుగారు సిద్ధహస్తులనుట అతిశయోక్తి కాదు".

నృత్యగీతాలలోనే కాదు వాద్యరచనలో కూడా వారు సిద్ధహస్తులు. అనేక వాద్యబృందాలకి సంగీత దర్శకత్వం చేసి ప్రసిద్ధి పొందారు. ఉదాహరణకి 'ఆంధ్ర - కల్యాణి', ఆదికావ్యావతరణం, ఋతుచక్రము, విశ్వయానం, కామదహనం,

హృద్య శారీర శాలిత - శ్రీ రజనీకాంతరావుగారి శారీరం అంటే గాత్రం (కంఠం) ప్రశంసాపాత్రం. తారస్థాయిలో వారు పాడేటప్పుడు వారి కంఠం శ్రావణాభ్రంలాశ్రావ్యంగా, హృద్యంగా ఉంటుంది.

లయతాలకలా జ్ఞానం - శ్రీ రజనీకాంతరావుగారు లయతాల కలాజ్ఞాని. ఉదాహరణకి - అన్నమాచార్యుల పాటని తీసుకుని రజనిగారిలా వివరించారు.



పినాకపాణి గారితో

"తొలి కలవె ఇవియు తొల్లి తాను కలడె
కల్లయును కాదు యిది కడు నిజముకాదు.

ఇది పాటే అయిన తటాలున పద్య స్ఫురణ కలిగినవారు చదివితే (చిట్టిచివర) కొంచెం భిన్నంగా ఉన్న సీసపద్యమా అనిపిస్తుంది. ఇంద్ర గణాలు ఆరూ, రెండు సూర్య గణాలూ ఒక సీసపాదం, భలమూ నలలమూ, అంటే భగణానికి చివర ఒక లఘువూ, నగణానికి చివర రెండు లఘువులు పాటలో ప్రతి అవృతానికీ ఐదేసి మాత్రలు రావడానికి అనువుగా ఈ పాట రెండవ పంక్తిలో లెక్కకి వస్తాయి.

"తొల్లి కల। వె ఇవియు। తొల్లి తా ।నుకలడె
కలయును । కాదు యిది । కడు నిజము । కాదు"

కడు నిజము కాదు అనే మాటలకు బదులు కాదు నిజము అని చివరను చేరిస్తే కొంచెం తేడాలతో సీసపద్యమే అనిపిస్తుంది.

రెండో పంక్తిలో ఐదు మాత్రలతో విడివడిన పెద్దగణాలు ఈ పాటకి ఈ తాళం అని అంటే ఖండగతి (ఐదు మాత్రల) తాళం అని సంగీత స్ఫురణ ఉన్నవారికి స్ఫురిస్తుంది.

అప్పుడు పై పాటకి తాళ శరీరం ఇలాగ కనబడుతుంది.

"తొల్లి కల। వె ఇవియు। తొల్లి తా ।నుకలడె
కలయును । కాదు యిది । కడు నిజము । కాదు"

ఇందులోని విభజన, తాళ అవృతాలు ఒక్కొక్క దానికి సమాన సంఖ్య గల మాత్రలుండేటట్లు పొట్టి అక్షరాలను పొడిగించడం జరిగింది. చిట్టచివర అయిదు మాత్రలలో మూడింటిలో కాదు అన్న తర్వాత రాగం తీసుకోవచ్చు లేదా నాదవిరామం అంటే నిశ్శబ్దంగా ఊరుకోవచ్చు.

"ఆదితాళంలో భజన కీర్తనగా పాడుకునే నారాయణ తీర్థుల తరంగం....

"శరణం భవ। కరుణాంమయి। కురుదీనద। యాళో
మధుసూదన । మధుసూదన ।
హరమామక । దురితం"

ఒక్కొక్కతాళ ఆవృతానికి ఆరేసి మాత్రం నాలుగు ఆవృతాలుంటే రూపకతాళం పడుతుంది.

"శరణం ఉఉభవ। కరుణాంఅఅ మయి । కురుదీ
ఇఇ నద । యాళో ఓఓ

ఈ విధంగా ప్రతి ఆవృతంలోని నాలుగో అక్షరాన్ని మరిరెండు మాత్రల చొప్పున రాగంలో పాడిగిస్తే ఆవృతానికి ఎనిమిదేసి మాత్రల చొప్పున నాలుగు అవృతాలతో ఆదితాళం రూపొందుతుంది.

కందుకూరి రుద్రకవి రచించిన యక్షగానం 'సుగ్రీవ విజయం'లోని ఒక ఏలపాటతో ఈ చర్చను రజనిగారిలా ముగించారు.

"భానువంశ। మునబుట్టి। దానవకా । మినిగొట్టి
మౌనివరులు। సమ్మతింప । గా॥ ఓ। రామచంద్ర

ఆరేసి మాత్రలలో త్రిశ్రగతీ లేదా రూపకతాళంలోని ఆవృతాలను పైని గుర్తించాము. ఇదే ఏడుమాత్రల గతిలో ఇలా గుర్తించవచ్చు.

"భానువంశా । మూనబుట్టీ।దానసాకా । మీనిగొట్టీ
మౌనివరులూ । సమ్మతింపా । గా ॥ ఓ । రామచంద్రా

దానినే ఎనిమిది మాత్రల ఆదితాళంలో ఇలాగా పాడవచ్చు. మొదట ఒక మాట మాత్ర నిశ్శబద్ధం.

"భానువంశా । మూనబుట్టీ । దానవాకా । మీనిగొట్టీ
మౌనివరులూ । సమ్మతింపా । గా ॥ ఓ । రామచంద్రా

పైన పేర్కొన్న శ్రీరజనిగారి వివరణని చూస్తే వారికి గల లయతాలకలాజ్ఞానం వెల్లడి అవుతుంది.

అంతే కాకుండా వారి గేయనాటికలలో ఆదితాళం, రూపకతాళం, రూపకతాళం, ఝంపతాళం, మిశ్రచాపు, ఖండచాపు, త్రిశ్రత్రిపుట, చతురశ్రత్రిపుట, అటతాళం విలోమచాపు, (4+3) మొదలైనవి ప్రయుక్తమయ్యాయి.

కాకువులు - శ్రీ రజనిగారికి సంగీతంలోని కాకువులన్నీ తెలుసు. అవి స్వరకాకువు, రాగకాకువు, అన్యరాగకారుకువు., దేశకాకువు, క్షేత్రకాకువు, యంత్రకాకువు.

స్వరకాకువు అంటే ప్రత్యేకం స్వరములకే సంబంధించిన యాస, ఏ స్వరాన్ని ఏ స్థానంలో ఏ విధంగా పట్టాలో ఆయాస, రాగ కాకువంటే ఆయా రాగాలకి ప్రత్యేక లక్షణమైన రాగ స్వరూప నిర్దేశకమైన యాస. అన్యరాగ కాకువు అంటే రాగాలలో తదితర రాగాలకి చెందిన సంగతులు ప్రయోగించడానికి వీలుకలిగినపుడు అలా ప్రయోగించినపడు కలిగే ప్రత్యేక యాస. ఆయా దేశాలలో ఒక్కొక్క రాగాన్ని వేర్వేరు యాసలలో పాడవచ్చు, అదే దేశకాకువు. పాడే గాత్రం స్త్రీదా, పురుషుడిదా, సన్నగొంతా, గౌడగాత్రమా అనే భేదాన్ని తెలిపేది క్షేత్రకాకువు.

ఒక్కొక్క జంత్ర వాద్యానికి వ్రయోగించే పద్ధతిని బట్టి వేర్వేరు యాసలు కలుగుతాయి కనుక అది జంత్రకాకువు. ఈ కాకువులన్నీ రజనిగారికి తెలుసని చెప్పడానికి కొన్ని ఉదాహరణలు.

స్వరకాకువుకి - వాతావరణ కాలుష్యం గురించి రజనిగారు రసికప్రియ రాగంలో (72 వ మేళకర్త)

పుస్తకాల అలమర్పై భూగోళం ఒరిగుంది
గోళమంటి పుడమితల్లి కుములుతోంది
భూమధ్య రేఖపై ముడతెందుకో
ధీమంత హృదయాలలో దిగులెందుకో

అనే పాటకి సంగీతం కూర్చారు. షట్ శ్రుతిరిషభం అంతరగాంధారం ప్రతిమధ్యమం, పంచమం, షట్ శ్రుతి ధైవతం, కాకలి విషాద స్వరాలతో కూడిన సంపూర్ణ రాగం ఇది. సాధారణ గాంధారం పలికిన చోటే షట్ శ్రుతి రిషభం పలుకుతుంది. అలాగే కైశిక విషాదం పలికిన చోటే షట్ శ్రుతి ధైవతం పలుకుతుంది. కనుక, ఏ స్వరాన్ని ఏ విధంగా పట్టాలో తెలిపినవారు గనుకే ఈ రాగంలో గేయం కూర్చారు.

రాగకాకువు - రజనిగారు అమృతవర్షిణి గేయనాటికలో నాగ లోకవాసులెల్ల నాశమైపోవుదురో, అనే గేయానికి పున్నాగవరాళి రాగంలో స్వరకల్పన చేశారు. ఈ రాగం నాగజాతి స్వరూప స్వభావ ద్యోతకమైనది. ఆ రాగాని కున్న ప్రత్యేకమైన యాస వారికి తెలుసు గనుక సందర్భోచితంగా దాన్ని ఉపయోగించి రాగాన్ని రక్తి కట్టించారు.

అలాగే 'ఘంనాఘంనా గర్జింపవో' అనే గేయం (శతపత్రసుందరి సంపుటిలోది) మేఘరంజని రాగంలో కూర్చబడింది. ఆ రాగంలోని స్వరసంపుటులు గాలినీ మేఘ గర్జనలనీ కురిసే వర్షాన్నీ అత్యంత సహజసుందరంగా స్ఫురింప చేస్తాయి. ఈ రాగం 15వ మేళకర్త రాగం మాయామాళవగౌళరాగ జన్యం.

అన్యరాగకాకువు - 'చండీదాసు' గేయనాటిక లోని దాసీ గానా ప్రాణబంధూ, అనే గేయానికి బెంగాలీ కీర్తన బాణిలో స్వరకల్పన జరిగింది. ఇందులోని పై పల్లవికి హరికాంభోజి మేళంలో సంగీతం కూర్చారు.

'చంద్రుడే యిరులలో దాగే జగము

తంద్రలో కనుమూసి తోగె' వరకు హరికాంభోజి రాగంలో సాగి,

ఇక్కడనుంచి మాయమాళవగౌళ అన్యరాగకాకువు వినిపించి

'బృందావనికి నీవు రావో', అంటూ అన్యరాగకాకువులో సాగి,

'మధుర మందానిలము లింక లేవో' అనే చివరిపంక్తిలో తిరిగి హరి కాంభోజ వచ్చేస్తుంది.

దేశాకాకువు - వంగదేశపు కీర్తన బాణీలో రజని వ్రాసిన 'చండీదాసు' నాటికలోని తెలుగుపాటలన్నీ వంగదేశ కాకువులో ఉంటాయి. బెంగాలీ బాణీలో ఉన్నా తెలుగుతనం పోకుండా ఉండడం వాటిలోని ప్రత్యేకత. 'దాసీ కానా ప్రాణబంధూ' అనే పాటలోని

'ఆశలో నురిగి తూలేనో ఆ
కాశమే విరిగి కూలేనో

అనే అనుపల్లవిలో దేశకాకువు పూర్తిగా ఉంది.

క్షేత్రకాకువు - స్త్రీలూ, పురుషులూ, సన్నగొంతు కలవాళ్ళూ, గౌడగాత్రం కలవాళ్ళూ, అనేక గాయనీ గాయకులు రజని పాటలని మధురంగా పాడారు. ఏ యే పాటలు ఎవరు పాడితే బాగుంటుందో ఏ భావం ఎవరి గొంతులో బాగా పలుకుతుందో గ్రహించి, వారి చేతనే పాడించి తన పాటలని రజని జనరంజకం చేశారు.

"కాలరాత్రి శిరోజాల పాయగా
నీల ఘనాఘనములపై త్రోయగా"


అనే బృందగానకాకువే ఇక్కడ క్షేత్రం.

జంత్రకాకువు : 'స్వైరిణి అన్నారు నన్ను' అనే గేయనాటికలోని

"నను చూసి నవ్వేరే నా
సఖులీ వ్రజభామినులు
పొదదాటి నదిదాటి
కదిలే వేణురవము వదిలో"

అనే గేయంలో వేణుకాకువు ఉంది. వేణు వాదనం ఎలా మెలికలు తిరుగుతుందో ఆ కాకువు ఈ గేయంలో ఉంది.

జోత!



ఇదె జోతా నీకిదె జోతా!
ఓ స్వతంత్ర భారతపితా!

పరిపాలనలో దాస్యాంబుధిలో
తెరువు నెఱుంగని దీర్ఘనిద్రలో
మరగిన నరులకు సత్యాగ్రహ మను
వరాయుధమ్ము నొసంగిన నేతా!

నీ కిదె జోతా! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా!

మన్నిక గలిగిన నరజాతులలో
ఎన్నిక గలదోయ్ మన జాతియునని
మా కొకదేశము మా కొకజెండా
మాకొక ఉన్నతి నిచ్చిన నేతా!

నీ కిదె జోతా! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా!

కరుణాశేషువు కవ్వపుత్రాడుగ
మఱిగెడుపగలే మంథానాద్రిగ
నరుల హృదంబుధి తరచి, తరచి శాం
తిరూప సుధ నందించిన నేతా!

నీ కిదె జోతా! ఇదె జోతా!
ఓ స్వతంత్ర భారతపితా!

ఇదె జోతా! నీ కిదె జోతా!
ఓ స్వతంత్ర భారతపితా!

రజనీగీతం

పై గేయనాటికలోదే అయిన
"రాగదే రాధికా" అనే పాటలో
"నింగి నీలి" మబ్బు తెరగా
నీ కొరకైవేచితి - అని లాగి దీర్ఘం తీసి
అనంగ ఖేదమాగదే అనుంగు మెరపు తీగవై

అని పాడడంలో వైయొలిన్ కాకువు వినబడుతుంది. ('అయిగిరి నందిని'.... అనే మహిషాసుర మర్దినీ స్తోత్రగేయం వీణాకాకువుకి ఉదాహరణ)

ప్రతిభ - నిత్యలోక పరిశీలన, శాస్త్ర, కావ్యపారాయణమూ, నిత్యకవితా కళాసాధనల వలన ప్రభవించే శక్తి ప్రతిభ. శ్రీ రజనిగారు అమేయ ప్రతిభ గలవారు.

వారి లోకపరిశీలనకి "పుష్పలావికుడు" అనే గేయనాటిక, 'చినుకుకన్నెలు హరివిల్లు, ఇంద్రధనుస్సు, గ్రీష్మగీతాలు', (ఈ రేడు జగాలు కాలు ఈ గ్రీష్మ జ్వాలాకీల), "ఘనా ఘనా గర్జింపవో", "ఒహో ఒహో ప్రతిశ్రుతి", మొదలైన ఎన్నో గేయాలని ఉదాహరణగా చెప్పవచ్చు.

రజనిగారు నిత్యమూ శాస్త్రాలనీ, పురాణాలనీ, పారాయణం చేసి, వాటిని చారిత్రక దృష్టితో పరిశోధించి, ప్రప్రథమంగా సాంస్కృతికపరమైన ఉన్నతిని సాధించిన జాతి ప్రాచీనమైన భారతజాతి అనీ మన భారతీయ సంగీతమే ప్రాచీనమైనదనీ ప్రతిపాదించారు.

అంతే కాకుండా వారు నిత్య కవితా కళాసాధన చేయడమే కాదు, ప్రత్యణువూ నాదాన్ని నింపుకుని ఉపాసిస్తున్నారు. ప్రతిచోటా సంగీత సాహిత్య సౌందర్యాలనే సందర్శించే పుంభావ సరస్వతి వారు.

దేశిరాగాలలో పరిపూర్ణ జ్ఞానం - శ్రీ రజనీకాంతరావు భారతీయ సంగీత పద్ధతులన్నీ తెలిసినవారు. దేశిరాగాలలో పరిపూర్ణజ్ఞానం ఉంది. అందుకే వారు కొన్నిదేశ భాషలలో గేయరచన ఆ రాగానుగుణ్యంగా చేయగలుగుతున్నారు.

'చండీదాసు' గేయనాటికకి రజనీకాంతరావుగారు కూర్చిన సంగీతం బెంగాలీ కీర్తన పద్ధతి ననుసరించింది. ఇది బెంగాలీ కవి అయిన చండీదాసు ప్రణయ గానానికి సహజత్వాన్ని చేకూర్చడం మాత్రమే కాకుండా కవికి ఆ సంగీత పద్ధతిలో గల అభినివేశాన్ని కూడా తెలుపుతోంది.

ఉదాహరణకి. ఒక గీతం
"దాసీ కానా ప్రాణబంధు
నన్ను దాసింతువె ప్రేమసింధు"

ఇంతే కాకుండా వారు దేశిరాగాలైన సౌరాష్ట్ర, సావేరి, హరికాంభోజి, మోహన, శ్రీరాగం, శంకరాభరణం మొదలైన అనేక రాగాలలో స్వరకల్పన చేశారు.

ఉదాహరణకి - 'స్వైరిణి అన్నారు నన్ను' అనే గేయనాటికలో హిందూస్థానీ శైలికి చెందిన చతుష్కలావతి రాగంలో "రాగదే రాధికా" అనే గేయానికి 'జయజయ వంతిరాగం'లో మనసౌనే ఓ రాధా అనే గేయానికి స్వరకల్పన చేశారు.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వ్రాసిన 'అతిథిశాల' అనే గేయనాటికకి శ్రీ వాత్సవగారు వ్రాసిన 'లైలామజ్నూ' గేయనాటికకీ స్వర్గసీమలో "ఓహో పావురమా" పాటకీ మధ్య ప్రాచ్య శైలిలో సంగీతం కూర్చారు. పైన వివరించిన లక్షణాలే కాకుండా మరి కొన్ని ఉన్నాయి.

1. ఇతర భాషలలోని ధాతుమాతు సంయోగ ప్రయోగ వైఖరులు బాగా తెలిసి ఉంటే తన భాషలో ప్రయోగానికి కూడా తనకు ఎన్నో కొత్త మెళకువలు తెలుస్తాయి. రజనిగారికి సంస్కృతం, హింది, బెంగాలి, కన్నడ మొదలైన భారతీయ భాషలలోని ధాతుమాతు ప్రయోగ వైఖరులు బాగా తెలుసని అంతేకాదు. మధ్యప్రాచ్యధాతశైలి, స్పానిష్‌శైలి మొదలైన విదేశీయ సంగీత పద్ధతులు కూడా వారికి తెలునని వారు కూర్చిన సంగీతం వల్ల తెలుస్తుంది.

2. భావాలకి తగిన వాఙ్నిర్మాణం చేయడం, వరకే కవీశ్వరుని ఔచిత్యనివేచనం ఉపకరిస్తుంది. కాని, వాగ్గేయకారుని ఔచిత్యజ్ఞానం మాతుధాతురచనలు రెండింటిలోనూ ఉపకరిస్తుంది. రజనిగారు రచించి, సంగీతం కూర్చిన 'ఓహో ఓహో ప్రతిశ్రుతి' 'తిరిగి తిరిగి తిరిగి ఈ రేయి ఏలనోయి' మొదలైన గేయాలు సాహిత్యభావం రాగభావం సరస సమ్మేళనం పొందిన రచనలు. అవి పై లక్షణానికి తార్కాణం.

3. మాతుధాతు వినిర్మితి - కొత్త ఫణితులలో గేయాలని రచించే శక్తిని సాధించాలి. గేయమనేది ఇతరుల ఆనందానికే. ఉదాహరణకి 'స్వామీ నీ ఆలయమున సంధ్యాదీప కళికినోయి' 'ఓహో శతపత్ర సుందరీ' మొదలైన గేయాలని ఎలా చేస్తే శ్రోతలకి ఆస్వాదయోగ్య మవుతుందో



తిరుమల తిరుపతి దేవస్థానం కళాపీఠం డైరక్టర్‌గా మల్లిచెన్నారెడ్డిగారిని ఆహ్వానిస్తూ "రజని"

తెలుసుకొని ఎప్పటికప్పుడు కొత్తగాను, వారికి తెలిసిన పుంతలలో స్వీకారయోగ్యంగాను చేశారు.

4. సంగీత శాస్త్రంలో భరతాది లక్షణ కారులు చెప్పిన దేశభాషలలో వ్యాప్తములై ఉన్న శాస్త్రీయ సంగీత రచనా రూపములైన ప్రబంధాలలో పాండిత్యం ఉంటే వాగ్గేయ కారుని గేయరచనాశక్తి విస్తృతమయి తీరుతుంది.

రజనిగారికి పైన చెప్పిన ప్రబంధాలలో మంచి పాండిత్యం ఉంది. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము అనే తమ గ్రంథంలో రజని 'ప్రబంధ లక్షణ క్రమ పరిణామము' అనే పేర ప్రత్యేకమైన అధ్యాయం వ్రాయడమే కాకుండా ఆ తరువాతి అధ్యాయాలలో ఆయా వాగ్గేయకారులు రచించిన ప్రబంధ రీతుల గురించి, వివరించారు. అంతే కాకుండా వారు ప్రబంధాలలో ఒకటైన దరువులని 'కందప్రబంధపు' తరువాతి పరిణామమైన కందార్థాలనీ తమ యక్షగానంలోనూ, నృత్యగేయనాటికలలోనూ రచించి, సంగీతం, కూర్చారు. ఇది పైన పేర్కొన్న లక్షణాన్ని నిరూపిస్తోంది.

5. మంద్ర మధ్య తారములు మూడు స్థాయిలలోను గమకముల నే విధంగా ప్రయోగించాలో పరిపూర్ణంగా సాధించాలి.

రజని దానిని పరిపూర్ణంగా సాధించారు. విశ్వవీణ సంపుటిలోని వారి గేయనాటికలు మూడు స్థాయిలలోనూ రచించబడ్డాయి. పై లక్షణాన్ని ఆ గేయనాటికలు నిరూపిస్తాయి.

కనుక, సంగీత, సాహిత్యం, పరమైన లక్షణాలన్నీ కలిగిన ఉత్తమ వాగ్గేయకారుడు రజని. తను రచనలకే కాకుండా దేవులపల్లి కృష్ణశాస్త్రి, బుచ్చిబాబు, శ్రీ శ్రీ, గోరాశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు, విశ్వనాథ, సి. నారాయణరెడ్డి మొదలైన ప్రముఖులు గేయరచనలకి కూడా ధాతు (సంగీత) రచన చేశారు.

శ్రీ రజనీకాంతరావుగారు ప్రసిద్ధ వాగ్గేయకారులని పేర్కొన్న ప్రముఖుల అభిప్రాయల నిక్కడ క్రోడీకరించి ఈ

వ్యాసాన్ని ముగించడం జరుగుతుంది.

అట్టిభావసంపన్నతను, అట్టి నుడికారపు సొగసులను ప్రదర్శించి. ఉత్తమ కవులుగా పరిగణింపబడిన గేయరచయితలు ఈ నాడును కలరు. వారిలో ఈ రజనీకాంతరావు ఒకడు. ఇతడు ఉత్తమ శ్రేణికి చెందిన గేయకవి. శాస్త్రీయమైన రాగతాళజ్ఞానముతో స్వయముగా పాడనేర్చిన గానకళా నిపుణుడగుటను బట్టి వాగ్గేయకారు డనిపించుకొనిన విశేష ప్రజ్ఞాశాలి.

వాగర్థాలూ, నాదభావాలూ, పరస్పర బంధంతో కవల పిల్లలవలె పుట్టిననైనా, అవి తర్వాత స్వతంత్రంగా అన్యోన్య నిరపేక్షంగా పెరిగి పెద్దవై విస్తరిల్లినవి కావడం చేత ఈ రెంటినీ ఆకళించుకొనే. సాహస ప్రయత్నాన్ని చేసేవారు కొద్దిమందే..... రజనికి ఆ రెంటియందూ సమానంగా కల శ్రద్ధాభక్తులూ, అట్టి రచనలో ఉపజ్ఞాబలమూ, విరామ మెరుగని కార్యశూరతా ఎన్నో యేండ్లుగా తెలుగుసీమలో పాదుకొన్న పరిచిత విషయాలే.

'ఆయా వాగ్గేయ రచనలపై వీరు కట్టిన విలువలు రెంటియందును వీరికి గల సాధనానుభవాల నైశిత్యాన్ని స్పష్టపరుస్తోంది.

'శ్రీ రజనీకాంతారావుగారు సంగీత సాహిత్య కళా ప్రవీణులు'

అపూరూపమైన వాగ్గేయ స్రవంతిని ఆంధ్రుల కిందించిన అపర భగీరథులు శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు'

"పల్లవితో కూడి పాటలవలె సాగిపోవు గేయములను గేయానాటికలలో సుందరముగా తీర్చిదిద్దిన ఖ్యాతి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారికే దక్కినది. శ్రీ రజనీకాంతరావుగారు స్వయముగా సంగీత విద్వాంసులును, వాగ్గేయ కారులును అగుట చేత ఈ విధములైన గేయములకు తమ గేయ నాటికలలో సముచితమైన స్థానమును కల్పించి కృతకృత్యలగుటయే గాక అనేకులకు ఆదర్శప్రాయులైనారు."

"సంగీత సాహిత్యములు పడుగు పేకలుగా కలనేత జేసి ఆ రెంటినీ మించిన పరమార్థం సాధించినవాడే వాగ్గేయకారుడు. ఆ నాడు సంగీత త్రిమూర్తులైన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామాశాస్త్రి. ఈ నాడు బాలాంత్రపు రజనీకాంతరావు, బాలమురళీకృష్ణ".

"ఆధునికాంధ్ర వాగ్గేయ కారులలో బాలాంత్రపు రజనీకాంతరావు వన్నెలో వాసిలో రాశిలో అద్వితీయుడు".

"దక్షిణ భారత చలనచిత్ర రంగంలో ఇద్దరు వాగ్గేయకారులతో నాకు ప్రత్యక్ష సంబంధం ఉంది. వారు తెలుగులో బాలాంత్రపు రజనీకాంతరావు, తమిళంలో పాపనాశనం శివన్ గారు"

"ఆయన గాయకుడు అని నేనే అనతగ్గవాడు. కవి అని నాకన్న పెద్దకవులే అనతగ్గవాడు వాగ్గేయకారకుడుగా శ్రీ రజని ప్రస్తుత యుగంలో ఒకానొక నూతన సృష్టికర్త".

"చిన్నతనము నుండి కవిత్వము, సంగీతమూ, రెండు నేత్రములు వలె ముఖ్యమైనవి అని యీ రెండూ సమాన దృష్టితో తీసుకొన్తుండేవారు శ్రీరజనీగారు."

'సంగీత సాహిత్యాలలో సమాన ప్రజ్ఞాశాలి ఆయనొక సంగీత నిఘంటువు. పలకరిస్తే సంగీత రహస్యాలని విప్పుతారు సంగీతమై ప్రవహిస్తారు."

సంగీత సాహిత్య సవ్యసాచి ఆడిన ప్రతిమాటా పాటలా, వ్రాసిన ప్రతి పలుకూ రాగంలా సంగీతంలో సాహిత్యాన్ని, సాహిత్యంలో సంగీతాన్ని, కలబోసి మృదుమధుర మాధ్వీరసాన్ని తెలుగు జాతి కందించిన సమగ్ర సాహితీ చైతన్యం అయనది.

Rajani is a born singer. He was a musical prodigy by the time he was ten... He did became a musician of eminence, but a musicologist and composer of greater eminence.

"సంగీత సాహిత్యాలు ఆయనకి భగవంతుడిచ్చిన అపురూపవరాలు. ఈ వరప్రసాదమే మాకు వారిచ్చే నృత్య నాటికలు".

శ్రీ రజనీకాంతరావుగారు ధాతుమాతు రచనాదక్షలు. ఈ మాటల కూర్పులోనూ, సంగీత రచనలోనూ కూడ నేర్పరి అయిన ఉత్తమ వాగ్గేయకారుడు. సంగీత సాహిత్యాలో సమానాభినివేశం కలిగి గేయరచనలు చేసిన ప్రతిభాశాలి. ఒక ఇతివృత్తం తీసుకుని కథగా అల్లగలిగే ఉత్తమ కథాకవి.

ఉపసంహారం :

సంగీత సాహిత్య నృత్యాభినయముల సరస సమ్మేళన

స్వరూపమే రజని గేయ సాహిత్యం.

ప్రకృతి అందాలకి పులకించి, దేశభక్తితో పరవశించి, విరహావేదనతో పలవరించి, ప్రణయభావంతో మైమరిచి, భక్తి భావంతో పెంజీకటి కవ్వల వెలిగే కాంతిని అర్చించి, కూర్చిన రజని గేయ సాహిత్యంలో భాష మీద అధికారం, రాగం మీది మమకాం గోచరిస్తాయి.

సంప్రదాయంలోని మేలినిగ్గును తీసి, ప్రయోగ గుణంతో మేళవించుకొని గేయ సృష్టి చేయడం వలన రజనిగారి ప్రతిభ రాణించింది. వారి గేయ సాహిత్యంలో సంప్రదాయం మార్గానికి చెందిన అలంకారాలు, వర్ణనలు, కవిసమయాలు మొదలైన వాటితో పాటు నవ్యమార్గానికి చెందిన వాదసప్తకం కూడా గోచరిస్తుంది.

రజనిగారి గేయాలలో వైవిధ్యమూ, ఉత్తమ కవితా ప్రమాణాలు ఉన్నాయి. ఇతడు ఉత్తమ శ్రేణికి చెందిన గేయ కవి. సాహిత్య రచనలో మహోన్నత స్థానాన్ని ఆక్రమించిన కవిమూర్ధన్యుడు.

రజనిగారి గేయనాటికా సాహిత్యంలో కావ్యత్వం గోచరిస్తుంది. 'గేయంలో నాటకీయత' రజనిగేయ సాహిత్యంలోని ప్రత్యేకత. అందుకనే వారు 'గేయనాటికా' రచనా ప్రయోగపారీణులు.

వారి గేయనాటికలలో 'ప్రదర్శనానుకూలత' మేటి గుణం. అవి కూచిపూడి నృత్యంలో ముఖ్యంగా ప్రయోగించబడుతున్నాయి. కనుక వారు 'నృత్యగానరచనా కళాప్రపూర్ణులు.'

రజనిగేయ సాహిత్యంలో సంగీతానికి విశిష్టస్థానం ఉంది. పాటలలోని మాటలకి, భావానికి, రసానికి అనుగుణమైన రాగరచన చేయబడింది. కనుక రజని తమ సంగీతవైశిష్ట్యం చేత దేశవిదేశ పురస్కృతులను పొంది మన దేశానికి ఖ్యాతి తెచ్చిపెట్టారు. అందుకే శ్రీ రజని సంగీతామృతాన్నందించే 'నాదసుధార్ణవం'

సత్యాన్వేషణ, సౌందర్యాన్వేషణ, సౌభాగ్యాన్వేషణ - ఈ 'త్రివర్గమైన అన్వేషణయే' రజనిగేయ సాహిత్యంలోని మౌలికత. రజని సృజించినగేయ సాహిత్యంలో వారి ప్రత్యేకతా, వైశిష్ట్యమూ, మౌలికతా సుస్పష్టంగా గోచరిస్తాయి. వారు తమగేయ సాహిత్యంలో సంగీత సాహిత్య నృత్యాభినయకళలని తీర్చి దిద్దిన 'కళాప్రపూర్ణులు' వారు సంగీత సాహిత్యాలలో సమానాభినివేశం కలిగి, గేయ రచనలు చేసిన ఉత్తమ వాగ్గేయకారుడు... 'వాగ్గేయ కారుడుగా శ్రీ రజనీ ప్రస్తుత యుగంలో ఒకానొక నూతన సృష్టికర్త. శ్రీరజనీకాంతారావు నేటి కవులలో, అందునూ గేయ కవులలో, అందునూ వాగ్గేయకారులలో ఉత్తమ స్థానమును దక్కకొనగలిగెను. అని పింగళివారు ప్రశంసించారు.

కవిగా, పండితుడుగా, ఉత్తమ వాగ్గేయకారుడుగా, ప్రయోగశీలిగా, మేధావిగా, పరిశోధకుడుగా, అనువాదకుడుగా రజనిగారి బహుముఖప్రజ్ఞనీ, వ్యక్తిత్వాన్నీ వారి గేయ సాహిత్యం వెల్లడి చేస్తోంది. కనుక రజని 'బహుముఖ ప్రజ్ఞాశాలి.'

రజనిగారు సంగీతానికి, కర్ణాటక సంగీతానికి, అందులోనూ లలిత సంగీతానికి చేసిన సేవ నిరుపమానమైనది. 'లలిత సంగీత సృష్టికర్త' అని రజని ప్రశంసలు పొందారు. వారు చలనచిత్ర సంగీత వాహినిలో కూడా ఒక నూతన తరంగాన్ని సృష్టించి, 'ఓహో పావురమా' అనిపించారు.

గేయనాటికా రచనమే తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విశేషం. ఆ గేయకవే తన గేయాలకి సంగీతం నిర్మించే ధాతుకల్పనాదక్షుడై ఉండడం మరొక విశేషం. రజనిగారు అలాంటి వాగ్గేయస్రవంతిని ఆంధ్రుల కందించిన ఉత్తమ వాగ్గేయకారుడు. ✪

సాహిత్య దర్శనం

"మాక్సింగోర్కి అన్నట్లుగా సాహిత్యం మానవుణ్ణి తన్ను తాను అర్థం చేసుకోవటానికి తోడ్పడాలి. అతనిలో ఆత్మ విశ్వాసం పెంపొందించాలి. సత్యం తెలుసుకొందామన్న తహతహలు కలిగించాలి. తనలో ఉన్న లోటుపాట్లను తెలుసుకొని వాటిని సమూలంగా పెకలించటానికి తోడ్పడాలి. తనలోని మంచిని తెలుసుకొనేట్లుచేయాలి. తనలో పశుత్వమున్నందుకు లజ్జ, అన్యాయం జరుగుతున్నందుకు క్రోధం, అధర్మాన్ని ప్రతిఘటించటానికి ధైర్యం పెంపొందించాలి. మానవునిలో నైతికబలం, సౌందర్య పిపాస, జీవితంపై అనురక్తి, కలిగించాలి" పుట 165 - రష్యాలో రైతు;

జి.వి. కృష్ణరావు రచనలు: 1వ సం. (1999)

ప్రభాస పబ్లికేషన్స్ - బోసరోడ్ - తెనాలి?

రజనీగానంలో జ్యోత్స్నా విభావరులు

— డా॥ సోమసుందర్ ఆవంత్స

పసితనం వీడీ వీడని మనస్సేమో, నాటి అనుభవాలు నిన్నో మొన్నో జరిగినంత నవనవంగా మెరుస్తూ యిప్పటికీ పరవళ్ళు త్రొక్కుతూంటాయి. 1939 - అంటే అప్పుడే నలభై మూడేళ్ళు గడిచిపోయాయన్న నిజం లెక్కపెట్టుకుంటేగాని తెలియదు. అప్పటివరకూ వానాకాలం చదువుగా సాగుతూ వచ్చిన సంస్కృత విద్యాభ్యాసం పూర్తిగ వంటబట్టనిదే ఆపు చేసిన రోజులవి. తెలుగు ప్రబంధాలు యింటి అలమరాల్లోంచి తీసి కూడబలుక్కుంటూ చదువ నారంభించిన రోజులవి. అప్పటికే సుబ్బయ్య దీక్షితులుగారి కాశీ మజిలీలు కాశీలు చేసేసి, వేంకట పార్వతీశ్వర కవుల నవలలు మెట్లెక్కి పోవడం జరిగింది. పానుగంటి, సాక్షి ఉపన్యాసాల సమాసాలతో నోరు తిరిగించుకొని, కంఠతా పట్టడానికి ఊదర కొడుతున్న కాలమది!

క్రింది తరగతుల నేలబారు గదులనుంచి, ఫోర్త్ ఫారంలోకి ప్రవేశించేసరికి, చదువు యుబిల్డింగ్ మేడమీద కెగబ్రాకిన కొత్త ఊపుల తొలినాళ్ళవి. అప్పటి మా తెలుగు మాస్టారు - చిత్రాడ శాస్త్రులుగారనబడే ఉపాధ్యాయులు వేంకట శాస్త్రిగారు. ఛందస్సుల ప్రాథమిక పాఠాలు బోధించనారంభించారు. ఎందుకో చెప్పలేను ఛందస్సులో నాకు శ్రద్ధ ఏర్పడింది మేస్టారి బోధతోనే పద్య విద్యా రహస్యాలు బోధపడిపోయినట్లు ఒక కొత్త ధీమా ఏర్పడింది. రోజుకొకటిగా పద్యాలు గిలుకుతూ నాలో నేనే గర్వపడిపోతున్న విచిత్ర దినాలవి!

అప్పుడు సందర్భించిందండీ ఈ సంఘటన! ఒక పొడుగాటి అందగాడు అకస్మాత్తుగా మా పిఠాపురం వీధుల్లో తిరుగుతూ సాక్షాత్కరించాడు. అతగాడ్ని నేనంతకు ముందెరుగను. తీరా పరకాయించి చూస్తే - అతడే విదేశాలనుంచో లేదా పరలోకాలనుంచో మా ఊరికి విచ్చేసిన గంధర్వుడుమల్లే ఉన్నాడు. దగ్గరగా వెళ్ళి చూద్దును కదా! లోగొంతులో ఏదో పాట పాడుకుంటున్నాడు. ఇంకా సందేహమేమిటి గంధర్వుడేననీ నిశ్చయించుకొన్నాను. అతడ్ని చూసిన కొద్ది రోజుల ముందే మను చరిత్రలో మాయా ప్రవరుడైన గంధర్వుడ్ని చూసి ఉన్నానేమో, ఆ అగంతుకుడ్ని గంధర్వుడిగా పోల్చుకుందుకు అట్టే శ్రమపడనవసరం లేకపోయింది.

అవును మరి, అతగాడు సంగీతంలా హాందాగా సాగుతున్నాడు. కవిత్వంలా అందాలు కురిపిస్తున్నాడు. ఎవరా ఎవరా అని తెలుసుకోగా, కోగా అయన బాలాంత్రపు రాజనీకాంతరావు అని ఎవరో మహనీయుడు తెలిపి పుణ్యం కట్టుకున్నాడు. ఈ మాటతో నా ఆశ్చర్యం మరీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎంత అందమైన పేరో! నా మనసు మూర్ఛపోనారంభించింది.

ఇంతలో అతగాడు మరో సన్నగా, తెల్లగా మెరిసే యువకుడితో జటపటాలు వేసుకుని సాగుతూ కనిపించాడు. లోగొంతులో అతడికి పాట వినిపిస్తున్నాడు. అతడు మెల్లగా ఉచ్చరిస్తున్నాడు. అంటే రజనీ నేర్పుతున్న పాట అతడు నేర్చుకుంటున్నాడన్నమాట! అది అలా ఎందుకు జరుగుతుందో తెలుసుకుందుకు ఎందరినో అడిగాను. ఎవరు వివరించారో తెలియదు. పిఠాపురంలో అంతకు ముందెన్నడో నవ్యకళా సమితి అనే సంస్థను శ్రీ చెలికాని భావనరావు



శ్రీ రజనంటే, శ్రీ రాళ్ళపల్లివారికి శిష్యవాత్సల్యం

స్థాపించారనీ, ఆ క్లబ్బు తరుపున దేవదాసు నాటకం వేయబోతున్నారనీ - ఆ నాటకానికి రజని పాటలు రాశాడనీ, సంగీతం కూర్చాడనీ, ఆ రెండో వ్యక్తి దేవదాసుగా నటించబోతున్నాడనీ ఆ స్నేహితుడు చెబితే ఇంత గొప్ప విశేషాలు నాకు వివరించిన అతడ్ని చూసి నేనెంత అబ్బురపడి పోయానో!

"సాయంత్రం వస్తావేమిటి రిహార్సల్‌కు వెడదాం?" అన్నాడతడు.

"రానిస్తారా?"

"ఏం? ఎందుకు రానియ్యరు?" అని నా మిత్రుడు పలికిన ధీరవాక్కు నాలో ఎంత ధీమా కలిగించిందో! ఎంత ఆనందంలోనికెత్తిందో! ఎప్పుడు సాయంత్రమవుతుందా! అన్నదొక్కటే ధ్యాస! అతడన్న రిహార్సల్ అన్నదేమిటో నాకు తెలియదు. ఆ సాయంత్రం తెలిసింది. నేను వెంటాడుతున్న గంధర్వుడు మా కన్న ముందే వచ్చి కూర్చున్నాడు. రిహార్సల్ జరిగింది. అతడూ పాడేడు. ఆ రాత్రి ఆరంభ యౌవనంలోకి ప్రవేశించిన కొత్త ఊపేదో నా మనసును కలవరపరచింది. రాత్రి తెల్లవార్లూ రజనీగాన తరంగాలే నన్ను ముంచెత్త నారంభించాయి!

నాటకం వేసే రోజుకూడా నిర్ణయమైంది. కాని అదేం చిత్రమో, పిఠాపురంలోని గాలి - రజనీ పాటలను మోసు కుంటూ వీధులన్నీ తిరిగేది. ఏ సందులోనికి వెళ్లినా అదే మోత!

"నీటితో తీరేదికాదే ఈ దప్పి
నీటితో తీరేది కాదే,....!" అనీ-
"పదవోయి ప్రయాణికుడా...
పదవోయి ప్రయాణికుడా-
తలకింద మూటతో వడివడి నడుచుచు
పదవోయి ప్రయాణికుడా!"

అనీ ఇలా ఎన్నో! అన్నీ గుండెల్ని మెలేసిపిండేవి.

అలా దూరదూరంగా చూసి, దూరంనుంచే విని, దూరంనుంచే నేను ప్రేమిస్తున్న రజనీకి మరింత దగ్గరగా జరిగి, దగ్గరగా విని, దగ్గరగా ప్రేమించనారంభించేసరికి మరో ఆరేళ్ళు చులాగ్గా సాగిపోయాయి!

అప్పటికి నేను కాకినాడ కాలేజీలో చదువుతున్నాను. వేసవి సెలవులకు యింటికివచ్చి పిఠాపురంలోనే ఉంటున్నాను.

1944 వేసవి సెలవుల్లో నేనూ శశాంకా మద్రాసు వెళ్ళాం. మద్రాసు మహానగరంలో మాకెవరు ఆత్మీయులున్నారని అలా బయల్దేరి వెళ్లామో చెప్పనక్కరలేదు కదా! నేరుగా మైలపూరు ట్రామ్ రోడ్డులో నం. 134 రు యింటికి - రజనీ వసతికి మేడమీదికి వెళ్ళాం. అలా వెళ్లి పదిరోజులున్నామా అన్నాళ్ళూ రజనీ వసతే మా కతిథిశాల! అప్పటికే ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంలో స్థిరపడ్డాడు రజని. తన కవితా గానలహరులను వాతపోతాలపై పూన్చి దేశం నలుమూలలకీ పంపే బాధ్యతను మద్రాసు కేంద్రానికే అప్పగించాడు. అప్పటికే చండీదాసు అవతరించాడు. రజనీకి కవిగా కృష్ణశాస్త్రి, గాయకుడు సైగలూ ఆదర్శపురుషులు! వారి అడుగుజాడలే అతని కారాధ్యాలు!

మద్రాసు వెళ్ళి తిన్నగా రజని యింటికే దిగడానికి అంత చనువు ఎలా ఏర్పడింది అంటే - ఈ లోగా గురుదేవులు కృష్ణశాస్త్రిగారి దర్బారులో ఇందరమూ కలసీ ఆడీపాడీ అంత సన్నిహితులమయ్యాం అలా నాకు బాగా సన్నిహితుడైన నలభై ఏళ్ళకీనాడు మా పిఠాపురం జనహృదయం మా రజనీకి సన్మానం జరుపుకోగలుగుతోంది. అతను పుట్టి పెరిగిన ఊరే యిన్నాళ్ళకి సమభావనతో - సౌమనస్యంతో పలకరించ గలుగుతోంది. అశ్చర్యమే మరి!

రజని సాహిత్యంతో నా తొలి అనుబంధం పాటతోనే! అసలు నా అనుభవమూ అభిమానమూ అతని పాటతోనే! అందుకే రజని పాటలు పాడుతూనే పుట్టివుంటాడని నా సుస్థిర విశ్వాసం! పాటలు రాయడంలోనూ, పాడటంలోనూ అంతకు ముందు తెలుగుపాట ఎన్నడూ ఎరుగని సౌకుమార్యాన్నీ లాలిత్యాన్నీ నాజూకునీ పరిమళాన్నీ కైసేసిన తొలి గంధర్వుడు రజనీయే! అందులో సందేహానికి తావు లేదు.

పాటలో కవితా భావన ముందుగా వస్తుందో సంగీతపు మట్టు ముందుగా వచ్చి దానికి కవితా భావన పూన్చబడుతుందో ఒక పట్టాన తేలదు. అదొక బ్రహ్మరహస్యంలా చప్పున విడదు! అతని పదాల హొయలు సంగీతామృతంలా యీదులాడుతూ ఉంటుంది. అందుకే ప్రధానంగా రజని వాగ్గేయకారుడు, గౌణంగాకవి! అందామా అంటే ఏదో గొంతులో అడ్డుపడుతుంది. అయితే ఒక్కటి మాత్రం తిరుగులేని సత్యం! వాగ్గేయకారులందరిలోకీ రజని మిన్నయైన కవి! కవులందరిలోకీ రజని మిన్నయైన వాగ్గేయకారుడు! పాటే రజనీరూపం!

ఏదో మన కోసం మనం విశ్లేషణ చేసుకుంటామే తప్ప ఒక సరస్వతీ స్వరూపాన్ని విశ్లేషణ చేయడం ఎలా? నిజమే - రజనీ సరస్వతీ సమగ్ర స్వరూపానికి ఆధునిక అవతరణ!

రజనీ పాటలతో తెలుగు కవిత్వంలో గానయోగ్యతకు హేమంత రజని విరమించింది. నవవసంత రజని ఆగమించింది. అందుకే ప్రతి రసహృదయమూ - "చెలి మధురుతు వేతెంచెనే - ఇలాతలి... హేమంతరజని విరమించెనే!... తనుపు పులకించెనే - తరులతాళి పరిమళించెనే - మలయ మరుత్తతి వేతెంచెనే! ... తనువు పులకించెనే - తరులతాళి పరిమళించెనే - మలయ మరుత్తతి వేతెంచెనే! మనముల నలరించెనే!" అంటూ లోగొంతులో ఆలాపించుకుంటోంది. సన్నిహితులతో పరవశత్వంతో ముచ్చటలాడుతోంది. తెలుగుజాతి రసికత!

అలాంటి అపూర్వ ఆనందానుభవాన్ని మన హృదయాలకు లభించిన నవగాంధర్వుడు రజని. తెలుగుపాటకు గుండె మార్పిడి చేసి పునరుజ్జీవనం కలిగించిన రసాధిదేవత కృష్ణశాస్త్రి అయితే - దాని రూపురేఖా విలాసాలకు సాక్షాదమర సంగీతధునిగా మార్చినవాడు రజని! అందుకే "విరులనో, కెంజివరులనో త్రుంచి అతనిపై చల్లుదమా? అళులనో, హరావళులనో కలిపి అతనిపై విసరుదమా?" అనే మురిపెం తెలుగు గుండెలకు కలుగుతూంటుంది.

రజనీ పాడుతున్నాడు! మంద్ర మంద్రంగా - మన గుండెల నరాలను మృదువుగా మీటుతున్నాడు. తారం నుంచి అతి తారాస్థాయికి అలవోకగా గొంతు సారిస్తున్నాడు. మహోన్నత భావనాలోకాలను మన కన్నులముందు నిలుపుతున్నాడు. రజని పాడుతున్నాడు! శ్రోతృలోకం తన్మయత్వంతో మునకలు వేస్తోంది. అపూర్వ దృశ్యాలను మనోనేత్రంతో అవలోకిస్తున్నారు.

తెలుగుదేశానికి రేడియోలో అంటేనే రజని గీతానికి పర్యాయపదమై భాసించింది. తరువాత కాలంలో అదే భావగీతం లలిత సంగీతంగానో, సుగమ సంగీతంగానో -

అనిబద్ధ సంగీతంగానో ఎన్నో పేర్లు పెట్టుకుంటూ సాగుతోంది. తొలినాటి నుంచీ వినిపిస్తున్నది రజని భావగీతమే - అనేక నామాంతరాలతో ప్రయోగాలు సాగిస్తోంది.

రజని పాడుతున్నాడు :

"మురళి తీసి మొలను దోపి - మూతి ముడిచి, తెడ్డు విడిచి,

ఒరిగి కృష్ణు డోసరిల్ల - మోకరిల్లి రువిదలెల్ల!"

అన్నంత స్పష్టమైన పరవశీభావంతో రసహృదయాలు మారిపోయాయి. అందుకే రజనీ గానం - స్వప్నసీమలో హాయి - వలపు జడులతో మంత్రించే మాయల సన్నాయి!" అంతేనా? ఇంకెంతో - "తెలివి మరపు పొలిమేరల వెలిగే నీరెండ! తొలిజన్మల వలపింతల తలపు తెరల తెరల నిండ" - స్వప్నసీమలో హాయివలె, వెన్నెల నీడల కలపోతలవలె, సుతారంగా మనం గుండెలలో విహరిస్తూనే ఉంటుంది.

"బాలమ్ ఆయో బసో, మేరీ మన్‌మే!" అంటూ మంద్ర మంద్రంగా సైగల్ గానం చేస్తుంటే, మన గుండెల లోపల్లోపల వినిపించీ వినిపించని సనసన్నని ఎలుగుదారి ఏదో వెలుగు రేఖలుగా తెరచుకుంటున్నట్లు భారతి జాతి యావత్తూ సొమ్మసిలిపోలేదూ? అలాంటి దివ్యానుభవమే మళ్ళీ మళ్ళీ ఆగమించింది.

"వేయబోవని తలుపు - తీయమంటూ పిలుపు, రాధకెందుకు వలపుగోలుపూ?" అంటూ కృష్ణశాస్త్రి గొంతెత్తి గానం చేస్తే - మన గుండెల శివార్లలో బృందావనం విరియలేదూ? అలాంటి మాదకానుభవమే ఇంద్రజాలంవలె పునరుజ్జ్వలించింది!

నిజం! రజనీ గానానికి అదర్శరేఖలై నిలచి పోలికలందుకోగలిగిన గాత్ర మాధుర్యాలు కొన్నే వున్నాయి. ఒక్క సైగల్, మరొక్క పంకజ్‌మల్లిక్, మనవాడుగా సాలూరి రాజేశ్వరరావో - నాలుగోవేలు ముడవాలంటే పేరు తట్టక తికమకపడిపోతాం!

ఈ గాత్రం ధర్మాలన్నీ - వినపడుతున్నప్పుడు ఏదో మాధుర్య గుణంలో తేలిపోతూనే ఎందుకో దిగులు పడిపోతాం. కులాసాగా ఉండీ బెంగటిల్లిపోతాం. ఒక్కోమారు వెక్కి వెక్కి - దొర్లిదొర్లి ఏడుస్తాం! మనసంతా డీలా పడిపోతున్నట్లు నిస్త్రాణపడతాం! అవునా - ఇంత బాధపడీ మళ్ళీ అవే వినాలని అంగలారుస్తాం! ఇలాంటి అనుభవ

జలదాగమనం



మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే!
గోపభామినికి దూరపుస్వర్గము
తిరిగి కనబడునదే!!
గోపభామినికి గ్రీష్మమ్మంతయు
హరివియోగమున వలవంత!
శౌరిరాకచే జలదాగమమున
ఆనందమ్మగు కొందంత!!
జలభరితములౌ చల్లని మెల్లని
జలధరముల నడకలలో
మదమయూర సమ్మదనాట్యమ్ముల
మృదుకేకారవములలో!!
శిఖిపింఛము తన శిరసున మెరయ
అఖిలలోకములు మురియ
శ్రావణనీరదశ్యామల దేహుడు
బృందావనిలో వెలయ!!
మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే!
గోపభామినికి పోయిన స్వర్గము
తిరిగి కనబడునదే!

'రజనీగీతం

తరంగాలనెన్నిటినో మనస్మృతిసీమలో ఉప్పొంగింప చేస్తూ రజనీ గానం సాగుతుంది! మన గుండెల్ని - వానలో తడిసిన పొగడచెట్టుగా మార్చి - ఊపితే చాలు పరిమళాలతో పాటు కన్నీళ్ళు ఝుమ్మరించేటట్లు - గారడీ చేస్తుంది రజనీ గానం!

ఎంతో ఆనందిస్తూ - బాష్పాంబుధి నెందుకు కెర లిస్తాం? ఆ గానంతో అనుభవించిన స్వర్గసౌఖ్యాన్నుంచి జారిపోయి, మళ్ళీ దుర్గంధ భూయిష్టమైన దినవారీ బ్రతుకులో పడిపోతామేమోనన్న దిగులేమో??

"మధురానగరీగాథ.... మరపురాని తీయనైనబాధ
కడపగడప యెడద యెడద తాకుచు -
ప్రేమను పంచిన మాధవుగాథ...
మాధవుడల మధురానగరికి చన - బృందావన గోపీజనబాధ
చల్లగొనుచు మధురానగరికి చను
వ్రజ భామినీ మధుర హృదయశోధ! మధురానగరీ గాథ"

అనే పాట వింటే చాలు, మనం ఎన్ని యుగాల వెన్నక్కో వెళ్ళిపోతాం. ఎన్ని యోజనాల దూరానికో అవలీలగా ప్రయాణిస్తాం. "మురళీధరుని మోహనగానము - మరల మరల వినబడునదే!" అనుకుంటూ, కస్తూరీ మృగంలా చుట్టుచుట్టూ తిరుగుతూ వెదుకులాడుతాం!

మన గుండెందాలనిండా యమునానదీ జలాలు నిండి తరంగలిస్తాయి. కన్నుల గంతల్లోంచి ఎందుకో ఊరికే ప్రవహించనారంభిస్తాయి!

"యమునా నీల జలములను వెదికితి
జాలిపడే కెరటాలేగానీ, కనులనీరు నినుకననీదే!
ఎటు దాగితివో?..."
అనుకుంటూ పదే పదే వెదికినచోటే వెదుకుతాం!

శ్రీ రజనీ సంగీత రూపకాలలో - చండీదాసు, మేఘసందేశం,స్వైరిణి అన్నారు. నన్ను - అనేవి నా దృష్టిలో క్లాసిక్కు. క్లాసిక్కు అంటే పురాణాలలో, పూర్వ కావ్యాల్లో కానక్కరలేదు. ఏకాలానికి చెందినవైనా, ఒక ప్రక్రియా విశేషంతో భావనా శిల్పమయమైన పరాకాష్టకు చేరేవేనని టి.ఎస్. ఇలియట్ చెప్పిన నిర్వచనం ప్రకారం ఈ సంగీత రూపకాలు క్లాసిక్కే!

మేఘసందేశంలో -

"అరుదెంచెమింటిపై ఆషాఢమేఘము
ఆ వేయి తలలతో శేషాహీవితో -
ఆ రామగిరులపై ఆ తపోవనులలో
ప్రియకాంతను బాసి ఏడాది ప్రవాసి
ఆగాగుమనియెను ఆషాఢమేఘమున్!..."


- వంటి వెన్నో కవితాశకలాలు కవి కులపతి కాళిదాసుని కవితా పారమ్యతలో ఓలలాడిస్తాయి.

"పూలతరులపై తీవలపై గీతాలు పాడు మధుపావళులు
తండతండములు తామర కొలనుల తారెడు తరుణ మరాళములు నిండుగళముతో పురివిపాడుచు, ఆడెడు మత్త మయూరములు
నిత్యవసంతము నిత్యశారదము అమరధామ మలకానగరి."

- అనే పద్యంలో, పద్యానికీ పాటకీ నడుమ గల నాదలయల సరిహద్దులను తొలగించి, కాళిదాస మహాకవి ఎన్నో మందాక్రాంతలలో వర్ణించిన అలకాపురీ వర్ణనాన్ని సూక్ష్మరూపంలో సాక్షాత్కరింపచేస్తుంది.

చండీదాసు నాటికలలో పాటలను రజని దశాబ్దాలుగా గానం చేశాడు. రజనీ గానంలో సాహితీ సౌరభం వెల్లి విరుస్తుంది. కవితానుభవ పరిపాకం సుళ్ళు తిరుగుతుంది. మన మహాగాయకుడు బాలమురళీకృష్ణ శ్రీరంగం గోపాలరత్నంతో కలిసి యుగళగీతంగా వినిపించిన ఈ క్రింది పాటను వినని తెలుగువాడుండడంటే ఏమాత్రం అతిశయోక్తికాదు. రసహృదయాలను నిరంతరాయంగా ఉర్రూతలూగించే యీ పాట మరోసారి మనం లోగొంతులో పాడుకుందాం!

"మన ప్రేమ... ప్రేమ ప్రేమ...
సస్య సౌందర్యభూములలో - ప్రభవించి
ప్రభవించి నప్రమ మరుసీమమగునో... కప్రసుమ ధామమగునో!
కల్లోలినీ తరంగములన్ - పయనించి, పయనించి
శీర్ణసికతాద్రియగునో? పూర్ణకలశాబ్ధియగునో?
కాలగాఢాగ్ని కీలలలో - తపియించి, తపియించి
దగ్ధతరు కాండమగునో.. ముగ్ధ మధుభాండమగునో
దీర్ఘ ఝుంఝుమారుతములన్ - ప్రసరించి ప్రసరించి
విరహనిశ్వాసమగునో...



ఆరు దశాబ్దాల కృషికి చిరుసత్కారం - అక్కినేనితో

సరసదరహాసమగునో? ॥మనప్రేమ॥
సువిశాల గగనవీధులలో - విహరించి, విహరించి
ప్రణయ స్వేచ్ఛాభ్రగామియగునో?
నిరవధిక సౌఖ్యధానియగునో?.. ॥మన ప్రేమ॥

ఈ గీతంలోని శిల్ప విన్నాణమూ, భావనా మనోజ్ఞత్వమూ, ప్రతిపదాంతర అనుభూతిని ఆవిష్కరిస్తూ రసహృదయాల నలరిస్తుంది. సద్య స్ఫూర్తిగా దీనిలోని మాధుర్యం కవితా హృదయాలకు చప్పున అందుతూనే వుంటుంది. విమర్శనాపరమైన వ్యాఖ్యానం చేకూర్చినపుడు ప్రతిపద రామణీయకత తప్పకుండా వ్యక్తమూ అవుతుంది.

అదే చండీదాసు నాటిక నాలుగోరంగంలో మరో గొప్ప పాట వుంది. అది తెలుగు జాతి గుండెల్లో చిరావాసం చేస్తున్నదే! ఊపరిగా, జీవనగానం వెనుక తంబురా శ్రుతిలా మ్రోగుతున్నదే! అది -

"ఎవరు విన్నారెవరు కన్నారు?
రాధికా ప్రణయమ్మునకు సాటి?
మాధవుని ప్రేమమ్మునకు సాటి
ఎడలు రెండూ ఏకమన్నారు! - ఎవరు
విన్నారెవరు కన్నారు?
గడెవియోగమె సైచమన్నారు -
తమ సమాగమ మింక ముగిసేనో
తను వొరసి ఉసురులెయొగసేనో?
ఎవరు విన్నారెవరు కన్నారు!
చందురుని చెంగలువ వలచేని
చాతకము జలధరుని తలచేని
చలితుఫానుల కలువముడిసేని
చాతకమూదాహార్తి నుడిసేని -
చందురుడు చెంగలువ చూచేనా?
జలధరుడు చాతకముగాచేనా?
ఏటికో ఈ క్షణిక ప్రయాణాలు
సాటిలేనిది రాధ ప్రణయమ్మో!
సాటిలేనిది కృష్ణ ప్రణయమ్మో! ఎవరు విన్నవారెవరు॥
తేటి వలపేమేటి అంటావా?
పూవు వలపే పొగడబోతావా?
పూవు కొరకై తేటి రాదేని
తేటి కొరకై పూవు పోయేనా?

బాలమురళిని గూర్చి బాలాంత్రపు రజని
"సంగీత సభా రంజక కళారహస్యాలను ఎరిగి, ఆ యెరుకతో తన ప్రదర్శనను రాణింపజేయ గల కొద్ది మంది విద్వత్కళావేత్తలో ఒకడు. ఒకనాడు త్యాగరాజస్వామి నుంచి మానాంబు చావడి వేంకటసుబ్బయ్య, సుసర్ల దక్షిణామూర్తి, పారుపల్లి రామకృష్ణయ్య పంతులుదాకా కొనసాగిన గురుపరంపరాదత్తమైన సంప్రదాయాన్ని సగౌరవంగా మన్నించే సమ్యక్ సంప్రదాయజ్ఞుడిగానూ; ఇంకొకనాడు తన సొంత వాగ్గేయ రచనలను స్వయంగా కల్పించిన నూతనరాగాల్లో పూర్తిగా స్వయం వ్యక్తియైన శైలిలో నూతన కల్పణ ప్రపంచాలకు శ్రోతలను లాగుకొనిపోతూ, మరొకనాడు రెండు పద్ధతులనూ సముచితంగా తగుపాళ్ళలో మేళవించిగానం చేయగల గాన సుధాకరుడు"
పుట 597 - ఆంధ్రప్రదేశ్ దర్శిని (1998)లో మన సంగీతపరిణామ చరిత్ర.

ఏటికో ఈ క్షణిక ప్రణయాలు?
సాటిలేనిది రాధ ప్రణయమ్మే -
సాటిలేనిది కృష్ణ ప్రణయమ్మే -
ఎవరు విన్నారెవరు కన్నారు!

ఈ పాటలోని వాచ్యార్థాలకన్న అనుభోక్తవ్య విశిష్టార్థాలే మన రసజ్ఞతలను కొల్లగొడతాయి. ఏవో పురాస్మృతుల పేరోలగంలో మన గుండెల్ని బందీ చేస్తాయి. తరచు తరచుగా అనుభూతులను నళువరించీ, స్మృతుల్ని ఛిదిలించీ ఎగరేసుకుపోయే ఇలాంటి దివ్యానుభవం కోసమే మన మనసులు వేగిరపడతాయి!

చండీదాసు తన ప్రియకాంత - రజకరామినితో ఇలా అంటాడు : అవేదనాపూరిత నాదం యుగయుగాలుగా ప్రేమికులందరినీ పరివేష్టించినదే!

"ప్రియతమా! గాఢాంధకారబంధురరాత్రి
గగనమ్ము కాలమేఘాచ్ఛన్న మీ రాత్రి
నలుగడల తాపసంకులమౌ మనస్సులో
అలముకొను పాపపంకిలమౌ తమస్సులో
వలచికొన్నాను - నా కరుణానిధిని, నిన్ను -
పిలిచికొన్నాను, దరికి రాబోవు నీదారి కంటకితమ్ము!
తలుపు గెడవైచి హేళనము చేయుసంఘమ్ము
కుటిలలోకమ్ము - ప్రేమకృపాదరిద్రము -
క్రూరమగు లోకధర్మము నెదుర్కొనలేను
గగనమ్ము కాలమేఘాచ్ఛన్నమీ రాత్రి
ప్రియతమా గాఢాంధకార బంధురమీరాత్రి!

అనే కవితా ఖండికలో శోకరసం తరంగితమై ద్యోతకమవుతుంది. ఇక్షుఖండంవలె మాధుర్య రసాన్ని చిప్పిల చేస్తుంది. అలాంటిదే మరొకటుంది, ఈ నాటకాంతంలో, ఉత్తర రంగంలోని బృందగీతమది!

మానవుని మధువనము జగము -
రాధారమణీ జీవనము
ప్రణవ వికంపిత పవనాలింగత
తరుమకుంజల తాకరము
ప్రణయ కదంచిత మధుకరచుంచిత
ప్రసవ సౌరభాకరము
మదశకుంతరవ పవనాలింగిత తరుకుంజ లతాకరము
మదశకుంతరవ మధుప్రభాతము -
హృదయరాగమంజరీ విభాతము
గ్రీష్మవికాస విచికలోచ్ఛ్వాసము -
ఉష్మాగమ వంశీ నిశ్వాసము
జలధరమర్మర దౌత్యోల్లాసము -
చలద్వినర్తక చపలాహాసము
శశికర సుషమాలస విన్యాసము -
శిశిర విహార విలాసము -
రాధామాధవ ఖేలనము జగము -
బాధా ఖేదోన్మూలనము -"

అనే కవిత సకల కవితా కళామర్యాదలనూ పుణికి పుచ్చుకొన్నది! సంగీత సాహితీ రసానుభవంగా నిలిచింది!

శ్రీ రజని మూడు దశాబ్దాల క్రితమే 'లకుమాదేవి' అనే నాటకం రచించాడు. వసంతరాజుగా ప్రఖ్యాతుడైన కుమారగిరిరెడ్డి చరిత్ర ఆధారంగా పుష్కరకాలం క్రింత వేరొక ఆధునిక కవి కావ్యంగా రచిస్తే - కొందరు కురచచూపు విమర్శకులు దానిని ఆ యితివృత్తంలో రచించబడ్డ మొట్టమొదటి కావ్యంగా కీర్తించారు! బహుశా కారణాలు వేరు కావచ్చు!

తెలుగు కవుల ధర్మమా అని రాధాకృష్ణుల ప్రణయం పచ్చి వ్యభిచారానికి ఆదర్శప్రాయంగా నిలిచిన వీరశృంగా

రమైపోయింది. జయదేవకవి చిత్రించిన 'రతిసుఖసారే - గతమభిసారే'ను మేలుబంతిగా స్వీకరించి, రాధను పచ్చిబోగందానిగా తీర్చిదిద్దారు మన కవులు. ముద్దుపళని మరో రెండాకు లెక్కువ చదివింది. తాను పెంచి పెద్దచేసిన ఇళాదేవిని కృష్ణుడికి కైంకర్యం చేస్తూ రాధ - స్త్రీ సహజమైన సిగ్గు గూడా విడిచి ఆమెకు ఎదురొత్తులతో సహా శృంగార క్రియలన్నీ నేర్పుతుంది.

అలాంటి పచ్చి బూతు పాత్ర - రాధను మొదటిసారిగా పునరుద్ధరించిన మహనీయుడు పానుగంటి నరసింహారావు పంతులుగారు! మీరా వంటి ఆత్మత్యాగానికి గురైన మహత్తర పాత్రగా, పానుగంటి తమ రాధాకృష్ణ నాటకం తీర్చిదిద్దారు. అందలి ఈ క్రింద పద్యం -

'తనువు గృహంబునందునను,
ధాన్యము వేరొకదిక్కునందు
నుంచును, స్వసుఖంబులేశమును చూడదు, నిద్దుర
బోదు, మనహానిని భరించు, ఉర్విజన నిందకు
గేలికి జంకదు, ఇట్టి కూర్మిని ప్రకటించు స్వైరణిని
మించును భక్తుడు దైవభక్తిలోన్!'

అదర్శప్రాయంగా నిలవగా స్వైరణి అన్నారు 'నన్ను' అనే సంగీతరూపకాన్ని రచించాడు రజని. అది నిడివిలో చిన్నదే కాని గుణంలో గొప్పది. పానుగంటివారి పద్యంలో భక్తునికీ స్వైరిణికీ ఉన్న సమానధర్మాల వల్లనే రాధ లోకం దృష్టిలో తృణీకరించబడింది. అపార్థాలకూ, అభాండాలకూ గురైంది.

ఆమె అర్ధరాత్రీ అపరాత్రీ లేకుండా కదిలిపోతోంది. వెదురుపొదల మెదలుగాలి - ఈలలే 'వేణునాదమనుకొని' అదిరిపడి ఉరకలు పెడుతోంది. 'నీలినీలి మునుగు తెలియాడు, తమాల తరుల వెనుక వెనుక తారుచు' కృష్ణుని కోసం తమోభిసరణం చేస్తోంది రాధ. అప్పుడామె నడలు ఒక వ్రజభామిని చూసింది. "ఓహోహో! కనరే లజ్జా విహీన యిలు విడియేగు విటరాయనికై - ముహురవలోకిత దిశయై - రహస్యకేళీ వసంతరాళము చేరన్!" అని అపనింద వేయనేవేసింది.

ఉప్పు పులుపూ తినే నేలబారు మనుషులకంతకన్న ఏం తెలుస్తుంది?

అవేమీ రాధ గమనించదు. పొదదాటీ, నదిదాటీ కదిలే వేణురవము వడిలో - ఈ గుండె ఎటులాగు రాగతరంగిణి పెనునుడిలో?" ఆ రీతిగా ఆమె సాగిపోయింది. "నింగి నీలిమబ్బు తెరగ వేచుకొన్న" కృష్ణుని సమీపించింది. అతని చేరువకు రాగానే లోకోపవాదగ్లాని ఆమె హృదయాన్ని కలవరపరిచింది. ఇలా అలా ఆక్రోశించింది.

"స్వైరిణి అన్నారు నన్ను శ్యామసుందరా!
నీరవనిశి వెన్నెలలో నీదు మధు మురళీరవము
ద్వారములను తెరచి ప్రతి హృదయము పిలుచు,
నిలుపనీదె.
స్నాన సమయమున యమునా సరిత్తటిని సఖీజనులు
నిన్ను జూచి మైమరిచిన నన్ను జూచి నవ్వినవారు...
స్వైరిణీ॥
బంధువులను, పతిని సకల బంధములను వదలివైచి
బృందావని నీదురాగ బంధమొదవ తరలితిననీ...
స్వైరిణీ॥

ఈ చిన్నిపాటలో ఎంత విషాదభారం తొంగిచూస్తుందో! మహాకవి కృష్ణశాస్త్రిగారి మహాకావ్యం అన్వేషణలోని భావనా సాంద్రత కొద్దిమంది సాహితీ రసహృదయులకు మాత్రమే అవగతమౌతుంది. కాని రజని నాటకం అదే మాధుర్యాన్ని అందరికీ పంచుతుంది.

నవ్య కవితా నవనీతంలో పరమాద్భుత భావగేయ సందోహాన్ని అందించిన కవులు నలుగురే నలుగురు. వారు వరుసగా బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బాలంత్రపు రజనీకాంతరావులు! ఆ నలుగురిలోనూ రజనీకి ఒక విశిష్టత స్పష్టంగా కనిపిస్తుంది.

సంగీత సాహితీరస పిచ్ఛలమైన స్వాదుగాన మురళీ రవాలు వినిపించినవాడు రజనీయే!

అందుకే అతడు అచ్చమైన కవీ, అబ్బురమైన వాగ్గేయ కారుడూను! అందుకే మనందరి హృదయ నీరాజనాలనూ అందుకోగలుగుతున్నాడు.

"కావ్యం పాఠకునకు తన్మయీభావం కలిగిస్తున్నది. కనుక అది అతని సంకుచితదృష్టిని పటాపంచలు చేసి మనోవైశద్యం కల్పించి పశుత్వం దగ్గరనుంచి పశుపతిత్వం దాక సానుభూతితో గ్రహింప జేస్తున్నది!

సాహిత్య భవితవ్యం - జి.వి. కృష్ణరావు

సంగీత నాటకాలు

– బాలాంత్రపు రజనీకాంతరావు




నాటకాలలో సంగీతం ఉండాలా అక్కరలేదా, నాటకాలలో పద్యాలు ఉండాలా అక్కరలేదా? పద్యాలు సంగీతంతో పాడవచ్చునా కూడదా అనే వివాదాలతో ప్రమేయం ఏమాత్రములేని - పూర్తి సంగీత నాటకాలు ఈ వ్యాసంలోని ప్రసక్తాంశం. నాటకం రచన ఎంతో బాగుంది, నటకులు ఎంతో ప్రతిభతో నటించి, నిర్వాహకులు, ఎంతో దక్షతతో నిర్వహిస్తేనే ఏనాటకమైనా ప్రేక్షకుల మన్నన పొందడం సాధ్యమవుతుంది. ఇన్నీ కలిసివచ్చినప్పుడు అటువంటి వచన నాటకానికా, లేక సంగీత నాటకానికా ప్రేక్షకులు ఎక్కువగా రంజిల్లేది అని అడిగితే, ఈనాటికి కూడా కాస్తోకూస్తో సంగీతంవుంటే (అది నిర్దుష్టంగా నిర్వహింబపడినపుడు) వచన నాటికకంటే సంగీతం ఉన్న నాటకానికే త్వరగా రంజన కలుగుతుంది అని చెప్పాలి.

ప్రాచీననాటక చరిత్ర పరిశీలిస్తే చరిత్రాతీతుడైన భరతముని నాటినుంచీ కూడా సంగీత ప్రసక్తీ మేళతాళ ప్రశంసా నాటక లక్షణంలో విధిగా వస్తూన్నవి. 'అవస్థానుకృతియే నాట్యం' అన్నారు గాని. నాట్యం యథాజీవిత మనిగాని, నాటకం జీవితానికి ఛాయాపటవత్ ప్రతిబింబం అనిగాని అనుకోడానికి వీలులేదు. జీవిత యథార్థతనుంచి రసానందానుభూతిద్వారా ప్రేక్షక మానసాలకు ఉడ్డీనత కలిగించేదే ఉత్తమ కళ. సంగీత నాటకంవల్ల అది త్వరగా సిద్ధిస్తుంది.

పాశ్చాత్య దేశాల్లో ఆపెరాలు అంటే సంగీత నాటకాలూ, బ్యాలేలు అంటే నృత్య నాటకాలూ - రెండు ప్రక్రియలూ స్వతంత్రంగా ఒకదానితో ఒకటి - ప్రమేయం లేకుండా వర్ధిల్లాయి. 17వ శతాబ్ది ప్రాంతంలో ఇటలీలో ఆపెరాలు ప్రారంభించేదాకా పాశ్చాత్య దేశాల్లో సంగీత నాటకాలు పుట్టలేదు. భారతదేశంలో 12వ శతాబ్ది ప్రారంభంలో వెలసిన జయదేవునిద్వారా మన దేశానికి అంతటికీ అన్ని ప్రాంతాలకీ ఈనాటికీ ఆరాధ్యమైన గీతగోవిందం అనే మహాసంగీత నాటకం లభించింది. 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' అన్న జయదేవుని ప్రజ్ఞాత్మకమైన బిరుదాన్నిబట్టి, అది వట్టి సంగీత నాటకమే కాకుండా నృత్య నాటకం అనికూడా గ్రహించవచ్చు. భరతనాట్య శాస్త్రానికీ, అలంకార శాస్త్రానికీ, గీతగోవిందం లక్ష్యప్రాయమై నాటినుంచి నేటివరకూ పరమ ప్రామాణికమయింది. ఓఢ్ర, వంగ దేశాలలో సరిహద్దులలో గల కిందు బిల్వం, కేందులీ అని పిలవబడే జయదేవుని జన్మ గ్రామంలోను, పూరీ జగన్నాథంలోను, ఇంకా అనేక ఇతర క్షేత్రాలలోను, విష్ణుప్రీతికరములైన ఉత్సవ దినాలలో గీతగోవిందాన్ని తరతరాలుగా ప్రదర్శిస్తున్నవారు ఈనాటికీ ఉన్నారు.

12వ శతాబ్ది మాట అటుంచి, క్రీస్తుకు పూర్వం సుమారు 10వ శతాబ్దినుంచి 4వ శతాబ్దివరకూ ఎప్పటివాడో స్పష్టంగా తెలియని భరతాచార్యుని నాట్యశాస్త్రంలోనే నాటకాలలోని ప్రావేశికీ, నైష్క్రమికీ ధ్రువాగానాలు - మన తెలుగు యక్షగానాల్లో అనాదిగా వినవస్తూ, పాత్రలు ప్రవేశించేటప్పుడూ, నిష్క్రమించేటప్పుడూ గానంచేసే దరువులే అని పరిశోధకులు స్పష్టపరిచారు. దీనినిబట్టి, పాశ్చాత్య దేశాలలో ఆపెరాలు బయలుదేరడానికి సుమారు 20 శతాబ్దాలు



వింజమూరి సీతాదేవితో రజని

ముందే మనదేశంలో సంగీత నాటకాలు సర్వలక్షణలక్షితాలై పరిఢవిల్లినట్లు తేటతెల్లమవుతోంది. అయితే, ఈనాట కాలను తొలిదశలో మనదేశంలోని వివిధ భాషాప్రాంతాలలో పల్లీజనులు, ఆటవికులు, కొండ జాతులూ, తమ తమ ప్రాంతాలలో వెలసిన దైవతములను గురించిన పురాణగాథలతో వారి వారి భాషలలో ప్రదర్శిస్తూండేవారు. ఆయా నాటకములలోని గేయఫణితులను 15వ శతాబ్ది నుంచి అన్నమాచార్యులవంటి సాహిత్యపరులైన వాగ్గేయ కారులు స్వీకరించి, సంకీర్తనములను పదాలను రచించే వరకు, ఈ యక్షగానాలు సాహిత్య పరిణతిలేక, గ్రామవినోదాలుగా మాత్రమే ఉంటూ వచ్చేవి. సుమారు 12,13 శతాబ్దాలకు చెందిన రాజ కళింగగంగు వేములవాడ భీమకవి శాపంచేత రాజ్యభ్రష్టుడై, తిరగి రాజ్యప్రాప్తి పొందడానికి తోడుపడినవారు ఆ విధంగా గ్రామగ్రామమూ సంచారం చేసే భాగవత మేళాలవారే. అన్నమాచార్యులకు సమకాలికుడైన సాళ్వ నరసింహరాయలనే విద్యానగర చక్రవర్తి కూడా, సమ్మెట గురవరాజు అనే దుష్టసామంతుని దుండగాలను గురించి, అటువంటి భాగవత మేళమువారి నాటక ప్రదర్శన ద్వారా తెలుసుకొని, ఆ తర్వాత సైన్యాన్ని పంపి గురవ రాజును దండించాడట. అంతేకాదు. సాళ్వ నరసింహరాయలకు ప్రోలుగంటి చెన్నయ్య సౌభరి చరిత్రము అనే జక్కుల కథ (యక్షగానము) రచించి అంకితమిచ్చాడు. ఆ తర్వాత ఒక శతాబ్దానికి కందుకూరి రుద్రయ్య రచించిన సుగ్రీవ విజయ యక్షగానం వచ్చింది. ఓబయ్య మంత్రి రచించిన గరుడాచల యక్షగానము కూడా వచ్చింది. ఓబయ్య మంత్రి రచించిన గరుడాచల యక్షగానము కూడా ఈ విధముగా పామర నాటక రంగమునుండి సాహిత్య పరుని గంటముచేత దిద్ది తీర్చబడినదే కనుక, సుమారు ఇదేకాలానికి చెందిఉండవచ్చు.


ఆంధ్రదేశాన్ని పాలించిన వేంగి చాళుక్యుల మొదలు ఆయా రాజవంశాల కొలువుకూటాలలో సంగీతానికీ నాటకానికీ ఏపాటి గౌరవాదరాలుండేవో స్థూలంగా పరిశీలించి గ్రహించవచ్చు. వైదికధర్మావలంబియై బహు శ్రోత్రియంగా ధర్మాద్వైతస్థితికి పాటుపడిన రాజనరేంద్రుని కొలువులో రాజు, మంత్రిపురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మాహా ప్రధానానంత సామంత విలాసినీ పరివృ

తుండైనట్లు, అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరుణులు', వారి తర్వాత పౌరాణికులు ఆ వెనుక మహాకవులు, తార్కికులు, అయిన పిదప, వైణిక గాయకులు చిట్ట చివర పంక్తిలో ఉండినట్లు నన్నయగారి భారతాన్ని బట్టి తెలుస్తుంది. కాకతీయ సామ్రాజ్యంలో మట్టుకు గణపతిదేవ చక్రవర్తి కొలువులో సేనానియైన జాయప్ప నృత్త్య రత్నాకరము, గీత రత్నాకరము, రచించిన గాయకుడూ లక్షణకర్తా అయి ప్రసిద్ధి పొందినట్లు ఇటీవల పరిశోధకులు వెలువరించిన నృత్యరత్నాకరాన్ని బట్టి తెలుస్తోంది. గణపతి దేవునికి తన సమకాలికుడయిన దేవగిరి యాదవ రాజైన సింహణుడితో రాజకీయ స్పర్థమాత్రమేగాక, కవిగాయక పోషణలో కూడా స్పర్థ ఉండేది. సింహణుడి కొలువులో ఉండిన శార్ఙ్గదేవుడు సంగీత రత్నాకరం రచించాడు. అది యీనాటికీ ఉత్తర దక్షిణదేశ సంగీతజ్ఞులకు ప్రామాణిక గ్రంథము, కాకతీయుల తర్వాత వచ్చిన రెడ్డి రాజులలో కుమారగిరి వసంతరాజు, పెదకోమటి వేమారెడ్డి - నాట్యశాస్త్ర వ్యాఖ్యాతలయి, నర్తకగాయకులను పోషించారు. వారికి సమకాలికుడైన రేచర్ల వెలమరాజు సర్వజ్ఞ సింగమనీడు సంగీతరత్నాకరానికి వ్యాఖ్య వ్రాశాడు. విద్యానగర స్థాపనకారకుడై వేదపారంగతుడయి భాష్యకర్తగా

> కావ్యం - శాస్త్రం
>
> "కావ్యానుభూతి అలౌకికం. ఇలాంటి అనుభవం శాస్త్రాల వల్లగాని, ఇక్షు రసాస్వాదన వంటి భౌతిక భోగాల వల్లగాని లభించదు. ఈ అనుభవం అనన్యం. శాస్త్రాదులు అసంవృతిని (*infinity*) ఆమోదిస్తవిగాని, ఆ అసంవృతి స్వరూపం అవిబోధపరచలేవు. కావ్యం అలాకాక పాఠకుణ్ణి మూర్త ప్రపంచంనుంచి అమూర్త ప్రపంచానికీ, ఆ అమూర్త ప్రపంచం నుంచి అసంవృతికీ చేరవేస్తుంది. అలా చేర వేయబడుతున్నప్పుడు పాఠకుడు పొందే ఆనందం ఇష్టార్థ ప్రాప్తి వల్ల కలుగదు. విమానంలో ఎక్కి తిరిగితే రాదు. చంద్రమండలంలో మొదటిసారిగా అడుగు మోపినా పొడమదు. సహృదయుడు పొందే ఆ ఆనందం అనుభవైకవేద్యం'
>
> - జి.వి. కృష్ణారావు; పుట 153, సాహిత్యభవితవ్యం - జివి. కృష్ణరావు రచనలు - 1వ సం (1999).

ప్రసిద్ధి చెందిన విద్యారణ్యుడు సంగీతసారం రచించాడు. ఈ చారిత్రక కాలంలో శ్రీనాథుని నాడు మాత్రం ప్రేమాభిరామ సంస్కృత వీధినాటకం పేరొకటి క్రీడాభి రామంద్వారా వినబడుతుంది. 15వ శతాబ్దంలో విద్యానగరము నేలిన సాళువ నరసరాజు కాలంలో యక్షగానం రాజదర్బారులకు ఎక్కిన సంగతి ముందు చెప్పుకొన్నాము. ఈ కాలం దాటే సరికి, మనం రాజవంశాలను దర్బారులను వదిలి, కూచిపూడి చేరుకోవలసివస్తుంది.

ఐతిహ్యాలనుబట్టి, కూచిపూడి భాగవత మేళముల వారిని భరతలక్షణానుసారులనుగాచేసి. వంశపారంపర్యంగా పురుషులే వేషధారణచేసి, నాటకములను ఆడవలెనని కట్టడి చేసినవాడు సిద్ధేంద్రయోగి అని చెప్తున్నారు. సిద్ధేంద్రుడు నారాయణ తీర్థులకు శిష్యుడని, ఒకవాదము. ఆయనకు ఈయనకు కూడా అత్తవారింటికి నదిలో ఈదుకొని పోతుండగా వరదరావడమూ, నదీగర్భంలో ఆపత్సన్న్యాస స్వీకారమూ - ఈ కథ ఇద్దరికీ జరిగిందని చెపుతారు. నారాయణతీర్థుల మహా యక్షగానం అయిన కృష్ణలీలా తరంగిణి పూర్తిగా సంస్కృతపు కీర్తనలతో, శ్లోకాలతో తరంగాలనబడే 12 అంకాలలో రచింపబడింది. ఆ తరంగాలను కూచిపూడివారు అనాదినుంచీ అనూచానంగా తమ ఆటలలో ప్రదర్శిస్తూ అభినయిస్తున్నారు. దాని తర్వాత సిద్ధేంద్రుని భామాకలాపం కూచిపూడివారికి ప్రధాన ఆలంబన మయింది. చరమ జీవితకాలంలో నారాయణ తీర్థులు దక్షిణాదికి వెళ్లిపోయి సత్యభామ కథనే పారిజాతాపహరణంగా కూర్చి, తంజావూరు ప్రాంతానికి తనతోపాటు వలసపోయిన కూచిపూడివారి వారసులయిన మేలటూరి వారికిచ్చాడు. అందుకే వారు అప్పటినుండి నేటివరకూ ఆ తమిళదేశం మధ్య - తెలుగు సంగీత నాటకాలనే ఆడుతుంటారు, అటు తర్వాత కూచిపూడి వారి ప్రదర్శనల్లో తరిగొండ వేంకమాంబగారి గొల్లకలాపము, భాగవతుల రామయ్యగారి గొల్లకలాపము రాణచెందాయి. చారిత్రకంగా ఆలోచిస్తే నారాయణతీర్థులూ, సిద్ధేంద్రయోగి, పదకర్త అయిన క్షేత్రయ్యా 17వ శతాబ్దానికి ఆవలి యీవలి సగాలలో యాభై సంవత్సరాల యెడంలో జీవించి ఉండినట్లు, ముగ్గురూకూడా కూచిపూడివారికి ఉపదేశకులయినట్లు తోస్తుంది. ఇటుపైని కూచిపూడివారు తరచుగా తీర్థులూ,



ఆనాటి రజని రికార్డుల గాయని టంగుటూరి సూర్యకుమారి

క్షేత్రయ్యా మొదలైన వాగ్గేయకారులు చేసినట్లే, ప్రదర్శనలకు రాజపోషణకు తంజావూరు మధురలు యాత్రలుచేసి వస్తూండినట్లు కనబడుతుంది. తంజావూరు నేలిన నాయక రాజులకు, మహారాష్ట్ర రాజులకు అంకితము చేయబడిన సలాము, దర్వులు మున్నగునవి కూచిపూడివారి తరువాత నాటకాలలో వినబడుతూండడమే దానికి దృష్టాంతం.

ఇంతవరకూ అస్పష్ట చారిత్రక యుగం గడిచింది. 17 శతాబ్దినుంచి, తెలుగుసంగీత నాటకచరిత్ర తంజావూరులో స్వర్ణయుగాన్ని స్థాపించు కొన్నది. అప్పుడు తంజావూరు నేలిన నాయకరాజులూ, వారి తర్వాత పరిపాలించిన మహారాష్ట్ర రాజులూ ఆ స్వర్ణయుగ నిర్మాతలు. 17వ శతాబ్ది తొలిదశ కంలో కృష్ణా ప్రాంతంనుంచి నారాయణతీర్థులతో పాటు తంజావూరు ప్రాంతానికి వెళ్ళిన కూచిపూడి భాగవత కుటుంబాలే - అప్పటిరాజైన అచ్యుతప్ప నాయకుని తమ నాటక ప్రదర్శనములద్వారా మెప్పించి, అచ్యుతరాయ సముద్రమనే గ్రామాన్ని ఆరణం పొందారు. అదే తర్వాత మేళత్తూరు. లేక మేలటూరి అయింది. ఈ మేలటూరులో భాగవత కుటుంబాలవారు నాటినుంచి నేటివరకు తెలుగులోనే అనేక వాగ్గేయ రచనలను సంగీతనాటకాలను రచించి ఏటేటా తమ గ్రామంలోను, దక్షిణ దేశంలోని ఇతర గ్రామాలలోను ప్రదర్శిస్తూ వచ్చారు. మేలటూరు వాగ్గేయ కారులలో ప్రసిద్ధులు శబ్దకర్తయైన కాశీనాథయ్యా, పదాలను కీర్తనలను, రచించిన వీరభద్రయ్యా, సుమారు 12 తెలుగు నాటకాల దాకా రచించిన వేంకటరామశాస్త్రి. ఈ వెంకట రామశాస్త్రి త్యాగరాజులు సమకాలికుడు.

అచ్యుతప్ప నాయకుని కుమారుడయిన రఘునాథ యకుడు కృష్ణదేవరాయలవలె కవి పండిత గాయక పోషకుడై సాహిత్యభోజుడని ప్రసిద్ధిపొందాడు. తాను స్వయంగా గజేంద్రమోక్షము, రుక్మిణీ కృష్ణవివాహము, జానకీ పరిణయము అనే యక్షగానాలను రచించాడు. రఘునాథుడు సంగీతశాస్త్ర నిష్ణాతుడుకూడా. అతని మంత్రియైన గోవిందదీక్షితుడు వ్రాశాడని చెప్పబడుతున్న సంగీతసుధ అనే లక్షణగ్రంథం రఘునాథనాయక కర్తృకం గానే రచింపబడింది.

రఘునాథుని కుమారుడైన విజయరాఘవ నాయకుడు 23 యక్షగానాలను రచించాడు. ఈయన కొలువులోని

ఇతని పుత్రుడు మన్నారు దేవుడు, కోనేటి దీక్షితకవి, పురుషోత్తమ దీక్షితుడు, కామరసు వేంకటపతి సోమయాజి, పసుపులేటి రంగాజమ్మ, కృష్ణాజి, వీరందరూ యక్షగాన కర్తలే.

వీరుకాక, విజయరాఘువుని దర్బారును అలంకరించిన గాయక నర్తకులలో అగ్రేసరు రాలైన చంద్రలేఖ, రూపవతి, చంపకవల్లి, మూర్తి, కోమలవల్లి, లోకనాయిక, శశిరేఖ, రత్నగిరి, భాగీరథి మున్నగు వారందరూ వివిధ నాటక నృత్య ప్రదర్శనలలో పాల్గొని మన్నన పొందేవారు. విజయ రాఘవుని యక్షగానంలో ప్రసిద్ధమైనవి రఘునాథాభ్యు దయమూ, విప్రనారాయణ చరిత్రా, అష్టభాషా విశారద యైన పసుపులేటి రంగాజమ్మ యక్షగానాలలో ప్రసిద్ధమైనది మన్నారు దాస విలాసము.

1704వరకు మైసూరు నేలిన చిక్కదేవరాయలు తాను మూగవాడయినప్పటికీ, కలువె వీరరాజు అను కవీశ్వరుని సాహాయ్యంతో ఆంధ్ర కొరవంజి, నాట్యవిద్యా విలాసము మొదలైన 14 యక్షగానాల రచనకు కారకుడయినాడు.

విజయరాఘవనాయకుని తర్వాత తంజావూరు మహారాష్ట్ర రాజుల వశమైంది. ఈ రాజులు తమ మాతృభాష మహారాష్ట్రమైనా, పాలించేది ద్రావిడ దేశమే అయినా, సంస్కృతాంధ్ర భాషలలో సంగీత సాహిత్య గ్రంథాలను స్వయంగా రచించీ అనేక కవి పండిత గాయకాదులను పోషించీ, నాయకరాజులు ప్రారంభించిన సంస్కృతీ బీజాలను ఇతోధిక భక్తి శ్రద్ధలతో పోషించారు. వీరిలో 1684 నుంచి 1712 వరకూ పాలించిన శాహభూపాలుడు (శాహజీ) దాదాపు 20 యక్షగాన నాటకాలను, అనేక పదాలను రచించాడు. వాటిలో ప్రసిద్ధమైనవి శంకర పల్లకిసేవా ప్రబంధ నాటకము, విష్ణుపల్లకి సేవా ప్రబంధనాటకము. శంకరపల్లకి సేవ తిరువారూరులోని త్యాగరాజస్వామి పల్లకి సేవను గురించి ఉత్సవ సంప్రదాయ కీర్తనాత్మకముగా రచించ బడిన యక్షగానము. దీనిని ప్రతిశుక్రవారము ఆలయపు దేవదాసులు నృత్య సంగీతాత్మకంగా ప్రదర్శించేవారు.

> నరుడు -
> "నరుడు ధరిత్రీ సుకవీ
> శ్వరుడను యుగధర్మముల ప్రవక్తను! నాకే
> చరితను గడచిన పుటలను
> తిరిగి తిరిగి చదువ మిగుల దిగులేకలుగున్!"
> విశ్వవీణ సంపుటిలో రజని గేయనాటిక - శాంతి పథము (ప్రచురణ - 1964)

ఈ శాహభూపాలుని ఆస్థాన వాగ్గేయకారుడు, బహుళ యక్షగాన పదకర్తా అయిన గిరిరాజకవి కర్ణాటక సంగీతరత్న త్రయంలోని త్యాగరాజుకు సాక్షాత్తు పితామహుడే. గిరిరాజు యక్షగానాలలో ముఖ్యమైనవి శాహేంద్ర చరిత్రము, లీలావతీ కల్యాణము, రాజమోహన కొరవంజి. తంజావూరులో ఈనాటికీ ఉన్న సరస్వతీమహల్ అనే ప్రాచీన గ్రంథాలయం శాహుజీభూపాలుని శ్రద్ధాభక్తులవల్లనే సేకరింపబడింది. తద్వారానే నాయక రాజులనాటి యక్షగానాలు, మహారాష్ట్ర రాజులనాటి యక్షగానాలు ఇంకా అనేక ప్రాచీనాంధ్ర సంస్కృత పద్యకావ్యములు తాళపత్రములపై లిఖింపబడి, భద్రపరుపబడి, మనకు ఈనాటికీ లభిస్తున్నవి.

ముందు మేలటూరు వాగ్గేయకారులలో చివర చెప్పుకొన్న వేంకటరామశాస్త్రి త్యాగరాజుకు సమకాలికుడు. వయోజ్యేష్ఠుడు. నారసింహోపాసకుడైన ఈయన నాటకాలలో ప్రసిద్ధమైనది ప్రహ్లాదచరిత్ర. ఈ తెలుగు నాటకం తంజావూరు గ్రామాలలో నృసింహజయంతి రోజుల్లో ఏటేటా ఇప్పటికీ ప్రదర్శిస్తూంటారు. మిగిలినవి ఉషాపరిణయం, రుక్మాంగదచరిత్ర, హరిశ్చంద్ర, మార్కండేయ - మొదలైనవి.

త్యాగరాజు నౌకాచరిత్రము, ప్రహ్లాద భక్తివిజయం, సీతారామ విజయం అనే సంగీత నాటకాలను రచిస్తూండి నపుడు తరచు తనకంటే వయోధికుడైన వెంకటరామశాస్త్రికి వినిపించి ఆయన మెప్పుపొందేవాడట. త్యాగరాజు బాల్యంలో తన తాతగారైన గిరిరాజకవి నాటకాలను, శాహభూపాలుని కొలువులో శాహజీ నాటకాలనూ తర్వాత మేలటూరు నాటకాలను కూడా ప్రదర్శిస్తూండగా అనేక పర్యాయములు దర్శించి, తన నాటకాభిలాషకు దోహదం చేసుకొన్నాడు. భక్తిరస ప్రాధాన్యము వల్లను, సంగీత సాహిత్య రచనాదక్షతలోను, త్యాగరాజు నాటకాలు మేలటూరు నాటకాల కంటే ప్రత్యేకత కలిగి ఉంటాయి.

త్యాగరాజుకు సమకాలికుడై తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపుర వాస్తవ్యుడైన మద్దిరాల వెంకటరాయకవి - స్థానిక దైవతమైన కుక్కుటేశ్వరుని నిత్యోత్సవాలకుగాను ఏకాంత

సేవా విలాసమనే యోక్షగానం రచించాడు. దీనిని పిఠాపురం లోని కళావంతులు ఆనాడు నృత్యగానాలతో ప్రదర్శించే వారట, కాని, ఈనాడు పూజారులలో ఒక రిద్దరి గాత్రాలలో హరించుకు పోవడానికి సిద్ధంగా ఉన్నది.

ఇవిగాక, 18, 19 శతాబ్దాలలో ఆంధ్రదేశంలోని ఆయా ప్రాంతాలలో అనేక గ్రామనాటక సంఘాలు వెలిసి అనేక వీధి నాటకములు, యక్షగానములు రచింపబడ్డాయి. వేములపల్లె విరాటపర్వం. లేపాక్షి రామాయణం, మానికొండ రామాయణం, ధర్మపురి, రామాయణం, ఇలాంటివే, 18వ శతాబ్దిలో భద్రాచలంలో యాదవదాసు అనే అతడు గరుడాచల నారసింహుడి కథను (చెంచులక్ష్మి) ఓబయ్య మంత్రి రచించిన దానికంటే అధునాతన పద్ధతులలో యక్షగానంగా రచించాడు. చెంచులక్ష్మి నాటకంగా ఇది ఆంధ్రదేశంలో చాలా ప్రాంతాలలో జనరంజకత పొందింది.

19 వ శతాబ్దంలో యక్షగానం క్రమంగా హరికథగా పరిణామం పొందింది. అంటే యక్షగానంలోని సూత్రధారుని కథాకథన గద్య పద్యాలకు తోడు ఆయా పాత్రల సంభాషణ దరువులను, గద్య పద్యాలను కూడా కథకుడే ఏక పాత్రాభినయంగా, అభినయం గాన నృత్యాత్మకంగా చెప్పు కుంటూ పోవడం అభ్యాసంలోకి వచ్చింది. గోగులపాటి కూర్మనాథుడనే సింహాచల నివాసియైన వైష్ణవ వాగ్గేయ కారుడు రచించిన మృత్యుంజయ విలాసమనే శివకథ ఈ విధంగా హరికథా పద్ధతిలో చెప్పబడి జనరంజకత పొందిన యక్షగానాలలో మొదటిది. యక్షగానాలను ఇంతటితో విడిచిపెట్టి, మనం ఆధునిక యుగంలోకి అడుగిడవలసి ఉంటుంది.

సుమారు 19వ శతాబ్దపు రెండవసగం ఆంధ్రదేశానికి మరాఠీ పార్శీ థియేటర్ నాటక సమాజాలవారు వచ్చేనాటికి మన ప్రాంతంలో కూచిపూడి వారివీ, ఇంకా ఆ సంప్రదాయంలో ఆయా జిల్లాలలో వెలసిన భాగవత కుటుంబాల వారివీ యక్షగాన ప్రదర్శనలూ, వీధి నాటకాలూ, కళావంతుల నట్టువరాంద్ర కలాపాలూ ఉంటుండేవి. ఆనాటి కప్పుడే బ్రిటిషు సామ్రాజ్యం బలపడి, ఆంగ్ల విద్యా ప్రభావం మనపట్టణాల్లో విద్యాధికులలో తలసూపనారంభించింది. దాని తొలిఫలితం యేమంటే జాతీయ కళా రూపాలయిన వీధి నాటకాలూ, కలాపాలూ పల్లెలకూ

స్వతంత్ర భేరి



మ్రోయింపు జయభేరి!
వాయింపుము నగారా!
తెలింపుము నభోవీధిని
త్రివర్ణాంచితపతాకా!

భారతదేశ స్వేచ్ఛా
సూర్యునాచ్ఛాదించు రాహుచ్ఛాయ
అంతర్ధానమాయె!... అంతర్ధానమాయె!
మ్రోయింపు జయభేరి!

స్వార్థమ్మనక సౌఖ్య మ్మనక
సంగ్రామమున పోరి
వీరస్వర్గ మేలగ చనిన
ధీరులకెల్ల జోహార్!

జోహార్ వివిధ రాష్ట్ర వీరయోధులకు జోహార్!
జోహార్ వీరమాతలకును పత్నులకు జోహార్!
ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారత
ముదయమ్మాయె నహో!

తూరుపుఖండపువారల తపములు
కోరిక లీడెరెనహో!!

దెసలల్లిన భారత స్వేచ్ఛా సూర్యుని
ప్రాభాతోజ్జ్వలకాంతి!
ప్రసరించుత తూరుపువాకిలి తెరచుక
ప్రేమపూరిత ప్రశాంతి!!

దేశదేశముల దీనజనావళి దాస్యబంధన విముక్తి
ద్వేషరోషములు తెగలు పగలు
నశియింప జగమెల్లశాంతి!!

'రజనీ'గీతం

దేవస్థానాలకూ మిగిలిపోయి, పట్నవాసాలలో ఆంగ్లరంగస్థల పద్ధతి నాటక రచననూ ప్రదర్శనలనూ ప్రారంభించారు. వీరేశలింగం పంతులుగారు, వేదం వెంకటరాయశాస్త్రిగారు, తిరుపతి వెంకట కవులవంటివారు కొందరు సంస్కృత నాటక పద్ధతిని పద్య గద్యాత్మకములైన నాటకాలను వ్రాశారు. కోలాచలం శ్రీనివాసరావుగారు, ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు మొదలైనవారు పద్యగద్యాత్మకములుగా మాత్రమే కాకుండా, పార్సీ మరాటీ నాటకములలో ఆనాడు తాము వినియుండిన పాట వంటి పాటలతో కూడిన నాటకాలను రచించి ప్రదర్శించారు. ఎక్కువ పద్యాలు కొద్దిగా పాటలతో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు, ఎన్నో పద్యాలతో చిలకమర్తివారు, తిరుపతి వెంకట కవులు, బలిజేపల్లి లక్ష్మీకాంతంగారు నాటకాలను వ్రాశారు.

ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు, గోపాలాచార్యులుగారు, చక్రావధానుల మాణిక్యశర్మగారు, అయినాపురపు సోమేశ్వరరావుగారు, సోమరాజు రామానుజరావుగారు, కొప్పరపు సుబ్బారావుగారు మొదలైనవారు తమ నాటకాలలో ఒక్కొక్క దానిలో 25, 30 పాటలకు తక్కువ కాకుండా చేరుస్తూ వచ్చారు. వీరందరి కంటె కూడా మైలవరంవారి నాటకాలకు సంగీత గురువయిన పాపట్ల కాంతయ్యగారి పాటలు - సావిత్రి, మాన సంరక్షణము, కృష్ణ తులాభారము నాటకాలకు వ్రాసినవి బహుజన రంజకత పొందాయి. అంతేకాదు ఆ పాటలవల్ల నైతేనేమి. అర్థశతాబ్దిపాటు ఆంధ్రనాటక రంగమును ఏకచ్ఛత్రాధిపతులై ఏలిన యడవల్లి, కపిలవాయి, జొన్నవిత్తుల, అద్దంకి వంటి గాయకనటులు తీర్చిదిద్దిన పద్యగాన సంప్రదాయంవల్ల నైతేనేమి ఒక విశిష్టమైన ఆంధ్రరంగస్థలబాణీ అంటూ ఒకటి ఏర్పడింది. ఇంతకుముందు వివరించిన ప్రాచీన యక్షగానాది నాటక చరిత్రకు తర్వాత ఇంతవరకు రంగస్థల సంప్రదాయ కథను ముందు సూచించబోయే ఆదర్శ సంగీత నాటక పరిణామానికి ముందటి యుగపు విశిష్టలక్షణంగా విశదీకరించడమయింది. దాని ఫలితం ఏమిటంటే జనానీకంలో సంగీతాభిరుచి వివిధశాఖలై అనేకమైన చీలికలు కాసాగింది. అదేలాగంటే, ప్రాచీన శాస్త్రీయ సంప్రదాయం రుచించేవారూ, ఆ తర్వాత వచ్చే పార్సీమట్లకూ మరాఠీ మట్లకూ చెవి ఒగ్గేవారూ. హిందూస్థానీ ఠుమ్రీ, గజల్, టప్పాబాణీలకు చెవి కోసుకునే వారూ, ఈ విధంగా ప్రేక్షకులలో అనేక అభిరుచులవారు తయారయినారు. ఇవన్నీ కాక, పల్లెప్రజలలో తరతరాలుగా పాడుకొనిపోయి వస్తున్న జానపద గేయరీతులు వాటి 'నేవళీకం' కోలుపోకుండా ఇంకా సజీవమై సంఘ గౌరవానికి మాత్రం దూరమై ఉంటున్నాయి.

20వ శతాబ్దిలో సినిమా వచ్చింది. తొలి తెలుగు సినిమాలో నటీనటులూ గాయకులూ రంగస్థలం మీద నుంచి సరాసరి తెరపైకి వెళ్ళిన వారు కావడంచేత ఆనాడు రంగస్థలపు బాణీలో మరాటీ, హిందీ శైలులలో సంగీతం వినవచ్చేది. రాను రాను హిందీ సినిమాలు మన ప్రాంతీయ

ఆగమనము



చల్లగాలిలో యమునాతటిపై
శ్యామసుందరుని మురళి!
ఉల్లము కొల్లగొనే మధుగీతులు
మెల్ల మెల్ల చెవి సోకునవే!
తూలి రాలు వటపత్రమ్ములపయి
తేలి తేలి పడు నడుగు లవే!
పూలతీవ పొదరిండ్లుమాటుగా
పొంచి చూచు శిఖిపింఛమదే!
తరువు తరువు కడ డాగి డాగి న
న్నరయు కన్నుగవ మురుపు లవే!
మురిసి మురిసి నా వెనుక దరిసి కను
మూయు చివురు కెంగేలు లివే!

కూజిత గీతం



రజని, సుభద్ర గారలు

ప్రేక్షకులకు కూడా ఆదర పాత్రములు కావడంతో, ఆనాటికానాడు అక్కడి బెంగాలీ, పంజాబీ, పర్షియన్, అమెరికన్, ఆఫ్రికన్, మెక్సికన్, స్పానిష్ సంగీతపు బాణీలు తునకలు తునకలుగా వచ్చి మన ప్రేక్షకులపైన, తెలుగు చిత్ర నిర్మాతలపైన దాడిచేసి, వారిలో చాలమందిని, ముఖ్యంగా యువతరం వారిని లోబరుచుకొన్నాయి. దీనితో అభిరుచులు మరీ శాఖోపశాఖలుగా చీలిపోయాయి. మన తెలుగు సినిమాలలో చాలమంది దర్శకులు డోలక గీతులూ, పర్షియన్ రీతులూ, ఇంకా ఇటీవల వచ్చే రాక్ ఇన్‌రోల్ పాటలూ అనుసరించి పాటలిస్తేగాని నిర్మాతలు వొప్పుకోవటం లేదు.

సంగీతంలో అభిరుచి ఇన్ని రీతులుగా చీలింది అని ఎందుకు వివరించవలసి వచ్చిందంటే- వ్రాసే కవి తాను ఎవరికోసం వ్రాస్తున్నాడో వారికి తెలిసిన ఒక భాషలో - ఒకే భాషలో తన కావ్యాన్నో, నాటకాన్నో వ్రాస్తాడు. అదే గేయమో, సంగీత నాటకమో అయినప్పుడు, దానిని ప్రదర్శించ వలసి వచ్చినప్పుడు తన ప్రేక్షకులూ శ్రోతలకూ పరిచితమై వారు అభిలాష కనపరచి, తలూపగలిగే బాణీలో తన గేయాలకు సంగీతపు వరుసలను అమర్చవలసి ఉంటుంది. ఈనాటి సంగీతనాటక రచయిత తానే సంగీత నిర్మాతకూడా అయినప్పుడు కాని. ఒక కవి రచించిన సంగీత నాటకమునకు తాను సంగీతము కూర్చేటప్పుడు కాని, ఎటువంటి అభిరుచి కలవారిని మనస్సులో పెట్టుకుని పనిచేయవలసి ఉంటుంది? ఒకటే సమాధానము - తాను ఏ శ్రోతలను రంజింపజేయాలని ఉంటుందో వారి అభిరుచుల ప్రకారమే చేయవలసి ఉంటుంది.

ప్రాశ్చాత్య సంప్రదాయం ప్రకారం మన ఆధునిక సాహిత్యంలో అనేక కొత్త అందాలను తీర్చుకొన్నది. తెలుగుగేయం. జాతీయులైన రగడలు మొదలయిన మాత్రాచ్ఛందస్సులలో నుండి ముత్యాల సరాలవంటి గేయాలను గురజాడవారూ వారి ననుసరించినవారు చాలమంది నవ్యకవులు రచించారు. ఇటువంటి గేయాలతోను, పద్యాలతోను కలిపి, నిర్వచనంగా పూర్తి గేయనాటికలను రచిద్దామనివూనుకొని, కృతకృత్యులయిన వారిలో శివశంకరస్వామిగారు మొట్టమొదటివారు. యక్షగాన నామకమయిన ప్రాచీన సంగీత నాటకంలో సూత్రధారుని సంధివచనాలలో, ఇంకా ఇతర పాత్రల సంభాషణలలో గద్యం ఉంటూ ఉండేది. దరిమిలా వచ్చిన

రంగస్థల నాటకాలు ఇంచుమించు అన్నీ కూడా పద్యాలూ, పాటలూ, కత్తిరించి, సంభాషణలతో మాత్రమే ఆడినా ఆడవచ్చు. కాని, నవ్యసాహిత్య సంప్రదాయంలో మాత్రం సంపూర్ణ గేయ నాటకాలలో 'సహజయాన పంథీ' అనే పేరు గల నాటకానికి ఇతివృత్తము వంగకవియైన చండీదాసు రజకినియైన రామమణిని ప్రేమించిన గాథ. వారు ఆ నాటకానిన వ్రాసే రోజులలోనే ఈ వ్యాసకర్త తన తొలి సంపూర్ణ సంగీత నాటకానికి అదే ఇతివృత్తాన్ని స్వీకరించడం జరిగింది. రెండు నాటకాలు ఒకే 'ప్రతిభ' సంపుటంలో ప్రకటింపబడడమే గాకుండా, 1941 ఫిబ్రవరి మాసంలో మద్రాసులోనే శివశంకరుల నాటకం రంగస్థలపైని ప్రదర్శిత మయింది. ఈ వ్యాసకర్త రచించిన 'చండీదాసు' వాయు ప్రసారితమయింది ఆ మాసంలోనే, శివశంకరలు సమారు 15 సంపూర్ణ సంగీత నాటకాలు వ్రాశారు. పద్మావతీ చరణ చారణ చక్రవర్తి చాలసార్లు రంగస్థలంపైని ప్రదర్శించ బడింది.

వాయు ప్రసారంలో (1939లో) తొలుతటి సంపూర్ణ సంగీత నాటకం మల్లవరపు విశ్వేశ్వరరావుగారి బిల్హణీయం. ఆ తర్వాత శ్రీ శ్రీ 'మోహినీ రుక్మాంగద' మొదలయిన కొన్ని సంగీత నాటకాలు వ్రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి 'ఊర్వశి' 'శర్మిష్ఠ' 'విద్యాపతి' 'ధనుర్దాసు', 'గుహుడు' 'ఉమర్‌ఖైయాం' 'అండాళ్ కల్యాణము' 'దక్షయజ్ఞము' మొదలగు సంగీత నాటకాలను ఎక్కువ భాగం పాటల తోటీ, తగుమాత్రం పద్యాలతోనూ సంభాషణలతోనూ కూడా వ్రాశారు. ఇవన్నీ వాయు ప్రసారంలో ఎన్నిక గన్నవి.

మల్లవరపు విశ్వేశ్వరావుగారు షెల్లీ రచించిన 'ప్రామిథియస్ అన్ బౌండ్'ను సంపూర్ణ సంగీత నాటకంగా అనువదించారు. ఇదీ, ఇంకా వారు కళాపూర్ణోదయ గాథను ననుసరించి చేసిన 'కలభాషిణి' ధారావాహి నాటికాగుచ్ఛం, శారదోత్సవం మొదలైనవి వాయుప్రసారంలో పేరు పడ్డవి.

"సంగీత నాటకానికి - అమాట కొస్తే ఏ నాటకానికైనా కూడా-ఇతివృత్తం ప్రసిద్ధమై ఉంటేనూ, పాత్రలు స్వరూప స్వభావ వాచకాదుల వల్ల స్పష్టంగా తెలిసిపోతుంటేనూ - ప్రదర్శన చాలా సుకరం" - రజని - విశ్వవీణ నాటికల సంపుటి ఉపోద్ఘాతం. (1964)

విశ్వనాథ సత్యనారయణగారి కోకిలమ్మ పెళ్ళి, కిన్నెరసాని, మారీచుడు, సుమిత్ర, ఊర్మిళ, గోదావరి మొదలైన సంగీత నాటకాలు బహుళ గేయాత్మకాలై వాయు ప్రసారంలో గణ్యత పొందాయి.

సి. నారాయణరెడ్డిగారి నాగార్జునకొండ, కర్పూర వసంతరాయలు మొదలైన కొన్ని గేయ నాటకాలు మునుముందు మన సంగీత నాటకాలకు మంచి పరిణతి రాగలదని సూచిస్తాయి.

ఆంధ్ర నాటకరంగ చరిత్రలో కృషిచేసిన కీ॥శే॥ కొప్పరపు సుబ్బారావుగారు పాశ్చాత్య దేశాలలోని బర్లెస్క్ లేక, హాస్యసంగీత నాటకాలను దృష్టిలో పెట్టుకొని, అల్లీముతా అనే సంగీత నాటకాన్ని రచించి, అనేక ప్రదర్శనలు చేయించారు.

ప్రాచీన గేయనాటక రూపమైన యక్షగానానికి ఇటీవల మళ్లీ మంచి కాలము రాగలదని తోస్తోంది. ఉదాత్త సాహితీ శిల్పదక్షులయిన మహాకవులు ఈ ప్రక్రియను చేపట్టి ఆదరిస్తున్నారు. కాటూరి వేంకటేశ్వరరావుగారి 'శ్రీనివాస కళ్యాణం', దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారి 'సాగర మథనమూ' 'మాళవికాగ్ని మిత్రమూ' 'విప్రనారాయణ చరిత్రమూ', అనే యక్షగానముల రచనలో ఈ వ్యాసకర్త తన సంప్రదాయ సంగీతానుభవమూ, ధాతుకల్పనా, వినియుక్తములైనందుకు తనను తాను ధన్యుడుగా భావిస్తాడు.

18 సంపూర్ణ గేయ నాటకాలనూ, 30 వరకూ గద్య పద్య గేయాత్మక నాటకాలనూ రచించిన ఈ వ్యాసకర్త, తన గేయ నాటకాలను వాయుప్రసారంలో మాత్రమేకాక, ఐదారింటిని రంగస్థలపైని నాట్యాత్మకంగా కూడా ప్రదర్శింపజేసిన అనుభవాన్ని పురస్కరించుకొని, సంగీత నాటకములు రచన గురించీ, ప్రదర్శన నిర్వహణముల గురించీ కొన్ని సూచనలతో ఈ వ్యాసాన్ని ముగించగలడు.

సంగీత నాటకానికి - ఆ మాటకొస్తే ఏ నాటకానికైనా కూడా - ఇతివృత్తం సుప్రసిద్ధమై ఉంటేనూ, పాత్రలు స్వరూప స్వభావ వాచకాదులవల్ల స్పష్టంగా తెలిసిపోతుం టేనూ - ప్రదర్శన చాలా సుకరం. అలా లేనిచోట్ల కథావివరణా పాత్రనిర్దేశమూ ప్రదర్శనానికి ముందు తప్పక అవసరం అవుతాయి. పాత్రలు ఎంత తక్కువుంటే

అంతమంచిది. మొత్తం 5,6 కంటె మించకూడదు. ఏ పాత్రకాపాత్ర తన పాట ఏదో పాడుగ్గా తాను పాడుకొంటూ ఉంటే మిగిలిన పాత్రలు స్తబ్ధంగా నిల్చుండో కూర్చుండో వుండే ఘట్టాలుండకూడదు. పాత్రల పాటలలోనే సంభాషణలు, కథాగతీ, (action) సంఘటనలూ సాగిపోతూ వుండాలి. ఒక్కొక్కచోట కథ మెల్లిగా సాగే బరువైన ఘట్టాల్లో బరువైన పాటలు ఉండాలికాని, మిగిలినచోట్ల లయాన్వితంగా త్వరితంగా సాగిపోయే సంవాద గేయాలూ, లయలలో ఛందాలలో మార్పులు చేసుకుంటూ పోవాలి. మధ్య మధ్య ప్రకటనా వివరణా అక్కరలేకుండానే స్థలనిర్దేశమూ, పాత్ర నిర్దేశమూ, సమయసూచనా తెచ్చిపెట్టుకొన్నట్లు కాకుండా సహజంగా గేయ సంభాషణలో సాగిపోవాలి. కథా కథనము (narrative) చెయ్యడానికీ, ఒక్కొక్క సంఘటనలో కలిగించిన రసాన్ని తీవ్రతరంచేసి సుస్థిరం చెయ్యడానికీ బృందగానాలు (Choruscs) ఉపయోగించాలి. ఈ బృంద గానాలను పాడే గాయక బృందం కథలో ఆయా ఘట్టాలలో సహజంగా సమకూడే పాత్రలైనా కావచ్చు. లేదా, ఏ సంబంధమూలేని వట్టి అఖ్యాతృ బృందంకావచ్చు. ఘట్టాలలో సహజంగా సమకూడే పాత్రలే బృందగానం పాడే అవకాశం ఉండే నాటకానికి పాత్రలు తక్కువవుండాలనే నియమం వర్తించదు. అంత మందీ చక్కగా పాడేవారిని సమకూర్చుకోవడం నిర్వాహకుని పూచీ.

సంగీత నాటకంలో సంగీత నిర్వాహకుని బాధ్యతే గురుతరమైనది. మన ప్రేక్షకులలో ఉండే వేరు వేరు సంగీతపు బాణీల అభిరుచులను గురించి ఈ వ్యాసంలో ముందు విశదీకరించాము. నిర్వాహకుడు ఈ బాణీలకు కొన్ని తారతమ్యాలను ఏర్పాటుచేసుకొని, ఇతివృత్తాన్ని బట్టిగాని, దేశకాలములను బట్టిగాని, తన నాటకంలోని వేరు వేరు ఘట్టాలలో పాత్రల ఉత్తమ మధ్యమాధమములని ప్రాచీన శాస్త్రాలలో చెప్పబడిన వర్గాలలో ఆయా వర్గాలకి చెందిన పాత్రలకు, ఆయా సన్నివేశాలలోని రసాలకు, అనుగుణమైన సంగీతపు బాణీలను కూర్చుకోవలసి ఉంటుంది. ప్రతి ఒక్క బరువైనపాటకూ రెండో మూడో తేలికగా రక్తిగా సాగిపోయేవరుసలుండాలి. నేపథ్యజంత్ర సంగీతం ఉందీ ఉండనట్లుగా వినిపిస్తూ, పాటలలోని మాటలను స్పష్టంగా తెలియనిస్తూ, గాత్రములు పాడని సమయాల్లో ఆయా రసావేశాన్ని ఉత్తేజపరచి సుస్థిర పరుస్తూ ఏ స్వరసంపుటికి పక్క ఏ స్వరాలు పలికిస్తే ఎక్కువ ఫలితం ఉండగలదో దాన్ని సాధించాలి.

సంగీత నాటకాలలో పాడే గాయకులందరికీ తమ వాచకం (పాటలు) క్షుణ్ణంగా వచ్చి ఉండాలి. ఒక్కొక్క వ్యక్తి తన పాటలను క్షుణ్ణంగా పాడగలిగి ఉండడమే కాకుండా మొత్తంమీద సాముదాయిక కృషిగా నటులు అంతా యంత్రపు చక్రాలవలె ఒకరికొకరు అతికి, పరస్పర సహకారముతో జయప్రదం చేయవలసి ఉంటుంది.

సంగీత నాటకాలలో వీలైతే అంటే లభిస్తే, నాట్యశాస్త్ర దక్షులైన నటుల నాట్యానికి పూర్తి అస్కారం ఉంది. లేకపోతే సకృత్తుగా ముద్రలతో, అంగ విన్యాసములతో కొంత నాట్యాభినయం ఉండవచ్చు. నాట్యమూ గానమూ రెండింటిలోనూ కృషిచేసిన నటబృందము సంగీత నాటకాలకు చాలా అవశ్యకం. ఒక గురుకులంలో వలె ఈ బృందానికి దినచర్యగా అంగవిన్యాసాదికాలు పాదలయ విన్యాసాలు డ్రిల్లుగా అభ్యాసం చెయ్యాలి. దేశమంతటా ప్రధాన పట్టణాలలో జాతీయ నాట్య మందిరాలు ఏర్పడి, అక్కడ అటువంటి గురుకులాలు ఏర్పడిననాడు మాత్రమే అలాంటిది సాధ్యమౌతుంది. లేనివాడు నాట్యాన్నీ గానాన్నీ విడదియ్యడం ఒక పద్ధతి. నాటకంలోని గేయభాగమంతా తెరలో మైక్రోఫోన్‌లో ఒక నటబృందం గానాభినయం చేస్తూంటే మరొక బృందం రంగస్థలంపై నాట్యాభినయం చేయించడం. ఈ వ్యాసకర్త 10 సంవత్సరాలక్రితం తన సంగీత నాటకాలను ఆ విధంగానే బాలికల చేత నాట్య ప్రదర్శనములుగా చేయించాడు.

ఈ వ్యాసం సంగీత నాటకాల రచనను గురించీ ప్రదర్శనను గురించీ, మన దేశంలోని జిజ్ఞాసువుల దృష్టి మరల్చడానికి ఉద్దేశింపబడ్డది. అందుకని మన ప్రాచీన అధునిక సంగీత నాటకాల చరిత్రను స్థాలీపులాకంగా ప్రదర్శించామే కాని. ఈ రంగంలో కృషిచేసిన ఏ పేరునైనా ఇందులో చేర్చకపోయి ఉంటే, అది ఉద్దేశపూర్వకం కాదనీ, వస్తువిస్తరణ భీతిచేతా, స్థాలీపులాక దృష్టిచేతనూ మాత్రమే అనీ విజ్ఞులైనవారు గ్రహించుకొందురు గాక.

(నాట్యకళ 1959 సౌజన్యంతో)

My Beloved Brother

P. Srinivasan

Retired Station Director, AIR

